RNI No. APTEL/2003/12253

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 19 Issue No. 8(2) Monthly August 2022 ISSN No. : 2456-4702 Rs. : 15/-



ఇందుగంటి కనుమచ్చిన్న



మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 19 - Issue 8 (2) - August 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

Dr. PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
Associate Professor, Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
HOD, Dept. of Telugu,
Hyderabad Central University, Hyderabad, Telangana.

ASSOCIATE EDITORS

1. **Dr. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Associate Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
HOD, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Narayanapuram.

15. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
Govt. Arts College, Rajahmundry.

16. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Potti Sriramulu University, Bommuru.

17. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

18. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

19. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

20. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

21. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

22. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి సుప్రసిద్ధ కవి, పండితుడు, విమర్శకుడు, వ్యాసకర్త, కథానికా రచయిత. వీరు 1911 సంవత్సరం ఆగష్టు 29వ తేదీన జన్మించారు. వీరి తాత తండ్రులందరు సంస్కృత పండితులై రాజా స్థానాల్లో విద్వాంసులుగా ఉన్నావారే. వంశపారంపర్య లక్షణాల వలన ఇంద్రగంటి వారికి కూడా సంస్కృతం బాగా అబ్బింది. కోనసీమలో గురుకులంలో సంస్కృతాధ్యయనం, తర్వాత విజయనగరం సంస్కృత కళాశాల, కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠంలోనూ ఉభయ భాషా ప్రవీణ విద్యలు అభ్యసించారు. వంశపారంపర్యంగా తాను నేర్చుకున్న ప్రాచీన సాహిత్య సంప్రదాయ పద్ధతిలోనే రచనలు సాగించారు. అయితే సమకాలీన సాహిత్య ధోరణుల్ని ఆకళింపు చేసుకున్నాడు. గుణదోషాల్ని బట్టి మంచిని మనస్ఫూర్తిగా ఆహ్వానించాడు. పనికిరాని భేషజాల్ని తిరస్కరించారు.

గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావులు ప్రారంభించిన నవీనాంధ్ర సారస్వతోద్యమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. నూతన మార్గాల్లో సాహిత్య విమర్శ, కథానక రచన, కావ్య నిర్మాణం చేశారు. వీరి రచనల్లో దక్షారామము (ఖండకావ్యం) అడవి పువ్వులు (కథలు), కడుపుమంట - సామ్యవాద కథ, కళాభాయి బ్రతుకు చీకటి, దౌర్జన్యం. అలాగే వీరికి బాగా పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టిన సాహిత్య వ్యాసాల్లో సాహిత్య గోష్ఠి, కళా; నీతి, ఆంధ్రులకు సంస్కృతం ఎంతవరకు కావాలి. మొదలగునవి. ఒకవైపు విమర్శకుడిగా, మరోవైపు కథా రచయితగా తెలుగు ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారు. వీరి రచనలు అనేక పత్రికల్లో ప్రచురితమయ్యాయి.

ఇంద్రగంటి వ్యక్తిత్వానికి అద్దంపట్టే పుస్తకం "ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి సాహిత్య సంచారం. ఇది ఆయన శతజయంతి సందర్భంగా ప్రచురించబడిన ఆయన సాహిత్య వ్యాసాల ఉపన్యాసాల సంకలనం. ఈ సంకలనంలో తొలి వ్యాసాలు ఒక విద్యార్థిగా మొదలైన ఇంద్రగంటి సాహితీ సంచారం నవ్యసాహిత్యోద్యమంతో ఎలా పెనవేసుకుందో వివరించారు. నాటి సమకాలీన సాహిత్యాన్ని దుమ్మెత్తి పోసిన సాంప్రదాయవాదుల విమర్శకులకి ధీటైన సమాధానాలిస్తూ నూతన సాహిత్యంలోని మెరుపుల్ని, పాత సాహిత్యంలోని మెరుపుల్నే కాకుండా కంటికి కనిపించే దోషాల్ని ఉదాహరణ పూర్వకంగా చూపించి మంచి సాహిత్యానికి పాత కొత్తల తేడా లేదని నిరూపించారు. ఆయన వ్యక్తిత్వానికి అద్దం పట్టే ఒక వ్యాసం 'సాహిత్య సంచారం' 'మ్యూజింగ్' లాగా సాగిన ఈ చిన్న వ్యాసంలో నిత్య పవల్లవశీలమైన సాహిత్యం ఎప్పటికి మోడు వారదన్న ఆయన ఆకాంక్ష, ఆవేదనా పరితుల గుండెల్ని తాకుతుంది. సాంప్రదాయాల్ని క్షుణ్ణంగా ఎరిగికూడా మార్పుని ఎంత విశాల హృదయంతో ఆహ్వానించారో మనకు అర్థమౌతుంది. ఇంద్రగంటి ప్రాచీన, నవీన సాహిత్యాల్ని బాగా తెలిసినవారు కావడం చేత పాత కొత్తలకి అతీతమైన సర్వకాలీనమైన ఒక మానవ చైతన్యాన్ని గుర్తించగలిగారు. నూతన మార్గాల్లో సాహిత్య పంథాల్ని నిర్మానం చేస్తూ 1987 నవబంర్ 14 వ తేదీన స్వర్గస్థులైనారు.

- సంపాదకవర్గం

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

Contents (విషయ సూచిక)

1.	జూపాక సుభద్ర కథల్లో ఇతివృత్త వైవిధ్యం	- యం. మల్లమ్మ	6
2.	పాత్ర సృజన ప్రకరణ ప్రబంధ వక్రతల పద్ధతి	- ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు	10
3.	కాళీపట్నం రామారావు 'యజ్ఞం' కథ:ఆధునికత - హక్కుల చర్చ	- డా॥. వెంకట రామయ్య గంపా	15
4.	రారా కథలు - సమాజ జీవిత చిత్రణ	- టి. హజరతయ్య	21
5.	సంఘ సంస్కరణవాది మన వేమన	- డా॥. పల్లా కృష్ణ	24
6.	పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి - ప్రపంచీకరణ వ్యవస్థ దాకా...	- డా॥. వి. శాంతిలక్ష్మి	28
7.	అన్నమాచార్యుల అభ్యుదయ భావం	- డా॥. నాయని మల్లికార్జున	32
8.	తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కార నవలలు - కుటుంబ జీవన చిత్రణ	- డా॥. లింగాల మంగమ్మ	35
9.	మానవత్వ ప్రబోధంలో నాటకాల పాత్ర	- డా॥. జె.వి.చలపతిరావు	44
10.	జీవనగీత - ఒక పరిశీలన	- డా॥. ఆగపాటి రాజ్‌కుమార్	48
11.	జోగులాంబ గద్వాల్ జిల్లా క్షేత్ర సాహిత్యం	- సి. శ్రీనివాసులు	55
12.	కె.విశ్వనాథ్ శంకరాభరణం చిత్రంలో చంద్రమోహన్ పాత్ర - నటనా వైదుష్యం	- జి. శ్రీదేవి	62
13.	నేటితరానికి నడత నేర్పించే నాటితరం మహానుభావుల 'మహాత్మ పంచకం'	- డా॥. ఎం. హరికృష్ణ & - బియ్యం మల్లీశ్వరి	65
14.	గిరిజన నవలలో స్త్రీల ఆర్థిక సమస్యలు	- అలకుంట్ల యాదయ్య	71
15.	ఎమ్.సి. మేరికోమ్ బాల్యం అభేద్యం - ఆత్మకథ	- డా॥. నందమూరి లక్ష్మీపార్వతి	77
16.	వి. ఆర్. విద్యార్థి రచనల్లో సామాజిక స్పృహ	- గడ్డిమీ మల్లేశం	80
17.	తెలంగాణ కథా ప్రక్రియ - కె.వి.నరేందర్ కథల్లో వైవిధ్యం	- జి. కృష్ణవేణి	85
18.	అంతరంగ ప్రవృత్తి చిత్రీకరణ	- ఆచార్య అయ్యగారి సీతారత్నం	91
19.	Political Geste of Women in Contemporary Tamilnadu - A Historical Study	- Mrs. P.Dhanakarthikai & - Dr. T. Asokan	94
20.	Social Management Framework of Legal Education in India	- Pooja Ashar & - Sony Kunjappan	100
21.	Community and Social Stratuminramad Townlets	- Dr. G. Sathiya Devi	108
22.	Untouchable Song	- Dr. M. Koteswar Rao	112

23.	Financial Inclusion throughself Help Groups (SHGS) - A Case Study in Jharsuguda District of Odisha	- Swati Agrawal & - Dr. Prabhati Panda	115
24.	Telugu - language tech - assisted learning	- Dr. R. S. S. Nehru	127
25.	Sustainbale Developments of Irula's Snake Catchers' Industrial Cooperative Society in Tamil Nadu : Present Issues and Challenges	- Dr. Gughan Babu Azhageshan & - Mrs. Girija Gughan	132
26.	Early Attempts at the Re-creation of the Greek Form of Drama in English: A Study of John Milton's Samson Agonistes and Matthew Arnold's Merope	- Jaishree Shanker	143
27.	Three Billers of Modern Dalits History in Colonial South India	- Jeyendra Selvam R & - Dr. Y.Srinivasa Rao	150
28.	Nomophobia:A Rising Concern for Digital Natives in New Normal	- Debarati Dhar & - Ravi Kant	158
29.	Social Victimisation to Political Victory:Contextualising and Consolidating Dalit Identity (and) Politics in Bama's Vanmam : Vendetta	- Dr. Siva Nagaiah Bolleddu	167

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జూపాక సుభద్ర కథల్లో ఇతివృత్త వైవిధ్యం

– యం. మల్లమ్మ, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

తెలుగు సాహిత్యం వివిధ ప్రక్రియలతో విరాజిల్లు తున్నది. తెలుగులో కవిత, కథ, గేయం, స్వీయ రచన, నవల,మొ॥లైన ప్రక్రియలు వున్నాయి. కథ అనే పదానికి చెప్పుట, సంభాషించుట అనే అర్థాలున్నాయి. కథకు ఇతివృత్తం ప్రధానమైనది. కథా వస్తువునే ఇతివృత్తం అంటారు. కథా వస్తువుకు రచనానుకూలమైన పథకం రూపొందించినపుడు అది ఇతివృత్తం అవుతుంది. రచయితలు తమ నిత్యజీవితంలో చూసిన లేదా విన్న విషయాలకు కల్పనలు జోడించి కథలు రాస్తున్నారు. నేటి కాలంలో రచయితలు మాండలిక భాషల్లో కూడా రచనలు చేస్తుండటం విశేషం.

జూపాక సుభద్ర తెలంగాణ రాష్ట్ర సచివాలయ, పంచా యతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖలో అదనపు కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూనే సాహిత్యం వైపు అడుగులు వేసారు. ఈమె తెలంగాణ మాండలికంలో తెలంగాణ అణగారిన గ్రామీణ దళితుల పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు రచిస్తారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మరియు వసతి గృహాలు దళిత విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగకరమైనవి మాకు గిట్ల లేకపాయె కథ ద్వారా తెలిపారు. దళితులు సహోద్యోగుల వల్ల ఎలాంటి ఇబ్బందిని ఎదుర్కొంటున్నారో మీరెట్ల వెజ్జులు కథలో తెలిపారు.

మాకు గిట్ల లేకపాయె :

ఈ కథలో మాణిక్య ప్రధాన పాత్ర. మాణిక్య దళితుల బిడ్డ. తల్లిదండ్రులు ఆమెను సాంఘిక సంక్షేమ వసతి గృహంలో చేర్పిస్తారు. హాస్టల్ పాఠశాల వేర్వేరు చోట్లలో ఉంటాయి. హాస్టల్లో ఉంటూ పాఠశాలకు వెళ్ళాస్తుం టుంది. హాస్టల్లో రోజూ ఒక గంట మాత్రమే నీళ్ళొస్తాయి. ఆ వచ్చే నీళ్ళు వంట చేయడానికే సరిపోతాయి. విద్యార్థు లకు నీటి సౌకర్యం సరిగాలేక చాలా మందికి గజ్జిలాంటి చర్మ రోగాలు వస్తుంటాయి. దానివల్ల విద్యార్థులు పాఠశాలకు వెళ్ళకుండా వసతి గృహంలోనే ఉండిపోతుం టారు. పాఠశాలకు ఎందుకు వెళ్ళలేదని అడిగే దిక్కుండేది కాదు.

హాస్టల్లో పురుగులన్నం, పచ్చిపులుసు పెట్టిన ఆకలికి తట్టుకోలేక విద్యార్థులు దాన్నే తినేవారు. హాస్టల్లో చేర్పించిన రోజు తప్ప విద్యార్థుల కోసం తల్లిదండ్రులు వెళ్ళేవాళ్ళు కాదు. అయిన కొందరు విద్యార్థులు తమ ఇంటికి వెళ్ళడం కంటే హాస్టల్లో ఉండటమే మంచిదను కునేవారు. ఎందుకంటే తమ ఊరికెళ్తే ఇంట్లో తల్లి దండ్రులు ఈ సంవత్సరం పంట నష్టం జరిగిందని, పంట ఎండిపోయిందని, బిడ్డలకు వండిపెట్టడానికి గింజలు లేవని మాట్లాడుకుంటారు. తల్లిదండ్రులతో పాటు తాను కూలిపనులకు వెళ్ళాలి. ఇంటికి సరిపడా నీళ్ళు మోసుకు రావాలి. ఇతర కులస్థులు తనను కులం పేరుతో పిలుస్తారు. ఇవన్నీ మాణిక్యకు ఇష్టం వుండదు.

పరీక్షలు మొదలైనప్పటినుండి పరీక్షలు పూర్తైనవెంటనే విద్యార్థులంతా హాస్టల్ నుండి వెళ్ళిపోవాలని వార్డన్ హెచ్చరిస్తుంది. ఇంటిదగ్గర అన్ని సౌకర్యాలున్న విద్యార్థులు ఇంటికి వెళ్ళడానికి ఆసక్తి చూపిస్తారు. కానీ మాణిక్య తన స్నేహితులు మాత్రం ఇష్టం చూపించరు. వాళ్ళ ఇండ్లళ్ళో కనీసం బాత్‌రూంలు కూడా ఉండవు. మాణిక్య స్నేహితు రాలు కమల ఇంటికి వెళ్తే ఊర్లో ఏ అబ్బాయైన తన వైపు చూస్తే కమలదే తప్పన్నట్లు ఆమె అన్నలు ఎడాపెడా కొడతారు. మరో స్నేహితురాలు బాలామణికి తల్లి లేదు. తండ్రి తాగుబోతు. కూతురిని ప్రేమగా బాధ్యతగా చూసుకోడు. ఆమె ఊర్లోవాళ్ళతో పాటు కూలిపనులకు వెళ్ళి డబ్బులు సంపాదించుకొని తనను తాను పోషించు కుంటుంది.

అందుకే హాస్టల్ వార్డెన్‌కు రకరకాల కారణాలు చెప్పి పరీక్షలు పూర్తైన కూడా సొంత ఊర్లకు వెళ్ళకుండా హాస్టల్లోనే మాణిక్య తన స్నేహితులు వుంటారు. ఊర్లకు వెళ్ళకపోతే హాస్టల్‌కి తాళం వేస్తాననీ వార్డెన్ బెదిరిస్తుంది. ఇదొక్క రోజు ఉంటామని అనుమతి తీసుకొని మాణిక్య తన స్నేహితులు ఆరోజంతా కబుర్లు, ఆటలు పాటలతో కాలక్షేపం చేసి మరునాడు ఆత్మీయ బంధాన్ని వీడి పోతున్నట్లు హాస్టల్ నుండి సొంత ఊర్లకు వెళ్ళిపోతారు.

మాణిక్య పదవ తరగతి చదువుతుండగానే తల్లి దండ్రులు వివాహం జరిపిస్తారు. పదవ తరగతి పరీక్ష రాసిన ఉత్తీర్ణురాలు కాలేకపోతుంది. మాణిక్య భర్త కుటుంబ బాధ్యతల్ని గాలికి వదిలేసి పనిపాటలేకుండా నిత్యం తాగుతూ మత్తులోనే ఉంటాడు. మాణిక్య కూలి పనులకు వెళ్ళి వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషిస్తుంది. మాణిక్యకు ఇద్దరు ఆడపిల్లలు పుడతారు కొడుకు పుట్టలేదని ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారని అత్త,మామలు భర్త తిడుతుంటారు. ఆడపల్లలైనా పిల్లలే కదా. ఇద్దరు ఆడపిల్లలు పుట్టారని ఇక నుంచైనా తాగడం మానేసి బాధ్యతగా పనికి వెళ్ళమని భర్తకు చెప్తుంది.

దళితుల ఇళ్లల్లోనే భర్తల మాటకు భార్యలు ఎదురు సమాధానాలు చెప్తారని, అగ్రవర్ణ మహిళలు భర్తలు చెప్పినట్లే వింటారని ఎదురు మాట్లాడరని మాణిక్య భర్త కోపంగా వాళ్ళ ఇళ్ళల్లో మగవాళ్ళు ఆడవాళ్ళని బయటికి రానివ్వకుండా అవసరమైన వస్తువులన్ని తెచ్చిపెడతారనీ, వాళ్ళు గడపదాటకుండా సౌకర్యాలుంటా యని మాణిక్య చెప్తుంది. మీరు కూడా నేను బయటకి వెళ్ళే అవసరం లేకుండా సకల సౌకర్యాలు ఏర్పాటు చెయ్యండి నేనూ మిమ్మల్ని గౌరవిస్తాను. ఎదురు మాట్లాడనని అంటుంది.

చదువుకుంటేనే బ్రతుకులు బాగుపడతాయని మాణిక్య బలమైన నమ్మకం. తల్లిదండ్రులు తొందరపడి పెళ్ళి చేయకపోయి వుంటే తను కూడా బాగా చదువుకొని ఉద్యోగం సంపాదించేదని అనుకుంటుంది. తన జీవితం లాగా పిల్లల జీవితాలు కాకూడదని వారి భవిష్యత్తు బాగుండాలని ఆశిస్తుంది. తన పిల్లలిద్దర్ని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు వసతి గృహంలో చేర్పిస్తుంది. అక్కడ అన్ని సౌకర్యాలున్న వసతి గృహం, పెద్ద ఆటస్థలం, ఉదయం సాయత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడం వంటి విషయాలు మాణిక్యకు బాగా నచ్చు తాయి. అలాగే భోజన విషయంలో కూడా పలు మార్పులు చోటు చేసుకున్నాయి. ఉదయం మంచి పలహారాలు, పాలు, గుడ్లు, కూరగాయలు, చికెన్ అన్ని రకాలు పెడ్తున్నారని మాణిక్య సంతోషిస్తుంది. అన్ని రకాలు తమ ఇళ్ళల్లో దొరకవని అనుకుంటుంది.

ప్రతినెల రెండవ శనివారం మాణిక్య తన కూతుళ్ళను చూడడానికి తప్పకుండా హాస్టల్ దగ్గరకు వెళ్తుంది. కూలిపని చేసిన డబ్బును రెండో శనివారం బగార అన్నం వండటానికి సోనమసూరి బియ్యాన్ని, చికెన్, మసాలాలు కొనడానికి దాచిపెడుతుంది. పొరపాటున తన తాగు బోతు భర్త ఆ డబ్బును తీసుకెళ్ళి తాగుడుకి ఖర్చుపెడితే ఎవరి దగ్గరైనా అప్పు చేసి బిడ్డలకోసం వంట చేసుకొని పోతుంది. రెండో శనివారం హాస్టల్లో పిల్లలు, తల్లులు కోసం ఎదురుచూస్తుంటారు.

ఏ అమ్మాయికైనా ఆ శనివారం తల్లి రాకపోతే మాణిక్య తన కూతుళ్లతో పాటు కూర్చోబెట్టుకొని అన్నం కూరలు వడ్డిస్తుంది. తను చిన్నప్పుడు సాంఘిక సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాలు ఇన్ని సౌకర్యాలతో ఉండేవి కాదని, అందువల్ల చాలా మంది చదువులు ఆపేయాల్సి వచ్చిందని, ఇలా ఉండి ఉంటే తాను తన స్నేహితులు బాగా చదువుకొని మంచి ఉద్యోగాల్లో స్థిరపడేవాళ్ళని పిల్లలతో అంటుంది. మంచి తిండి, చదువు, గొప్ప ఉద్యోగాల్లో నియమించబడాలని పిల్లల్ని ప్రోత్సహిస్తుంది.

ఈ విద్యా సంవత్సరానికి ఇదే చివరి రెండో శనివారం కదా తరువాత వేసవి సెలవు ఇస్తారు కదా ఇంటికి పిలుచుకొని పోవడానికి వస్తానని మాణిక్య కూతుళ్ళతో చెప్తుంది. ఈ వేసవి సెలవులకి తాము ఇంటికి రావడం లేదని, వారికి పాఠశాలలోనే ఆటపాటలు, ఉపన్యాసాలు,

చిత్రలేఖనం మరియు ఉన్నత విద్యలకు అవసరమైన కోచింగ్ ఇస్తారని చెప్తారు. సెలవులకు పిల్లలు ఇంటికి రారనే బాధ కొంచెం ఉన్నా వారి భవిష్యత్తుకు అవసర మయ్యే శిక్షణనిస్తున్నందుకు ఆనందపడుతుంది. గురుకుల పాఠశాలల అధికారికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుతుంది.

సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ప్రారంభంలో ఒక చిన్న అద్దె ఇంట్లో నడిపేవారని అందులో అరకొర సౌకర్యాలతో, నాణ్యతలేని తిండితో విద్యార్థులు అవస్థపడే వారని, అప్పుడు వసతి గృహాలు, పాఠశాలలు వేరువేరుగా ఉండేవని ఇప్పుడు రెండూ ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేశారని తెలుస్తుంది. అన్ని సౌకర్యాలు సమకూర్చడంతో పాటు విద్యాబోధన, ఆహారం, ప్రత్యేక శిక్షణా కార్య క్రమాలు దళిత విద్యార్థుల భవిష్యత్తులు తీర్చిదిద్దడానికి ఎంతో ఉపయుక్తమైనవని అవగతమౌతుంది.

మీరెట్ల వెజ్జులు :

కథకురాలు వరంగల్ జిల్లా, మారుమూల గ్రామంలో పుట్టి సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో చదువుకొని గ్రూపు-II, దీలో ఎన్నికై హైదరాబాదులోని అగ్రికల్చరల్ ఆఫీసులో ఉద్యోగం సంపాదిస్తుంది. ఉద్యోగానికి వెళ్ళేటప్పుడు ఇంట్లోవాళ్ళు హైదరాబాద్ మన ఊరికి చాలా దూరం అక్కడ ఎలా వుంటావో అని అంటారు. హైదరాబాద్‌లో తనకు తెలిసినవాళ్ళు ఉన్నారని వాళ్ళ దగ్గర వుండి ఉద్యోగానికి వెళతానని చెప్తుంది. కథకురాలు తనకు తెలిసినవాళ్ళ ఇంట్లో అద్దెకువుంటూ ఉద్యోగానికి వెళ్తుంటుంది. ఉద్యోగంలో చేరిన మొదట్లో ఆఫీసు సమయానికి వంట వండుకొని తినడానికి ఇబ్బంది అని పిస్తుంది. అన్నం మాత్రమే వండుకొని అందులో పాలు, ఉప్పు వేసుకొని తిని బస్సు ఎక్కి ఆఫీసుకు వెళ్తుంది. కొన్ని నెలల తర్వాత ఆఫీసు సమయానికంతా అన్నం, కూరలు వండుకొని తీసుకెళ్ళడం అలవాటు చేసు కుంటుంది.

అగ్రికల్చర్ ఆఫీసులో దాదాపుగా పది మంది మహిళా ఉద్యోగులు ఉంటారు. ఆఫీసులో సీనియర్ ఉద్యోగులు కొత్తగా వచ్చిన ఉద్యోగుల వివరాలను అడిగి తెలుసు కుంటుంటారు. కథకురాలికి లక్ష్మీకాంతం, సీతాలక్ష్మి, మీనాక్షి అనే సహోద్యోగులతో పరిచయం ఏర్పడుతుంది. మధ్యాహ్న భోజన సమయం ఉద్యోగులకు చాలా ముఖ్యం. అన్ని పనులు అప్పుడే చేసుకుంటారు. మహిళా ఉద్యోగులకు ఉదయం లేచినప్పటి నుండి ఇంటిపని, వంటపని ముగించుకొని పిల్లల్ని బడికి తయారు చేసి భర్తకు క్యారియర్ కట్టి ఆఫీసుకు వెళ్లడానికి బస్సు ఎక్కు తారు. టిఫిన్ బస్సులోనే తింటారు. అందుకే మధ్యాహ్నం తీరికగా కూర్చొని కబుర్లు చెప్పుకొంటు భోజనం చేస్తారు. ఆ సమయంలో ఉద్యోగినులు వంటల దగ్గరనుండి అంతరిక్ష విషయాల వరకు చర్చించుకుంటారు.

ఒకరోజు మధ్యాహ్నం కథకురాలు సీతాలక్ష్మి దగ్గరి చనువుతో సీతాలక్ష్మి నేను కూడా మీతో లంచ్ చేయడానికి వస్తానంటోంది. వద్దూ! నీవు మాతో తినలేవు అంటుంది. మాతో పెట్టుకుంటే అంతే. మేము తినే సరికి చాలా ఆలస్యమౌతుందని లక్ష్మీకాంతం అంటుంది. అయిన కథకురాలు తన లంచ్ బాక్స్ తీసుకొని సీతాలక్ష్మి, లక్ష్మీ కాంతం, మీనాక్షీ కూర్చున్నచోటుకి వచ్చి కూర్చుంటుంది. కథకురాలు బాక్స్ తెరుస్తూ తన సహోద్యోగులను ఈ రోజు స్పెషలేంటి అని అడుగుతుంది. మాకేం స్పెషల్స్ ఉంటాయి. ఉంటే మీకుంటాయి అని మీనాక్షీ అంటుంది. భోజనంలో ప్రత్యేకత ఏంటని అడిగితే దాన్ని మాంసాహారం అనే అర్థంలో తీసుకొని మీనాక్షీ అలా అనిందని కథకురాలు అర్థం చేసుకుంటుంది. అయినా నేను స్పెషల్స్ తింటానని మీకెలా తెలుసని అడుగు తుంది. ముఖాలే చెప్తాయని సీతాలక్ష్మి అంటుంది. ముఖం చూసి శాకాహారుల, మాంసాహారులా అని కనిపెట్టగలిగిన వారి తెలివికి ఆశ్చర్యపోతుంది. కోపంగా అక్కడి నుండి వెళ్ళి పోవాలనుకుంటుంది కానీ, కొత్తలో చిన్న చిన్న విషయాలకు కోపపడకూడదని సర్దుకుపోవాలని అను

కుంటుంది. సహోద్యోగులు ముగ్గురు వారి లంచ్ బాక్స్‌లు తెరచి తెరవనట్లు తెరచి వాళ్ళు వాళ్ళే నువ్వేమి తెచ్చావు నువ్వేమి తెచ్చావని ఒకరి బాక్సుల్లోకి ఒకరు తొంగిచూస్తుంటారు. కథకురాలిని మాట వరుసకు కూడా ఏమి తెచ్చావని అడగరు.

లక్ష్మీకాంతం, సీతాలక్ష్మి, మీనాక్షీ వాళ్ళ సంసార విషయాలు వంటల తయారీ గురించి కబుర్లు చెప్పుకుంటారు. ఒకరు నెయ్యి తెస్తే ముగ్గురు పంచుకుని తింటారు. కథకురాలి లంచ్ బాక్సు మూతలో ఆ ముగ్గురు తెచ్చిన రకరకాల కూరలు వేస్తారు. కథకురాలు వెయ్య బోతు ఈరోజు శుక్రవారం చిక్కుడుగాయ కూర తిననీ ఒకరు, ఈరోజు బయటివస్తువులు తినకూడదని వాళ్ళత్త చెప్పిందని ఇంకొకరు, ఈరోజు టిఫన్‌లు తప్ప మరేమి తిననీ మరొకరు చెప్పి కథకురాలి చిక్కుడుగాయ కూరను తిరస్కరిస్తారు. కథకురాలు వారు ముగ్గురును మీరు శాకాహారులా? అని అడుగుతుంది. వారు ముగ్గురు అవును మేము శాకాహారులమే గుడ్డు కూడా తినము అని చెబుతారు. పప్పు, పెరుగు, నెయ్యి, ఆకు కూరల్నే తింటామని ముగ్గురు అంటారు.

మొక్కలు కూడా జీవమున్న ప్రాణులే. ఆకుల్ని కోసుకొని తినడమంటే ఆ జీవుల్ని చంపి తినడమే కదా. అలాంటప్పుడు మీరెలా శాకాహారులైతారు అని అంటుంది. మీరు తినే నెయ్యి ఆవు రక్త, మాంసాలనుండి వచ్చినదే కదా! జంతువుల నుండి వచ్చినవి మాంసాహారంతోనే సమానం. అలాంటప్పుడు మీరు శాకాహారులు ఎలా అవుతారు. గుడ్లును తింటూ విభూతిపండ్లు అనడం, చేపలను తింటూ జలపుష్పాలనడం ఎంతవరకు సబబు. అయిన మీ పూర్వులు యజ్ఞయాగాల పేరుతో ఆవు, ఎద్దు మాంసాలనే తినేవారు కదా. అదెక్కడికి పోతుంది అని కథకురాలు అంటుంది.

కులం పేరుతో కాకుండా మాంసాహారాన్ని అడ్డంపెట్టి తనను అవమానకరంగా మాట్లాడినందుకు కథకురాలు బాధపడుతుంది. సహోద్యోగులు ముగ్గురు మాట్లాడుకొనే మాటలు అనందర్భంగా, అసహ్యంగా తనెప్పుడూ వినని‌వాటిలాగా తోస్తాయి. వాళ్ళు కథకురాలి బాక్సు మూతలో వేసిన కూరల్ని తీసుకువెళ్ళి చెత్తబుట్టలో వేస్తుంది. అక్కడి నుండి లేచివెళ్ళి తన సీటులో కూర్చొంటుంది.

తర్వాత ఒకరోజు తన సహోద్యోగిని తనని లంచ్ చేశావా? అని అడుగుతుంది. లంచ్ బాక్సు తీసుకురాలేదు మేడమ్ అని కథకురాలు చెప్పుంది. ఎందుకు అని అడిగితే ఊరకనే అని సమాధానం చెప్పుంది. ఊరకనే ఏమిటి? తినకపోతే పని చేయలేవు. క్యారియర్ తీస్కురాకపోతే క్యాంటీన్‌కి వెళ్ళి తినమని చెప్పుంది. లంచ్ చేయడానికి తనకు ఎవరూ తోడు లేరని కథకురాలు అంటుంది. మొదట్లో అలాగే అనిపిస్తుంది. తర్వాత అలవాటు అయిపోతుంది. ఎవరు నచ్చితే వారితో తినాలి అని సలహా ఇచ్చి తన లంచ్ బాక్సును బ్యాగ్‌లో వేసుకుని వెళ్ళి పోతుంది.

ఈ విధంగా జూపాక సుభద్ర ఒక్కో కథలో ఒక్కో విధమైన ఇతివృత్తంతో కథలను రాశారు. ప్రతి కథలోనూ దళితుల పరిస్థితి కుటుంబంలో, ఉద్యోగం చేసేచోట, పాఠశాలలో, గ్రామంలో ఎలా ఉంటుందో చిత్రీకరించారు.

ఆధార గ్రంథాలు :

1. రాయక్కమాన్యమ్ కథా సంపుటి - జూపాక సుభద్ర
2. తెలుగు వెలుగు మాసపత్రిక మార్చి, 2019 - మాకు గిట్ల లేకపాయె కథ - జూపాక సుభద్ర
3. కథానిక స్వరూప స్వభావాలు - పోరంకి దక్షిణామూర్తి

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పాత్ర సృజన ప్రకరణ ప్రబంధ వక్రతల పద్ధతి

- ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు

సాహిత్య సౌందర్యాన్ని చెప్పే ఆలంకారిక ప్రస్థానాలల్లో వక్రోక్తి ప్రస్థానం ఒకటి. ధ్వనిని వక్రోక్తిలో ఇమిడ్చి చెప్పే ప్రయత్నం చేస్తుందీ ప్రస్థానం. దీని స్థాపకుడు కుంతకుడు. వక్రోక్తి సిద్ధాంతం కూడ ధ్వనిసిద్ధాంతంలాంటిదే. దీనికంత ప్రాచుర్యం రాకపోవటానికి, అభినవగుప్తపాదుల వంటి వ్యాఖ్యాతవలన సాహిత్యలోకంలో సుప్రతిష్ఠం కాక పోవటమే. ధ్వనిని, రసధ్వనిని గురించి కాదనలేని మమత్వం. సరే! వ్యవహార వాక్కునుండి కావ్యవాక్కుకు వచ్చేసరికి ఒక విలక్షణత సమకూరుతుందనేది అందరమూ అంగీకరించేదే. దానినే వక్రత అని కుంతకుడు నిర్దేశించి షడ్విధ వక్రతల్ని చెప్పాడు. అందులో ప్రకరణ వక్రత అనేదొకటి. అనేక వాక్యాల సముదాయంతో కూడిన గ్రంథంలోని ఒక భాగం ప్రకరణం. కొన్ని వర్ణాలు కలిసి పదమైనట్లు, కొన్ని పదాలు కలిసి వాక్యమైనట్లు కొన్ని వాక్యాలు కలిసి ప్రకరణంగా రూపుదిద్దుకుంటాయి. కవి తన సహజ ప్రతిభతో, సహృదయుల్ని ఆనందింపచేసేలా ఈ ప్రకరణాన్ని తీర్చి దిద్దటమే ప్రకరణ వక్రత - ఇది తొమ్మిది రకాలు. అవి -

1. ఒక పురాతన ఇతివృత్తాన్ని గ్రహించి, మూలకథకు భంగం కలిగించకుండా, ప్రస్తుత సందర్భానికి సముచితంగా నూత్న కల్పన చేయటం.

   ఉదా॥ రఘువంశంలోని పంచమసర్గలోని రఘు కౌత్సుల ప్రసంగం.

2. కవి తన ప్రతిభతో ఒక నవీన సన్నివేశాన్ని కల్పించి దానిని కావ్యానికి ప్రాణభూతంగా రూపొందించటం. ఇది రెండు రకాలు -

   అ) ఇతివృత్తంలో ఇంతకుముందులేని దానిని భావించటం.

   ఉదా॥. కాళిదాసు దుర్వాస శాప కల్పనం

   ఆ ఇతివృత్తంలో ఉన్నదానినే అనౌచిత్య పరిహారానికై కొత్తపద్ధతిలో మార్చి చెప్పటం.

   ఉదా॥ ఉదాత్త రాఘవంలోని 'కాంచనమృగ వృత్తాంతం'

3. ప్రబంధం యొక్క ప్రధాన ఫలాన్ని సిద్ధింప చేయటానికి సమర్థమైన ప్రకరణాన్ని ఉపజీవ్యోపజీవక భావంతో నిర్మించటం.

   ఉదా॥ ఉత్తరరామచరిత్రలోని ప్రథమాంకంలోని చిత్రపటదర్శవృత్తాంతంలోని 'జృంభకాస్త్ర వృత్తాంతం'.

4. ఒకే పదార్థ స్వరూపాన్ని ప్రత్యేక ప్రకరణంలో నవరసాలంకార సముల్లసితంగా, మనోజ్ఞంగా తీర్చి చెప్పటం.

   ఉదా॥ 'తాపసవత్సరాజము' - లోని ద్వితీయ చతుర్థ పంచమ షష్ఠాంకాలలోని కరుణరస పోషణ

5. కావ్య సౌందర్యాన్ని పెంపొందించటానికి కథా వైచిత్రికి అనుకూలంగా వేట, జలక్రీడ మొ॥వి కల్పించటం.

   ఉదా॥ రఘువంశంలోని 21వ సర్గలో కుశుని జలక్రీడ.

6. ప్రధాన రసపరిపోషణాన్ని ఏదైనా ఒక ప్రకరణంలో తక్కిన ప్రకరణాలకన్నా మిన్నగా కొనసాగించటం.

   ఉదా॥ విక్రమోర్వశీయంలోని ఉన్మత్తాంకం.

7. ప్రధాన కథ యొక్క సమగ్ర సౌందర్యానికై వైచిత్రితో కూడిన ఒక కొంగ్రొత్త ప్రకరణాన్ని నెలకొల్పటం.

   ఉదా॥ ముద్రారాక్షసంలోని 'రాక్షసమంత్రి - పురుషుడు' - వీళ్ల సన్నివేశం.

8. నాటకంలో అంతర్నాటకాన్ని సంధానించటం.

ఉదా॥ బాలరామాయణంలోని చతుర్థాంకంలోని ఉత్తర రామచరితంలోని సప్తమాంకంలోని అంతర్నాటకం.

9. ప్రతి ప్రకరణాన్ని, పౌర్వాపర్యవిపర్యయంలేని సంధి సంవిధానంతో క్రమవిన్యస్తాలైన అంగ ఉపాంగాలతో సమంచితమైన కథాశరీరాన్ని సంఘటితం చేసినట్లుగా సంతరించటం.

ఉదా॥ పుష్పదూతక ప్రకరణం. కుమార సంభవంలోని క్రమోన్మేషంతో కూడిన పార్వతీ వృత్తాంతం.

ఇది ఇతివృత్తాన్ని గురించి చెప్పినప్పటికీ వాటిని పాత్రపరంగా అన్వయించి కూడా చూడవచ్చు. వీటిలో కవి లేదా రచయిత పాత్రల్ని సృష్టించటంలో అనుసరించే మార్గాన్ని విశ్లేషించటానికి కూడా ఉపయోగిస్తుంది.

మన తెలుగు కావ్యాలలోని ఈ ప్రకరణ వక్రతను గురించి ప్రస్తావిస్తే చాలానే చెప్పాలి. మూల భారతాన్ని కవిత్రయం చేసిన మార్పులు కల్పనలు ప్రకరణ వక్రతలే. సంస్కృత నాటకం తెలుగులో కావ్యాలుగా మార్చటం ప్రక్రియాపరమైన వక్రతే. ఇతిహాసపురాణ కథల్ని తీసికొని ప్రత్యేక కావ్యాలుగా మలచటం కూడా ప్రకరణ వక్రతే. ఉదా॥ వసుచరిత్ర, మనుచరిత్ర, పారిజాతాపహరణం వంటివి. వీటన్నింటిలో ఆయా పాత్రల మూల స్వభావం మారకుండానే కవి తన ప్రక్రియకు అనుగుణంగా పాత్రల్ని పెంచి పోషించారు. ఉపరిచరవసువృత్తాంతం భారతంలో ఎంతో చిన్న ఘట్టం. దానిని రామరాజ భూషణుడు ఎంత గొప్ప కావ్యంగా మలచాడు! మార్కండేయ పురాణంలోని వరూధినీ ప్రవరణ ఘట్టాన్ని ఎంత రసవత్తరంగా పెద్దన తీర్చాడు! పాల్కురికి బసవపురాణంలోని చిఱుతొండనంబి కథను శ్రీనాథుడు, తిన్నడి కథను, ధూర్జటి, నత్కీరుని కథను ఎంతో గొప్పగా తీర్చారు. ఆ తీర్చటంలో మూల పాత్రల స్వభావాలు చెడలేదు. కానీ ఆ పాత్రల్ని తీర్చిన తీరు, ఆయా కవుల ప్రతిభా సంపత్తికి నికషం.

ప్రబంధ వక్రత :

1. మూల కథలోని ప్రధాన రసాన్ని మార్పుచేసి రాయటం.

ఉదా॥ భారతకథ శాంతరస ప్రధానమైతే, భట్టనారాయణుడు వేణీ సంహారాన్ని వీరరస ప్రధానంగా రాయటం.

కరుణ రస ప్రధానమైన రామాయణంలోని ఉత్తర కాండను భవభూతి విప్రలంభ శృంగారంగా మార్చి రాయటం.

2. మూలకథలోని నీరసభాగాల్ని, అనౌచిత్యాల్ని మార్చి రాయటం.

ఉదా॥ కవిత్రయం చేసిన మార్పులు.

3. ప్రధాన కథా వస్తువుకు సంబంధించిన అధికార ఫలప్రాప్తికి విరుద్ధమైన కార్యాంతరాన్ని కల్పించి, చివరకు ఆ కార్యాంతరం ద్వారానే ప్రధాన ఫలసిద్ధి కలిగినట్లు వర్ణించటం.

ఉదా॥ శిశుపాలవధ (మాఘుడు)లో శిశుపాలుడిని చంపటానికి కృష్ణుడిని నారదుడు ప్రేరేపిస్తాడు. శ్రీకృష్ణుడు కూడా సన్నద్ధుడవుతాడు. ఆ సమయంలోనే ధర్మరాజు రాజసూయయాగపు ప్రసక్తివస్తుంది. రాజసూయ యాగమనే కార్యాంతరం వలన శిశుపాల వధ అనే ప్రధాన ఫలం భంగమైనట్లు కనిపిస్తుంది. కాని ఆ రాజసూయ యాగంలోని 'శిశుపాలసంహారం' జరిగి, అధికార ఫలసిద్ధి జరిగింది.

భీమఖండంలో దక్షవాటిలో భీమేశ్వర లింగాన్ని ప్రతిష్ఠించేందుకు సప్తర్షులు సన్నద్ధమై, గోదావరిని తీసుకవచ్చేందుకు వెళతారు. దారిలో కలిగిన విఘ్నాలవల్ల, ముహూర్త సమయానికి రాలేకపోయారు. ప్రతిష్ఠ తప్పని సరిగా ముహూర్తానికే జరిగితీరాలి. సప్తర్షుల జాడలేక పోయేసరికి శివుడే స్వయంగా వచ్చి ప్రతిష్ఠితుడయ్యాడు.

సూర్యుడే దిగివచ్చి తొలి పూజలు చేశాడు. ఇంతలో గోదావరీ సహితులై వచ్చిన సప్తర్షులు జరిగిన ప్రతిష్ఠా పూజలను చూచి పరమానందభరితులై సంతోషించారు. భీమేశ్వర ప్రతిష్ఠ ప్రధాన ఫలసిద్ధి. భావించిన విధంగా కాకుండా మరో రూపంలో జరిగింది.

4. ప్రధాన కథకు అవంతర కథ తోడై కావ్య సౌందర్య సాధకం కావటం.

ఉదా॥ నాగానంద నాటకంలో తొలి అంకంలో భక్తి పరాయణుడైన జీమూతవాహనుడు, లోకోత్తర త్యాగమూర్తిగా నాటకాంతానికి కనిపిస్తాడు. ఈ పరిణామంలో మలయవతీ సంబంధం, శంఖచూడ సంరక్షణం, నాగ జాతి సముద్ధరణ, ఆత్మరాజ్య లాభం వంటి అవాంతర సన్నివేశాలన్నీ కలిసి నాటకాన్ని శోభాయమానం చేశాయి.

5. కవి తన కావ్యానికి సముచితమైన పేరు పెట్టటం

ఉదా॥ అభిజ్ఞాన శాకుంతలము
ముద్రారాక్షసము
మృచ్ఛకటికము
స్వప్నవాసవదత్త

6. ఒకే కథను కవులు భిన్నరీతులుగా రాయటం

ఉదా॥ భాసుని - ప్రతిమ
దిఙ్నాగుని - కుందమాల
భవభూతి - మహావీరచరిత్ర, ఉత్తర రామ చరితము
జయదేవుడు - ప్రసన్నరాఘవము
మురారి - అనర్ఘ రాఘవము - వీటన్నిటికీ వాల్మీకి రామకథే మూలము.

7. కాంతాసమ్మితంగా కావ్యంలో ఉపదేశం చేయటం.

పైన ప్రస్తావించిన ఈ భేదాలన్నీ కాక పోయినా, కొన్నయినా పాత్రచిత్రణలో దోహదం చేస్తాయి.

మన తెలుగు నవలలలో, యితర రచనలలో ఇలాంటి ప్రబంధ, ప్రకరణ వక్రతలకు సంబంధించిన ఉదాహరణలు చాలా ఉన్నాయి.

సీతజోస్యం, జాబాలి (నార్లవారి నాటకం). శంభుకవధ (త్రిపురనేని), అశోకం (ముద్దుకృష్ణ).

వనవాసంలో రాముడు చంపిన రాక్షసులందరూ ఆటవికులని నార్ల అభిప్రాయం. ఋషుల స్వార్థానికి ఆటవికుల్ని బలిపెట్టక ప్రాణభిక్ష పెట్టమని సీత అడుగుతుంది. రాముడప్పుడు నిన్ను లక్ష్మణుడిని అయినా విడిచి పెడతానుగాని, ఋషులకిచ్చిన మాటను తప్పనని రాముడు అంటాడు. 'అవసరమైతే నన్ను విడిచి పెడతానన్నారు. మీరు అంతటి వారే! మీ వంశ గౌరవానికి బలిగా ఎప్పుడో ఒకప్పుడు, ఏనట్టడవిలోనో నన్నుదిక్కులేని దాన్నిగా దిగవిడుస్తారు'' - అంటుంది. అదే సీత జోస్యం.

జరిగిన దాన్నే అంటే ప్రసిద్ధమైన పాత్ర వ్యక్తిత్వాన్ని మార్చి రచయిత చెప్పటం కనిపిస్తుంది.

ఓల్గా 'మృణ్మయనాదం' - కథలో కూడా పురాణ పాత్రలైన సీత, ఊర్మిళలు కొత్త గొంతుతో మాట్లాడతాయి. వనవాసానంతరం వచ్చిన సీతకు తోడికోడళ్లలో మాండవి శ్రుతకీర్తులు తప్ప ఊర్మిళ కనిపించకపోయేసరికి ఊర్మిళను వెతుక్కుంటూ వెళుతుంది. 14 సం॥లు తాను చేసిన తపస్సును గురించి సీతకు వివరిస్తుంది. 'నేను ఎవరి అధికారానికీ లొంగను. నా అధికారంతో ఎవరినీ బంధించను. నన్ను నేను విముక్తి చేసుకున్న భావన'' - అని చెప్పి సీతను కూడా అలాగే ఉండమని చెపుతుంది. చివరికి లవకుశుల్ని అప్పగించిన సీత కూడా అలాంటి భావననే పొందుతుంది. పిల్లలనుండి విముక్తురాలై, ''తాను లోకం కోసం, భర్తకోసం నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవలసిన అవసరం లేదని ఎక్కడినుండి వచ్చిందో అక్కడికే వెళ్లిపోతుంది. సీత, ఊర్మిళలు కొత్త గొంతుకతో మాట్లాడటం ఇందులోని వక్రత.

హెన్రిక్ ఇబ్సన్ రాసిన ''An English of the People'' నాటకాన్ని 'సత్యంగారిల్లెక్కడ' - నాటకంగా మార్చిరాశాడు.

ప్రజాభిప్రాయం ఎప్పుడూ విపరీతం, అమానుషము - అని చెప్పే సార్వజనీనమైన ఇతివృత్తం ఇబ్సెన్ నాటకం. దానిని మన భారతదేశపు నేటివిటికి అనుగుణంగా మార్చి రాసేటప్పుడు, ఈ దేశంలో ప్రజాభిప్రాయాన్ని బాగా ప్రభావితం చేసే మరోశక్తిని గొల్లపూడి మారుతీరావు పాత్రగా చేశాడు. ఆ పాత్రే దేవుడు. తమ మాటే రైటని నిరూపించటానికి దేవుడికి విషమిస్తారు నాటకంలో. అదే నాటకంలోని మలుపు.

పల్నాటి యుద్ధాన్ని భారతయుద్ధంతో పోల్చి చెపుతారు. చాపకూటితో సమతను నేర్పిన బ్రహ్మనాయుడి పాత్రను చాలామంది ధర్మరాజుతో కృష్ణుడితో పోల్చి వర్ణించారు. పల్నాటియుద్ధగాథను 'నాయకురాలు' నాటకంగా తీర్చిదిద్దిన ఉన్నవవారు నాగమ్మను చాతుర్వర్ణ్య వ్యవస్థ కోసం నిలబడిన శైవురాలిగా, బ్రహ్మన్నను వర్ణవ్యవస్థను నిరసించే అభ్యుదయ కాముకునిగా, అస్పృశ్యతను నిర్మూలించి అందరిచేతా చాపకూడు తినిపించటానికి కంకణం కట్టుకున్న వీరవైష్ణవుడిగా, చిత్రించాడు. చాపకూడు, వైష్ణవం - బ్రహ్మనాయుడి విషయంలో చెప్పటం పాతవిషయమే. కాని అంతకంటే విశేషమేమంటే గాంధీ సిద్ధాంతాలను పలకటానికి అనువైన పాత్రగా బ్రహ్మనాయుడి పాత్రను తీర్చారు. అంతేకాకుండా బ్రహ్మనాయుడి పోరాటం పంచమ, పంచమేతర తగాదాలోకి దిగుతుందని కన్నమనీడు అంటే 'అంతకంటే బీదల - భాగ్యవంతుల తగాదాలోకి దిగుతుందంటే సరిపోతుంది' - అంటాడు బ్రహ్మనాయుడు.

ఇలా ప్రసిద్ధమైన పాత్రలను వాటి సంఘర్షణను సమకాలీన చైతన్యంతో సంవదింప చేసేలా చిత్రించటం ప్రకరణవక్రతే.

బాగా ప్రసిద్ధమైన Classical పాత్రల్ని తరువాతి కాలంలో మార్చి రాయటం చాలాచోట్ల కనిపిస్తుంది. అలా మార్చి రాయటం రచయిత ప్రకరణ వక్రతలో భాగమే కావచ్చు కాని, అలా రాసిన పాత్రలలో సఫలమైనవి లేదా జనామోదం పొందినవీ బహుతక్కువే. ఉదా॥కు హేతువాద దృక్పథంతోనో, Psychology దృక్పథంతోనో సీత పాత్రను వ్యాఖ్యానిస్తూ చేసిన పునఃసృజనలన్నీ అంతే! ఎందుకవి జనామోదంపొందలేదంటే అవి Classical పాత్రలు కాబట్టి. Classical అంటేనే ఆదర్శమైన, లక్ష్యప్రాయమైనవని కదా!

ఒక వేళ ఏ Classical పాత్రయినా అలా పునఃసృజనలో గొప్ప పేరు సంపాదించుకొని జనామోదం పొందిందంటే అది Original లోనే Classical ప్రమాణం పొందలేదని. అలా Classical స్థాయిని పొందనీయని వెలితే పునఃసృజనలో ఆ ప్రాభవానికి కారణమైందని గ్రహించాలి.

ఆధునిక కాలంలో గురజాడ సృష్టించిన గిరీశం ఒక క్లాసికల్ పాత్ర. ఆ పాత్ర Noble Qualiteesతో ఉండటం వలన Classical కాలేదు. ఆ పాత్ర చిత్రించబడ్డతీరు, సమస్త మానవకోటికీ సంకేతమై కూర్చున్నందుకు. గురజాడ ఆ పాత్రను యువకుడిగానే సృష్టించాడు. మరి ఆ పాత్రను ఎవరైనా ఎనభై ఏళ్ల ముసలివానిగా చిత్రిస్తే అంగీకరించలేం. ఇలా సాహిత్యంలో ప్రసిద్ధమైన పాత్రల్ని మార్చటంలో మన హృదయాలపై ఆ పాత్రలు వేసిన ముద్రల్ని గమనించుకోవలసి యుంటుంది.

- యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ద్రౌపది పాత్ర సంచలనమే కాని జనామోదం పొందిన పాత్రకాదు.
- తెలుగులో ఆదిత్య 369, 'బ్యాక్ టుది ఫ్యూచర్' పరంపరలో వచ్చిన మూడు సినిమాలనీ ఒకే కథలో కుదించి, దానికి మార్క్‌ట్వైన్ నవల "A Connecticut Yankee in King Arthur's Court" నుండి పొందిన ప్రేరణను జోడించి తీసిన సినిమా. ఆక్రమంలో కథని చాలా సరళీకరించి, మూలకథలోని కాలమాన వైరుధ్యాలను తొలగించి అరటి పండు ఒలిచి చేతిలో పెట్టినట్లుగా తీశారు.
- 'మట్టి మనిషి' (వాసిరెడ్డి సీతాదేవి) నవలలోని సాంబయ్యే 'తాతమ్మకల' సినిమాలోని రావమ్మ. కథ కూడా కొద్ది మార్పులతో అలాగే సాగుతుంది.

- హిందీ సినిమా 'సాజన్'లోని పురుష పాత్రలు, తెలుగులోని 'అల్లరిప్రియుడు'లోని స్త్రీ పాత్రలు.
- కృష్ణ తీసిన 'మీనా' (యద్దనపూడి సులోచనా రాణి నవల) తరువాతి కాలంలో మార్పులతో 'అ..ఆ'' సినిమాగా రూపుమార్చుకొంది.
- తొప్పిల్‌భాసి రాసిన 'తులాభారము'నే నవల తెలుగులో 'మనుషులు మారాలి' అనే సినిమాగా వచ్చింది. మూలంలో నాయిక నిరుపేద. కాని తెలుగులో రసోత్కర్షకోసం నాయికను సంపన్న కుటుంబంలో నుండి వచ్చినట్లు మార్చారు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కాళీపట్నం రామారావు 'యజ్ఞం' కథ : ఆధునికత - హక్కుల చర్చ

- డా॥. వెంకట రామయ్య గంపా

తెలుగు సాహిత్య పాఠకులకు పరిచయం అక్కర్లేని పేరు కాళీపట్నం రామారావు అయితే, అత్యంత చర్చనీయ మైన కథ యజ్ఞం. ఈ కథ పాఠకులు, విమర్శకుల మనస్సులపై చెరగని ముద్ర వేసింది. కాళీపట్నం రామారావు మార్క్సిస్టు ఆలోచనా విధానాన్ని ఆకళింపు చేసుకొని అణగారిన వర్గాలపై పెత్తన వ్యవస్థ వైఖరిని, సమాజంలో ఉన్న అనాగరిక చర్యను వెలికి తీయడానికి యజ్ఞం కథను రాసినట్లు కనిపిస్తుంది. అభివృద్ధి, ఆధునికత అనే పేరుతో కొంతమంది చేస్తున్న దోపిడీ వలన సామాన్యులు తమ భూమి హక్కులను, వారి అస్తిత్వాలను పణంగా పెట్టాల్సిన పరిస్థితి వ్యవస్థ కల్పించిన తీరు యజ్ఞం కథలో కనిపిస్తుంది. ఈ కథలో ప్రధాన సమస్య భూమిపై పెత్తందారుల అధికార దుర్వినియోగం, సామాన్యుల హక్కులను హరించడం. కొన్ని వర్గాలు ఎలా (అక్రమ మార్గంలో) సంపాదించాయో, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అభివృద్ధికి కోసం సూచించిన పంచవర్ష ప్రణాళికలు క్రియాత్మక అమలులో ఏ విధంగా వైఫల్యం చెందాయో ఈ కథలో కనిపిస్తుంది. ఈ కథ రాసి ఐదు దశాబ్దాలు దాటినప్పటికీ అది లేవనెత్తిన హక్కుల సమస్యలు ప్రస్తుత సందర్భాలకు ఉప యోగపడతాయి.

ఆధునికతను అర్థం చేసుకోవడం :

ఆధునికత దేశంలోకి రెండు శతాబ్దాలకు పైగా విస్తరించి, మానవ సామాజిక జీవితంలోని వివిధ దశలను విపులంగా చర్చించింది. ఆధునికత అనేది వ్యక్తి యొక్క స్వేచ్ఛపై నమ్మకం - అనేక మంది ఆలోచనాపరులు ఊహించినట్లుగా సాధారణమైనది మరియు సహజ మైనది, ప్రపంచంపై ఉన్న అవగాహనతో తర్కించే తత్వాన్ని జత చేయబడింది. పారిశ్రామిక శక్తులు ఈ ప్రక్రియలో ఆధిపత్యం చెలాయిస్తూనే ఉన్నాయి. పట్టణీకరణ అంటే గ్రామీణ జీవితాన్ని దుర్భరం చేయడం కాదు. పట్టణ జీవితాన్ని గ్రామీణ ప్రాంతాలకు వ్యాప్తి చేసి ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించేలా కృషి చేయడం, పాత నగరాలు మెట్రోపాలిటన్ ప్రాంతంగా అభివృద్ధి చెంది ఆ ఫలాలను తక్కిన వారికి అందించడం. లక్షల మంది ప్రజలు ఉన్న ఒక పెద్ద నగరం, సామాజికంగా మరియు ఆర్థికంగా చుట్టుపక్కల సమాజంతో కలిసి ఉంటుంది. మెట్రోపాలిటన్ ప్రాంతాలు ఇతర పెద్ద పట్టణ సముదాయాలతో విలీనం అవుతాయి. పారిశ్రామికీకరణ ద్వారా వ్యవస్థలో ఉత్తమ జీవన వ్యవస్థ ఏర్పడుతుందని భావిస్తారు. ఇది సాధారణంగా ఆధునికతలో పైకి కనిపించే అంశం. కానీ ఫలితాలు వాస్తవంలో భిన్నంగా ఉన్నాయి. ఆధునికత ఉత్పత్తి సాధనాలన్నిటినీ త్వరిత గతిన మెరుగుపరచడం ద్వారా, కమ్యూనికేషన్ల ద్వారా సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వారిని దేశీయ పద్ధతులను పాటిస్తున్న వారిని అనాగరికులుగా ముద్ర వేస్తుంది. నాగరికత పేరుతో తమ వస్తువులను ఉప యోగించుకునేలా ఆధునికత తయారుచేస్తుంది

'యజ్ఞం' కథలో మనం చూసినట్లుగా, ఆధునికీకరణ ఫలితంగా భూస్వాములు, పాపుకారులు మరీ ముఖ్యంగా వ్యవసాయ రంగంలో అట్టడుగు స్థాయిలో పనిచేసే ప్రజల జీవితాలను ఎలా ప్రభావితం చేశారో చూడవచ్చు. ఆధునికత ఫలితంగా గ్రామీణ జీవితంలో వివిధ ఆర్థిక విధానాలలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఆధునికత వారిని తాకడానికి ముందు సాంప్రదాయ సమాజం,

చాలా పరిమితమైన సాంకేతిక పరిజ్ఞానం, స్థిరమైన సమాజాన్ని కలిగి ఉంది. ఇది తరువాత బాహ్య ప్రభావం వలన సహజత్వాన్ని కోల్పోయింది. ముఖ్యంగా వ్యవసాయ రంగం వాణిజ్య దోపిడీకి గురైంది. ఆధునికీకరణ వలన భూస్వాముల జీవితంలో ఆర్థికంగా మార్పు వచ్చి సామాజిక, రాజకీయంగా ఉన్నత స్థాయికి చేరారు. పారిశ్రామిక మరియు వాణిజ్య రంగంలో విస్తృతమైన పెట్టుబడి పెట్టారు. భూస్వాములు పెట్టుబడిదారులుగా, ఆధునిక సంస్థల అధిపతులుగా మారారు. వాణిజ్యంలో ప్రయోజనాలను పొంది పరోక్షంగా సామాన్యులను దోపిడీ చేయడం ప్రారంభించారు. ఈ విషయాన్ని అర్థం చేసుకోవడానికి సామాన్యులకు చాలా సమయం పట్టింది. ఈ సమయంలో జరగాల్సిన నష్టం జరిగిపోయింది. "పండిన పంటంతా కాఉవందుల గోదాలకెళ్లాల. ఎల్లకుండా కూలోడు అడ్డ తగులుతున్నాడు. ఎనకట్రోజుల్లో అయితే తన్ని సేయించుకునీవారు. ఇప్పటి రోజుల్లో ఆ పప్పులు డకవు. కూలోడి అడ్డ వొదిలించుకోవాలంటే మిసీన్లు కావాలి. మిసీన్లు తేవాలంటే యెలట్రిసిటీ, రోడ్లు కావాలి. అంతేకాదు, సదువుకున్న కూలోళ్లు కావాల.. అందుకనే యీ యిస్కూళుబీ అందుకనే యీ రోడ్లూ, యీ యెలట్రిసిటీ, ఇయన్నీ మన కోసవే అనుకోవడం బుద్ధి తక్కువ. నీల్లు తోడానికటి మిసీన్లాచ్చేసినాయనే గుంజుకు పోతున్నారు. రేప్పాద్దున దున్నడానికి, ఊడుపులకు, గొప్పులకు, కోతలకు కూడా మిసేన్న రాబోతున్నాయి. అప్పుడు సూసుకోండి తడాఖా అన్నాడు" అని కథలో పాత్ర చేత రచయిత చెప్పిస్తాడు. సామాన్యులకు ఉన్న పరిమిత జ్ఞానం వలన ఆధునికతను తమకు అనుకూలంగా మలుచుకోలేకపోతున్నారు. కానీ అందుకు భిన్నంగా భూస్వాములు తమకు ఉన్న అవగాహనతో, పలుకుబడితో, ఆర్థిక బలంతో సమాజంలో పరోక్షంగా ఇతరులను దోచుకుంటున్నారు. గతంలో భూస్వాములు బలహీన వర్గాల పైన ప్రత్యక్షంగా పెత్తనం చేసేవారు. కానీ స్వాతంత్రం తరువాత చట్టాల్లో ఉన్నటువంటి సమస్యల దృష్ట్యా ప్రత్యక్షంగా బలహీనవర్గాల పైన పెత్తనం చెలాయించకుండా తమకు అనుకూలమైన పద్ధతులలో వారి హక్కులను తమ గుప్పిట్లో పెట్టుకుంటున్నారు.

యజ్ఞం కథ : ఆధునికత సాంస్కృతిక సిద్ధాంతం - హక్కులు

ఆధునికతకు రెండు ముఖాలు ఉన్నాయని పలువురు విమర్శకులు ఇప్పటికే తెలిపి వున్నారు. మొదటిది ప్రకాశవంతమైనది. ఇది ముందు చూపుతో ఉంటుంది, అదే సమయంలో రెండవ ముఖం ఆధునికత యొక్క చీకటి కోణాన్ని మనకు చూపిస్తుంది, ఆధునికతతో ఉన్నత స్థాయిలో తీసుకురాబడే కొత్త సామాజిక సమస్యలను తెలుపుతుంది. భూస్వామ్య వ్యవస్థలో, ప్రజలు శారీరక బలం ద్వారా ఆధిపత్యం చెలాయించేవారు, కాని ఆధునికతలో ప్రతిదీ కుల/వర్గ వ్యవస్థ ప్రభావంతో నిశ్శబ్దంగా జరుగుతుంది. సమాజం పట్ల ఎలాంటి దురభిప్రాయం లేకుండా ఆధునికతను పెంపొందించడానికి ప్రభుత్వం ప్రయత్నించింది.

అప్పల్రాముడు విలపించినప్పుడు ఆధునికతకు సంబంధించి యజ్ఞం' కథలోని అంశాలను చూపించారు. 'మేము మా ఉత్పత్తిని అమ్మాలనుకున్నప్పుడు, రేట్లు ఎల్లప్పుడూ తక్కువగా ఉండేవి, కానీ మేము వాటిని కొనాలనుకున్నప్పుడు, ఖర్చులు మనస్సును కదిలించేవి. మోసపోయిన రైతులను మోసగించడానికి వ్యాపారవేత్తలు చాలా ఉపాయాలను ఆశ్రయిస్తారు. మేము అన్యాయాన్ని ప్రశ్నించినప్పుడు, వ్యాపారవేత్తలు అది వర్తక ధర్మంలో భాగమని చెప్పేవారు'. వడ్డీ వ్యాపారులు మరియు ఆర్థిక నిపుణులకు సమానమైన 'వర్తక ధర్మంలో అత్యంత భయంకరమైన భాగం అధికారులూ చేరడం! "బాబయ్యా! పంట ముకాన సావుకారొచ్చినోడు. ఓ రప్పల్రావుడూ, ఓరసిరిగో! పుట్టీ వీరుశనగల ధర యింతరా అనేవోడు. మాం సిత్తం బాబయ్య అనివాళ్లం. సరుకు వచ్చిది కాబట్టి తరుగింతరా అనీవాడు. సరే బాబయ్యా అనీవాళ్లం. కాలగారం యింతా అనేవాడు. నోరు మూసుకునీవోళ్లం.

నీకింతొస్తది. అవసరమైతే పుచ్చుకొనేవోళ్లం. లేప్పోతే నీకాడే వుణ్ణియ్యయ్యా - అనీవోళ్లం..."

"తరువాత తరవాత ధరలు పడిపోవడం, పెరిగి పోవడం ఆరంభించాయి. ఏరుసెనగలు ఏసి అవి పండితే ఆటి ధర పడిపోయేది. ఆ యాడాది మిరపకాయలు ధర పెరిగిపోయేది. మిరప బాగా పండిన ఏడాది దానికి ధర పలికేది. పొగాకు జయ్ మనీది కాదు. ధరలెప్పుడు పడి ఎప్పుడు లెగిసిపోతాయో తెలిస్తే బావున్ననిపించిది. కాని రైతోడి కెప్పుడూ అవి తెలిసి వచ్చివి కావు". అప్పల్రాముడి ఉపన్యాసం వాస్తవానికి నేటికీ వర్తిస్తుంది.

యజ్ఞం కథలో లో ప్రధానమైనవి కుల/వర్గ చట్రం, సాంస్కృతిక అసమానతలు, భూస్వాముల లాభదాయక మైన వర్తకం, సంప్రదాయ పంటల నుండి ప్రమాదకరమైన వ్యాపార పంటలవైపు చూస్తున్న రైతులు, యంత్రాలు పేదల కూలి డబ్బును లాగేసుకోవడం, గ్రామీణ ఉత్పత్తుల అస్థిరమైన ఖర్చులు, పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చులు, రైతుల అస్థిరమైన ఆదాయం. ఇవన్నీ రైతుల హక్కులను పరోక్షంగా హరిస్తున్నాయి.

ఆధునికత : శ్రీరాములు నాయుడు- గ్రామ సమాజం :

"నడి వర్షాకాలం ఎండవేళ ఆ పాలిమేర తాటితోపుల్లో కనిపించే దృశ్యం సుందరమైనదే. మధ్యగా చిక్కని కొబ్బరి చెట్లూ, చిల్లర చెట్ల నీడని ఆ చిన్న గ్రామం. ఆ మీద పచ్చ పచ్చగా, ఎర్ర ఎర్రగా, నల్లగా, తెల్లగా, బూడిద రంగులో మెరక భూములు, తాటి పెండెలూ, మొగలి డొంకలూ వాటికి సరిహద్దురేఖగా వుంటాయి. కింద పచ్చని వరిచేలు. మధ్య అక్కడక్కడా వెండిలా, ఎండలు నిండుగా మెరిసే నిండు నిండు చెరువులు. ఆ కోస్తాలో సుందర పాలెం పలువురు అనాధల నడుమ పచ్చగా బతికే సనాధలా కనిపిస్తుంది". కథకుడు సుందర పాలెం గురించి వివరించిన వర్ణణ ఇది. గాంధేయవాది అయిన శ్రీరాములు నాయుడు గత 15 సంవత్సరాలలో తన గ్రామమైన సుందరపాలెంను అభివృద్ధి చెందుతున్న ముఖంగా మార్చడానికి అద్భుతమైన చర్యలు తీసు కున్నాడు, అదే సమయంలో విద్యుత్తును కూడా నిర్ధా రిస్తూ ఒక రహదారి, పాఠశాల మరియు ఆసుపత్రిని నిర్మించాడు. గాంధేయవాది యొక్క ఈ అభివృద్ధి చోదక ప్రయత్నాలు 'యజ్ఞం' అని రచయిత పేర్కొన్నాడు, కాని నాయుడు యొక్క ఈ ప్రయత్నాలు క్రమంగా వారి గ్రామమైన సుందరపాలెం యొక్క పురోగతి ప్రక్రియలో ఒక వర్గం ప్రజలు బూడిదగా మారాయని గమనించడం పాఠకులను ఏకకాలంలో తాకుతుంది. ఇది భూస్వాము లకు వరంగా మారింది. ఈ వసతులను సరిగా విని యోగించుకోవడం రాని వర్గం తమకు ఉన్న చిన్నపాటి ఆదాయ వనరులను కోల్పోయారు. అప్పల్రాముడికి సమస్య వచ్చినప్పుడు పరిష్కరించడానికి శ్రీరాములు నాయుడు ఒక కార్పొరేట్ యజమాని లాగా వ్యవహరించి నట్లు కథలో కనిపిస్తుంది. "బాబూ లక్షణం నాయుడూ! నేను శ్రీరాములు నాయుడ్ని నెస పెడుతున్నా ననుకోకు. ఆయన ధర్మరాజు. ధర్మరాజులాగానే ఆయన అజాత శత్రువ ఒక వంక న్యాయంకోసం ఎవ్వరూ వూరు విడిచి పోకూడదని కట్టడి చేస్తాడు. ఇంకో వంక న్యాయం చెప్పవలసే వేళకు దాటిపోతాడు. లేకపోతే ఆయనకు గానీ, ఆయన మేనమామలకుగానీ, మంది లేరనా, మార్బలం లేదనా ఒక్కటంటే ఒక్క పూట వచ్చి వెళ్లడానికి ఆయనకు తీరిక చిక్కడం లేదంట".. "నీ దెబ్బన్నది తగిలినసోట కనపడదు. నువ్వేంజేసినా సాపకింద నీరులాగ సల్లగ ముంచుతావు" అని అప్పాల్రాముడు చెబుతారు. ఈ మాటల ద్వారా శ్రీరాములు నాయుడు పైకి కనిపించే స్వభావం, లోపలి మనస్తత్వం రెండూ పూర్తిగా భిన్నం. ఏది ఏమైనప్పటికీ, నాయుడు గ్రామాన్ని గ్రామ దృక్కోణం నుండి మాత్రమే చూడకుండా ఆధునికత దృక్పథం నుండి అణగారిన వర్గాల వారికి వ్యతిరేక దిశలో వెళుతున్న విషయాన్ని గమనించే ఉన్నాడు. "నూతుల చెరువుల ఎగువను, పోతినాయుడు అయిదెకరాలు బంజరు వరకట్టాడు. దానికి పైని ఇంకో అయిదెకరాలు వరకట్టనిది ఉంది. అది కూడా తన పేరనే

ఉందని అతను దబాయిస్తూ ఉంటాడు. అతను అప్లికేషను పెట్టడం అది శాంక్షను కాకపోవడం ఆ కథంతా వేరే వుంది. ఏమైనా అతన్ని ఒప్పించే పూచీ పెద్దలది. మీరధి కట్టేయండి. మీపేర పట్టా అయేటట్టు చూచే పూచీ నాది". శ్రీరాములు నాయుడు కి ఈ విషయాలన్నీ తెలుసు కానీ మౌనం వహించారు. ధనవంతులకు సామాజికంగా ఉన్నత వర్గాల వారికి అవకాశం ఉన్నటువంటి పద్ధతులను పరోక్ష దోపిడిని కథలో తెలియజేశారు రచయిత. ఈ విధానాల వల్ల కొంతమంది భూస్వాములు ధనవంతులుగా మారుతున్నారు. ఆధునికతను తట్టు కోలేనివారు వ్యవస్థలో జీవితాలను కోల్పోయారు. 19వ శతాబ్దం తరువాత పారిశ్రామికీకరణ ఫలితంగా సంప్ర దాయ సంస్కృతుల నుండి బయటకు రావడానికి ప్రయత్నించడం, కొత్త ఆర్థిక వ్యవస్థ, మరియు వస్తువు లను అవలంబించడం మన దేశ గ్రామాల్లో పలు సమస్యలు ఉత్పన్నమయ్యాయి. దేశంలో వ్యవసాయ సంబంధిత వృత్తి చాలా ప్రాథమికమైనది, కానీ పారి శ్రామికీకరణ పట్టణీకరణకు దారితీసి మునుపటి రకమైన జీవనశైలిని మార్చివేసింది. దేశీయంగా ఉన్న సరళమైన జీవనశైలిని సవాలు చేసింది. సామాజిక అసమానతలను రూపుమాపక పోగా కొత్త సమస్యలను లేవనెత్తింది. భూస్వాములు, వ్యాపారస్తులు పారిశ్రామికీకరణ, పట్టణీకరణల వల్ల లబ్ధిపొందుతున్నారు. వ్యవసాయ రంగంలో పాశ్చాత్య ఉపకరణాలను ప్రవేశపెట్టడం వల్ల పేదలు, శ్రామికవర్గమంతా నష్టపోయింది. కథలో కూడా, గ్రామంలో రోడ్డు వేయడం వంటి పరిణామాలు కొంత మందికి ప్రయోజనం చేకూర్చాయి, కాని మొదట తమ బండ్లపై రాళ్లను సేకరించి, వారి చేతులతో రహదారిని నిర్మించిన ప్రజలను హింసించాయి. "ఆ దెబ్బతో నా వ్యాపారం దెబ్బ తినేసింది. నాదే అన్న మాటేవిటి - చాలామందిది. దెబ్బతినేసింది. నాది మరీ అధ్వాన్నం!" ప్రతివారు ఆధునికత ఫలితంగా వచ్చిన బాధలను తెలియజేశారు.

ఇక్కడ, గోపన్న బాబు విషయంలో, అతను ఒకప్పుడు విజయవంతమైన మరియు ధనిక వ్యాపారవేత్త, అలాంటప్పుడు ఇన్ని సంవత్సరాలు గ్రామ పురోగతి గురించి అతను ఎందుకు ఆలోచించలేదు? వ్యాపార వేత్తగా ఉన్నప్పుడు, గోపన్న కార్పొరేట్ ప్రపంచంలో ఎందుకు విఫలమయ్యాడు? కనీస మానవ హక్కులకు భరోసా కల్పించి, తరువాత గ్రామంలో కార్పొరేట్ సంస్కృతిని స్థాపించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు వ్యవస్థ కూడా విఫలమైంది. ప్రాథమిక మానవ హక్కులు కూడా పేదలకు అందుబాటులో లేవు, వాటిని ఇతరులు చూశారు.

అప్పల్రాముడు 50 ఏళ్ల క్రితం తన తండ్రి నుంచి సేకరించిన భూమిని దశలవారీగా ఎలా కట్టబెట్టాడో, బాధ్యతల ఉచ్చు నుంచి బయటపడేందుకు ఎలా పోరాడుతున్నాడో వివరిస్తాడు. రైతులు నిరంతరం అప్పుల సుడిగుండంలోకి వెళతారు, దాని నుండి వారు బయటకు రాలేరు... తాము మోసపోయామని బాగా తెలిసిన రైతులు వడ్డీ వ్యాపారులపై ఆధారపడతారు... వాణిజ్య పంటలను ప్రవేశపెట్టడంతో మా సంతోషకరమైన రోజులు నాశన మయ్యాయి" అని అతను 1910 ల మంచి పాత రోజు లను గుర్తు చేసుకుంటూ చెప్పాడు.

అప్పల్రాముడు ఒక దశలో మనిషి అనే వాడు ఎంత భయంకరంగా రూపాంతరం చెందుతున్నాడో చూసి ఆశ్చర్యపోయాడు. "బాబయ్యా! మంచన్నది సెబ్బరై పోవడం నాకూ సిత్రంగానే వుంది కాని జరిగిందీ జరగ బోయేదీ సూస్తే, ఆల్ని కాదనడ వెలాగో నాకు తెల కండున్నాది." గతంలో మనుషులు చేసిన పనులన్నీ నేడు యంత్రాలతో చేయడం ప్రారంభించారు. దీని ఫలితంగా కూలివని చేసుకునేవారు వారి జీవనోపాధిని కోల్పోతున్నారు. కృత్రిమ మేధస్సు వంటి తాజా పురోగతి వలన ఎంతోమంది తమ ఉపాధి అవకాశాలను కోల్పో తున్నారు. ఈ సమస్యలకు పరిష్కారాలు చూడటం లేదు.

ఆధునికత: అప్పల్రాముడు, సీతారాముడు, వ్యవస్థ

ఆధునికతను తమకు అనుకూలంగా మార్చుకోవడం చేతకాకపోతే యజ్ఞంలో సమిధలు లాగా మిగిలిపోతారని, అప్పల్రాముడు, సీతారాముడు వంటి పాత్రలను ఒక ఉదాహరణగా చూపించారు రచయిత. నిజానికి ఆధునికతను ఉపయోగించుకొని తమ హక్కులను చట్ట బద్ధంగా పొందడం, అప్పల్రాముడు, సీతారాముడుల జీవితాన్ని ఉన్నత స్థితికి తీసుకెళ్లే అవకాశం రచయిత యజ్ఞం కథ ద్వారా తెలియజేయవచ్చు.

ఉదాహరణకు కథలో పరిస్థితికి సంబంధించిన ఆచరణాత్మక దృక్పథాన్ని పరిగణనలోకి తీసుకొని, అప్పల్రాముడు, ముసలయ్య నుండి కొత్త రుణం పొంద డానికి బదులుగా గోపన్నబాబుకు తిరిగి చెల్లించడానికి మరేదైనా ప్రత్యామ్నాయాన్ని చూసుకొని ఉండవచ్చు. 'అప్పల్రాముడంటే వూరి జనంలో మూడొంతులు ముప్పాతిక మందికి సదభిప్రాయం వుంది. మాటకు నిలబడేవాడూ, మర్యాదగా బతకాలను కొనేవాడూ... తగువుల్లో పేదా రోదా అంటే సానుభూతి కలవాడని కొందరికభిమానం' అని కథలో అప్పల్రాముడి పాత్ర గురించి తెలియజేశారు రచయిత. గ్రామంలో అంత గౌరవం, నమ్మకం ఉన్న వ్యక్తికి ఎవరైనా అప్పు ప్రత్యక్షంగా ఇవ్వవచ్చు లేదా 450 కుటుంబాలు ఉన్న గ్రామంలో సగం మంది పది రూపాయల చొప్పున సేకరించినా అతని అప్పు తీర్చడానికి సులభంగా ఉండేది. కానీ అటువంటి ప్రయత్నం జరగలేదు. 'అంతా అయ్యాక జనం సానుభూతి రాముడి వంక ప్రవహిస్తోంది. దేనికా ప్రవాహం! మురుగునీరు దానికన్నా నయం!' అని రచయిత పేర్కొ న్నారు. మనుషుల్లో వస్తు సంస్కృతి ఆధునికత ప్రవేశించక పూర్వం ఒకరికొకరు సహాయపడేవారు. ఒకరి అవసరాలను గుర్తించి ఇతరుల తమ వంతు సహాయం చేసేవారు. కానీ ఆధునికత ప్రవేశించిన తరువాత వస్తువుల పట్ల వ్యామోహం పెరిగింది, మనుషుల పట్ల మమకారం తగ్గిపోయింది. ఒక వ్యక్తి తన జీవితాన్ని కోల్పోతున్నారని తెలిసికూడా ఇతరులు ఏ రకమైన సహాయం చేయడానికి ముందుకు రాలేదు.

రెండవ ప్రయత్నంగా అప్పల్రాముడు రైతులకు బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణాన్ని తీసుకొని గోపన్నకు అప్పుతిరిగి చెల్లించడం. కానీ ఇటువంటి ప్రయత్నం ఏమీ జరగలేదు అందుకు గల కారణం అవగాహన రాహిత్యం.

సనాతన కట్టుబాట్లను వదిలిపెట్టి న్యాయపరమైన ఒప్పందం పొందడానికి న్యాయస్థానానికి వెళ్ళే ఎంపికను పరిగణనలోకి తీసుకోవడం. న్యాయస్థానానికి వెళితే న్యాయస్థానాలు చట్టప్రకారం తీర్పును ఇవ్వవలసి ఉం టుంది. అవన్నీ అప్పల్రాముడికి అనుకూలంగా ఉన్నాయి. అప్పల్రాముడు తన హక్కును వినియోగించు కోవడానికి సిద్ధ పడకపోగా సనాతన ధర్మాన్ని ఆచరించ టానికి సిద్ధపడ్డారు. ఈ విషయం తెలిసిన శ్రీరాములు నాయుడు సంప్రదాయ వ్యవస్థను కొనసాగించారు. సీతారాముడు అన్నట్లు అప్పల్రాముడు మంచివాడు ధర్మ బద్ధుడు అనే పేరు కోసం జీవన ఆధారమైన భూమిని త్యాగం చేయ డానికి సిద్ధపడ్డాడు. కానీ సీతారాముడు కూడా బలహీనుడై పోయి సనాతన వ్యవస్థకు కట్టుబడ్డాడు. అలాకాకుండా గతంలో ప్రారంభమైన పోరాట ప్రభావాన్ని దృష్టిలో ఉ ంచుకుని సీతారాముడు మధ్యయుగ ఆధిపత్య పంచాయితీకి వ్యతిరేకంగా వర్గ శత్రువులకు గుణపాఠం చెప్పడానికి తనవర్గాన్ని సమీకరించి చట్టబద్ధంగా పోరాటం చేసివుండవచ్చు. ఈ అంశాలలో ఏ ఒక్కటి పాటించినా సీతారాముడు తన బిడ్డకు జీవించే హక్కును హరించే వాడు కాదు. అప్పు తీర్చకపోతే తరువాత తరం వారు బానిస అయ్యే పరిస్థితి ఉండటం వ్యవస్థ వైఫల్యంగా చూడవచ్చు. కనీన సౌకర్యాలు కోల్పోయే పరిస్థితిని ఎదుర్కోవడం హక్కులను కోల్పోవడమే.

ఉపయోగించుకున్న పుస్తకాలు :

ప్రాథమిక ఆధారం :

యజ్ఞం - కాళీపట్నం రామారావు

ద్వితీయ ఆధార గ్రంథం :

భారత రాజ్యాంగం. (అనువాద వ్యాఖ్యాత) సత్యనారాయణ, పెండ్యాల.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రారా కథలు – సమాజ జీవిత చిత్రణ

– టి. లాజరతయ్య, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజంపేట.

కొడవటిగంటి కుటుంబరావు (కొకు), శ్రీశ్రీ ల తర్వాత ఆధునికాంధ్ర సాహిత్యానికి కొత్త జవసత్వాలను సమకూర్చి, కొత్త దారుల వెంట, కొత్త సంచలనాల వెంట పరిగెత్తించిన రాచమల్లు రామచంద్రారెడ్డి- రారా అనే పొడి అక్షరాలతో తెలుగు సాహిత్య విమర్శలో ప్రతిపాదించిన మార్క్సిస్టు సూత్రీకరణలు తర్వాతి తరానికి (నేటికీ) ప్రామాణికంగా వున్నాయి. రారాను విమర్శకుడిగానే గుర్తిస్తున్నప్పటికీ ప్రాథమిక దశలో కొన్ని కథలు, నాటికలు, బాలసాహిత్యం రాసినాడు.

రారా తన సాహితీ జీవితం కథలతో ప్రారంభించినాడు. "అలసిన గుండెలు" అనే కథానిక వీరి తొలి రచన. 1957-60 మధ్య కాలంలో రాసిన 12 కథలు "అలసిన గుండెలు" అనే పేరుతో వెలువడినాయి. కొకు ఈ కథలకు పరిచయ వాక్యాలు రాస్తూ "సాధారణంగా మనకు బాగున్నాయనిపించే కథలు మనల్ని ఉల్లాస పెడతాయి. జీవితంలో లభించని సంతృప్తి కలిగిస్తాయి. అయితే ఈ కథలు షాక్ ఇస్తాయి. జీవితంలో చూసి ఉపేక్షించే విషయాలనే ఈ కథలలో చదివి 'షాక్' తింటాం. వీటిని చదివి మానసిక చైతన్యం పొందకుండా ఉండటం సాధ్యం కాదు" అని అంటాడు. కుటుంబరావుగారన్నట్లు రారా అందురూ ఉపేక్షించేవీ, అతి సామాన్యమైనవీ అయిన సామాజికాంశాల్ని ఇతివృత్తాలుగా తీసుకొని సమ్యక్ శిల్పంతో, అనుభూతి ముద్రను జోడించి మంచి కథలు రాసినాడు. వాస్తవికత పునాదుల మీద రారా సాహిత్య రచన చేసినాడు. రారా రచనలకు జన్మస్థానమూ, గమ్య స్థానమూ సమాజమే.

రారా రాసిన కథల్లో 'మన జీవిత కథలు' వస్తు రీత్యా, శిల్ప రీత్యా చాలా గొప్ప రచన. నిస్సారంగా, నిర్జీవంగా బ్రతుకుతున్న ఓ పెద్దమ్మ జీవితాన్ని ఈ కథ చిత్రిస్తుంది. ఈ కథలో కథకుడు తన ఇంటికి దగ్గర్లోనే నివశిస్తున్న పెద్దమ్మను గురించి కథ రాయాలనుకుంటాడు. ఆమె వృద్ధాప్యంలో ఒంటరిగా, మౌనంగా, నిర్లిప్తంగా జీవించడం వెనుక ఏదో పెద్ద ఫ్లాష్ బ్యాక్ ఉండొచ్చని దాన్ని చేధించి కథ రాయాలన్నది కథకుడి పథకం. అయితే చాలా మంది స్త్రీల జీవితాల్లో వున్నట్లుగానే పెద్దమ్మ జీవితంలోనూ పెళ్లి, పిల్లలు, సంసార జీవితం వంటి విషయాలు తప్ప ప్రత్యేకించి విశేషాలేమీ లేవు. కథా వస్తువులో ఉండాల్సిన 'అసాధారణత' ఏదీ ఆమె జీవితంలో కనబడనందుకు కథకుడు పరితపిస్తాడు. 'యింత మామూలు మనిషి గురించి ఏమని కథ రాయాలి' అని కథకుడు పెదవి విరిచినా, కథ రూపు తీసుకుంటుంది. అయితే కథ చివరన కథకుడి భార్యతో పాటు పాఠకునికి కూడా పెద్దమ్మ జీవితం పట్ల జాలి కలుగుతుంది. ఈ కథలోని పెద్దమ్మ లాంటి యాంత్రిక జీవితాన్నే మన సమాజంలోని మనుషులు బ్రతికేస్తున్నారన్న సత్యాన్ని రచయిత తెలియ జేసినాడు. 'ఈ కథలో శిల్పం తప్ప యేమీ లేదు, శిల్పాన్ని తొలగిస్తే కథే లేదు' అంటాడు రారా. అందుకే శిల్ప రీత్యా యిది విశిష్టమైన కథానిక.

'అలసిన గుండెలు' సంపుటిలోని మరొక విశిష్టమైన కథానిక 'ఓడి పోయిన సంస్కారం'. సంఘ సంస్కరణాభిలాషతో పెళ్ళి చేసుకునే వారిలో ప్రేమలు లేకుండా కేవలం ఆదర్శాలు, కీర్తి దాహం ఉంటే ఎలాంటి పర్యవసానాలు తలెత్తుతాయో తెలిపే కథ యిది. చిన్న వయస్సులోనే భర్తను కోల్పోయిన వితంతువు సుందరమ్మ. పునర్వివాహానికి మొదట నిరాకరించినా, తన అన్నల హిత బోధ వల్లా, అప్పటికే గడించిన లోకానుభవం వల్లా నిదానంగా రెండో పెళ్ళికి ఒప్పుకుంటుంది. అయితే సుందరమ్మ తాను కోల్పోయిన సౌఖ్యాన్ని తిరిగి పొంద వచ్చనే వుద్దేశ్యంతోనే రెండవ పెళ్లికి ఒప్పుకుంటుంది.

ఐతే పెళ్లి కొడుకు రామనాథానికి ఇది పెద్ద ఆదర్శం. లోకమంతా తన ఆదర్శాన్ని కీర్తించాలనే దాహం ఎక్కువగా వుండే వ్యక్తి అతడు. శోభనపు గదిలో సుందరమ్మ ఆడుగు పెట్టగానే రామనాథం ఆమెను దగ్గరకు తీసుకుని 'నేను త్యాసం చెయ్యకపోతే ఎట్లా? నీబోటి యువతులు నిష్కారణంగా జీవిత సౌఖ్యాలకు దూరవ్వై ఉనూరుమంటుంటే మన సంఘం బాగుపడేదెట్లా?' అని ఉపన్యాసం దంచేసరికి సుందరమ్మ దిమ్మెర పోతుంది. అతని కీర్తి కండూతి భార్య అయిన సుందరమ్మకు భరించలేనిదిగా కనిపిస్తుంది. వివాహ వ్యవస్థలో ప్రేమతో పాటు, భార్యభర్తల మధ్య భాగస్వామ్య భావం కలిగి వుండాలనీ., ఆదర్శాల కోసం, కీర్తి కోసం, ఆర్థిక లాభాల కోసం నేటి సమాజంలో వివాహాలు చేసుకునే గిరీశం లాంటి వాళ్ళను విమర్శించడమే కథా లక్ష్యంగా సాగుతుంది.

'అలసిన గుండెలు' సంపుటిలో ప్రత్యేకంగా పరిశీలించ దగ్గ కథానిక 'దేశంలో దేవకన్యలు' మన జీవితాల్ని ఆర్థికవ్యవస్థ శాసిస్తున్నదని తెలిపే కథ యిది. ఈ కథానికలో అందమైన యువతి క్షయ రోగంతో మృత్యు ముఖాన పడబోతుంది. ఆమె వారం కన్నా ఎక్కువ రోజులు బ్రతకదు. ఆమెని ఎలాగైనా బ్రతికించమని కథకుడు తన స్నేహితుడైన డాక్టరుని ప్రాధేయ పడతాడు. త్యాగబుద్ధితో ఆ పల్లెలో ప్రజాసేవ చేస్తున్న డాక్టరు కూడా ఆ అమ్మాయిని బ్రతికించడానికి ప్రయత్నం చేసి, విఫలమవుతాడు. ఆఖరికి ఆ యువతి రక్తం కక్కుకొని చచ్చిపోతుంది.1950, 60 దశకాల్లో క్షయరోగుల దీనస్థితికి అద్దం పట్టే కథ యిది. క్షయ ఒకప్పుడు ప్రాణాంతకమైన వ్యాధి. సరైన విధంగా చికిత్స తీసుకోకుంటే నేటికీ క్షయ ప్రాణాంతకమే. ''పల్లెలు ప్రశాంతి నిలయాలనే సూక్తికి విరుద్ధంగా నడిచిన కథ యిది. మన ఆర్థిక వ్యవస్థ మానవులకు అనుకూలమయింది కాదు. అది మానవతా ద్వేషి, మానవతా శత్రువు, మానవతా హంత''- చెప్పడమే యీ కథానికా లక్ష్యం.

పై కథల్లోనేగాక రారా రాసిన యితర కథల్లో కూడా సామాజిక, ఆర్థికాంశాల్ని చర్చించినాడు. 'చుక్కలూ - చీకటి' కూడా రారా రాసిన కథల్లో గొప్పది. పెండ్లి విషయంలో ప్రేమ లేకుండా, కేవలం ఉద్యోగం, డబ్బూ ప్రాధాన్యత వహించడాన్ని యిందులో ప్రధానాంశంగా చిత్రించినాడు. నేటికీ భారతీయ సమాజంలో జరిగే పెండ్లిండ్లలో అధిక భాగం డబ్బూ, ఉద్యోగమూ ప్రాధాన్యత వహించడం గమనించదగినది. వాస్తవికవాదం ఛాయలతో రాసిన కథ యిది.'ఆత్మహత్య కథలో సమాజంలో హీనంగా చూడబడే వేశ్యల పట్ల పాఠకునికి కొత్త దృక్పథాన్ని కలిగించినాడు. ''వేశ్య ఆత్మను చంపు కోలేదు, అభిమానాన్ని మాత్రమే చంపుకొంది. ఆమెను ఆ సందులోకి తోసినవాళ్ళు ఆత్మను చంపుకున్నవాళ్ళు'' అని సీతారామయ్య ద్వారా పలికిస్తాడు.

'అలసిన గుండెలు' కథానిక దారిద్ర్య భారం చేత అలసి పోయిన రెండు హృదయాలను చిత్రించింది. అత్త వస్తే ఆమెకు రెండు పూటలైనా తిండి పెట్టలేని దారిద్ర్య స్థితి. ఇందులో సీతారామయ్య బడిపంతులు. ఆయన భార్య తన ఆరో కాన్పుకి పుట్టింటికి పోవడానికి సిగ్గుపడి ఇక్కడే పురుడు పోసుకుంటానంటుంది. పురుడు కోసం తన తల్లిని తెచ్చుకుంటానంటుంది. పుట్టిన ఐదు మంది పిల్లల్లో ఇద్దరు చిన్నతనంలోనే చనిపోయినా కుటుంబం గడవడం కష్టంగానే వుంటుంది. ఇలాంటి స్థితిలో మరొకరు వస్తే ఎలా? అని భార్యా, భర్తలు తర్కించుకోవడం దారిద్ర్య భారం చేతనే. పేదరికం మానవ సంబంధాల్ని ఎలా ప్రభావితం చేస్తుందో ఈ కథ తెలియ జేస్తుంది. స్వాతంత్ర్యానంతరం బీద బడి పంతుళ్ల దుర్భర జీవితా నికి అద్దం పడుతుందీ కథ.

రారా రాసిన పెద్ద కథ 'కావ్యచిత్ర'- ఇది 'అలసిన గుండెలు' సంపుటిలో లేదు. తర్వాతి కాలంలో రాయ బడింది. గురజాడ తన డైరీలో 'Liquor makes a man friendly and generous' అని రాసుకున్న సూక్తికి రారా

ఇచ్చిన కథారూపమే 'కావ్యచిత్ర'. ఈ కథను గురజాడకే అంకితమిచ్చినాడు. మద్యపానాన్ని అసహ్యించుకునే సామాజిక వాతావరణంలో, మద్యం త్రాగడమే మహా పాపంగా పరిగణించే దేశంలో మద్యపానం గురించి సానుకూలంగా కథ రాయడం సాహసోపేత నిర్ణయం. త్రాగని వాళ్ళందరూ మంచివాళ్ళు కానట్టే, త్రాగే వాళ్ళందరూ చెడ్డవాళ్ళు కాదు. కొంత మందిలో సహజంగా ఉండే ఉన్మాదస్థితికి తోడు మద్యం అనే ముసుగులో విధ్వంసాలు, వీరంగాలు చేస్తున్న వారిని దృష్టిలో వుంచుకొని మద్యపానాన్ని నిషేధించి వుండవచ్చు. (ప్రాచీన కాలంలో సురాపానం నిషేధం వెనుక పౌరాణిక కారణాలు గమనించవచ్చు.) త్రాగినా హద్దులు మీరి ప్రవర్తించకూడదు. మద్యానికి బానిస కాకుండా వున్నంత వరకు మద్యపానం అనర్థ దాయకం కాదు. ఈ కథలో చిత్ర తన భర్తకు కూడా ఇదే హితబోధ చేస్తుంది. 'మనిషి మద్యానికే కాదు, దేనికీ బానిస కాకూడదు.' మరోచోట పురుషుడు ఎంతటి కవియైనా, మహర్షియైనా అతని వ్యక్తిత్వం ఓసారి చదివితే పూర్తిగా అర్థమైపోయే పత్రికా వార్త లాంటిదే. మళ్ళీ చదవవలసిన అవసరముండదు. చదివినా ప్రయోజనమూ ఉండదు. మంచి కావ్యం మళ్లీ మళ్లీ చదివే కొద్దీ మరింత ఆస్వాదనీయంగా ఉంటుంది. అందుకనే స్త్రీ వ్యక్తిత్వం కావ్యం లాంటిది'' అని ప్రస్తావించాడు. ఈ కథలో చిత్ర పాత్ర ద్వారా రచయిత తన అభిప్రాయాల్ని వెల్లడిస్తాడు.

రారా పాఠకుల హృదయం మీద గాఢమైన అనుభూతి ముద్ర వేయాలని, చక్కని శిల్పంతో ఈ కథలు రాసినాడు. రారా శిల్పానికి ఇచ్చిన ప్రాధాన్యత ప్రతి కథలో స్పష్టంగా కనిపిస్తుంది. అందరూ ఊహించేవీ, అతి సామాన్యమైన అంశాలే రారాకు కథా వస్తువులు అయినాయి. రారా కథల్లో ప్రస్థావించిన జీవిత సత్యాలు మరుపురానివి. అందుకే కొడవటిగంటి కుటుంబరావు వీరి కథల్ని ఉద్దేశించి 'వీరి కథలు షాక్ (దిమ్మరపాటు) ఇస్తాయి.' 'ఈ కథకుడి శైలిలోని పటుత్వమూ, కథనంలో గల సామర్థ్యమూ, జీవితం పట్ల గల వైఖరీ మరింత సృష్టంగా కనిపిస్తున్నాయి' అని అన్నాడు. ఈ కథలు చదివితే పాఠకుల సంస్కార స్థాయి తప్పకుండా ఒక్క మెట్టు ఐనా పెరుగుతుంది. ఈ కథలు ద్వారా రారా కథా రచన కంటే కథా శిల్పం పైనే దృష్టి పెట్టినట్లు కనిపిస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. అలసిన కుండెలు (కథా పంపుటి) - రారా
2. రారా (మోనోగ్రాఫ్) తక్కోలు మాచిరెడ్డి
3. తెలుగు కథలు - కథన రీతులు (3 వ సంపుటం) - సం: సింగమనేని నారాయణ
4. రారా విశేష సంచిక- యుగ సాహితీ,ప్రొద్దుటూరు.
5. రారా స్మారక సంచిక-ప్రజాసాహితి
6. కథానికా, దాని శిల్పమూ (వ్యాసం) - రారా

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సంఘ సంస్కరణవాది మన వేమన

– డా॥. తల్లి కృష్ణ , వైస్ ప్రిన్సిపల్, తెలుగు అధ్యాపకులు, సిఎస్ఎస్ఆర్ & ఎస్ఆర్ఆర్ఎమ్ డిగ్రీ & పీ.జీ. కళాశాల, కమలాపురం, కడప జిల్లా.

భారతదేశం ఎందరో ప్రతిభావంతులకు కాణాచి. వారంతా మనకు వివేకం, వివేచన, వైదుష్యం, విజ్ఞానం పంచారు. మానవజాతిని ఆనంద తీరాలకు చేర్చగలిగే ఆలోచనలే మనిషి మనుగడకు కారణం. నేను అనే అల్పమైన ఆలోచనకన్నా మనం అనే భావన ఔన్నత్యానికి గుర్తు. మన వ్యక్తిత్వం దానిపైన్నే నిర్మితమవుతుంది. గొప్ప వ్యక్తులు, ఆలోచనాపరులూ ఈ లోకంనుంచి నిష్క్రమించినా, వాళ్ళ ఆలోచనల అడుగుజాడలు తుఫాన్లకు సైతం మాసిపోనివి. వారి చరిత్ర వర్తమానాన్ని, భవిష్యత్తును ఉజ్జ్వలవంతం చేసేది. అలాంటి ఎందరో మహానుభావులలో "సంఘసంస్కరణవాది మన వేమన" ఉండడదం విశేషం.

తెలుగు సాహిత్య చరిత్రలో వేమన ఒక ప్రత్యేకమైన కవి. వేమ, వేమన, వేమారెడ్డి, వేమన యోగిగా పిలవబడే వేమన జీవించిన కాలం, పుట్టిన స్థలం, చదువు వంటి విషయాలలో భిన్నాభిప్రాయాలు ఉన్నా, ఎక్కువ మంది పరిశోధకులు, విమర్శకుల అభిప్రాయంలో వేమన 17వ శతాబ్దానికి చెందిన కవి అని, రాయలసీమ నివాసి అని చెప్పడం జరిగింది. ఏది ఏమైనా ఆయన జీవితం ఎన్నో ఒడిదుడుకులకు లోనైనదిగా భావించవచ్చు. ఒక సామాన్య మానవుడు అనుభవించే కష్టాలు, బాధలు ఈయన కూడా అనుభవించే ఉంటాడనిపిస్తుంది.

ఒక వ్యక్తి యొక్క జీవన విధానం, సమాజంపట్ల అతని దృక్పథం, సంస్కృతి పట్ల అతని నైతిక కృషి - ఇవన్నీ అతణ్ణి మనుషులకు దగ్గర చేయటమో, దూరపరచటమో జరుగుతుంది. సమాజం నిర్ణయించే నైతిక సూత్రాలు, స్వతంత్ర ఆలోచన గల వ్యక్తుల్ని ప్రభావితం చేయలేవు. అసలు నైతికమైన విలువలు సమాజం నేర్పేవి కావు, అనుభవం ద్వారా వ్యక్తి తనకోసం వికసింపచేసుకొనేవి. సంఘం స్థిరపడి ఉన్న విలువలతో ఏకీభావం లేక పోవచ్చు, ఇలా లేకపోవడమే తన నైజమని విప్పి చెప్పే తత్వాన్నే దార్శనికత అంటారు. అటువంటి దార్శనికులు మన వేమన.

వేమన తాను దర్శించిన సమాజాన్ని క్షుణ్ణంగా జీర్ణించుకున్న మహనీయుడు. కవిగా పద్యాల ద్వారా మనతో ఆ సమాజాన్ని దర్శింపజేసిన దార్శనికుడు. సాధారణంగా మనిషి జీవితంలో ఒకదశకు చేరుకున్న తర్వాత ఎన్నో అనుభూతులతో, అనుభవ సారాలతో జ్ఞానిగా మార్పు చెందుతూ ఉంటారు. ఇలా ప్రతి మనిషి లోనూ మార్పు రావాలని సిద్ధాంతం ఏదీ లేదు కానీ, కొందరిలో నైనా ఈ జ్ఞానం ఎక్కువగా కనిపిస్తుంది. వేమన విషయంలో ఇది నిజమైందని అనుకోవచ్చు. అందుకే వేమనను ఒక మహాజ్ఞానిగా లోకం గుర్తించడం, కీర్తించడం, జరుగుతోంది.

వేమన కవిత్వం ద్వారా తెలిపిన తత్వాల ద్వారా ఆయన మహాజ్ఞాని, మహాకవి, ప్రజాకవి, లోకకవిగా సుప్రసిద్ధులయ్యారు. వీరి కవిత్వాన్ని నిశితంగా గమనిస్తే కేవలం ఊసుపోక రాసినట్లుగా అనిసించదు. లోక సారాన్ని కాచి వడబోసినట్లుగా జీవిత పరమార్థాన్ని విశదపరుస్తాయి. అత్యధిక భాగం ఆటవెలదిలలో సులభమైన శైలి విన్యాసంతో జన హృదయాల్లో నిలిచిపోయే రీతిలో వీరి పద్యాలు రూపుదిద్దుకోవడంతో పండితులనే గాక పామరులను సైతం కట్టి పడేస్తాయి. అంతేకాక ప్రజలలో పేరుకుపోయిన అజ్ఞానాంధకారాన్ని దూరం చేసే విధంగా ప్రజల నాలుకలపై వీరి పద్యాలు తాండవమాడతాయి. అందుకే వేమన సంఘసంస్కరణవాదిగా, ప్రజాకవిగా కీర్తింపబడ్డారు.

"సమాజాన్ని పట్టించుకొని, సమాజంలోని సమస్యల్ని

గుర్తించి, ఆ సమస్యల్ని తన కవిత్వంలో వర్ణించడం ప్రజా కవి మొట్టమొదటి లక్షణం'' అని, కారణాలు చెప్పడం, ఖండించడం, పరిష్కారాలను దర్శించడం వంటి లక్షణాలు కలిగి ఉండడంచే ప్రజాకవిగా వేమనను చెప్పవచ్చని డా.ఎన్.గోపి గారు ''ప్రజాకవి వేమన'' గ్రంథంలో తెలియజేశారు.

ఒక యోగిగా, భోగిగా, అద్వైతిగా, జ్ఞానిగా అనేక కోణాల్లో వేమనను మనం దర్శించవచ్చు.గతానుగతికంగా సాగిపోతున్న సమాజాన్ని సమాజం మోస్తున్న వెర్రిమొర్రి మూఢనమ్మకాలను అశాస్త్రీయమైన విశ్వాసాలను శాస్త్రీయ దృష్టితో ప్రశ్నించారు వేమన. అసమంజసమైన సామాజిక నియమాల్ని నిర్దాక్షిణ్యంగా ఖండిస్తాడు. అంటరానితనాన్ని ఘోరమైనన అపరాధంగా భావించారు, అంతేకకుండా వర్ణ భేదాలతో, ఆర్థిక అసమానతలతో వ్యక్తుల మధ్య పెద్ద అగాధం సృష్టించబడుతుందని అన్నారు.

సంఘసంస్కరణవాదిగా వేమన :

జీవితంలో ఎందరో విభిన్న జీవిత దృక్పథం గల వాళ్ళు మనకు ఎదురవుతుంటారు. కొత్త భావనల్ని, కొత్త దారుల్ని చూపిస్తారు, మన వెనకున్న చరిత్రకు ఆన వాళ్ళుగా నిలబడుతారు. అన్ని మలుపుల్లోను స్ఫురణకు వస్తూ ఉంటారు. ప్రతి జీవితం దేశకాల ప్రభావాలకను గుణంగా మార్పు చెందుతూ ఉంటుంది, వేమన కవిత్వంలో ఇలాంటి వ్యక్తిత్వాలు, ఎన్నో జీవిత సత్యాలతో పాటు వ్యక్తిత్వ వికాసం, సంస్కరణ తత్వం బాగా కనిపిస్తుంది.

ముఖ్యంగా సంఘంలో మనుషులలో పేరుకు పోతున్న అజ్ఞానాన్ని తొలగించే విధంగా వేమన అనేక సందర్భాలలో తమ పద్యాల ద్వారా వెల్లడించారు. వర్ణవ్యవస్థకు వ్యతి రేకంగా నిరంతరం పోరాడిన అభ్యుదయవాది వేమన. అలాగే ఆరోజుల్లో సమాజంలో బాగా పేరుకుపోయిన అంటరాని తనాన్ని ఘోరమైన అపరాధంగా ఘోషించారు.

''మాలవాని నేల మరి మరి నిందింప
ఒడలనున్న మాంస మొకటికాదె''

''జాతిభేద మెంచి జన్మముల్ తెలియక
ముక్తిగానలేరు మూర్ఖజనులు'' అంటూ వర్ణ వ్యత్యాసా లను నిరసించారు. అంతేగాదు మనిషి జీవితంలో దర్శించాల్సిన జీవిత సత్యాలను, ముక్తి మార్గాలను, ధర్మ సూక్ష్మాలను స్పష్టంగా తెలియజేశారు.

అనువుగాని చోట అధికుల మనరాదు
కొంచె ముండు టెల్ల కొదువ గాదు
కొండ అద్దమందు కొంచెమై యుండదా

అంటూ మనిషి జీవితంలో అన్ని ప్రదేశాలలోనూ, అన్ని సందర్భాలలోనూ తనే గొప్ప అనే భావనతో ప్రవర్తించడం మంచిది కాదని, మనకు మనం అనువు కాని చోట గొప్పవాళ్లం అని చెప్పుకోకూడదంటారు. అంతేగాక చిన్న తనంగా అన్పించినా, అవమానమయిందని భావించ నక్కర లేదని, పెద్దదైన కొండ సైతం అద్దంలో కొంచెంగానే కనిపిస్తుందంటారు.

ఆలి వంకవార లాత్మ బంధువు లైరి
తల్లి వంకవారు తగినపాటి
తండ్రి వంకవారు దాయాదు లైరయా - అంటూ భార్యవైపు వారు ఆత్మీయులౌతారని, తల్లి వైపువారు అంతంత మాత్రమేనని, తండ్రివైపు వారు పగవారౌతారని చెప్పడంలో గొప్ప జీవిత సత్యం దాగుంది. ఆ జీవిత సత్యం ఈనాడు మనకు ప్రస్ఫుటంగా సమాజంలో కనిపిస్తూనే ఉంది.

అలుసుతులు మాయ అన్నదమ్ములు మాయ
తల్లి తండ్రి మాయ తానుమాయ
తెలియ నీదు మాయ దీనిల్లు పాడాయ - అంటూ జీవిత అంతిమ సత్యం తెలిసిన వారికి భార్యాపిల్లలు, అన్నదమ్ములు, తల్లిదండ్రులు, చివరికి తాను కూడా మాయే అన్న జ్ఞానం కలుగుతుంది. ఈ శరీరం పాడు గాను, ఈ మాయ ఏమీ తెలుసుకోనీయదు. భవ బంధాలు మనిషిని అంతిమ సత్యానికి దూరంగా నిలబెడ తాయని, మాయ చేత మనుషులు దాన్ని గ్రహించ లేకున్నారని విశదపరుస్తారు.

ఆశచేత మనుజులాయువు గలనాళ్లు
తిరుగుచుందురు భ్రమ త్రిప్పలేక

మురికిభాండమందు ముసరు నీగల భంగి - అంటూ మురికి కుండలోని తిండికోసం ఈగలు ముసురుకొన్నట్లు ఆయుస్సు ఉన్నన్ని దినాలు మనిషి ఆశతో తిరుగుతూ ఉంటాడని, భ్రాంతిని వదలలేడని చెబుతారు. ఏది శాశ్వతమో ఏది అశాశ్వతమో గ్రహించలేని మనుషులు, ఆశా వ్యామోహంలో అశాశ్వతమైన ఆశలపై ప్రయాణం చేస్తున్నాడని చెబుతారు. నేటి కాలంలో మనుషులు అనంతమైన ఆశలతో, వాటిని తీర్చుకోవడంలో తమ అమూల్యమైన జీవితాన్ని అధిక భాగం వృధాగా ఖర్చు చేసుకుంటున్నాడని చెప్పవచ్చు.

ఇంద్రియములు బట్టి ఈడ్చుచు నుండగా
వెర్రి మనుజుదేల వెదకు శివుని

ఇంద్రియముల రోసి ఈశుని జూడరా - అంటూ ఇంద్రియాలు లాగుతూ ఉంటే వెర్రిమనిషి శివుని కోసం వెతకడం వీలుకాదు. ఇంద్రియాలను అదుపులో ఉంచుకొని శివుణ్ణి చూడాలి. మనిషి ఎపుడైతే తన ఇంద్రియాలను తన అదుపులో ఉంచుకుంటాడో అపుడే గదా మోక్షం గురించిన ఆలోచన చేయగలడు. తన ఇంద్రియాలు తన ఆధీనంలో లేనపుడు భగవంతుని ఎలా దర్శించ గలడు, అతన్ని చేరుకోగల మార్గాలను ఏవిధంగా కనుగొన గలడు. ఆత్మజ్ఞానం కలగాలంటే ఇంద్రియాలను కట్టడి చేసుకోగలగాలి అంటారు.

ఎన్ని తనువులైన మృతికి నడ్డము గావు
మృతిని గెలువలేని యెరుకలేల
దొంగరీతిగాక దొరకునా మోక్షంబు

ఎన్ని శరీరాలైనా చావును తప్పించుకోలేవు. చావును గెలవలేని యెరుక వృథా దొంగ యిల్లిల్లూ దూరి వస్తూ వున్నట్లు జీవుడు పుడుతూ గిడుతూ ఉంటాడు. మోక్షం మాత్రం దొరకదు అంటారు వేమన. నిజమే కదా, మనిషి చావకుండా తప్పించు కోవాలని ప్రయత్నించడం వృధా ప్రయాసే అయినట్లు, ఎరుక సంపాదించని మనిషి జీవితం కూడా వృధానేకదా. మోక్షం సాధించడానికి ఎన్ని దొంగదారులతో ప్రయత్నించినా మోక్షం దొరుకుతుందా? అని ప్రశ్నిస్తారు.

కలిమినాడు నరుడు కానడు మదమున
లేమి నాడు పెట్ట లేడు మొదలె

కలిమి లేమి లేని కాలంబు కలుగునా - అని సంపద ఉన్నప్పుడు కంటి కావరంలో దానం చేయాలని తెలుసు కోలేడని, ఆ సంపద లేనప్పుడు మొదలు పెట్టడానికే అసలు లేదు. కలిమి లేములు మానసిక రుగ్మతలని తెలియలేడని అంటారు. సంపద మనిషిని మాయలో జీవించేలా చేస్తుంది. అపుడు మనిషి తనలోని కుబుద్ధి చేత మంచి చెడులు తెలుసుకోలేక ప్రవర్తిస్తాడు. తన దగ్గర సంపద లేనినాడు తోటి వారికి సాయం చేయాలని ఉన్నా చేయలేడు. కష్టాలైనా, సుఖాలైనా వస్తాయి, పోతాయి అన్నింటిని సమానంగా తీసుకుని సమంగా ప్రవర్తించినపుడే మనిషి మహనీయుడు అవుతాడు.

చదివి చదివి చదివి చావంగ నేలను
చావులేని చదువు చదువ వలయు

చదువు మర్మమెరిగి చదివిన చదువురా అంటూ చదివి చదివి చదివి చావడమెందుకు. చావులేని చదువు చద వండి, చదువులోని మర్మం అంటే, మరణాన్ని అధిగ మించడానికి చదివే చదువే చదువు క్రింద లెక్క అంటారు వేమన. అందరూ చదువు కోవడంలో సఫలత చెందలేరు. ఎందుకంటే కొందరు సంపాదనే పరమాధిగా చదువుతారు. మరి కొందరు పేరు కోసం చదువుతారు. కానీ అతి కొద్ది మంది మాత్రమే చదువులోని అంతస్సూత్రం ద్వారా ఆత్మ జ్ఞానం పొందగలుగుతారు. మనిషి జీవితం అత్యున్నత మైంది. అత్యంతం విలువైనది. అంతటి ఘనమైన జీవితాన్ని సమగ్రంగా, సంపూర్ణంగా వినియోగించుకోవాలి. "జీవితమంటే పరిపూర్ణంగా జీవించడమే" అంటారు మేధావులు.

చిప్పలోన బడ్డ చినుకు ముత్యంబయ్యె
నీటబడ్డ చినుకు నీళ్ల గలిసె

ప్రాప్తమున్న చోట ఫలమేల తప్పురా - చిప్పలో పడిన చినుకు ముత్యమవుతుంది. నీళ్లలో పడిన చినుకు నీటిలో

కలిసి పోతుంది. ప్రాప్తం ఉంటే ఫలితం తప్పిపోదు అంటారు కవి. సరేనా దారిలో ప్రయణించినపుడేగదా జీవితానికి సార్థకత చేకూరుతుంది. మంచి మార్గంలో కష్టపడుతూ పోతే ఫలితంకూడా మనదరి చేరకుంటుందా అని అంటారు. దక్కవలసింది ఎప్పటికైనా దక్కేతీరుతుంది గదా.

చిప్పలోన బడ్డ చినుకు ముత్యంబయ్యె
నీటబడ్డ చినుకు నీళ్ల గలిసె

ప్రాప్తమున్న చోట ఫలమేల తప్పురా - చిప్పలో పడిన చినుకు ముత్యమవుతుంది. నీళ్లలో పడిన చినుకు నీటిలో కలిసి పోతుంది. ప్రాప్తం ఉంటే ఫలితం తప్పిపోదు అంటారు కవి. సరేనా దారిలో ప్రయణించినపుడేగదా జీవితానికి సార్థకత చేకూరుతుంది. మంచి మార్గంలో కష్టపడుతూ పోతే ఫలితంకూడా మనదరి చేరకుంటుందా అని అంటారు. దక్కవలసింది ఎప్పటికైనా దక్కేతీరుతుంది గదా.

భూమిలోన బుట్టు భూసార మెల్లను
తనువులోన బుట్టు తత్వమెల్ల

శ్రమములోన బుట్టు సర్వంబు తానౌను - భూమిలో భూసారం పుట్టినట్లే, తనువులో తత్వం పుడుతుంది. అలాగే శ్రమము యొక్క ఫలితమంతా బ్రహ్మమనే తెలియాలి. శ్రమైక జీవితంలోనే సమస్తముందన్న అనుభవ సారాన్ని గ్రహించినపుడే మనిషి మహా తాత్త్వికుడు కాగలడు. మనిషి తనను గురించి ఆలోచిస్తే, ఎదుగుదల, అహంకారం, స్వార్థంలాంటివన్నీ మనసుపై స్వారీ చేస్తాయి. ప్రకృతిని శ్రద్ధగా పరికిస్తే బుద్ధి వికసించి తానేమిటో అర్థమవుతుంది. ఒదిగి ఉండడం, అణకువ, త్యాగం లాంటి ఉత్తమ గుణాలు అలవడతాయి. మనిషి భౌతిక అందానికి ప్రాధాన్యమిస్తూ, కనిపించని అంతఃకరణ పట్ల సావధానంగా ఉండమని ఒక సూచన ఉంది. కాని మనిషి బహిఃప్రపంచంతో గడిపే లావాదేవీలతో తన ఉనికి పైకో, కిందికో దిగజార్చుకుంటున్నాడు.

మానవ సమాజం ఒక జీవనది లాంటిది. నది పైపైకి నిశ్చలంగా ఉన్నట్లు కనిపించినా నిరంతరంగా ఉందులోని నీరు మారుతూ వేగంగా ముందుకు సాగుతూనే ఉంటుంది. పరివర్తన చెందుతున్న బాహ్య జగత్తుకను గుణంగా మనిషి మారితేనే జీవితం చైతన్యవంతమవుతుంది.

వేమన పద్యాలలో కనిపించే మరికొన్ని అంశాలు నీతి, హేళన, తాత్త్విక దృక్పథం. కవి అంటే " కవి:క్రాంతదర్శీ". తనకంటే ముందున్న రచనల్ని అవగాహనంచేసి, తన కాలపు కవులు చెప్పనివి చెపుతూ భవిష్యత్తును ఊహించి చెప్పేవాడు కవి. సామాజిక సమస్యల్ని పరిష్కరించే సూచనలు, రుగ్మతల్ని రూపుమాపే హేతువాదిత్వం, మార్గ దర్శకత మొదలైన వాటిని రసభావబంధురంగా చెపేవారే కవి. సార్వకాలికతతో పాటు సార్వజనీనతను గర్భీకరించుకొని సత్యం సుందర సమన్వితమై ఉండాలి. వేమన పద్యాల్లో ఈ అంశాలు మనం గమనించవచ్చు.

తళుకు బెళుకు రాళ్ళు తట్టెడేల
చదువ పద్యమరయ చాలదా ఒక్కటి
విశ్వదాభిరామ వినురవేమా

ఒక్కటికాదు వేలకొద్దీ నిక్కమైన నీలాలను తెలుగు ప్రజలకు ప్రసాదించాడు వేమన. ఆదికాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ అప్పారావు మన తెలుగులో మహాకవులు అన్నాడు శ్రీశ్రీ.

ఆధార గ్రంధాలు :

1. ప్రజాకవి వేమన - డా. ఎన్.గోపి.
2. వేమన పద్యాలు - ఆచార్య జి. శివారెడ్డి.
3. సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర - డా.ఎన్.రామచంద్ర.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి – ప్రపంచీకరణ వ్యవస్థ దాకా...

– డా॥ వి. శాంతిలక్ష్మి, అతిథి ఉపన్యాసకురాలు, తెలుగు విభాగం, బెంగుళూరు విశ్వవిద్యాలయం, బెంగుళూరు, కర్నాటక.

ఆర్థిక ప్రపంచీకరణ - పెట్టుబడిదారీ వ్యవస్థ :

ప్రపంచీకరణ అనేది రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, చారిత్రక, పర్యావరణ మొదలైన అనేక ఆర్థికేతర అంశాలను ప్రభావితం చేస్తోందన్న మాట ఎంత వాస్తవమో, ఆర్థిక ప్రపంచీకరణ వీటిపై ప్రభావం చూపుతోందన్న విషయం కూడా అంతే వాస్తవం. ఆర్థిక ప్రపంచీకరణ సైతం ఉత్పత్తి, వాణిజ్యం, ఫైనాన్స్ రంగాలలో జాతీయ సరిహద్దులను చెరిపేయడం లాంటి అంశాలకు వర్తిస్తుంది. సరిహద్దుల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల ప్రవాహాల ఆర్థిక ప్రపంచీకరణ సూచికలు తరచు వినియోగించబడుతున్నాయి.

పెట్టుబడిదారీ అభివృద్ధి విస్తృత పరిధిలో అర్థం చేసుకోవాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ అంటే ఏమిటి? ఉత్పత్తిని బ్రహ్మాండమైన స్థాయికి పెంచిన మీదట సాంఘిక ప్రగతికి అదెలా అవరోధం అవుతోంది? ఆర్థిక ప్రపంచీకరణ ప్రారంభమయినప్పటి నుండీ పెట్టుబడిదారీ వ్యవస్థలో వచ్చిన మార్పులేమిటి? అన్న విషయాలు ప్రతి వ్యక్తి విధిగా తెలుసుకోవాలి. పెట్టుబడిదారీ వ్యవస్థకు - ఆర్థిక ప్రపంచీకరణకు అంతర్గత సంబంధాలు, బాహ్య సంబంధాలు ఖచ్చితంగా ఉన్నాయి. ఇవి రెండూ ఒకదానితో ఒకటి విడదీయరానివి. ఒకదానిపై మరొకదాని ప్రభావం ఎంత ప్రగాఢంగా ఉందో గమనించవలసిన అవసరం ఉంది.

"నూతన ప్రపంచ పెట్టుబడిదారీ విధానాన్ని అర్థం చేసుకోవడానికి మనం ప్రపంచ యుద్ధానంతర పెట్టుబడుదారీ విధానంలోని 'స్వర్ణయుగపు' కాలం వరకూ వెళ్ళాలి. 'ఫోర్డిజాన్ని' మనం వస్తూత్పత్తి విధానంగానేగాక ఒక సామాజిక క్రమంగా, పెట్టుబడిదారీ విధానాన్ని నియంత్రించే సాధనంగా పరిశీలించాలి. దక్షిణాది దేశాలలో ఇది కార్మిక వర్గంలో ఒక నూతన విభజనకు దారి తీసిన శకం. ఒకప్పటి వ్యవసాయ ప్రధాన ఆర్థిక వ్యవస్థల స్థానే వస్తూత్పత్తి ఆర్థిక వ్యవస్థ కేంద్రంగా మారిన కాలం. 60వ దశాబ్దాంతానికి ఈ నమూనా కూడా సంక్షోభంలో పడింది. ఐతే ఇది పెట్టుబడిదారీ విధానం పతనానికి దారి తీయకపోగా, 1980ల నాటికి ప్రపంచీకరణ రూపంలో పునరుద్ధానం చెందడానికి ఉపయోగ పడింది." (రొనాల్డో మంక్, ప్రపంచీకరణ - శ్రామికులు-2005, పుట-5, 6).

పెట్టుబడిదారీ వ్యవస్థ - పరిచయం :

ప్రపంచంలో అసమానత్వానికి, వివక్షకి, సాంఘిక అన్యాయానికి, ఆకలికి, దారిద్ర్యానికి, యుద్ధ ప్రమాదానికి కారణం అన్వేషించాలి. పెట్టుబడిదారీ సమాజాలన్నింటిలోనూ సాంఘిక నిర్మాణం అసమంగా ఉంది. వర్గ వైరుధ్యాలు విపరీతంగా ఉన్నాయి. వీటి కారణాలను అన్వేషించాలి.

పెట్టుబడిదారీ దేశాల్లో జనాభాలో అధిక సంఖ్యాకులు తమ కనీస జీవితావసరాలకోసం నిత్యం పోరాడుతూ ఉంటే ధనికులు విలాసాల్లో మునిగి తేలగలుగుతున్నారు! ఎంతోమంది ప్రజలు గంజికోసం ఆహోరాత్రులు ఎదురు చూస్తున్నారు. కొద్దిమందికి వందలాది ఎకరాలు ఆస్థిగా ఉన్నాయి. ధనిక, పేదల తారతమ్యం పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎక్కువైంది. పెట్టుబడిదారీ వ్యవస్థలోని ఈ అంతర్గత వైరుధ్యాలు ఆ వ్యవస్థకు సంబంధించి ఆర్థిక, సాంఘిక అవ్యవస్థలను ఉత్పన్నం చేస్తున్నాయి. ప్యూడలిజంపై పైచేయి సాధించిన పెట్టుబడిదారీ వ్యవస్థ త్వరలోనే మానవజాతి ప్రగతికి బదులు తిరోగమనానికి వైలురాయిగా నిలిచింది. పెట్టుబడిదారీ వ్యవస్థ యూరప్, అమెరికా, ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియాలలోని కోట్లాది ప్రజలను కష్టాలకు, కడగండ్లకు గురిచేసింది.

పెట్టుబడిదారీ వ్యవస్థ పుట్టుక :

చారిత్రకాభివృద్ధి క్రమంలో అడవి జంతువులను వేటాడేందుకు విల్లులను, ఈటెలను వాడిన ఆదిమ సమాజం నుంచి అంతరిక్ష ఉపగ్రహాలను, రోబోట్లను, ఎలక్ట్రానిక్ కంప్యూటర్లను వాడుతున్న నేటి దాకా సుదీర్ఘ ప్రయాణం మానవజాతి సాగించింది. ప్రకృతితత్వాన్ని అర్థం చేసుకునేందుకు మానవజాతి శైశవ దశలో ప్రయత్నాలు ప్రారంభించింది.

మానవులు, మానవ సమాజం నిర్దిష్ట నియమాల ప్రకారం అభివృద్ధి చెందుతుందని తెలుసుకున్నారు. ఈ నియమాలను తెలుసుకోవడం గతాన్ని సరిగా అర్థం చేసుకునేందుకూ, వర్తమానాన్ని అంచనా వేసుకునేం దుకూ, కొంత మేరకు భవిష్యత్తును గురించి ఊహించేం దుకూ సహాయపడింది. ఈ నియమాల ఆంతర్యాన్ని గ్రహించేందుకు ఎందరో ప్రయత్నించారు. తత్వవేత్తలు, అర్థశాస్త్రవేత్తలు, రాజకీయవేత్తలు, మతాధిపతులు చరిత్ర క్రమం గురించి చర్చించారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుకూలంగా, వ్యతిరేకంగా అభిప్రాయాలు విజ్ఞులు వెలిబుచ్చారు.

పెట్టుబడిదారీ వ్యవస్థ గురించి మొదట చెప్పినవాడు జర్మన్ విప్లవకారుడు అయిన కార్ల్ మార్క్స్ (1818-1883).

కార్ల్‌మార్క్స్ 'పెట్టుబడి' అనే గ్రంథాన్ని రచించాడు. ఈ గ్రంథ రచనకు ఆయనకు నలభై సంవత్సరాలు పట్టింది. మార్క్స్ సమాజ విజ్ఞాన శాస్త్రంలో ఒక విప్లవం తెచ్చాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో అర్థశాస్త్రం, రాజకీయాలు, భావజాలం, న్యాయశాస్త్రం, కుటుంబ సంబంధాలను ఆయన ప్రగాఢంగా అధ్యయనం చేశాడు.

"పెట్టుబడిదారీ సమాజాన్ని అధ్యయనం చేసేటప్పుడు మార్క్స్ ఒక నూతన శాస్త్రీయ పద్ధతిని అవలంభించాడు. ఆయన ఎంగెల్సుతో కలిసి రూపొందించిన యీ పద్ధతిని గతితార్కిక, చారిత్రక భౌతికవాదం అంటారు. మానవ సమాజపు అభివృద్ధి సరళ రూపాలనుంచి ఉన్నత రూపాలకు శంఖ్యాకారంలో సాగుతుందనీ, దానిలో ప్రతి ఒక మాలుపూ ఒక ఉన్నత దశకు చేరుతుందనీ నిరూపించేందుకు ఈ సిద్ధాంతం తోడ్పడింది." (ఎ. బుజూయెవ్, పెట్టుబడిదారీ వ్యవస్థ అంటే ఏమిటి? - 1989, పుట - 13)

మానవులు తమ రోజువారీ కార్యకలాపాలు సాగించు కొనే కార్యక్రమంలో తమ చరిత్రను తామే నిర్మించు కుంటారు. వాళ్ళ జీవితంలో వాళ్ళ ఉత్పాదక శ్రమ కార్యకలాపాలే కీలక పాత్ర వహిస్తాయి అనే వాస్తవాన్ని గుర్తించడమే ఈ నూతన శాస్త్రీయ పద్ధతి సారాంశం.

ఉత్పత్తి సంబంధాలు మానవజాతి అభివృద్ధిలో ప్రధానాంశం. ఉత్పాదక శక్తులూ ఉత్పత్తి సంబంధాలూ కలిస్తే ఉత్పత్తి విధానం. ఇదే సమాజపు ఆర్థిక పునాది. చారిత్రక క్రమంలో ఆదిమ సృష్టి, బానిస - యజమాని, ఫ్యూడల్, పెట్టుబడిదారీ, కమ్యూనిస్టు అనే ఈ ఐదూ సామాజిక, ఆర్థిక నిర్మాణ రూపాలని మార్క్సిస్టు అభిప్రాయం.

పెట్టుబడిదారీ వ్యవస్థ జర్మనీ, రష్యా, తదితర దేశాల్లో మొదట నెలకొల్పబడింది. ఈ నాటికీ అన్ని పెట్టుబడిదారీ దేశాల్లోనూ ప్రబలంగా ఉన్న సామాజిక వ్యవస్థ సారాన్ని నూతన లక్షణాలతో లోతుగా తెలుసుకోవడానికి మార్క్స్ గ్రంధం ఎంతో ఉపకరిస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ - ఆవిర్భావం - వికాసం:

పెట్టుబడిదారీ వ్యవస్థ ఫ్యూడల్ వ్యవస్థ అవశేషాల్లోంచి ఉత్పన్నమైంది. ఉత్పత్తి సాధనాలపై వ్యక్తిగత స్వామ్యం, ఒక మనిషిని వేరొక మనిషి దోచుకోవడం అనే వాటి మీదనే ఫ్యూడల్, పెట్టుబడిదారీ వ్యవస్థలు రెండూ ఆధారపడి ఉన్నాయి. ఫ్యూడల్ సమాజం ప్రధానంగా ఫ్యూడల్ భూ ఎస్టేట్ల మీద ఆధారపడి ఉంటుంది. ఆ ఎస్టేట్లలో ఉత్పత్తి చేయబడిన సమస్తం అక్కడికక్కడే వినియోగించ బడేది. ఫ్యూడల్ ప్రభువు కట్టుబానిసలైన భూదాసుల చేత రకరకాల విధులను చేయించుకొనేవాడు. రకరకాల చేతివృత్తులు అభివృద్ధి చెందాయి. పట్టణాలు క్రమంగా

పెంపొందాయి. వర్తకం, డబ్బు, లావాదేవీలు పెరిగాయి. స్వయం పోషక ఫ్యూడల్ ఆర్థిక వ్యవస్థ మూలాధారాన్ని క్రమంగా దొలచి వేసిన సాంఘిక జీవిత అంశాలన్నీ పెంపొందాయి.

స్వయం పోషక ఆర్థిక వ్యవస్థ స్థానాన్ని క్రమంగా మార్కెట్లో అమ్మకం కోసం సరుకుల ఉత్పత్తి, ఆర్థిక వ్యవస్థ ఆక్రమించింది. దీనితో ఉత్పత్తిదారుల మధ్య పోటీ ప్రారంభమైంది. ఆ పోటీ వలన కొందరు దివాళా తీయగా, మరికొందరు సంపన్నులయ్యారు. తత్పర్యవసానంగా సరుకు ఉత్పత్తిదారుల మధ్య ధనికులు, పేదలు అనే తరగతులు ఏర్పడ్డాయి.

వర్తక పెట్టుబడి ఫ్యూడలిజం పునాదులను కదిల్చి వేయడంలో క్రియాశీలమైన పాత్ర వహించింది. సరుకు - డబ్బు సంబంధాల రంగాన్ని విస్తృతం చేసింది. సరుకుల మార్పిడిలో దళారులుగా మాత్రమే వ్యవహరించే వర్తకుల ఆలోచనా తీరు మారి, చేతివృత్తుల వాళ్ల నుంచి సరుకులు కొని, వాళ్ళకు ముడిపదార్థాలు సప్లయ్ చేయడం, డబ్బు అప్పులు ఇవ్వడం మొదలు పెట్టారు. ఎక్కువకాలం గడవక ముందే చేతివృత్తి పనివాళ్లలో చాలామంది వ్యాపారస్తుల నుంచి తాము తీసుకున్న అప్పుల్లో పూర్తిగా కూరుకుపోవడం, తప్పని పరిస్థితుల్లో వాళ్ళు తమకోసం కాక కార్ఖానా యజమాని కోసం పనిచేయడం మొదలైంది. ఈ విధంగా వ్యాపారస్తుల్లో కొందరు ధనిక చేతివృత్తి పని వాళ్ళతో కలిసి పారిశ్రామిక సంస్థలను నెలకొల్పడం ప్రారంభించారు.

"కొలంబస్ అమెరికాను కనుగొనడం, వాస్కోడిగామా యూరప్ నుంచి మహాసముద్రాలు దాటి భారతదేశానికి చేరుకోవడం (15వ శతాబ్ది మధ్య, 17వ శతాబ్ది మధ్య) వంటి మహత్తర భౌగోళిక ఆవిష్కరణల మూలంగా విదేశీ వ్యాపారపు శీఘ్ర విస్తరణకూ, ప్రపంచ మార్కెట్ ఏర్పడేందుకూ ప్రేరణ లభించింది" (ఎ. బుజాయెవ్, పెట్టుబడిదారీ వ్యవస్థ అంటే ఏమిటి? - 1989, పుట-17)

నేటి ఆర్థిక ప్రపంచీకరణకు పునాదులు ఆ కాలాలోనే వేయబడిందనడానికి ఈ సంఘటన సాక్ష్యంగా నిలుస్తుంది.

మానవజాతి అభివృద్ధిలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక పెద్ద ముందంజ. అది విజ్ఞానశాస్త్రం, టెక్నాలజీ, ఉత్పత్తుల శీఘ్రాభివృద్ధి, యంత్ర ఉత్పత్తి, వ్యవసాయ రసాయనిక ఎరువులు, రైల్వే రవాణా, ఓడ మార్గాలు, విద్యుత్ టెలిగ్రాఫ్ మొదలైన రూపాలుగా రూపాంతరం చెందింది.

పెట్టుబడిదారీ వ్యవస్థ సాధించిన అభివృద్ధిలో సరళ సహకారం - కార్ఖానా ఉత్పత్తి ప్రధానమైనవి. యంత్రాల అభివృద్ధి పారిశ్రామిక విప్లవానికి మార్గం ఏర్పాటు చేసింది. ఫ్యూడలిజంపై విజయమే పెట్టుబడిదారీ వ్యవస్థకు మార్గం సుగమం చేసింది. కాలక్రమంలో ఈ వ్యవస్థ అనేక దశలలో అత్యంత పాశవిక రూపాలు దాల్చింది. ఇలా ప్రారంభమైన పెట్టుబడిదారీ అభివృద్ధి 1970ల ఆరంభం నుండి తీవ్రమైన వ్యవస్థాగత సంక్షోభాన్ని ఎదుర్కొంటూ నేటి ఆర్థిక ప్రపంచీకరణకు దారి తీసింది.

ఆర్థిక ప్రపంచీకరణ - ఆవిర్భావం - వికాసం:

పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భవించినప్పటి నుండీ నేటి దాకా ఎన్నో మార్పులకు లోనవుతూనే ఉంది. ఈ వ్యవస్థ ఒక కోణంలో మానవజాతి అభివృద్ధిలో ముందంజ అయితే మరో కోణంలో అదే మానవజాతి అభివృద్ధికి అవరోధంగా కనిపిస్తుంది.

కమ్యూనికేషన్లు, సమాచార సాంకేతిక రంగాలు బాగా అభివృద్ధి చెందటం వల్ల పెట్టుబడిదారీ వ్యవస్థ ఎల్లలు దాటి ఇతర దేశాలతో లావాదేవీలు ప్రారంభించటంతో ఆర్థిక ప్రపంచీకరణ ఆవిర్భవించింది. ఉత్పత్తి, పెట్టుబడుల రంగాలలో జాతీయ సరిహద్దులను చెరిపివేయడం ఆర్థిక ప్రపంచీకరణను సూచిస్తుంది.

ఈ విధంగా ఆరంభమయిన ఆర్థిక ప్రపంచీకరణలో రెండు లక్షణాలు కనిపిస్తున్నాయి. వాటిలో ఒకటి ఉత్పత్తి ప్రపంచీకరణ అయితే రెండవది ఫైనాన్స్‌రంగ ప్రపంచీకరణ. దీనికి తోడుగా ద్రవ్య జాగరూకత, నియంత్రణల

ఎత్తివేత, ప్రైవేటీకరణ, సరళీకరణ మొదలైన కొత్త ఉదారవాద సంప్రదాయ సిద్ధాంతాల్ని విస్తృతంగా ప్రవేశ పెట్టడం ద్వారా ఈ వ్యవస్థ బలం చేకూర్చుకుంది.

ప్రస్తుత ప్రపంచీకరణ సహజమైనదీ, దానంతట అదే అభివృద్ధి చెందినదీ కాదు. బహుళజాతి పెట్టుబడులు, జాతి రాజ్యాల మధ్య పరస్పరం జరిగిన అనేక సంక్లిష్టమైన, చురుకైన ప్రక్రియల ఫలితంగా ఇది రూపుదిద్దుకుంది. ప్రపంచ మార్కెట్ల అభివృద్ధికి ప్రపంచీకరణ ప్రభుత్వం ఒక ప్రక్క అన్ని నూతన అవకాశాలు కల్పిస్తూ మరోపక్క కార్మిక, ప్రజా ఉద్యమాల గూర్చి, పేద ప్రజల జీవన ప్రమాణాలను అది దెబ్బ తీయడం గూర్చి అధికంగా ఆందోళన చెందుతోంది.

"సామాజిక సంక్షేమాన్ని మెరుగుపరచాలనే ధోరణు లను అంతర్భాగం చేసుకోవడంతోపాటు, వ్యక్తుల అధికారా లను విస్తృతం చెయ్యడం, మార్కెట్ శక్తుల గుడ్డి, విచ్చల విడి కార్యకలాపాలను నియంత్రించడం, ప్రజలని అణిచి వేత ద్వారా ఆధీనంలో ఉంచుకోవడం - ఇవన్నీ పెట్టుబడిదారీ ఆర్థిక విధానానికి అనుగుణంగా ప్రజలని మలచడానికి అనుసరించే ధోరణులు." (రొనాల్డ్ మంక్, ప్రపంచీకరణ - శ్రామికులు-2005, పుట-40)

ప్రపంచీకరణ పట్ల ప్రజల ఆందోళన, వ్యతిరేకత రోజు రోజుకూ మరింత ఎక్కువ అవుతోంది. ప్రపంచ ఆర్థిక విలీనం వలన ఆర్థికాభివృద్ధి మందగించడం, జీవన ప్రమాణాలు దెబ్బతినటం, ఫైనాన్స్ రంగ సంక్షోభాలు, పెద్దపెద్ద సామాజిక, రాజకీయ సంఘర్షణలు వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. విద్య, ఆరోగ్యం మొదలైన సామాజిక అవసరాలు ప్రపంచంలో చాలా ప్రాంతాలలో క్షీణిస్తున్నాయి. దీనికి ముఖ్య కారణం ప్రపంచీకరణ పేరుతో అనుసరించబడిన విధానాలు.

"నిలకడగా సాగుతున్న పారిశ్రామిక ప్రవాహంపై బుడగల్లాంటి స్పెక్యులేషన్ వల్ల ఎలాంటి హాని ఉండదు. కాని స్పెక్యులేషన్ అనే సుడిగుండంలో పారిశ్రామిక సంస్థలు బుడగల్లా మారినపుడు పరిస్థితి తీవ్రంగా మారు తుంది. జూద గృహం ఉత్పత్తిగా ఒక దేశపు పెట్టుబడి అభివృద్ధి తయారయితే ఆ పని అస్తవ్యస్తంగా మారడానికి అవకాశంఉంది." (కవల్జిత్ సింగ్, ప్రపంచీకరణను ప్రశ్నిద్దాం - 2006, పుట - 11) అంటున్నారు జాన్ మేనార్డ్ కీన్స్.

ప్రపంచ వ్యాప్తంగా ప్రవేశించిన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ సాంప్రదాయకంగా ప్రకృతికి మానవ జీవితానికి మధ్య ఉండే సంబంధాలను దెబ్బతీసింది. అటవీ సంపద అదృశ్యమైంది. వాణిజ్యం విస్తరణతో లక్షలాది జంతుజాలం, పశుపక్ష్యాదులు వ్యాపారుల చేతిలో హతమయ్యాయి. ఎగుమతి కోసం వ్యవసాయ ఉత్పత్తి జరుగుతుండడంతో నేడు భూమి కూడా బానిసగా మారిపోతోంది. విశాలమైన వ్యవసాయ క్షేత్రాలకు అనువుగా భూమిని తయారు చేసుకోవడం కోసం పెద్ద ఎత్తున అడవులు నరికివేయటం వలన ప్రకృతి క్షీణతకు, కరువు కాటకాలకు మన భారతదేశం ఆనవాలుగా మారుతోంది.

ఉపసంహారం :

ఆర్థిక ప్రపంచీకరణలో వాణిజ్య నియంత్రణల్ని బద్దలు కొట్టడమనేది ముఖ్యాంశంగా కనిపిస్తుంది. అయితే మరో పక్క సంపన్న దేశాలు తమ ప్రయోజనాల్ని పరిరక్షించుకునేందుకు అనేక నిబంధనలను ఏర్ప రుస్తున్నాయి. సంపన్న అగ్రరాజ్యాలు తమకు అనుకూల మైన చోట్ల ఇతరులపైన సరళీకరణలు రుద్దుతూ, తమ దేశాల స్వప్రయోజనాల కోసం రక్షణ వలయాల్ని నిర్మించు కుంటున్నాయి. సరళీకరణ, కఠిన నియంత్రణలు రెండూ మిళితమై ఉన్న ఈ ప్రపంచీకరణ మానవ మనుగడకు ప్రశ్నార్థకంగా నిలుస్తున్నది.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అన్నమాచార్యుల అభ్యుదయ భావం

– డా॥. నెయని ముల్లికార్జున, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చంచల్‌గూడ, హైదరాబాదు.

పదకవితా పితామహుడు శ్రీ తాళ్ల పాక అన్నమాచార్యులు క్రీ. శ. 1408వ సంవత్సరంలో వైశాఖ మాసంలో విశాఖ నక్షత్రంలో కడప జిల్లా, రాజంపేట తాలూకా లోని తాళ్ళపాక గ్రామంలో నారాయణ సూరి, లక్కమాంబ లకు నందకాంశముతో జన్మించాడు. విష్ణు సహస్ర నామాల్లోనుండి "అన్నం" అనే మాట నుండి అన్నయ్య పేరును ఆయనకు నామకరణం చేసినట్లు ప్రతీతి. చిన్నప్పటినుండి శ్రీ వెంకటేశ్వర స్వామి పేరు చెపితేగాని ఉగ్గు పాలు కూడా త్రాగేవాడు కాడు . వేంకటపతి మీద జోల పాట పాడితేగాని నిద్రపోయే వాడు కాదు . లక్క మాంబ భక్తి గీతాలు పాడుతుంటే ఏదో అర్థమైనట్లు తల పంకించేవాడు. నారాయణ సూరి కావ్యాలలో అర్థాలు వినిపిస్తూంటే బోసి నవ్వులతో ఊ కొట్టేవాడు. విద్యలో ఏక సంధాగ్రాహి. ఐదేండ్లకే గురువులు చెప్పినదంతా చెప్పినట్లుగా నేర్చుకొన్నాడు. గురువులు ఇక నేర్పించ వలసింది లేదని నిశ్చయించుకున్నారు .

అన్నమయ్య ఆడినదంతా అద్భుత కావ్యంగా, పాడినదంతా పరమ గానంగా వినిపించేది. కన్నె పిల్లలు వెన్నెల రోజుల్లో జాజర పాటలు పాడుతుంటే వెళ్ళి అల్లరి పెట్టేవాడు, కవుల కావ్యాలలో కలుపు పాటల్లో. జాన పదులతో పాటు శృతి కలిపేవాడు . తండ్రి ఆయన్ను దారిలో పెట్టడానికి పాలం వెళ్లి గడ్డి కోసుకొని రమ్మని పురమాయించాడు. గడ్డి కోసేటప్పుడు వ్రేలు తెగి రక్తం కారి కొంత సేపు స్పృహ తప్పి పడిపోయాడు. ఆ తర్వాత మెలుకువ వచ్చి ఈ అవస్థలకు తన బంధువులు, తల్లిదండ్రులు కారణమని, వీరంతా అబద్ధమని, తనకెవ్వరూ లేరని లౌకిక బంధాలతో పని లేదని తలంచి నాడు. అంతలో దూరాన తిరుపతికి వెళ్తున్న భక్తుల గుంపును చూశాడు, కోడవలి క్రింద పడవేసి ఆ గుంపు వెంట తిరుమల చేరుకున్నాడు. ఇక అక్కడినుండి ఆయన స్వామిని కీర్తిస్తూ, సమాజాన్ని హెచ్చరిస్తూ 32,0000 సంకీర్తనలు రచించాడు.

అన్నమాచార్యుల సంకీర్తనలన్నీ ఒక విలక్షణ సంగీత ప్రక్రియలో సాగినవి. తేట తేట పలుకులతో పరమాత్మ తత్వాన్ని బోధించాడు. అంతే కాదు మాధవారాధనతో పాటు మానవ కల్యాణాన్ని కాంక్షించాడు. ఆయన జీవితమొక దీర్ఘ శరణాగతి. ఆయన మహాకవి యైనా కనకాభిషేకాలు కాంక్షించలేదు. మహా గాయకుడు, కానీ సత్కారాలు కోరలేదు. అతని గురువు లోక కల్యాణాన్ని బోధించిన వారే, అతని తండ్రి అభ్యుదయ భావాలున్న వాడే. అందుకే అన్నమయ్య మహా ప్రవక్తయైనాడు . జాతిభేదములు, శరీరభేదములు నిరసించాడు .

ఉదా : తందనాన అహి తందనాన పురే
తందనా భళా తందనాన
బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటే

అనే కీర్తనలో పరమాత్మ ఒక్కడే ఆంతర్యామి అని నిరూపించాడు. "కందువగు హీనాధికము లిందులేవు" అంటూ అల్పుడు, అధికుడు అనే భేద భావాలు మనం కల్పించున్నవే అని ఉద్ఘాటించారు .

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటె
అండనే బంటు నిద్రయు నొకటె
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొక్కటె
చండాలుడుంటేటి సరిభూమి యొకటే

అని పాడిన ఈ పాటలో ఒక రాజు నిద్రించే నిద్ర, ఆ దరిదాపుల్లో నిద్రపోయే బంటు నిద్ర కూడా ఒక్కటే అని అని పేర్కొన్నాడు. వీరిద్దరూ నివసించే భూమి కూడా ఒక్కటే, మరియు మరణము తర్వాత వెరే దేహములు ఒకే నేల యందు ప్రవేశింపక తప్పదు అని పేర్కొన్నాడు. ఈ మాటల్లో తాత్వికతతో పాటు ఆ కాలోకంలో అతని అభ్యుదయ భావం తెలుస్తుంది.

"అనుగు దేవతలకును అల కాముని సుఖమొకటే
ఘన కీట పశువులకు కామ సుఖమొకటే" అన్నాడు

అనగా దేవతలా కామ సుఖము, పశు పక్షాది కీటకముల కామ సుఖమొకటే. ఇంకా ధనవంతుని కైనా నిరుపేదకైనా రాత్రింబవళ్లు సమానమే. విందు భోజనం ఆరగించే వారికైనా సామాన్య భోజనం ఆరగించే వారికైనా ఆకలి ఒక్కటే. ఒక పెద్ద ఏనుగు పైన కాసే ఎండ ఒక్కటే అదేవిధముగా ఒక శునకము మీద కాసే ఎండ ఒక్కటే, ఎక్కడా భేదము ఉండదు, కాబట్టి జీవులు అంతా ఒక్కటే అని పెర్కొన్నాడు.

అన్నమయ్య శరీర భేదాన్ని కూడా నిరసించాడు 'ఆటది రాజ్యమేలితే' అనే కీర్తనను పరిశీలిస్తే

"ఆటది రాజ్యమేలితే అది మంచిదే కాదా
చాటువుగా మాకు నిన్ను సాధించ నేటికి
పీటపైనున్న దాపె ప్రియుడవు నిలుచుండి
మాటలాడే నా పేతోను మంచిదేకాదా
గాటముగా వంచనెంత కలిగి మెలిగినాను
ఈ టున నీవే బడికేవేమి నననేటికి
పడతి పవళించగా పాదాలకడ నుండి
మడి నిచ్చే నాకు నీవు మంచిదే కాదా
ఉడుగక నీవెంత ఊడిగాలు నేర్చినాను
కడుగక లాభమయ్యా కాద గనేటికి
ఉరముపై నున్న దాకె ఒగి నిట్టె కిందుపడి
మరులు గొంటివి నీవు మంచిదే కాదా
ఇరవై శ్రీ వేంకటేశ మెంత మోపెత్తు కొనినా
మరగి నన్నేలితివి మచ్చరించ నేటికీ"

అనే ఈ కీర్తనలో అన్నయ్య మహిళల అభ్యున్నతికి పరితపించిన విధము తెలుస్తుంది

సామర్థ్యము కలిగితే స్త్రీలు రాజ్య మేలితే ప్రజలకు వేలునే చేకూర్చును, వివిధ రంగాలలో స్త్రీలు ఆభ్యున్నతికి రాకుండా మగవారు అడ్డుకొనుట న్యాయము కాదు. భార్య ఆసనంపై కూర్చుంటే భర్త ఎదురుగా నిలబడినను న్యూనత్వము ఉండరాదు, దంపతులిద్దరి స్థాయి సమానమే. భార్యను భర్త కపటంతో మోసగించిన ఆమె అతన్ని ప్రేమించక మానదు. కాబట్టి అట్టి భార్యను నిందదించుట నేరము. భార్య శయ్య మీద పడుకొంటే భర్త ఆమె కాళ్ళ దగ్గర కూర్చొని తాంబూలం అందించినా మంచిదే గదా ! తన సేవల వలన బాగున్న భార్య తిరిగి భర్తకే మేలు చేస్తుంది గదా ! పురుషుడు స్త్రీని తనకు శారీరక సుఖాన్నందించే వస్తువుగానే భార్యను చూడకుండా, భర్త ఆమెను తన కన్నా ఉన్నత స్థానమున నిలిపి గౌరవించుట, ఆరాధించుట ఉత్తమము. తన మహిళోద్యమమును స్వామి దీవించుగాక అని అన్నమయ్య వేడుకున్నాడు . అన్నమయ్య ఈ ఉద్యమము ఏ కాలము నాటిదో . ఇది ప్రతి కాలంలోనూ పురుషులకు మేలు కొలుపే. అన్నయ్యలోని మహిళాభ్యున్నతి కాంక్ష హరణీయం.

సమస్త జీవులు భగవంతునిలో భాగములే. స్వామికి దాసులే కాబట్టి వీరిలో ఎక్కువ తక్కువ అను భేదము లేదు. నాలుగు వర్ణముల వారిలో ఎవరైనా నరసింహుడగు స్వామిని తలచు జపమొకటే. ఒకవేళ మంత్రములలో రకములున్నను నామములో భేదములున్నను ఇవన్నియు ఒకే అంతర్యామి యగు దేవుని ఉద్దేశించినవే. ఈ భూమిపై ఏ జాతి వారయినను సాధనతో దేవుని సేవించి మనస్సు నియమితము కాగా కలుగు మోక్ష స్థితి యొక్కటే అని ఈ కీర్తనలో పేర్కొన్నాడు.

హీనాధికము లింక -నేడున్నవో కాని
అనిన దాస్యపు పొత్తు -అందరికి నొకటే
నానా వర్ణములవారు -నరహరి దలచేటి
ఆ నామ మంత్ర జప -మది యొకటే
పూని యతని గొలిచి -భువి నేజాతైనా ను
మొనమునబొందేటి -మోక్షమొక్కటే

అని పాడిన ఈ కీర్తనలో వర్ణ వ్యవస్థను, కుల వ్యస్థను మరియు సంపదను నిరసించాడు.

"కులమెంత గలిగెనది కూడించు గర్వము
చలమెంత గలిగె నది జగడమే రాదు

అని అగ్ర కులములో జన్మించినా , గొప్ప వంశములో పుట్టినా గర్వమేర్పడుటకు అవకాశము గలదు అని ప్రబోధించాడు

"ధనమెంత గలిగెనది దట్టమో లోభంబు
మొనయు చక్కదనంబు మోములురేచు

ఘన విద్య గలిగినను కప్పు పై పై మదము. అని కీర్తనలో పేర్కొన్నాడు. అనగా ధనము పెరిగిన కొలది లోభము పెరుగును. అందము భౌతికాకర్షణను పెంచుతుంది. పాండిత్యము కూడా గర్వాన్ని పెంచు తుంది. కాబట్టి సమాజమున అంతర్యామి యగు స్వామి నర్చించిన వానికే దేనిపైనా ఆధారపడని సహజానందము కలుగునని ప్రబోధించాడు.

అన్నమాచార్యుల వారి పై కీర్తనలు గాని మరియు ఇంకా చాలా కీర్తనలు పరిశీలిస్తే ఆయన చాలావరకు సందర్భము దొరికాప్పుడెల్లా సమాజాభ్యున్నతికి ప్రయత్నం చేసే ప్రభోదాలు చేశాడు. ఇంకా అన్నమాచార్యుల జీవిత ధ్యేయం గొప్ప సాంఘిక ప్రయోజనం సాధించించడమే. తాను తరించడమే కాదు తన తోటి మానవ సమాజము కూడా తరించవలెనని అతని తపన. అన్నమాచార్యుల ఆత్మ కళ్యాణమే కాంక్షించినట్లైతే తిరుమల ప్రభువును, తిరువీధులను వదలివచ్చేవారు కాదు. తన ప్రచారానికి క్రూర సర్పాల్లాంటి రాజులతో స్నేహం చేశాడు. ప్రజా శ్రేయస్సు కోసం పాటు పడినా వ్యక్తిగత విద్వేషాలను ఎదుర్కొనక తప్పదు కనుక అవన్నీ అయన అనుభ వించాడు.

అన్నమాచార్యుల వారి పై కీర్తనలు గాని మరియు ఇంకా చాలా కీర్తనలు పరిశీలిస్తే ఆయన చాలావరకు సందర్భము దొరికాప్పుడెల్లా సమాజాభ్యున్నతికి ప్రయత్నం చేసే ప్రభోదాలు చేశాడు. ఇంకా అన్నమాచార్యుల జీవిత ధ్యేయం గొప్ప సాంఘిక ప్రయోజనం సాధించించడమే. తాను తరించడమే కాదు తన తోటి మానవ సమాజము కూడా తరించవలెనని అతని తపన. అన్నమాచార్యుల ఆత్మ కళ్యాణమే కాంక్షించినట్లైతే తిరుమల ప్రభువును, తిరువీధులను వదలివచ్చేవారు కాదు. తన ప్రచారానికి క్రూర సర్పాల్లాంటి రాజులతో స్నేహం చేశాడు. ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడినా వ్యక్తిగత విద్వేషాలను ఎదుర్కొనక తప్పదు కనుక అవన్నీ అయన అనుభవిం చాడు.

పదం వ్రాసినా, పాడినా బూతు అనే పండితుల పాటనే బాటగా చేసుకొన్న అన్నమాచార్యుని విషయంలో ఇక చెప్పనక్కల్ లేదు. అన్నమాచార్యుడు ఎదుర్కొన్న సమస్యలు, బాధలు ఒకటా ! రెండా !. పాదకర్తలు నీటి బహ్యులని గాయకులూ పంక్తి బాహ్యులని తీర్మానించే ప్పుడిట పరిషత్తులను అన్నమాచార్యులు శ్రీనివాసాస్త్రంతో ఎదుర్కొన్నాడు. పదం వ్రాశాడు, పదం పాడాడు. వీనికి తోడు జనపదాలలో పదాలు పాడాడు. ఇలా భక్తిని సమాజాభ్యున్నతిని రెండింటిని చాటినాడూ.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కార నవలలు - కుటుంబ జీవన చిత్రణ

- డా॥. లింగాల మంగమ్మ, పోస్ట్ డాక్టోరల్ ఫెలో ఫర్ వుమెన్, యు.జి.సి., తెలుగు విభాగం,
హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

తెలుగువారి జన జీవితంలో వున్న కష్టసుఖాల్ని తనలో ఇముడ్చుకొని అంతోఇంతో అక్షర జ్ఞానం కలిగిన వారందరికీ మిక్కిలి దగ్గరై, వారిలో సామాజిక చైతన్యంతో పాటు విజ్ఞాన వికాసానికి ఎంతో దోహదం చేసిన సాహిత్య ప్రక్రియ నవల. ఇటువంటి ప్రచార ప్రశంసలను పొందుతూ వస్తున్న నవలా ప్రక్రియను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో, ఆ ప్రక్రియను సుసంపన్నం చేయడానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతి సంవత్సరం సాహితీ పురస్కారాన్ని అందిస్తుంది. 1985లో స్థాపించబడిన తెలుగు విశ్వవిద్యాలయం 1986 నుండి సాహితీ పురస్కారాలను ఇవ్వడం మొదలు పెట్టింది. అప్పటి నుండి అనగా 1986 నుండి ఇప్పటి వరకు అంటే 2010 వరకు ప్రతి సంవత్సరం ఉత్తమ నవలగా ఎంపికైన నవలా రచయిత(త్రు)లకు సాహితీ పురస్కారాలను అందించింది, అందిస్తుంది. సాహితీ పురస్కారం పొందిన నవలలు కొన్ని సామాజిక అంశాలకు, మరికొన్ని చారిత్రక, వైజ్ఞానిక అంశాలకు ప్రాధాన్యం ఇవ్వగా అంతస్సువంతి, నన్ను వెళ్లిపోనీరా, కొత్తబంగారు లోకం నవలలు కుటుంబ జీవన విధానానికి, ఆచార వ్యవహారాలకు ప్రాధాన్యం ఇచ్చాయి. ఈ నవలలోని కుటుంబ జీవన చిత్రణను ఆయా కోణాల నుండి పరిశీలించి వివరించడం ఈ వ్యాస ఉద్దేశం.

నవల - కుటుంబ జీవనం :

భారతీయ సామాజిక వ్యవస్థ పునాదయిన కుటుంబ వ్యవస్థ భారతీయుల జీవన విధానానికి, సంస్కృతికి ప్రతిబింబమని చెప్పవచ్చు. మొదటి నుంచి ఈ కుటుంబ వ్యవస్థ కొన్ని నీతినియమాలకూ, కట్టుబాట్లకూ, ఆచార వ్యవహారాలకూ ప్రాధాన్యతనిస్తూ భారతీయ తత్వానికి అద్దం పడుతుంది. వేద కాలం నుండి ఇప్పటి వరకూ వున్న ఈ కుటుంబవ్యవస్థను సాహితీ గ్రంథాలుఎన్నో కావ్య నాటకాదుల ద్వారా వివరిస్తున్నాయి. వివాహ వ్యవస్థ, వివాహ విధానాలూ, సాంఘిక మర్యాదలూ, ఆచార వ్యవహారాలూ మొదలైన ఆదర్శాలతో సమాజంలో ప్రవర్తించాలో తెలియజేస్తుంది. భారతీయ కుటుంబ వ్యవస్థను గూర్చి కొంతమంది ప్రముఖులు తమ అభిప్రాయాలను ఇలా తెలియజేశారు.

"మమత చిగురించి, మనసు విరిసి, మానవత సఫలమయి జంతు దశ నుంచి అధిగమించిన తొలినాడే మానవుడు తన నాగరికతకూ, సంస్కృతికి కుటుంబ వ్యవస్థతో శ్రీకారం చుట్టుకొన్నాడు. పరస్పర సహకారంతో సాగే సంఘ జీవనానికి సతీపతుల సాహచర్యంలో బతుకు పరిపూర్ణమయ్యే కుటుంబజీవనాన్ని ప్రాతిపదికగా చేసికున్నాడు.ఆ కారణంగానే బహిరాకారంలోను, అంతస్సూత్రాల లోను కాలానుగుణంగా ఎన్నెన్ని మార్పులు వచ్చినా, అసలు వ్యవస్థ మాత్రం అన్ని కాలాల లోనూ, అన్ని దేశాలలోనూ, అన్ని సంఘాలలోనూ చెక్కుచెదరక నిలిచింది" అని దేవులపల్లి రామానుజరావు గారు తెలియజేశారు

"కుటుంబాలే సామాజిక నిర్మాణానికి ఆధారాలు. ఏ సమాజంలో కుటుంబీకులు తమ తమ విధులను నిర్వర్తించరో ఆ సమాజం శిథిలమయిపోతుంది. ఎందు కంటే కుటుంబాన్ని ఆధారంగా చేసుకొని మాత్రమే వ్యక్తి సమాజానికి తనవంతు ఋణాన్ని తీర్చుకోగలడు. కుటుంబమే వ్యక్తుల్ని సమాజంతో అనుసంధించే సాధన

మవుతుంది'' అని ఆనందరామంగారు తమ అభి ప్రాయాన్ని చెప్పారు.

మానవుని మనుగడలో కుటుంబ వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యముంది. వైయక్తిక సమస్యలు, స్త్రీ పురుష సంబంధాలు, వైవాహిక సంబంధాలు, ఉమ్మడి కుటుంబ జీవనం, అస్తి ప్రాధాన్యం మొదలైన కుటుంబ జీవన చిత్రణ విషయాలు సాహితీ పురస్కార నవలల్లో కూలం కషంగా వివరించబడ్డాయి. ఈ కుటుంబ వ్యవస్థ మానవునికి సమాజంలో ఒకగుర్తింపు తీసుకువచ్చి, అతనిని ఆదర్శవంతునిగా నిలుపుతుంది. పాట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాహితీ పురస్కారాన్ని పొందిన నవలల్లో కుటుంబ జీవన చిత్రణాత్మక అంశాలు ఇలా ఉన్నాయి.

అంతస్రవంతి :

ఈ నవలను నవీన్‌గారు రాశారు. 1994లో తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాన్ని ఇచ్చి గౌరవించింది. దాంపత్యంలో అనురాగం, అనుకూలత ఎంత వున్నా, నిత్య జీవితంలో ఎలాంటి సన్నివేశాలు దంపతుల మనస్సుని బాధిస్తాయో చిత్రించిన నవలగా, కాలేజీ అవ్యవస్థ గూర్చి సమగ్ర చైతన్య స్వరూపాన్ని దృశ్యమానం చేసిన నవలగా అంతస్రవంతి కనిపిస్తుంది. అలాగే మధ్య తరగతి కుటుంబ జీవన చిత్రణ, విద్యా వ్యవస్థలో అరాచకం, రాజకీయాలు, సాహిత్య సంస్థల బండారం, పాపులర్ రచనలపై నిరసన, కవుల అవకాశవాదం, సాహిత్య చర్యలు ఇతివృత్తంగా ఉన్నాయి. వాస్తవంలో ఉన్న విషయాలు సంఘటనలు ఇందులో ప్రధానం.

అంతస్రవంతి నవలలో కథానాయకుడు రవి. ఇతడు భావుకుడు, రచయిత, లెక్చరర్, అదర్శవాది కూడా. లౌకిక వ్యవహారాలపట్ల ఆసక్తి లేకపోవడం వల్ల ఇంటా బయట అనేక ఇబ్బందుల్ని ఎదుర్కుంటాడు. వచ్చే జీతం సరిపోక అతికష్టం మీద ఇల్లు నడిపిస్తుంటే, ఇంటి వద్ద నుండి డబ్బులు పంపించమని తండ్రి, ఆర్థిక ఇబ్బందుల వల్ల దాంపత్యంలో కలహాలు వల్ల రవికి మనశ్శాంతి ఉండదు. రవి దాంపత్యం గురించి అతని మాటల్లోనే తెలుస్తుంది. ''తన కలలు, తన కళాత్మక విలువలు, కన కళాత్మక హృదయం, తన తపన, తన ఆరాటం, తన అన్వేషణ, తన అశాంతి, తన ఆదర్శాలు ఇవేమి ఆమెకు అక్కర్లేదు. ఆమెకు తను సంపాదించాలి. చేతినిండా డబ్బులుండాలి. ఇంటి నిండా కమ్‌ఫర్ట్ ఉండాలి..... ఎవరి దగ్గర అప్పు చెయ్యకూడదు. ఎక్కడకీ వెళ్ళకూడదు..... ఏ ఉద్యమాల్లోనూ తల దూర్చగూడదు.... ఇల్లు, కాలేజీ ఇవి రెండే రెండు. ఆమెలో తను ఇంతకంటే ఉన్నత సంస్కారాన్ని ప్రవేశపెట్టలేడు. ఆమె చదువుకోలేదు. పెద్ద అందగత్తె కాదు. అందుకే ఆయన తనను విసుక్కుంటున్నాడు. నేనాయనకు తగిన దాన్ని కాను..... నేనే గనుక ఆయన జీవితంలో ప్రవేశించి ఉండకపోతే ఆయనకెంతో డబ్బున్న వాళ్ళు పిల్లనిచ్చేవాళ్లు....ఎంతో చదువుకున్నది.....ఎంతో అందమైనది ఆయనకు దొరికేది..... ఆమెకిదొక కాంప్లెక్స్''. (పుట.66) రవి భార్యను ఆమెను ప్రేమించాడు. బుద్ధి తిరిగినప్పటి నుంచి స్త్రీని గురించి తనకున్న కలలు అన్నింటిని ఆమెలో చూసుకున్నాడు. ఆమెను అనుక్షణం ఆనంద డోలికల్లో విహరింప చేయాలని ఆరాటపడ్డాడు. ఆమెకు ఎన్నో విషయాలు చెప్పాలని, ఆమెను విజ్ఞాన వంతురాల్ని చేయాలని... రొటీన్ లౌకిక విలువలకు అతీతంగా ఆలోచించేట్టు చేయాలని,ఆమె హృదయాన్ని కళాత్మక హృదయంగామార్చాలని ఆరాటపడ్డాడు. కాని ఫలితం శూన్యం. బిగ్ ఫెయిల్యూర్. ఆమెను ఆమె లోకంలోంచి బయట పడెయ్యలేకపోయాడు.

తన భావుకతలో, తన లోకంలో మెదిలే రవికి ఇంటి సమస్యలు పట్టవు. ఇంట్లో ఏం వున్నా, లేకపోయినా తన అవసరాలకు లోటు రాకూడదు. ఇంట్లోకి సరుకులు తీసుకురావడానికి నామోషీ. అన్నింటికి భార్యనే బాధ్యుల్ని చేసే మధ్య తరగతి మనస్తత్వంలో నుండి రవి బయట పడలేదు. సరుకులు సైకిల్ కి తగిలించుకుని వస్తూ..... 'సైకిల్ మీద వెళ్తున్న తన నెవరూ లెక్చరర్ అనుకోరు. ఎవరో దొక్కు సామానులు కొనేవాడో లేక అమ్మేవాడో

అనుకుంటారు. వ్వాటెపిటీ!వ్వాటెపిటీ!రవీందర్ దిగ్రేట్ ది గ్రేట్ రైటర్! తన రచనలతో ప్రపంచాన్నంతా ఓ ఊపు ఊపి తన పాదాక్రాంతం చేసుకోబోతున్న రైటర్ ది గ్రేట్! ఇలా డొక్కు సైకిల్ మీద ఈ దిక్కుమాలిన వీధుల్లోపడి తిరగటమా షేమ్ ! షేమ్! అని ఆలోచిస్తాడు రవి.

వంట చేయడానికి స్టౌ బత్తులు తెమ్మంటే భార్యపై విరుచుకుపడిన రవికి ఉన్న అర్జంటు పని తన అభిమానికి ఉత్తరం రాయడం. ఈ నవలలో అంతా రవి చైతన్య స్రవంతిలో సాగిపోవడం వల్ల ఆలోచనల్లో కళాత్మక హృదయాన్ని పట్టించుకోలేని భార్య అవివేకాన్ని తలుచుకుని కృంగిపోవడం వల్ల పాఠకులకు అంతా రజని తప్పయినట్లు తోస్తుంది. కానీ ఇందులో రజని తప్పేం ఉండదు. చాలీచాలని జీతం డబ్బులతో సంసారాన్ని నడిపించడం, ఏ బాధ్యతలను పట్టించుకోని భర్తపట్ల ఉక్రోషం రజనీలో కనిపిస్తుంది. రజని రొటీన్ లౌకిక విలువలకు అతీతంగా ఉంచాలని చేసిన ప్రయత్నం విఫలమైందని బాధపడే రవికి ఆమె మాత్రం ప్రాక్టికల్‌గా ఉండడం వల్లే సంసారం ఆమాత్రం నడుస్తుందన్న స్పృహ ఉండదు. భార్య ప్రవర్తనను రచయితగా ఎలా విశ్లేషించాలని తనలో తాను ప్రశ్నించుకొని 'స్త్రీలా తప్ప ఒక హ్యూమన్ బీయింగ్ గా తన తోటి మనిషిగా చూడడం నేర్చుకోగలదు, తానూ అంతేనా?అని తనను తాను ప్రశ్నించుకుంటాడు'.

కాలేజీలో క్లాసులు తీసుకోవడానికి ఏడిచే లెక్చరర్ ఒకరు. దుకాణాలు, చిట్ ఫండ్‌లు నడిపేవాళ్ళు, ఎల్.ఐ.సి. ఏజెంట్లు, గైడ్ లు రాసే వాళ్ళు, విద్యార్థి యూనియన్‌లలో ఒక పార్టీకి బాహాటంగా మద్దతునిచ్చి విద్యార్థుల ఎన్నికల్లో అలజడి నింపిన లెక్చరర్, ఈ వ్యవహారాలను చుక్క దిద్దాలని ప్రయత్నాలు చేసే ఆదర్శవాదిగా రవిపొందే విపరీతమైన మానసిక ఆందోళన, అటు పోలీసులతో, ఇటు రౌడీ విద్యార్థుల దాడులతో మనశ్శాంతి కోల్పోతాడు. ఇక్కడ రచయిత ఉన్నత విద్యలోని ఆడంబరాన్ని, విద్యార్థుల అధ్యాపకుల బాధ్యతారాహిత్యాన్ని చక్కగా తెలియజేస్తున్నాయి కాలేజీలోని పరిస్థితులు.

రవి తెలుగు దేశంలో ఒక ఉత్తమ రచయిత పడే బాధలను ఇలా తెలియచేస్తాడు. తన పుస్తకాల్ని తానే పబ్లిష్ చేసుకోవాలి. తానే అమ్ముకోవాలి. అడవిలో మానై పుట్టినా పరవాలేదు గాని తెలుగు రచయితగా మాత్రం పుట్టొద్దు. తెలుగు రచయిత పొద్దున లేవగానే చేసే పని ఏమిటంటే అప్పుకోసం పరిగెత్తడం... ఏ అమెరికాలోనో, బ్రిటన్ లోనో అయితే నువ్వు రాసిన ఒక పుస్తకం సక్సెస్ అయితే చాలు.... లక్షలు, మిలియన్స్ సంపాదించొచ్చు. జీవితాంతం ఇక డబ్బు సమస్య లేకపోతే ఎంతహాయి, విశ్రాంతి.... అప్పుడిక ఎన్ని నవలలైనా రాసెయ్యొచ్చు. ఒక నవల రాసి మిలియన్స్ సంపాదించడం తనకు సాధ్యమవుతుందా? తనకే కాదు, ఈ దేశంలో ఎవరికీ సాధ్యం కాదేమో...డబ్బుకోసం ఆంగ్ల రచయితలవన్నీ కాపీ కొట్టి, మిక్చర్ తయారుచేసి పత్రికలకు పంపిచే డబ్బు, తర్వాత పబ్లిషర్స్, సినిమావాళ్ళు.....డబ్బు, డబ్బు ఇలా కలలు కంటాడు. చివరకు అలాంటి రచనలు తాను చేయలేనంటాడు. చివరకు ఆ రోజు సన్నివేశాలన్నింటినీ విశ్లేషించి వాళ్లంతా ఎందుకు అలా ప్రవర్తిస్తున్నారో, విశ్లేషిస్తూ వాళ్ళను గురించి ఒక నవల రాయాలనుకుంటాడు. కృత్రిమ విలువలకు అన్నింటికీ అతీతమైన స్వచ్ఛమైన మానవత్వాన్ని పెంపొందించే రచనల సృష్టి చేయాలని నిర్ణయించుకోవడంతో నవల ముగుస్తుంది. నిజానికి ఇది ముగింపు కాదు. ఉత్తమ నవలా రచనకు ద్వారాలు తెరవడంగా కనిపిస్తుంది.

ఈ నవలలో విచిత్రం ఏమిటంటే రవికి తనలో అశాంతి, అసంతృప్తి, తన మానసిక సంఘర్షణల గురించి స్పష్టంగా తెలుసు. "నాలో ఎప్పుడూ ఏదో అశాంతి, ఏదో చేయాలన్న ఆరాటం - ఎక్కడికో పరుగెత్తాలన్న ఆతురత - ఎప్పుడూ దేని కోసమో అన్వేషణ -అర్థంకాని తపన - ఎప్పటికీ తీరని దాహం.... వీటితో వేగిపోతూ నామీద నేనే కోపగించుకుంటూ..... నీ లోపలెప్పుడూ ఏదో ప్రవాహం, బాహ్య సంఘటనలు ఆ ప్రవాహానికి అడ్డు తగులుతుంటాయి. ఆ ప్రవాహాన్ని ఫ్రీగా ప్రవహించ

నీయవు. అప్పుడు కోపమొస్తుంది" (పుట.90) అంటూ భార్యకు వివరిస్తాడు. అయితే రవి పరిస్థితులను వాటంతటవే సర్దుకుంటాయని వదిలివేయలేదు. ఆరోజు జరిగిన సంఘటనలలో తన ప్రమేయం ఎంతవరకుందో నిష్పాక్షికంగా బేరీజు వేసుకుంటాడు. తనను తాను ఎనలైజ్ చేసుకోవడానికి ప్రయత్నించడం....అసలు తన చేతిలో తానూ ఒక పాత్రే. ఇతరులను విశ్లేషించినట్లుగానే తనను తాను విశ్లేషించి, ఆ విశ్లేషణ ఆధారంగా పాత్రల్ని సృష్టిస్తాడు. అలా సృష్టించడంలోనే తనకు నిజమైన 'శాంతి' అని వెల్లడించి ఒక రచయిత సామాజిక దృక్పథాన్ని, నిజాయితీని రచయితగారు చాలా చక్కగా తెలియచేశారు.

ఈ నవలలో విద్యాధికుడు, ఆదర్శవాది అయిన రవి అద్భుతంగా, ఆదర్శప్రాయంగా ఆలోచించసాగాడు. "కానీ, ఇలా ఎంతచించినా... చించినా.... పైసామాత్రం పుట్టదు".అనే వాస్తవాన్ని గుర్తిస్తాడు. తనకు సలహాలిచ్చే వారిలో "వేరే ప్రొఫెషన్‌కు లేని నొబిలిటీ మన(అధ్యాపక) ప్రొఫెషన్‌కుంది. మనల్ని స్టూడెంట్స్ అబ్జర్వ్ చేస్తుంటారు. మనల్ని అనుకరించడానికి పయత్నిస్తుంటారు. మనం స్టూడెంట్స్‌కు ఆదర్శంగా ఉండాలి" (పు.93) అని నీతిబోధ కూడా చేస్తాడు రవి. దీనికి శ్రీనివాసరెడ్డి ఇచ్చే సమాధానం - "తిండీ బట్టా సరిగ్గా లేకుండానే బజార్లో బికారిలా తిరిగేవాన్నెవడూ ఆదర్శంగా స్వీకరించడు.... ముందు అది తెలుసుకోవాలి" అంటాడు. ఇది ఒకరకంగా చూస్తే అందరి వ్యక్తుల్లో రేగే మానసిక సంవాదమే అనిపిస్తుంది.

"అంతస్సువంతిలో తొలిభాగంలో - దాంపత్యంలో అనురాగం, అనుకూల్యత ఎంత ఉన్నా, నిత్య జీవితంలో ఎలాంటి సన్నివేశాలు దంపతుల మనస్సుని బాధిస్తాయో చిత్రించడంలో - భార్యాభర్తల సంబంధంలోని అంతస్సువంతి ఏమిటో, పాఠకుల్ని ఆలోచించేట్టు చేశారు. రవి,రజనీ-యిద్దరూ యిద్దరే-వారి సంవాదంలో, సంఘర్షణలో ఎవరికి వారు న్యాయంగానే మాట్లాడుతున్నట్టు మనకు తోస్తుంది. అవతలి మనిషిమీద ఎంత మమత, ఆకర్షణ, అనురాగం ఉన్నా, వ్యక్తి తన అహం పరిధిలోనే స్పందించడానికి సాధ్యం అనే అంతర్యాన్ని స్ఫురింప జేయడంలో నవీన్ సమదృష్టి సాధించిన విజయం గొప్పది"[7] అని ఆర్.ఎస్.సుదర్శనంగారు ఈ నవలా ప్రవేశికలో తమ అభిప్రాయాన్ని తెలియజేశారు.

"ఇది కథానాయకుడు రవి ఇంటాబయటా జీవిత చిత్రణ. అతడి వ్యక్తిగత జీవిత చిత్రణ చైతన్య పద్ధతిలోనూ, బయట జీవితం మామూలు ప్రథమ పురుష పద్ధతిలోనూ సాగుతుంది. బయటి జీవితంలో కాలేజీ రాజకీయాలు యథాతథంగా చిత్రిస్తే ఇంట్లో భార్యాభర్తల మధ్య అన్యోన్య సంబంధాలూ, సరస సల్లాపాలూ, ఘర్షణలూ, రాజీలూ అంతా ఎంతో ఆకర్షకరీతిలో సాగుతుంది. ఈ అంతరంగ దర్శనం కేవలం ఒక వ్యక్తి కాదు. మన అంతరంగాల్లోకి కూడా చూసుకునేటట్లు చేస్తుంది. ఈ నవల హాయిగా చదివింపజేయటమే కాదు, సున్నితంగా ఆలోచింపజేస్తుంది కూడా. అంతకన్నా ఏమి కావాలి? యే రచయితకైనా? విచక్షణగల పాఠకులు తప్పక చదవదగిన నవల అంతస్సువంతి" అని వాసమూర్తి గారు ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో తెలియజేశారు. (జనవరి 5-11,1994)

అంతస్సువంతి నవలలో మధ్యతరగతి కుటుంబ జీవన చిత్రణ ఉంది. విద్యావ్యవస్థలోని అరాచకం ఉంది. రాజకీయాలున్నాయి. సాహిత్య సంస్థల బండారం ఉంది. పాపులర్ రచనలపై నిరసన ఉంది. కవుల అవకాశ వాదముంది. సాహిత్య చర్చలున్నాయి. ఇవన్నీ ఒక్కటిగా మారి ప్రజల్ని ప్రశ్నింపచేస్తాయి. ఏది ఏమైనా ఆదర్శాలకు అనుగుణంగా జీవించడానికి చేసే ప్రయత్నంలో ఎన్నో ఆటుపోట్లనూ, అంతరంగ, బహిరంగ సంఘర్షణలనూ ఎదుర్కోవలసి ఉంటుంది. వీటిని తట్టుకుని నిలబడగలిగే వారి సంఖ్య అత్యల్పం. అలా నిలబడలేక ఏదో రూపంలో మనసును మోసపుచ్చుకుని జీవితంలో రాజీపడేవాళ్ళు అదో ప్రత్యేక కోవకు చెందుతారు. అందులో రవి ఒకడు. మనలో చాలామంది ప్రతిరూపం అతనిలో

కనిపిస్తుంది. నవీన్‌గారు పూర్వ నవల 'అంపశయ్య'లో ఈ రవి కాలేజ్ విద్యార్థిగా కనిపించాడు. అతడే 'అంత స్రవంతి' నవలలో సామాజికుడిగా స్థిరపడే ప్రయత్నం చేస్తూ కనిపిస్తున్నాడు.

నన్ను వెళ్లిపోనీరా :

నన్ను వెళ్లిపోనీరా నవలను కె.రామలక్ష్మిగారు రాశారు. ఈ నవలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 1995లో సాహితీ పురస్కారాన్ని ఇచ్చి గౌరవించింది. అతి సామాన్యంగా సహజ సుందరంగా చిత్రించిన నవలగా, భాషరాకపోయినా మనసు స్పందన తెలిసిన మనుషులు ఒకరికిమరొకరు తోడైన విధానాన్ని వివరించిన నవలగా నన్ను వెళ్లిపోనీరా నవలను పేర్కొనవచ్చు.

సుందరమ్మ, ఆమె భర్తశాస్త్రి అమెరికాలో ఉంటున్న కొడుకు, కోడలు దగ్గరకి వెళ్లిరావాలని ప్రయాణం చేసు కుంటుంటారు. ఇంతలో అనుకోకుండా శాస్త్రిగారికి పక్షవాతం చేస్తుంది. కొడుకులా పెంచుకున్న సుందరమ్మ తమ్ముడు వారికి ధైర్యంగా ఉండి అన్ని పనులు చూసు కుంటాడు. కొడుకైన రవికుమార్ ఎన్నిసార్లు కబురుపెట్టినా రాడు. ఇంతలో శాస్త్రి చనిపోతాడు. కర్మ కూడా సుందరమ్మ తమ్ముడు గణపతి చేస్తాడు. పెద్దకర్మ రోజు కొడుకు రవి వస్తాడు. కానీ వేటిని అంతగా పట్టించుకోడు. తన భార్య రెండోసారి కడుపుతో ఉండడంవల్ల తల్లిని వెంటనే అమెరికా తీసుకువెళ్ళాలనుకుంటాడు. రవికి తల్లిందండ్రులపై వున్న గౌరవం గురించి గణపతి సుందరమ్మకి చెప్పడు. అందువల్ల ఆమె కొడుకు ప్రేమను నమ్ముతుంది.

అమెరికా వెళ్లిన రవి, భార్య రాణికి అకస్మాత్తుగా ప్రసవం జరగడంతో తల్లిని పంపించమని మేనమామ గణపతికి ఫోన్ చేస్తాడు. ఊరిలోని అన్ని పనులు గణపతి చూసుకుంటానని మాష్టారుగారితో కలిసి సుందరమ్మని అమెరికా పంపిస్తాడు. సుందరమ్మ వెళ్ళడానికి మధ్యలో తెలుగామె బొంబాయిలో పరిచయం అయ్యి విమానా శ్రయంలో కొడుకు కలుసుకునేదాక సహాయం చేస్తుంది. అంతేగాక కొన్ని డాలర్లు, పాస్‌పోర్టు ఎవ్వరికీ ఇవ్వకుండా జాగ్రత్తగా ఉంచుకోమనీ, మరల ఇండియా రావాలంటే అవి తప్పనిసరిగా ఉండాలని చెప్తుంది. అందువల్ల సుందరమ్మ వాటిని జాగ్రత్తగా తన పెట్టలో అడుగున పెట్టుకుంటుంది.

కొడుకు దగ్గరకు వచ్చిన సుందరమ్మను కోడలు రాణి ఏపని చేయినిచ్చేదికాదు. సుందరమ్మకి ఏం తోచేదికాదు. తమ్ముడు గణపతి విషయాలు రవీ, రాణి దాచివుంచే వారు. రవి స్నేహితులు, ఇండియాకు చెందిన మూర్తి గారితో సుందరమ్మను నయాగరా మొదలైన దర్శనీయ ప్రదేశాలు చూడడానికి పంపిస్తారు. సుందరమ్మ మూర్తి గారితో మనసు విప్పి మాట్లాడుతుంది. ఎంతమందితో ఉన్న సుందరమ్మ ఆమె తమ్ముడి సంగతులు తెలియక బెంగపడుతుంది. ప్రసవం అయిన తర్వాత రాణి తిరిగి మరల ఉద్యోగంలో చేరాలనుకుంటుంది. అంతేగాక అత్తగారు కూడా ఉండడం వల్ల కొంత సహాయంగా ఉంటారనుకుంటుంది. రవికీ, రాణికి సుందరమ్మను మరల ఇండియా పంపే ఉద్దేశం ఉండదు. అంతేగాక గణపతి గురించి చెపితే ఎక్కడ వెళ్లిపోతుందోనని అతనికి సంబంధించిన ఉత్తరాలు వచ్చినా సుందరమ్మకి ఇవ్వరు. సుందరమ్మ తమ్ముడు కాలు అవిటిగా ఉండడంవల్ల పెళ్లి చేసుకోకుండా ఒంటరిగానే ఉంటాడు. అందుకే సుందరమ్మ తమ్ముడికి తానుగాక ఇంకెవరున్నారని దిగులు పడుతుంది.

ఒకరోజు రాణి ఏవో ఉత్తరాలు దాచినట్టుగా సుందరమ్మ అనుమానిస్తుంది. రాణి ఉద్యోగానికి వెళ్లిన తర్వాత సుందరమ్మ ఆ ఉత్తరాలు వెతుకుతుంది. అందులో ఒక ఉత్తరం జాగ్రత్తగా దాచివుండడం వల్ల నల్లజాతీయులచేత అది చదువించుకుని తన తమ్ముడు చనిపోయాడని తెలుసుకుని, కొడుకు, కోడలు మోసం చేశారని గ్రహించి, ఎవరికీ చెప్పకుండా తాను దాచుకున్న డాలర్లు, పాస్‌పోర్టు తీసుకుని, భాష తెలియకపోయినా భావం తెలియజేస్తూ, నల్లామె, డ్రైవరు, ఓ యువకుడు,

సహాయంతో న్యూయార్క్ వంటి మహానగరంలో భాష రాకపోయినా, కొడుకు విమానాశ్రయానికి వచ్చి ఇంటికి రమ్మనా సుందరమ్మ నన్ను వెళ్లిపోనీరా, మీరు డబ్బుని నమ్ముతారు నేను మనషుల్ని నమ్ముతాను అంటూ యువకుని సహాయంతో వెళ్లిపోతుంది. ఆమె మనవడు కూడా ఆమెను నాయినమ్మని పిలవడు. ఆమెతో సరిగ్గా ఉండడు. రవి ఇంటికి వచ్చిన రవిని రాలేదా అని రాణి అడిగి 'రేపెలా' అంటుంది. నీ ఏర్పాట్లు నువ్వు చూసుకో అంటూ గదిలోకెళ్లి తలుపువేసుకుని భార్యాభర్తలు మోసం చేసినందుకు, తల్లి తమ చిన్నబద్ధికి బలైపోయిందని దుఃఖించడంతో ఇందలి కథ ముగుస్తుంది.

నందివాడ పుతలీబాయిగారు నన్ను వెళ్లిపోనీరా నవలపై తమ అభిప్రాయాన్ని ముందుమాటలో ఇలా తెలియజేశారు. "మాతృమూర్తి మమత అతి సామాన్యంగా సహజ సుందరంగా చిత్రించారు రచయిత్రి. తన గుండెలు పిండే వార్త నల్లయువతి సాయంతో సుందరమ్మ చదివించుకోవడం, మనసు పిండినట్లనిపిస్తుంది. బస్సు డ్రైవరు, ఒక ముక్కుమొహం తెలియని కుర్రవాడు సుందరమ్మని గమ్యం చేరుస్తారు. భాషరాని మనిషికి మనసు స్పందన తెలిసిన మనుషులు-తెల్లవారేకాని నల్లవారేకాని - ఎలా తోడవుతారో తెలుసుకుని మనం ముగ్ధులమవుతాం. జీవిత మజిలీలలో ఎన్నిభావాలు మనిషికి. రాణీ ప్రశ్న మనల్ని మరింత ఆలోచింపచేస్తుంది" (పుట.ఐఱఱ) అంటూ అభిప్రాయపడ్డారు.

తమ స్వార్థంకోసం కుటుంబంలోని వారినీ, అందునా కన్నతల్లిని మోసం చేయడం కుటుంబ విలువలు పడిపోతున్న వైనం కనిపిస్తుంది. న్యూయార్క్ మహా నగరంలో భాష రాకపోతే బయటకు కాలు పెట్టలేరనేది అబద్ధం అనిపిస్తుంది. మనిషినీ మనిషినీ కలపడానికి భాష చాలదు. భాష రాకపోయినా మనిషి మీద మనిషికి అభిమానం, ఆత్మీయత ఉంటే అవే దగ్గర చేస్తాయని తెలుస్తుంది.

కొత్తబంగారులోకం :

ఈ నవలను టి.ఎస్.ఎ.కృష్ణమూర్తిగారు రాశారు. ఈ నవల 'ఆంధ్రభూమి' వారపత్రికలో 2004వ సంవత్సరంలో ఆరు నెలలపాటు ధారావాహికగా ప్రచురింపబడింది. 2006లో తెలుగు విశ్వవిద్యాలయం వారిచే ఉత్తమ నవలగా ఎంపికయ్యి సాహితీ పురస్కారాన్ని పొందింది.

చెరుకుపల్లె అందమైన ప్రకృతికి నిదర్శనం. అక్కడి ప్రేమలు, ఆప్యాయతలు, అభిమానాలు ఎటువంటి మనిషినైనా తమ బంధానికి బంధీని చేస్తాయి. వారి అభిమానం ఎలా ఉంటుందో మనకు ఆ ఊరికి ఎప్పుడూ టపాలు తెచ్చే రషీదు వల్ల తెలుస్తుంది. రూరల్ పోస్టు మ్యాన్‌గా కేంద్ర ప్రభుత్వ అవార్డు పొందిన వ్యక్తి రషీదు. రషీద్ ఎప్పుడు టపాలు తెచ్చినా ఆప్యాయతతో పలకరిస్తూ, తల్లిలా అన్నం పెట్టి పంపిస్తుంది చెరుకుపల్లె. ఆ పల్లెప్రజలు ప్రేమకు నిదర్శనం. రషీదుకు కూడా ఆ పల్లెపట్ల అంతే ప్రేమ ఉంటుంది. చెరుకుపల్లె దయ్యాల గుట్టకు అవతలవున్నా, ఒకటిరెండు ఉత్తరాల కోసం తన భార్యకు బాగాలేకపోయినా, అదే దిగులుతో వచ్చి ఆ పల్లె ప్రజలకు టపాలు ఇస్తాడు రషీద్.

రాజారావుగారు నాటువైద్యుడు అవ్వడం వల్ల తని భార్యకు మందులు ఇచ్చి పంపిస్తాడు. రషీద్ ఆ మందులను రాజారావు చెప్పినట్లుగావాడి భార్య ఆరోగ్యాన్ని కాపాడుకుంటాడు. రషీద్ ఆ పల్లె యందు అభిమానం, కృతజ్ఞతను కలిగివుంటాడు. అంతేగాక అతడు దారిలో ఎదురైన భార్గవిని తానే పలకరించి చెరుకుపల్లెకు జాగ్రత్తగా వెళ్ళమని, ఏ కొంచెం పరధ్యానంగా వున్నా అడవిలోకి వెళ్ళిపోయే ప్రమాదముందని హెచ్చరిస్తాడు. అంతేగాక ఎవరికోసం ఎందుకు వెళ్లుతుందో తెలుసుకొని, రాజారావుగారు వైద్యం బాగా చేస్తారని, ఆయన వైద్యం వల్ల తన భార్యకు కూడా వెంటనే రోగం తగ్గిందని చెప్పి, ఆమెకు నమ్మకమైన భరోసాన్ని కలిగిస్తాడు. తనకు జరిగిన మంచిని అందరికీ తెలియజేస్తూ, ఎదుటివారికి కూడా

మంచి జరగాలని కోరుకునే మంచి మనస్తత్వం రషీద్‌ది. రషీద్ ఉత్తరం వల్ల కథలో ప్రవేశించిన భార్గవి మరల అతని ఉత్తరం వల్లనే కథా నాయకుడు రాజారావు హృదయంలో ఉందనీ, ఆమె అతనిని వెతుక్కుంటూ వస్తుందనే కథా బలాన్ని రషీద్ తీసుకువచ్చే పోస్టు ద్వారా రచయిత చిత్రీకరించారు.

స్త్రీ-పురుషుల మధ్య స్నేహం పవిత్రంగా ఉంటుందనే విషయాన్ని భార్గవి, రఘుపతి పాత్రల ద్వారా రచయిత తెలియజేశారు. స్త్రీ-పురుషులు కలిసివుంటే తప్పుగా భావించే సమాజానికి రచయిత ఈ రెండు పాత్రల వల్ల మచ్చలేని మమత గల అభిమానం ఉంటుందని చెప్తున్నట్టున్నారు. ఆదర్శవంతమైన స్నేహితులు వారు. భార్గవిని భర్తకూడా వదిలేస్తే స్నేహితుడైన రఘుపతు ఆమెను చేరదీసి, ఎలాగైనా ఆమెను మామూలు మనిషిని చేయాలని ఆయన పడిన తాపత్రయం స్నేహితురాలికి అతనిచ్చే ప్రాధాన్యం వల్ల స్నేహం విలువ తెలుస్తుంది. ఆమె బాధ్యతను అతను తీసుకుని, తన స్నేహితుడికి అప్పగిస్తాడు. భార్గవి, రాజారావు కలుసుకోవడానికి వారి అభిప్రాయాలు కలవడానికి, వారిరువురు ఒకటవడానికి రఘుపతియే కారణం. స్నేహితురాలికి అండగా నిలవడమే గాకుండా ఆమెకు నచ్చిన వ్యక్తిని ఆమెకు అందించిన మంచి మనసున్న స్నేహితుడు రఘుపతి. ఎప్పుడైనా స్త్రీకి ఎవరోఒకరి అండ అవసరమే అనుపిస్తుంది. ఎవరో ఒకరు ఉన్నారనే ధైర్యం వుంటే స్త్రీ ఎంత కఠినమైన సమస్యనైనా అధిరోహించి తన జీవితాన్ని అభివృద్ధి చేసుకోగలుతుంది. భార్గవి చేత రచయిత ఇలా అనిపిస్తాడు. ''ప్రపంచంలో ఇంత ఉదాత్తమైన మనుషులు ఉంటారా''. ''ఒక పురుషుడు తాను పురుషుడననీ, ఒక స్త్రీ తానొక స్త్రీననీ మరిచిపోగల్గినప్పుడు వారిద్దరి మధ్య ఏర్పడే స్నేహం చాలా అత్యున్నతంగా ఉదాత్తంగా సాగుతుంది''.(పు.16)

శారదమ్మ గొప్ప సహనశీలి, శాంతమూర్తి. ఎంతమంది వచ్చినా వండిపెట్టగల మహాతల్లి. విసుగన్నది ఎరుగదు. ఎవరినైనా కన్నతల్లిలాగా ఆదరించి, వారికి కావాల్సిన విధంగా సపర్యలుచేస్తూ, పథ్యంకు సంబంధించిన భోజన సదుపాయాలను కూడా తనవంతు బాధ్యతగా చక్కగా నిర్వహిస్తుంది. ప్రదీప్ చనిపోయినప్పుడు ఆమె పడిన బాధ వర్ణనాతీతం. ఆమె ఎక్కువగా చెరుకుపల్లెలోనే ఉండేది. ప్రదీప్ చేత శారదమ్మ అని పేరుపెట్టి పిలిపించుకునేది. ఆమె ప్రదీప్ మరణించిన తర్వాత రాజారావును దత్తత తీసుకుంది. ఆ సందర్భంలో రాజారావుతో ఇలా అంటుంది. ''అది నీ అదృష్టంకాదు నాయనా ..... నా అదృష్టం! స్వామిగారికి పున్నామ నరకం తప్పించడానికి కొడుకు వరసైనవారు కాశీనాథుని అగ్రహారంలో ఉన్నారు. నాకే తలకొరివి పెట్టడానికి నీవు తప్ప మరెవ్వరూ లేనిది! నిన్ను దత్తత చేసుకుంటున్నది బ్రతికినన్నాళ్లూ 'శారదమ్మా!' అని పిలిపించుకుని, ఆపై నీ చేతుల మీదగా వెళ్ళిపోవడానికి! నా స్వార్థంతోనే ఈ ఆలోచన!'' (పుట.30) అని అంటుంది. అమ్మలాగా అందరిని ఆదరించిన వ్యక్తి శారదమ్మ. విసుగు విరామంలేని పల్లెవనిత శారదమ్మ. ఎంతోమందికి అమృతవల్లి శారదమ్మ.

ఈ నవలలో సినీనటిది ఒక రకంగా జీవన్మరణ సమస్య. స్త్రీకి అంగవైకల్యం ఎంతో దురదృష్టకరం. ఆమెకు అంగవైకల్యం ఊహించరానిది. ఆమె ఎప్పుడూ తన చేతికి వున్న పుండు నయం అవుతుందా?లేదా? అని అంతర్గతంగా సతమతమవుతుంది. నడి సముద్రంలో మునిగిపోతున్న వ్యక్తికి నూలుపోగు దొరికినా ఆశగా, ఆతృతగా రెండు చేతులతో పట్టుకుంటాడు అన్నట్లుగా రాజారావు నుండి వచ్చిన ఉత్తరం అంత ఆశను, ఆతృతను కలిగిస్తుంది. అందుకే రఘుపతి లేకపోయినా ఒక్కతే ధైర్యంగా చెరుకుపల్లెకు బయలుదేరుతుంది. జీవితంపై ఆశతో ఆరోగ్యంగా ఉండాలనుకుంటుంది. బురఖా వేసుకోవాలని ఆమెకు అనిపించడం స్త్రీ సహజమైన సునిశిత ఆలోచనకు నిదర్శనం. తన ఆరోగ్య పరిస్థితి నిమిత్తం ఎంత బాధనైనా అనుభవిస్తుంది. కఠినమైన పథ్యం చేస్తుంది. తనకు వైద్యం చేసే రాజారావు శ్రద్ధను, అభిమానాన్ని చూసి అతని గురించి తెలుసుకోవాలను

కుంటుంది. అప్పుడు శారదమ్మను అడుగుతుంది. రాజారావు నుండి మనసుకు ప్రశాంతత కలిగించే విషయాలను తెలుసుకుని ఆచరిస్తుంది. భార్గవి తన గురించి రాజారావుకు చెబుతుంది. అనాధనని పెంచిన తల్లిదండ్రులు చనిపోతే లాయర్ విశ్వనాథయ్య ద్వారా ఆస్తివచ్చి సినీనటినయ్యానని, ప్రేమించి పెళ్లి చేసుకున్న ప్రవీణ్ నటి శ్రీప్రియతో సంబంధం పెట్టుకుంటే తట్టుకోలేక అతనికి విడాకులు ఇచ్చానంటుంది. స్త్రీ సహజ ప్రవర్తనకు ఇది నిదర్శనం. ఆమె చేతి జబ్బుతోనే ఎంతో బాధపడుతుంటే ప్రవీణ్ పెట్టే మానసిక చింత కొంత బాధను కలిగించింది. రాజారావుతో వున్న కొన్ని నెలల్లోనే అతని పట్ల ప్రేమను, అభిమానాన్ని పెంచుకుంది. అతన్ని, ఆ పల్లెను సర్వస్వంగా భావించింది. రాజారావు కోరిక ప్రకారం తనకున్న ఆస్తినంతటిని తను పెరిగిన 'కరుణ' అనాథ ఆశ్రమానికి రాసిచ్చి, ఎంతో ప్రశాంతంగా, సంతోషంగా, అతని కోసం రెక్కలు కట్టుకుని వాలుతుంది. భార్గవి తనకు కావలసిన ప్రేమ, ఆప్యాయతల కోసం సర్వస్వాన్ని వదులుకొని తన జీవితాన్ని తానే నిర్ణయించుకుని చెరుకుపల్లెవైపు పయనిస్తుంది.

ఈ నవలలో ప్రసిద్ధమైన పాత్ర రాజారావు. డిగ్రీ చదివేటప్పుడు సుగాత్రిని ప్రేమించి మరెవరినీ వివాహం చేసుకోవడానికి ఇష్టపడని అమర ప్రేమికుడు. తన చెల్లెలు ఆశాలత కోరిక ప్రకారం ఆమెను ప్రదీప్ కిచ్చి వివాహం చేయడానికి అందరూ ఒప్పుకునే పరిస్థితులను కల్పిస్తాడు. తన కుటుంబం అంతా తనను మరణించినప్పుడు ఎంతో బాధపడతాడు. ఎంత ప్రయత్నించినా ఎవరినీ కాపాడుకోలేకపోతాడు. చివరి క్షణంలో తండ్రితో మాట్లాడ లేక పోయాననే బాధతో విలపిస్తాడు. చివరి క్షణంలో అప్పులు తీర్చలేని స్థితిలో వున్న రాజారావు తండ్రి ఇన్సూరెన్స్ వల్ల అప్పులన్నీ తీర్చి చెరుకుపల్లెకు వెళ్ళి శారదమ్మ దగ్గరే ఉంటాడు. ఆమె అతనిని దత్తత తీసుకుంటుంది. ప్రదీప్ తండ్రిగారి ద్వారా నాటువైద్యం నేర్చుకుంటాడు. అతనికి వాస్తు, జ్యోతిష శాస్త్రాలు వంటబట్టవు. నాటువైద్యంలోనే బాగా రాణించి, ఆ పల్లెకు, చుట్టు పక్కల పల్లెలకు ఎంతో అవసరమైన వ్యక్తిగా ప్రముఖ స్థానాన్ని పొంది, సుగాత్రి స్థానంలో భార్గవిని కోరుకుంటాడు. ఉదాత్త వ్యక్తి రాజారావు.

రచయిత ఈ నవలలో మానవ సంబంధాలు, ప్రకృతి వరాలను చక్కగా జోడిస్తూ, రాజారావు పాత్రవల్ల పాఠకునికి తెలియజేశారు. "కొండలలో, అడవులలో లభించే వస్తువులతో ప్రతి రోగానికీ, ప్రతి గాయానికీ, ప్రతి పుండుకూ మందులు తయారుచేసి నయం చెయ్యవచ్చు. అనుభవజ్ఞు డైన నాటు వైద్యుని చేతుల్లో నయం కానిదంటూ ఉండవు. వాస్తవానికి నాటువైద్యంలో ఏ కొమ్మ, ఏ రెమ్మ,ఏ ఆకు, ఏ బెరడు, ఏ గింజ, ఏ వేరు, ఏ మట్టి ఎందుకు, ఎలా ఉపయోగపడతాయో గ్రహించ గలిగితే ఎన్నో సాధించవచ్చు." (పుట.45) అనేది రాజారావు వల్ల తెలుస్తుంది. వేపనూనె, గడ్డపొడ్డి, దూది, నూలు గుడ్డతో వైద్యం చేస్తాడు. భక్తితో, ఉపాసనతో, ఆత్మ సమర్పణతో సాధ్యంకానిదీ, సాధించలేనిదీ ఏదీలేదని రచయిత తెలియజేస్తాడు. ఏనుగుపల్లేరు కాయలను, దూది, బోదపుల్లలకు దూదిని చుట్టి ఆమె చేతిపుండు మధ్యనున్న రంధ్రాన్ని పరిశుభ్రం చేయడం మొదలైన అంశాలను రచయిత చక్కగా వివరించారు.

ప్రదీప్ వాళ్ల తండ్రి రామమోహనశాస్త్రి ప్రముఖ వాస్తు, జ్యోతిష, నాటువైద్యుడు. మనం చెప్పే రోగి లక్షణాలను బట్టి మందులిస్తాడు. ఇతని ద్వారా రచయిత వాస్తు ప్రాధాన్యాన్ని తెలియజేశారు. విష్ణుమూర్తికి ఇంటి వాస్తు బాగోలేదని చెప్పి, ఇల్లు మారమని చెప్తాడు. ఇల్లు మారదామన్నా మారలేక తమ చావును తామే తెచ్చుకుంటారు. అలాగే ప్రదీప్, ఆశాలతల పెళ్ళి విషయంలో ప్రదీప్‌కు పుత్రోదయం తర్వాత యమగండం ఉందని చెప్పడం, ఎన్ని శాంతులు, పూజలు చేసినా అతనిని, అతని కుటుంబాన్ని రక్షించలేకపోవడం మొదలైనవన్నీ శాస్త్రిగారు ఎలా చెప్పారో అలాగే జరగడం, వాస్తు, జ్యోతిష్య

శాస్త్రాలకు పూర్వీకులు అంత విలువ ఎందుకు ఇచ్చారో, ఇస్తున్నారో తెలుస్తుంది. ఈ నవలలో అంతా రామమోహనశాస్త్రి చెప్పిన "జ్యోతిష్య, హస్త, వాస్తు శాస్త్రాల ప్రకారమే కథంతా జరిగింది". ఆయన ఎప్పుడు ఎక్కడ ఎలా చెప్పారో దానినే రచయిత రాశారు. రచయిత చెప్పాలనుకున్న విషయాలనే అతని ద్వారా తెలియ జేశారు.

రచయిత మాయమైపోతున్న మానవతా విలువలను, బంధాలు- అనుబంధాలలోని ఆప్యాయత అనురాగాలను, విస్మరిస్తున్న ప్రకృతి వరాలను, కోల్పోతున్న జ్ఞాన, విజ్ఞాన సంపదను వివిధ పాత్రల దృష్ట్యా కళ్ళకు కట్టినట్లుగా చక్కగా చిత్రించి వివరించారు. పాఠకునికి ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని, అనుభూతిని కలిగించిన రచయిత టి.ఎస్.కృష్ణమూర్తిగారు అభినందనీయులు. ఈ విధంగా మధ్యతరగతి, కుటుంబ గృహస్థజీవనమూ, ఆచారాలు, వ్యవహారాలు, నాటువైద్యం మొదలైన విషయాలను రచయిత(త్రు)లు సందర్భోచితంగా నవలల్లో చిత్రించారు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. ఆనందరామం,సి. తెలుగు నవలల్లో కుటుంబ జీవనం. విజయవాడ : నవజ్యోతి పబ్లికేషన్స్, 1979.
2. కృష్ణమూర్తి,టి.ఎస్.ఎ. కొత్తబంగారులోకం.హైదరాబాదు:జయంతి పబ్లికేషన్స్, 2006.
3. నవీన్.అంతస్సువంతి.వరంగల్ : ప్రత్యూష ప్రచురణలు,1991.
4. నాగభూషణ శర్మ,మొదలి. తెలుగు నవలా వికాసం. హైదరాబాదు : నాట్యకళాప్రెస్, 1971.
5. యోహాన్ బాబు,గజ్జా. బలివాడ కాంతారావు నవలలు పరిశీలన. విశాఖపట్టణం : దీప్తేజ పబ్లికేషన్స్, 1995.
6. రామలక్ష్మి,కె.నన్ను వెళ్లిపోనీరా.మద్రాసు : స్త్రీశక్తి ప్రచురణ,1992.
7. రామానుజరావు,దేవులపల్లి.తెలుగు నవల నూరు సంవత్సరాలు.హైదరాబాదు:ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1976.
8. రామిరెడ్డి,ఘంట(సం).అంపశయ్య నవీన్ సాహితీ ప్రస్థానం.వరంగల్:ప్రత్యూష ప్రచురణలు, 2002.
9. మంగమ్మ,లింగాల. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిదాలయం సాహితీ పురస్కార నవలలు-పరిశీలన (1986-2010). పి.హెచ్.డి సిద్ధాంత గ్రంథ. హైదరాబాద్ : కేంద్రీయ విశ్వవిద్యాలయం, 2014.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మానవత్వ ప్రబోధంలో నాటకాల పాత్ర

– డా॥ జె. వి. చలపతిరావు, ఆంధ్రోపన్యాసకులు, కాకరపర్తి భావనారాయణ కళాశాల (స్వయంపతిపత్రి), విజయవాడ.

మానవునికి మనోల్లాసాన్ని కలిగించేవి లలిత కళలు, అందులో ఆలోచనామృతమైన "కవిత్వము" ప్రధాన మైనది. కావ్యాలు, నాటకాలు, కథలు, ప్రహసనాలు మొదలైనవి సాహిత్యాన్ని పరిపుష్టం చేసి దానికి నిండు దనాన్ని తెస్తాయి. వీటన్నింటిలో "నాటక ప్రక్రియ" ముఖ్యమైనది. అందుకే "నాటకాంతంహి సాహిత్యం", కావ్యేషు నాటకం రమ్యం అనే అభాణకాలు చిర ప్రసిద్ధా లయ్యాయి. ఎంతో ప్రభావశీలమైన ప్రచోదనా శక్తిగల (ఉత్తేజపరిచే) రచనా పటిమ నాటక రచనకు మూల మైనది.

కథాంశము ఎన్నుకొనుటయందును, సంఘటనలను కూర్చుకొనుటయందును, సన్నివేశములు కల్పించుట యందును, పాత్రలను సృష్టించుటయందును, వాని మనస్తత్వమును చిత్రీకరించుటయందును ఎంతో ప్రౌఢిమ (ప్రావీణ్యత) కలవారే గొప్ప నాటక కర్తలు కాగలరు.

జీవితాన్ని చక్కగా పరిశీలించిన వారికి ఈ ప్రపంచమే ఒక నాటక రంగమని, మానవులు, పశుపక్ష్యాదులు వివిధములైన వైయుక్తిక (విలక్షణమైన) పాత్రధారులని ఈ విశ్వాన్ని నడిపించే శక్తి ఏదో, దానిని సూత్రధారి అని వాటి అనుభవాలు, అనుభూతులను సాంద్రతల (ఎక్కువ తక్కువలను) విశ్లేషణలని తేలుతుంది. అందుకే విశ్వనాటక కర్త షేక్స్ పియర్ "All the World is a Stage, all are actors, the birth is the entrance as the death is exist" అని సూటిగా - స్పష్టంగా, తన నాటకాల ద్వారా చెప్పకనే చెప్పారు. అనుభావాలను, అనుభూతు లను సన్నివేశాలుగా, సంభాషణములుగా పేర్చి, కూర్చి ఆంగ్ల సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. మానవ జీవన తత్వం విస్తృతముగా అగాధముగా పరిశీలించి రత్నముల వంటి నాటకాలకు సృష్టికర్త అయినాడు. కవికోకిల దువ్వూరి రామిరెడ్డిగారు "పానశాల"లో "అంతములేని ఈ భువన మంత పురాతన పాంథశాల, విశ్రాంతి గృహమ్ము అందు నిరుసంజెలు రంగుల వాకిళుల్... బాదుషాలు, బహరామ జెమిషీడులు ఎందరెందరో కొంత సుఖించి పోయిరెటకో పెరవారికి బోటసంగుచున్" అని తన కవితలో ఈ ప్రపంచము యొక్క నాటకీయతను శ్రోతల కనులకు కట్టినట్లుగా వర్ణించినాడు.

నాటకరంగ చరిత్ర :

సంస్కృతంలో దశవిధ రూపములున్నవి. అవన్నీ నాటక కళయొక్క గొప్పతనాన్ని తెల్పుతాయి. కవికుల గురువు కళిదాసు, భానుడు, భవభూతి మొదలుగు వారు సంస్కృత నాటకములను సుసంపన్నం చేశారు. అలాగే మన తెలుగు వాఙ్మయమునందును 20వ శతాబ్దపు ప్రారంభం నుండి నాటక కళకు ప్రాచుర్యం ప్రారంభ మైనది.

మొట్టమొదటి పురాణ గాథలను తీసుకొని, పాత్రలను సృష్టించి వాని ద్వారి మానవులకు నీతి బోధ చేసే ప్రయత్నములు జరిగినవి. "కాలము పరిణామశీలం కదా!" కావున కవిత్వము నందే నాటకకళ ఉండును. వస్తువులోను, వ్యక్తీకరణలోను మార్పు సంభవించినది. ఆనాటి సమాజమునందలి సమకాలీన సంఘటనలను వస్తువులుగా తీసుకొని రచనలు సాగించుట సాగినది. అటువంటి వానిలో 19వ శతాబ్ధమునందు తెలుగులో వ్రాయడిన "కన్యాశుల్కము" నాటకము మకుటాయ మానమైనది (కిరీటము వంటిది). దాని ప్రభావం ఈనాటికిని శ్రీ గురుజాడ అప్పారావు గారిని, అందరి మనసులలో చిరస్మరణీయులుగా చేసినది.

19వ శతాబ్దం ఉత్తరార్ధమున మంచన రాజశేఖరుని "విద్దశాలభంజిక" అనే సంస్కృత నాటకము "కేయూర

బహు చరిత్రము'' అను పేరాను, పిల్లలమర్రి పిన వీరభద్రుడు ''కాళిదాసుని అభిజ్ఞాన శాకుంతలము''ను, ''శృంగార శాకుంతలము'' అను పేరాను కావ్యబ్రంధములుగా వ్రాసిరి. బడ్డుచర్ల తిమ్మన (16వ శతాబ్దాంతమున) రచించిన ''ప్రసన్న రాఘవము'' ఏడు అంకముల నాట్య ప్రబంధము. ఇది తెలుగులోని దృశ్య కావ్య భాగములో ఒక విలక్షణము. తరువాత యక్షగానమను వీధినాటకము ప్రచారములోనికి వచ్చినది. ఇది పండిత, పామరులకు ఆనందము కూర్చెడిది. 13వ శతాబ్దముకే సంచాలక నాటక సంఘములు ఏర్పడినవి. తెలుగునాటక రచన రెండు కాలములలో రెండు శాఖలుగా సాగినది. తెలుగు సాహిత్య ప్రారంభం నుండి క్రీ.శ.1860 వరకు మొదటి దశ. దీనినే 'ఆధునిక నాటక రచనా కాలమని పేర్కొన్నారు.

క్రీ.శ.1860 లో ''మంజరి మధుకరీయము'' అను ప్రకరణమును స్వతంత్ర్యముగా రచించిన కోరాడ రామచంద్ర శాస్త్రి గారు తెలుగు నాటక రచన గావించిన వారిలో ప్రప్రధముడు. 1871లో వెంకటరత్నం పంతులు నరకాసుర విజయం, తెనిగించి 1872లో ప్రకటించారు. తరువాత 1883కు అనువాదములు వచ్చినవతీ. 1875లో వావిలాల వాసుదేవశాస్త్రి షేక్స్‌పియర్ రచించిన ''జూలియస్ సీజర్'' నాటకమును ''సీజర్'' చరిత్రముగా 1880-1881లో ధార్వాడ నాటక సమాజం వారు సంచార హిందీ నాటకములు ప్రదర్శించిరి. 1886 నుండి తెలుగు నాటక చరిత్రలో వికాసదశ ప్రారంభమైనది. కృష్ణమాచార్యుల నాటకములలో నాంది ప్రస్తావనలే గాక ఆంగ్ల సాంప్రదాయకములైన పూర్వ రంగము, ఉత్తర రంగములుగా విభజింపబడినవి.

1911లో తిరుపతి వెంకట కవులు రచించిన ''పాండవోద్యోగ విజయము'' ప్రసిద్ధి పొందినది. చారిత్రక నాటకములైన ''బబ్బిలి యుద్ధం'' తరువాత సాంఘిక నాటకములు వచ్చినవి. గురుజాడ అప్పారావు ''కన్యాశులబము''లో 5 అంకములు 27 రంగములు ఉన్నవి. తరువాత దేశకాల పరిస్థితులలో మార్పుల వలన రాజకీయ, సాంఘిక వస్తు వైవిధ్యములతో కూడిన నాటకములు వచ్చినవి. తర్వాత నాటికలూఏకాంకికలు వచ్చినవి.

భమిడిపాటి కామేశ్వరరావు ఏకాంకికలో కచటతపలు ముఖ్యమైనవి. ఆరుద్ర శివశంకర శాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి మొదలగు కొందరు నాటక రచయితలు, పిల్లల వస్తువులనే వస్తువులుగా గ్రహించి చక్కని నాటికలు వ్రాసిన వారిలో ప్రథములు, మద్దిపట్ల వేంకటరావు, సోమంచి రాములు మొదలైన వారున్నారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలో కూడా వార్షికోత్సవ సందర్భముగా నాటకాలు, ఏకాంకికలను ప్రదర్శిస్తున్నారు.

''సొంత లాభం కొంత మానుకొని పొరుగువారికి తోడుపడవోయ్'', ''దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్'' అన్న గురజాడ వారి ఆశయాలను నూటికి నూరు పాళ్ళు పాటించదగినవి.

అనాటి సమాజము నందలి సాంఘిక దురాచారములను, బాల్య వివాహములు, భోగము మేళములు, సతీసహగమనము, ధనవంతుల ధాష్ట్యము, నిస్స హాయుల బలహీనతలను బలవంతులు నిర్దయగా ఉపయోగించుకోవటము. అగ్రజులనబడే వారి మనస్సులందుండే నీచ స్వభావము మొదలగు వాటినన్నింటినీ వస్తువుగా స్వీకరించి సంఘటనలుగా, సంభాషణలుగా, పాత్రలుగా మార్పు చేసి సమాజమునకు చైతన్య మందించి ఎంతో సేవ చేశారు.

వీరికన్నా ముందు వీరేశలింగం పంతులు గారు వివాహములను విధవా ప్రోత్సహించుచూ, బాలికా విద్యాభ్యాసమునకు తోడ్పాటుగా పాఠశాలలు స్థాపించి నాటకములు, ప్రహసనముల ద్వారా సంఘ సంస్కరణకు ఎంతో కృషి చేశారు. అలాగే కాలక్రమములో వస్తువును ఎన్నుకొనుట యందును పాత్ర, సన్నివేశములను కల్పించుటయందును ఎంతో వైవిధ్యము కనిపించినది. పి.వి.రాజమన్నార్. ''తప్పెవరిది''. ఆత్రేయ-''కప్పలు'', ''ఎన్.జి.ఓ.'' కొడాలి గోపాలరావు - ''చైర్మన్'' ఇలా భిన్న వస్తువులతో భిన్న భిన్న వ్యక్తిత్వములతో నాటకములు రచింపబడినవి.

పోలూరి హనుమజ్జానకీ రామశర్మ గారిచే రచించ బడిన ''భువన విజయం'', ఝాన్సీలక్ష్మీబాయి, పద్య వచన నాటకాలు, ''జనాటవిలో జవరాలు'', ''జనా రణ్యంలో జవరాలు'', ''శ్రీనాథుడు'', ''నన్నయ'', ''తిక్కన'' వంటి నాటకాలు కూడా ప్రజాదరణ పొందినవి.

నాటక రచనలో కేవలము నీతిబోధ, సంఘ సంస్కరణలే కాకుండా ఆయా అంశముల యందలి తమ ప్రతిభను చూపగల విభిన్న అంశములతో, వస్తువులతో నాటకకాలు రచింపబడినని. ఇవే కాక, విశ్వ విద్యా లయములందును, నాటకము కొరకు ప్రత్యేక విభాగములు ఏర్పడి నాటక కళా పరిషత్తులు స్థాపింప బడినవి. అనుభవజ్ఞులైన పెద్దలు ప్రతిభావంతులైన నటులు వారి రచనలతోపాటు, ఔత్సాహికులైన ప్రతిభా శాలురైన యువకవులు నాటిక రచనలు చేసిరి, సంప్రదాయయమును పాటిస్తూ వీరు సమాజము నందలి సంఘటనల మూలమునకు వెళ్ళి-వారి సృజనాత్మక శక్తిని నాటక కళకు అందించిరి. ఆంధ్ర విశ్వవిద్యాలయమున కత్తి వెంకటేశ్వరరావు, చాట్ల శ్రీరాము గారు, నటన, రచన, దర్శకత్వ బాద్యతలను సమర్థవంతముగా నిర్వహించిరి.

ఒకనాడు సినిమా రంగము నేలిన వారందరూ ముందుగా నాటక కళలో ప్రసిద్ధి పొందినవారే, తెలుగు సినీరంగమునకు ఆ విధముగా తెలుగు నాటక రంగము ''జీవగఱ్ఱ'' ''మూలధాతువు''. కాలక్రమములో చక్కగా ప్రయోగింపబడిన నాటకములచే, నటులచే ఉత్తేజితులైన వారు పెద్ద పెద్ద నగరములలో నాటక కళా పరిషత్తులను స్థాపించిరి.

విభిన్నమైన ఇతివృత్తములను తీసుకొని తరువాతి తరములకు మార్గదర్శకాలుగా ఎందరో నిలచిపోయిరి. పినిశెట్టి శ్రీరామమూర్తి, కొర్రపాటి గంగాధరరావు, మోదుకూరి జాన్సన్, ఎన్.ఆర్. నంది మొదలుగువారు విభిన్న అంశములను స్వీకరించి సమాజ సమస్యలకు తమ రచనల ద్వారా వినూత్నమైన ధోరణులలో పరిష్కారములు చూపించి, మానవత్వ విలువలను కళ్ళకు కట్టినట్లు చూపించాయి.

నాటకమనేది ఒక జీవనకళ, అందలి ఇతివృత్తములు, పాత్రలు, సన్నివేశములు జీవిత సమస్యలకు పరిష్కారము లుగా ఉండుటయే గాక మానవుని మనస్సుకు ఉల్లా సమును కూడా కల్గించవలెను. ప్రేక్షకుని ఆలోచింపజేయ వలెను. ఒక ప్రదర్శన చూసిన తరువాత మంచి అనుభూతితో పాటు సమస్యలకు తమదైన రీతిలో కనుగొనగలిగే ఆలోచనా రీతిని, ప్రేక్షకులలో కలిగించ వలెను. కేవలము ఆకర్షణ, రసోత్తత్తియే గాక ప్రేక్షకులు సమాజములో తమ పాత్రలను తాము పరిశీలించు కొనునట్లు ఉత్తేజితులను చేయవలెను. చైతన్యశీలిగా మనిషిని మార్చినపుడే నాటక రంగము సార్థకత సత్ఫలత పొందుననుట అతిశయోక్తి కాదు.

మనం విన్నదానిని కొంత కాలమునకు మర్చిపోవుటకు ఆస్కారము కలదు. కాని చూచిన దృశ్యములు మన మెదడులో చిత్రీకరింపబడుటచే, వాని ప్రభావము మన మసస్సుపై చాలా కాలము నిలిచియుండును. మహాత్మా గాంధి ఈ నాటకములలో సత్యహరిశ్చంద్ర, శ్రవణ కుమారుని నాటకములను చూచుటచే అతని మసస్సుపై అవి కల్గించిన చైతన్యముతోనే, తన తండ్రి జేబునుండి డబ్బు దొంగిలించుటను తప్పుగా తీర్మానించుకొనినాడు, దీనిని బట్టి శ్రవ్య కావ్యముల నిశ్చయంబున కన్నా, దృశ్యకావ్యములు మానవుల మనస్సులో నాటుకొని వారిలోని వివేచనా శక్తిని మేల్కలిపి చైతన్యవంతులుగా మార్చగలవని ఋజువైనది.

కావున మంచి నాటకముల ప్రదర్శన వలన మన సమాజములోని ప్రజలలో, ఆలోచనా శక్తిని పెంపొందించి చెడును కడిగివేయుటకు సమసమాజ మార్గదర్శకులుగా వారిని తీర్చిదిద్దుననుటలో ఎంతమాత్రము సందేహము లేదు. అందుకే ప్రస్తుత ప్రభుత్వం హెచ్.ఐ.వి., ఎయిడ్స్ మొదలైన విషయములను గూర్చి ప్రజలలో అవగాహన కల్గించుటకు రూపకములను (టెలిఫిల్ములను) తయారు చేసి వాటిని ప్రదర్శించుచున్నవి. విద్యలేని వారిలో ఈ దృశ్య కావ్యములైన నాటకములు ఎక్కువ ప్రభావమును

చూపించి చైతన్యవంతులుగా చేయగలవనుట ప్రత్యక్ష నిదర్శనము.

ముగింపు :

కాలగమనంలో నాటకం స్వర్ణయుగ దీప్తులనుపొంది నేడు అంధకారంలో ఆరిపోతున్న దీపం వలె మిణుకు మిణుకు మంటున్నది. సినిమాలు రాకమునుపు సమాజం లోని ప్రజలకు సాంఘిక పౌరాణిక, ఐతిహాసిక, సందేశాత్మక, వినోదాత్మకమైన నాటకాలు ఎన్నో, ఎన్నెన్నో ప్రజలను అలరించినవి. ఆనాటి ప్రజలకు నాటకాలే ఒక కాలక్షేప వినోదాత్మకమైన వస్తువు. నాటకములోని పాత్రలు, అవి చెప్పే సందేశం ఆనాటి ప్రజలకు శిరోధార్యం, నేటి సినిమాలు ప్రజలకు వినోదాన్ని పంచు తున్నాయే తప్ప, ఎటువంటి విలువలను, సందేశాలను ఇవ్వడం లేదు, కాబట్టే మానవత్వ ప్రభోదంలో నాటికాలు విశేష భూమికను పోషిస్తున్నాయి.

సినిమాలలో పోషించిన పాత్రలను తిరిగి మార్చ లేము, కాని నాటకంలో సమాచానికి అనుగుణంగా వచ్చే మార్పులను, వైవిధ్యాలను ఎప్పటికప్పుడు మార్చి ప్రత్యక్షానుభూతిని మిగిల్చేవే నాటకాలు. అటువంటి రసవత్తరమైన నాటకాలను నేడు జాతరలలోను, తిరుణాళ్ళ లోను, పండుగల సందర్భముగా, వార్షికోత్సవాలలో, స్నాతకోత్సవాలలో ప్రదర్శించబడు తున్నాయి. ఇలా కాక, ఇదివరలో లాగ నాటకాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. వీని వలన ఎన్నో కుటుంబాలు జీవనాధారాన్ని పొందుతాయి. ఉదా: సురభి నాటక కంపెనీ, తదనుగుణంగా నాటక రంగం ఎంతో అభివృద్ధి చెందింది.

నాటక రంగాన్ని అభివృద్ధి పరచడం ఏ ఒక్కని చేతిలోనో లేదు. ఇది సమాజంలోని అందరి బాధ్యత.

"ఆంగికం భవనం యస్వావాచికం సర్వవాఙ్మయం
ఆహార్యం చంద్రతారాది తంవందే సాత్వికం శివం"

ఉపయుక్త గ్రంథసూచి :

1. ఆంధ్రనాటక రంగ చరిత్ర - మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
2. భారతనాటక చరిత్ర - తెలుగు అకాడమి
3. అలనాటి నాటికలు - ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జీవనగీత - ఒక పరిశీలన

- డా॥. ఆగపాటి రాజకుమార్, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

కాళోజీ నారాయణరావు మొదట కవి. ఆయన జీవితమంతా కవిత్వంగా పరచుకుపోయిన కవి. ఒక ఉద్యమానికి, ఒక సిద్ధాంతానికి, ఒక సందర్భానికి పరిమితమైన కవి కాదు. ఏ సిద్ధాంతాల ప్రభావాల ప్రవాహాల్లో పడి కొట్టుకొని పోయినవాడు అంతకంటే కాదు. కవిత్వంలో ఎంత స్పష్టత ఉంటుందో ఆయన జీవితం కూడా అంత స్పష్టమైందే. ప్రజల సమస్యలను తన సమస్యలుగా చేసికొని, ప్రజల కష్టాలను, కన్నీళ్లను తనవిగా చేసుకొని ఆయన రచించిన "నా గొడవ"లోని కవితలు ప్రజల హృదయాల్లో మార్మోగినాయి. అయితే కాళోజీ స్వీయ కవిత రచనలతో పాటు కొన్ని అనువాదాలు కూడా చేశారు.

ఆయన చేసిన అనువాదాల్లో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఉర్దూ కవి 'ఖలీల్ జిబ్రాన్' ఆంగ్లంలో రచించిన "ది ప్రాఫెట్" గ్రంథాన్ని కాళోజీ "జీవనగీత" పేరుతో తెలుగులోకి చేసిన అనువాదం ప్రధానమైంది.

1953 డిసెంబర్‌లో "నా గొడవ" రెండో ముద్రణ ఎడిటింగ్ హైదరాబాద్‌లో ఏల్చూరి సుబ్రహ్మణ్యం గారింట్లో సాగుతోంది. ఏల్చూరి వారు అందులోని ఒకటి రెండు గేయాలు చదివి ఖలీల్ జిబ్రాన్ తత్వాన్ని బాగా ఒంట పట్టించుకున్నారే అన్నారట. అందుకు కాళోజీ- "ఉన్న సంగతి చెబుతాను, నిజంగా ఆయన ఎవరో నాకు తెలియదు" అన్నాడట నవ్వుతూ. అప్పుడు ఏల్చూరి వారు లోపలికి వెళ్లి "ది ప్రాఫెట్" పుస్తకాన్ని వెతికి తెచ్చి కాళోజీ గారికి ఇచ్చారని తర్వాత ఆ పుస్తకం ఆసాంతం చదివి, స్పందించి అనువదించే దాకా నిద్రపోలేదని, అంతేకాదు "ఖలీల్ జిబ్రాన్ రచనలతో ఎందరికో పరిచయం చేయించాను. కొందరికి పుస్తకాలు కొని యిచ్చాను. ఎందరి చేతనో కొనిపించాను. ఎక్కడ కూర్చున్నా ఖలీల్ జిబ్రాన్ ముచ్చటే. ఏ సభలో మాట్లాడిన ఖలీల్ సంగతే! ఎవరికి ఉత్తరం రాసిన ఖలీల్ గురించే!" అంటాడు కాళోజీ 'జీవనగీత' ముందుమాటలో. ఇలా కాళోజీ ఖలీల్ జిబ్రాన్ రచనలను అధ్యయనం చేయడానికి ఏల్చూరి వారి ప్రేరణే పురి కొల్పింది.

కవి, తాత్వికుడు, చిత్రకారుడు అయిన జిబ్రాన్ 1883లో లెబనాన్ దేశంలో జన్మించాడు. అతని మాతృభాష అరబ్బీ. తల్లిదండ్రుల మతానుసారంగా అతడు క్రైస్తవుడు. 1903లో అతడు అరబ్బిలో "ది స్పిరిట్స్ రెబెలియస్" అనే పుస్తకాన్ని ప్రచురించాడు. అందులో ఆయన ప్రకటించిన విప్లవ భావాల కారణంగా అతన్ని దేశం నుంచి బహిష్కరించారు. అతని పుస్తక ప్రతులన్నీ స్వాధీనం చేసుకొని కాల్చేశారు. ఈ వార్త తెలిసినప్పుడు ఖలీల్ జిబ్రాన్ పారిస్‌లో ఉన్నాడట. "భలే పని జరిగింది. రెండవ ముద్రణకు మంచి అవకాశం" అన్నాడట. తర్వాత అమెరికాలో కొద్దిరోజులు నివాసం ఉండి తరువాత ఫ్రాన్స్ వెళ్లి సంగీతము, చిత్రకళా నేర్చుకున్నాడు. మళ్ళీ 1912లో అమెరికా వెళ్ళి న్యూయార్క్‌లో స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. నలభై ఎనిమిదేళ్ళు బ్రతికిన జిబ్రాన్ 1931లో మరణించాడు. జిబ్రాన్ తన జీవితంలోని ఆఖరి ఇరవై ఏండ్లు అమెరికాలో గడిపాడు.

జిబ్రాన్ మొదట్లో తన గ్రంథాలను అరబ్బీలో వ్రాసి, ఆ తరువాత ఇంగ్లీషులో అనువదించేవాడు. తర్వాత కాలంలో ఇంగ్లీష్‌లోనే రాశాడు. సాహిత్యంలోని అన్ని శాఖలలోనూ కృషి చేశాడు. అతని పుస్తకాల పేర్లు చూస్తే అతని గొప్పదనం తెలుస్తుంది. స్పిరిట్స్ రెబెలియస్, మూడ్ మాన్, సానేడ్ అండ్ ఫోమ్, దివాన్‌డరర్, గార్డెన్ ఆఫ్ ది సెల్ఫ్ పొర్ట్రెట్, ది వాయిస్ ఆఫ్ ది మాస్టర్, ది బ్రోకెన్ వింగ్స్, జీసెస్ ది సన్ ఆఫ్ మాన్, ఎర్త్‌గాడ్స్, టియర్స్

అండ్ లాస్టర్, థాట్స్ అండ్ మెడిటిషన్, ది సీక్రెట్స్ ఆఫ్ ది హార్ట్, ఫోర్ రన్నర్ ఇంకా ఎన్నో వ్యాసాలు, వచన గేయాలు, సాహిత్య గోష్టుల్లో చేసిన ప్రసంగాలు, మిత్రులకు రాసిన ఉత్తరాలు, సాహిత్య పత్రికల సంపాదకీయాలు అనేకం. కవిగా, చిత్రకారుడుగా జిబ్రాన్‌కు ప్రపంచ ఖ్యాతి లభించింది. తను బ్రతికి వున్న నాటికే ప్రపంచంలోని పాతిక భాషల్లో అతని రచనలు స్థానం సంపాదించుకున్నాయి.

ఖలీల్ జిబ్రాన్ చాలా చిన్న వయస్సులోనే "ది ప్రాఫెట్" గ్రంథాన్ని అరబ్బీ భాషలో రాసి తన తల్లికి వినిపించాడు. తల్లి 'బాగానే ఉంది కానీ ఇంకా పసిగానే ఉంద'న్నదట, అలా అనేసరికి మరోసారి రాసి వినిపించాడట. అయినా ఆమె సంతృప్తి చెందలేదు. అలా పదేళ్లపాటు ఏడుసార్లు రాశాక, ఏడోసారి విని కావ్యం బావుంది అని తల్లి తృప్తిపడింది. ఖలీల్ సంతోషపడ్డాడు. అప్పుడు అరబ్బీ భాషలో "ది ప్రాఫెట్"ను ప్రచురించాడు. తదుపరి తనే ఈ రచనను 1923లో ఆంగ్లంలోకి అనువదించాడు. తర్వాత కాలంలో ఈ గ్రంథం ఎన్నో భాషల్లోకి అనువాదం పొందింది. ఇంగ్లీష్‌లో వందలసార్లు వెలువడింది. ఒక్క ఇంగ్లీష్‌లోనే "ది ప్రాఫెట్" ప్రతులు 20 లక్షలకు పైగా అమ్ముడుబోయి ప్రతివారం 5,000 ప్రతులు అమ్మబడుతున్నాయని అమెరికా ఆంగ్లపత్రిక 'టైం' 13-8-1965 కథనం. ఈ కావ్యం అంత పరిపక్వత చెందడానికి అతని తల్లే కారణం. నల్లని అట్ట కలిగిన ఈ గ్రంథాన్ని ఖలీల్ జిబ్రాన్ క్రైస్తవ దేవాలయాల్లో, చర్చీల్లో తనే స్వయంగా పఠనం చేసేవాడు. అందువల్లనేమో మహా భారతానికి పంచమవేదం అనే పేరు వచ్చినట్టు ప్రాఫెట్‌కు The Little Black Book, Bible Black Book అనే పేర్లు వచ్చాయి. 1924 నుండి 1931 వరకు జిబ్రాన్‌తో సన్నిహిత పరిచయం కలిగిన 'బార్బరాయంగ్' అనే అమెరికన్ రచయిత్రి This Man from Lebanon పేరుతో జిబ్రాన్ జీవిత చరిత్ర రాసి సాహితీ ప్రపంచంలో గొప్ప ఖ్యాతిని గడించింది. ఈ పుస్తకం చదివితే జిబ్రాన్ ఎంత గొప్పవాడో తెలుస్తుందంటాడు కాళోజీ.

కాళోజీ నారాయణరావు 1953 నుండి 1968 వరకు అదేపనిగా ఖలీల్ జిబ్రాన్ రచనలు చదువుతూ, ప్రచారం చేస్తూ, అనువదిస్తూ వచ్చాడు. అయితే ఈ అనువాదం అనేక పర్యాయాలు చేయాల్సి వచ్చింది. ఎందుకంటే ఈ పుస్తకం మొత్తం తెనుగయిన తర్వాత రాతప్రతి పోయింది. మళ్లీ రాయడం, మిత్రులకు వినిపించడం, అప్పుడప్పుడు చేసిన అనువాదాలకు లెక్కలేదు, పోగొట్టుకోవడానికి హద్దులేదు. ఇలా పదిహేనేండ్లపాటు ప్రయత్నించి చివరికి బ్రతుకుబాటగా "ది ప్రాఫెట్" అనువదించాడు. దీనికి "ఖలీల్ పాట" అని కూడా పేరు పెట్టాడు కానీ చివరికి శశాంక "జీవనగీత" అని నామకరణం చేశాడు. అదే పేరు స్థిరపడింది. ఇలా కవీ, అనువాదకుడు ఇద్దరు అనేక పర్యాయాలు ఈ కవితను రచించడం కాకతాళీయమే అయినా అది పరిపక్వత చెందడానికి ఉపయోగపడిందని చెప్పవచ్చు. జీవన గీతను 1968లో యువభారతి హైదరాబాద్ వారు ప్రచురించారు. ఈ కావ్యం కాళోజీ ద్వారా తెలుగులోకి రావడం తెలుగు పాఠకుల అదృష్టం.

ఈ కావ్యంలో 25 మంది విభిన్న వ్యక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు అందించడం జరుగుతుంది. జీవనగీతలో మొత్తం ఖండికలు 27. కావ్య సంప్రదాయాన్ని అనుసరించి మొదటి ఖండిక ఉపోద్ఘాతం గాను, చివరి ఖండికను ఉపసంహారం గాను మిగతా ఖండికలు ఉద్బోధ గాను సాగినవి. కవిత ప్రారంభమైనప్పటి నుంచి చివరి దాకా ఎలాంటి శీర్షికలు లేవు కానీ ఇందులో అనేక అంశాలు ప్రస్తావనకు వస్తాయి. ప్రేమ, వివాహబంధం, దానం, సంతోషం, దుఃఖం ఇలా మానవ సౌధానికి సంబంధించిన విషయాలు వివరించడం జరిగింది.

ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ప్రాఫెట్ గ్రంథాన్ని కాళోజీ కంటే ముందు ఎవరూ తెలుగులోకి అనువదించే సాహసం చేయలేదు. ప్రథమంగా కాళోజీ ఆ సాహసం చేశాడు. ఈ గ్రంథాన్ని తనదైన పద్ధతిలో మామూలు వ్యావహారిక భాషలో కాకుండా సరళ గ్రాంధికంలో ఈ అనువాదం కొనసాగింది. తన అనుభూతులకు మాటలు

తొడిగి అద్భుతమైన రూపకల్పన చేసి సూటిగా పాఠకుల గుండెల్లోకి దూసుకుపోయే విధంగా ఈ అనువాదం కొనసాగింది. ఈ గ్రంథానికి ఉత్తమ అనువాద గ్రంథంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి పురస్కారం కూడా లభించింది.

ప్రాఫెట్‌లో కథను పరిశీలిస్తే ఇందులో ప్రధాన పాత్ర ఆల్ ముస్తాఫ. అతడు పండెండేళ్ళ క్రితం అర్ఫలీజు అనే నగరానికి వచ్చి అక్కడి ప్రజలతో ఆత్మీయంగా కలిసి మెలసి జీవనం కొనసాగించాడు. అయితే పండెండేళ్ళ తర్వాత అతని కోసం వచ్చే ఓడ కొరకు ఎదురు చూస్తుంటాడు. ఆ ఓడ వచ్చిన తర్వాత తాను తిరిగి ద్వీపానికి వెళతాడని పాఠకులకు కావ్యం ద్వారా తెలుస్తుంది. అయితే ఇన్ని సంవత్సరాలు ప్రజలతో తనకున్న ఆత్మీయ అనుబంధం కారణంగా తనకు వెళ్లడం ఇష్టంలేదు. ప్రజలు కూడా అతడు వెళ్ళిపోవడాన్ని నిరాకరిస్తారు. కానీ పోవుట తప్పదు. అయితే ప్రజలతో గడిపిన గత స్మృతులు దాయలేక ఆయనలో చెలరేగిన భావాల్ని ఇలా వ్యక్తం చేశాడు.

"నేనిప్పుడు పోవుటెట్లు-వెత చెందక స్థిమితముగా
ఇచట నుండి పోవుటెట్లె? - పోజాలను
గాయపడిన గుండియతో - పురము వదలి పోజాలను
ఈ పురమును చుట్టియున్న - గోడల్లోనే గడిపిన
నానా బాధల దినాలు, ఏకాంతపు-నా రాత్రులు
ఎడతెగనవి
తన బాధను తన ఒంటరి తనమును
ఎడబాయుచు మిడుకని వాడెవ్వడు?"

- అని ప్రశ్నించుకుంటూనే

"చిట్లి పగిలిపోయినట్టి
నా గుండియ తునకలెన్నొ
ఈ నగరపు వీధులనే వెదజల్లితి"నని

ఆకలిదప్పుల మంటల అమృతాన్నాస్వాదించిన హృదయాన్ని విడిచిపెట్టి వెళ్ళుచుంటినన్నాడు ఆల్ ముస్తాఫ. అయినా నేనాగలేను పోవుటయే తప్పనిసరి అని తన వేదనను చెప్పుకోవడం అతని మానసిక సంవేదనలను తెలుపుతుంది. అప్పుడు అక్కడున్న దేవస్థానంలోని వాళ్ళు అతని దగ్గరకు వచ్చి విలపించారు. "మా అందరి నడుమ నేడు వాస్తవమగు నీ ఉనికిని - అప్పుడే స్మృతిగా మార్చకు"మని వేడుకున్నారు.

"నీవే చైతన్యముగా మాలో ప్రసరించినావు.
నీ నీడలు వెలయించెను మా మోములలో వెలుగులు
మేము నిన్ను ప్రేమించుట - ఇంత అంతని కాదు
మా ప్రేమకు హద్దులేదు, మా మమతకు అంతు లేదు"

అంటూ ఈ క్షణం దాకా అది మూగగా ఉందని బయటికి కనపడక అది లోలోపల దాగున్నదని, కాని ఈనాడు మా మమతల పావురాలై నీ ముందర వచ్చివాలి బావురుమని ఏడుస్తోందని బొళ్ళుమని ఏడుస్తూ ఆల్ ముస్తాఫకు చెప్పారు.

అంతేకాదు ఆ నగర ప్రజలు ఆల్ ముస్తాఫతో ఇలా చెప్పుకున్నారు-

"అలజడితో నిండియున్న మా పగళ్లు మా దిగుళ్ళు
అధ్యయనము జేసినావు
రాత్రులందు నిద్రలోని మానవులు, మా యేడ్పులు
నిద్రపోక ధ్యానముతో విన్నాడవు పనిపెట్టుక
మమ్ము మాకు చూపింపుము"

అని అర్ఫలీజు పట్టణ ప్రజలు ఆల్ ముస్తఫను అడిగారు. ఈ ఆల్ ముస్తఫ తానుండిన కాలమునకు తానే ఉషస్సైనవాడు. అప్పుడు ఆల్ ముస్తఫ ఇలా అంటాడు.

"అర్ఫలీజు వాసులారా
మీ మనస్సులందు లేనిదేదీ చెప్పలేను నేను
నేను చెప్పగలిగినది మీ మనసుల మసలునదే!"

చెబుతానన్నాడు. ఇక్కడ ఒక గురువు కాని, తాత్వికుడు కాని ఒక విషయాన్ని చెబుతున్నాడంటే లేనిది ఎవ్వరూ చెప్పరు, ఉన్నదే దర్శింపజేస్తాడంతే. ఇక్కడ ఆల్

ముస్తఫ కూడా కాలజ్ఞాని, తత్త్వవేత్త. అందుకే మీ మనస్సులలో లేనిదేది చెప్పలేనన్నాడు. మీ మనస్సులలో మెదిలే సంఘటనల్నీ, విషయాల్నీ నేను బహిర్గతం చేస్తానంతే అన్నాడు. అయితే పట్టణంలోని ప్రజల్లో ఎవరో ఒకరు ఒక విషయాన్ని అడగటం, ఆల్ ముస్తఫ దానికి సమాధానం చెప్పడం ఇలా అనేక విషయాలు ప్రస్తావనకు వస్తాయి.

ఆల్‌మిత్ర అనే సన్యాసి ప్రేమ, వివాహబంధం గూర్చి అడిగింది దానికి ఆల్ ముస్తఫ వివరణ ఇలా వుంది.

''ప్రేమ యిచ్చునది ప్రేమయే - ఇవ్వలేదు ఇంకేదియు
ప్రేమ తీసికొను ప్రేమయే - తీసుకొనదు ఇంకేదియు
ప్రేమ వశము చేసుకొనదు - వశము కాదు తానెప్పుడు
ప్రేమకు ప్రేమయే చాలును''

ప్రేమ ప్రేమను ఇస్తుందే తప్ప ఇంకేదాన్ని ఇవ్వదు. ప్రేమిస్తే ప్రేమే పుడుతుంది. ద్వేషిస్తే ద్వేషమే పుడుతుంది. ప్రేమలో వ్యక్తి వ్యక్తిత్వం లుప్తమవుతుంది. ఏ ఇద్దరి వ్యక్తుల మధ్య గాని పరస్పర అవగాహన ఏర్పడకపోతే అక్కడ ప్రేమ ఏర్పడదు. అందుకే ఇద్దరు వ్యక్తుల మధ్య ఎక్కువ-తక్కువలు అనే బేధం లేకుండా ఉన్నప్పుడే ప్రేమకు తావుంటుంది. ప్రేమ ప్రేమనే తీసుకుంటుంది. ప్రేమ ప్రేమనే ఇస్తుంది, అంతేకాదు ప్రేమ దేనికి వశం కాదు. ప్రేమకు ప్రేమే సరిపోతుందని అంటాడు ఆల్ ముస్తఫ.

వివాహ బంధం గురించ ఇలా :

దాంపత్య బంధంలో ఉన్నంత రసానుభూతి సన్యాస మతంలో ఉండదు. వివాహబంధంలో అనుభూతులు, అనుబంధాలు ఉంటాయి. వివాహ బంధం విడదీయరాని బంధం, విడదీయలేని బంధం. భార్య, భర్త పేరుకు మాత్రమే ఇద్దరు. కాని వాళ్ళిద్దరూ ఒక్కటే అంటూ

"సంతసంబుగ ఎల్లవేళల కలసి ఆడుడు కలసి పాడుడు
ఎవరి వ్యక్తిత్వంబు వారు నిలుపుకొనుడు."

భార్యాభర్తలు ఎవరి వ్యక్తిత్వం వారు నిలుపుకోవాలి. అలా ఉండాలంటే భార్యభర్తలు ఒకరిపట్ల ఒకరికి గౌరవంతో పాటు పరస్పర సహకారం ఇచ్చి పుచ్చుకోవాలి. అలా లేనియెడల వారి వివాహబంధాన్ని పోగొట్టు కుంటారు. అందుకే ఆల్ ముస్తఫ ఎవరి వ్యక్తిత్వం వారు నిలుపుకొండి అన్నాడు.

వారి వివాహబంధం నిలబడాలంటే భార్య అభి ప్రాయాన్ని భర్త, భర్త అభిప్రాయాన్ని భార్య గౌరవించు కోవాలి. ఒకవేళ ఏదైన సమస్య ఏర్పడితే ఏ పద్ధతిని అనుసరిస్తే ఎక్కువ ప్రయోజనం ఉంటుందో ఆ పద్ధతికే ఇద్దరూ ఓటువేసి అనుసరించాలి. దీన్ని సమర్థించడానికి చక్కని రెండు దృష్టాంతాలు చెప్పాడు.

''వీణ తీగలు రాగమందున ఏకమయ్యును
దేనికయ్యది వేరువేరుగ నిలచి ఉండును
స్వీయ కంపనము తోడ పలుకును''

వీణలో తీగలు రెండు వేరువేరుగా ఉంటాయి కాని రాగంలో ఏకత్వాన్ని పొందుతాయి. అలాగే ఆలయ స్తంభాలు ఎప్పుడూ వేరువేరుగా ఉంటాయి. కాని మంట పాన్ని తలదాల్చడంలో ఒక్కటిగానే కలిసి వుంటాయి. అలాగే భార్యాభర్తలు తమ వ్యక్తిత్వాలను తాము నిలుపు కోవడమే కాక ఏదైనా కర్తవ్యాన్ని నిర్వహించడంలో కలిసి కట్టుగా ఉండాలని ఆల్ ముస్తఫ ద్వారా కవి చక్కగా చెప్పించాడు.

కాయకష్టం గురించి చెప్పమని ఒక కాపుబిడ్డ అడిగింది. అప్పుడు ఆల్ ముస్తఫ చెప్పిన మాటల వల్ల శ్రమ అంటే ఎంత సౌందర్యభరితమైనదో తెలుస్తుంది. నిజమైన సౌందర్యం పని చెయ్యడంలోనే ఉందని చాలా సహేతుకంగా నిరూపించాడు.

''ప్రేమ గలిగి శ్రమకోర్చిన సమయమందు మానవుడు
తనతోనే కాదు, తానితరులతోనే కాదు
సర్వేశ్వరునితో సహితము సంసిద్ధుడై పోవును
శ్రమయనగా సాకారంబైన ప్రేమ''

ప్రేమతో ఏ పని చేసినా దాని ఫలితాన్ని అనుభవించే వారు పొందే తృప్తికన్నా ఆ పని చేసినవారే అధిక తృప్తిని పొందుతారని ఆల్ ముస్తఫ చెప్పిన తీరు అద్భుతం. ఏదైన అంకితభావంతో చేస్తే అందులో ఉన్న ఆనందమే వేరు అంటాడు. నిరసన భావంతో చేసిన ఏదైన, అది అమృతమైనా విషం అవుతుందంటాడు.

"నిరసన భావంబుతోడ వండిన వంటంత - చేదు చేదై పోవుటె కాదు
మొదటి బుక్క తినకముందే తినువానికి ఆకలినే చంపివేయును
అనిష్టముతో ద్రాక్షరసము పిండ....
మీ అనిష్టమే విషమై చిలుకును
ఆప్యాయత లేక అచ్చము గంధర్వుల వోలె
మీరు గానము చేయుట
వినువారల చెవులు గడియ పడవేయుట"

నిరసన భావంతో ఇష్టంలేక వంట వండితే అది తినక ముందే చేదైపోయి తినేవారికి ఆకలిని చంపేస్తుంది. అయిష్టంతో ద్రాక్షరసం పిండి అమృత రసమని చేతికందించినా అది తాగే విషమే అవుతుంది. ఆప్యాయత లేక గానగాంధర్వం ఆలపించినా అది వినేవాళ్ళకు చెవులలో సీసం పోసినట్లు ఉంటుందని కవి విశ్లేషణాత్మకంగా చెప్పాడు. అందుకే అంకితభావంతో చేసిన పనే నాణ్యంగా ఉంటుంది, అంకితభావం లేకపోతే ఎటువంటి పనైనా చెడిపోతుంది. ప్రీతితో కూడిన శ్రమ అసలైన సౌందర్యమని కవి భావన.

అర్ఫలీజు పట్టణం నుంచి వచ్చిన ఒక స్త్రీ- సంతోషం - దుఃఖాలు గురించి అడుగగా, ఆల్‌ముస్తఫ ఇలా బదులు ఇచ్చాడు-

"మీ సంతోషము ముసుగును తొలగించిన మీ దుఃఖము అవుతుంది. మీ నవ్వులు సంతోషాలు పొంగి పొర్లే బావికి గల ఊటలన్నీ గతంలో మీ దుఃఖం ఒనగూర్చిన కన్నీళ్ళే. ఇంకా ఎక్కువగా మీ దుఃఖం మిమ్మల్ని తొలిచే కొద్దీ సంతోషము నింపుకునే మీ పాత్రతో పెరుగుతూనే ఉంటుంది" అంటే సంతోషాన్ని అనుభవించ డానికి అర్హత మరింత పెరుగుతుందని భావం.

ఆల్ ముస్తఫ మీకు దుఃఖం కలిగినప్పుడు ఏ మాత్రమూ బాధపడ వద్దంటాడు. ఎందుకంటే ఇప్పుడు దుఃఖపడుతున్నామంటే సమీప భవిష్యత్‌లోనే సంతోషం రాబోతుందని అర్థం. దీన్ని ఉదహరణతో నిరూపించాడు. ఇందుకు నిదర్శనంగా మట్టికుండ, వెదురుబొంగును గురించి ఇలా చెపుతాడు-

"వామి మంటల్లో కాలుట చేతనే కద
మట్టికి మధురసము నింపుకొను 'పాత్ర'త చేకూరుట
ప్రాణానికి హాయిగూర్చు మురళి రూపు దాల్చుటకై
వెదురు తాను ఎదనిండ కత్తికాట్లు పోట్లు తిన్నదె కద!
సంతోషము కలినప్పుడు మీ హృదయపుటంచుల
సందుల తేరిపార జూచుకొనుడు
ఇదివరలో మీ దుఃఖానికి కారణమైనదే ఇపుడు
సంతోషము చేకూర్చుచు ఉండెననుట తెలియవచ్చు"

కుమ్మరివామిలో మట్టికుండ కాలటం చేతనే కదా ఆ మట్టికి మధుర రసం నింపుకునే అర్హత కలిగింది. వెదురుబొంగు తాను కత్తిపోట్లకు గురై దాని ఎదపై రంధ్రాలు పడటం వల్లనే కదా అది మురళిగా మారి అంత మధురమైన స్వరాలాపానికి అర్హత పొందినది. కాబట్టి సంతోషం కలిగినప్పుడు ఎవరంతకు వారు మీ హృదయపుటంచుల సందుల తేరిపార చూసుకుంటే ఇంతకు మునుపు వాళ్ళ దుఃఖానికి కారణమైనదే ఇప్పుడు వాళ్ళ సంతోషానికి కారణమైందని ఖచ్చితంగా తెలుస్తుంది. అందువలన దుఃఖం, సంతోషం ఒకదాని వెంట ఒకటి మానవ జీవితంలో కావడి కుండలుగా వస్తాయని, సుఖం వచ్చినప్పుడు పొంగడం, దుఃఖం వచ్చినప్పుడు కుంగడం రెండూ తగదని హితబోధ చేశాడు. ఇలా 25 అంశాలపై ఆల్ ముస్తఫ, అర్ఫలీజు ప్రజలకు తాత్విక బోధన చేశాడు.

అనంతరం ఆల్‌మిత్ర, ఆల్‌ముస్తఫకు వీడ్కోలు పలుకుతూ ఇలా అంటాడు.

"నేటికి మా ఈ పగలు ధన్యము
నేడు మా ఈ స్థలము ధన్యము
మాతో ఇంతగా ముచ్చటించిన
మేటి నీదగు ఆత్మ ధన్యము!" అని పలికిన అల్‌మిత్రా మాటలకు అల్ ముస్తఫ బదులిస్తూ ఇలా అంటాడు-

"నేనా పలికినందింతకు, నేనేనా?
కానా! నేనును వినువాడను ఒకడ కాన!"

అంటూ అక్కడి ప్రజలను సంయమనం పరుస్తూ తాత్విక ఆలోచనతో కూడిన ప్రవచనాలను బోధిస్తాడు.

అంతలో అతడు దేవాలయ పరిసరాలు విడిచి సాగరతీరాన ఉన్న ఓడవైపు ముందుకు నడిచాడు. అందరూ అతని వెంట నడిచారు. అల్ ముస్తఫ ఓడ ఎక్కి పైభాగంలో నిలిచి తీరాన గుమిగూడిన ప్రజలను చూసి ఇలా అంటాడు-

"మేము దేశ దిమ్మరులము
ఎల్లప్పుడు మరింత ఒంటరి
మార్గమునకై వెదుకుచు నుందుము
ఓరోజు గడిపిన చోట మేము
మరో రోజును మొదలు పెట్టము"

మేము మర్రివంటి వృక్షాలకు విత్తనాల గింజలం. మేము అక్కడక్కడ వెదజల్లబడతాం. తనలాంటి వాళ్ళు ఈ విశ్వంలో అక్కడక్కడ ఉంటారని, వాళ్ళు జ్ఞానతత్వాన్ని బోధిస్తూ దాని వ్యాప్తి కొరకై పాటుపడతారని భావం.

అంతేకాదు అల్ ముస్తఫ ఇంకా ఇలా అంటాడు-

"మీ మధ్యన నే గడిపిన రోజులు
చాలా తక్కువ, మీతో నే పలికినట్టి
మాటలు అంతకు తక్కువ
అయిన నేమి
నా మాట మీ చెవులయందు సన్నగిల్లిన
నా ప్రేమ మీ స్మృతి నుండి మాయమైనా
తక్షణమున నేను తిరిగి వచ్చెదను"

అల్ ముస్తఫ అర్ఫలీజు ప్రజలతో గడిపినది కొద్ది రోజులే అయినా వాళ్ళకు అన్ని విషయాలు చెప్పాడు. ఒకవేళ అతను చెప్పినది ప్రజలు మరిచిపోతే తిరిగి నేను వచ్చి మళ్ళీ చెబుతానన్నాడు. మరపు మానవ నైజం కనుక గురువులు చెప్పిన దాన్ని శిష్యులు మననం చేసుకుంటూ ఉండాలి. అతడు నేను తిరిగి వస్తానంటూ ఇలా పలికాడు-

"కడలి పోటుతోడ కూడి
చావు నన్ను దాచినను
మితిమీరిన మౌనము
నన్నావరించుకొని ఉన్నను
మరోసారి మీ బుద్ధిని
ఆరయుదు నే తప్పక
నా వెదుకులాట వ్యర్థమెపుడు కానేరదు
మీ బుద్ధిని తప్పకుండా తెలుసుకుంటాను.
నా అన్వేషణ ఎప్పుడూ వ్యర్థం కాదు
మనిషి అవసరాలు మారు
కాని మారదతని ప్రేమ
ప్రేమయే తన అవసరాల
తీర్చి తృప్తి పరచవలెనను
ఆతని వాంఛయును మారదు"

మనిషి అవసరాలు మారుతుంటాయని, కాని అతని ప్రేమ మాత్రం ఎన్నటికీ మారదని ఖచ్చితంగా చెప్పాడు.

అంతేకాదు మీలో ఉన్నట్టి అనంతత్వ ఆసీమత్వ, నిత్య విరాటత్వమే అని
మీరందరూ ఆ విరాట్ పురుషుని కాయములోని స్నాయువులు మాత్రమేనని
ఆతని రాగాలాపన యందలి ధ్వని రహితంబగు స్పందన
మాత్రమేను - మీ సంగీతము సాంతము
ఆ విరాట్ పురుషుని యందుండుట చేతనే మీరు కూడా అనంతులు

ఆ విశ్వరూప సందర్శనమందె-నేను మిమ్మందర దర్శించితి
మిమ్మందర ప్రేమించితి

మానవులలోనే అనంతత్వాన్ని, నిత్య విరాటత్వాన్ని దర్శించాడు ఆల్ ముస్తఫ. విరాట్ పురుషునిలోనే మానవులు ఉంటారు. కనుక వాళ్ళు కూడా అనంతులు. విశ్వరూప సందర్శనంలోనే ప్రజలందరిని దర్శించాను. ప్రజలందరిని ప్రేమించానని చెప్పి మీకు 'శుభంబగు గాక" ఓ అర్ఫలీజు వాసులారా! ఇక పోవు చుంటిని నేను ఈరోజు. ఇంతటితో ముగిసినది అని చెప్పాడు ఆల్ ముస్తఫ. వెంటనే నావికులు ఓడకు కట్టిన పగ్గాలు విప్పేశారు. జనమంతా ఒకే గుండే కలిగినట్లుగా గుండె పగిలినట్లు గొల్లుమన్నారు. ఆ ఏడుపు సంజె మబ్బులలో కలిసిపోయింది. దాని ప్రతిధ్వని కూడా వీడ్కోలు బాజా సముద్ర తరంగాలపై ఆడసాగింది.

ఈ విధంగా ఖలీల్ జిబ్రాన్ ఆల్ ముస్తఫ ద్వారా చెప్పిన జీవన తాత్వికాంశాలను, జీవన సత్యాలను కాళోజీ నారాయణరావు జాగ్రత్తగా అనువదించారు. అయితే రాచమల్లు రాంచంద్రారెడ్డి జీవనగీతపై ఘాటైన విమర్శ చేసినా, కోవెల సుప్రసన్నాచార్యులు ఇంగ్లీష్ గ్రంథం చదువని వారు, తెలుగు మాత్రమే చదివిన వారు తమ ఎదుట జీబ్రాన్ భావ పరంపరను సాక్షాత్కరించుకోగలిగితే ఈ రచన సార్థకమౌతుంది అని అభినందనలు తెలిపినా, ఏది ఏమైనా జిబ్రాన్ కవితా మాధుర్యాన్ని తెలుగువాళ్ళకు రుచి చూపించిన కాళోజీ ధన్యుడు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జోగులాంబ గద్వాల్ జిల్లా క్షేత్ర సాహిత్యం

– సి. శ్రీనివాసులు, పరిశోధక విద్యార్థి

మన దేశములో మత వికాసానికి శిల్ప చరిత్రకు ఎంతో ప్రాముఖ్యత కలిగిన పుణ్యక్షేత్రాలు, అందమైన దేవాలయాలు చాలా ఉన్నాయి. వీటిలో బౌద్ధ, జైన, వైదీకమతాలకు చెందిన గుహాలయాలు, శిల్ప నిర్మాణాలు ఉన్నాయి. ఇంతవరకు దొరాకిన ఆధారాలను బట్టి బౌద్ధ నిర్మాణాలు క్రీ.పూ. 3వ శతాబ్దం నుండి, వైదిక నిర్మాణాలు క్రీ.శ.4వ శతాబ్దం నుండి ప్రాచుర్యంలోకి వచ్చాయి. దక్షిణాపథాన్ని పాలించిన శాతవాహనులు, ఇక్ష్వాకులు చాలావరకు వైదిక మతాన్ని అనుసరించినప్పటికీ ఆ కాలంలో బౌద్ధ గుహాలయాలను, స్తూపాలను ఆదరించారు. ఆ కాలపు వైదిక నిర్మాణాలు (కట్టడములు) కనిపించలేదు. ఇటీవలన నాగార్జున కొండ తవ్వకాలలో హారితివిగ్రహము బయటపడటంతో ఇక్ష్వాకుల కాలంలో వైదీకుల ఆలయాలు కూడా ఉండినట్లు తెలుస్తుంది. ఉత్తర భారతదేశంలో 4వ శతాబ్దంలో గుప్త చక్రవర్తులు, దక్షిణాపథంలో 6-7 శతాబ్దాలలో పల్లవులు, బాదామీ చాళుక్యులు వైదిక మతోద్ధారణకు కంకణం కట్టుకున్నారు. వారి కాలంలోనే వైదిక మతంలోని అన్ని శాఖలకు సంబంధించిన దేవాలయాలు వెలిశాయి. బాదామీ చాళుక్యుల నిర్మాణాలు బీజాపురం జిల్లా మొదలైన కన్నడ ప్రాంతాల్లోనే కాక తెలంగాణలోని అలంపురం, సంగమేశ్వరం మొదలైన చోట్ల కూడా కనిపిస్తున్నాయి. ఈ వంశీయుల కట్టడాలు ఎంతో గొప్పవని ఈ క్షేత్రాన్ని సందర్శించిన విదేశీ విద్వాంసులు ప్రశంసించారు.

అలంపూరు దేవాలయాలు శ్రీశైలం ప్రాజెక్టులో జల సమాధి కాకుండా పరిరక్షించినవాడు, ఇక్కడి శిల్ప సంపద, చరిత్ర పురాతత్వ విషయాలను పరిశోధించి ప్రపంచానికి తెలియచెప్పినవాడు, ఆరు వందల ఏళ్ళ తర్వాత, జోగుళాంబా దేవి నూతన ఆలయం పూర్వం ఉన్నచోటనే నిర్మించడానికి మూలకారకుడు, కవి, పండితుడు, వక్త, సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు, చరిత్ర శాసన పరిశోధకుడు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత.కీ॥శే॥ గడియారం రామకృష్ణగారు 1956 నాటి మొదటి ముద్రణకు 2005 నాటి రెండవ ముద్రణకు రాసిన పీఠికల సారాశం ఇలా వుంది. అలంపూరులో చరిత్రపూర్వయుగానికి చెందిన అవశేలతో పాటు క్రీ.శ.6వ శతాబ్దం నుండి 12వ శతాబ్దం దాకా భారతీయ వాస్తు, శిల్పాల్లో జరిగిన పరిమాలను తెలిపే చాలా ఆలయాలు కూడా వున్నాయి. క్రీ.శ. 7 నుండి 16వ శతాబ్దం వరకూ దక్షిణాపథాన్ని పాలించిన రాజవంశాల శాసనాలు, వైదిక మతశాఖలు, అంతశ్శాఖలకు చెందిన దేవతామూర్తులు, తాంత్రికోపాసకుల ప్రతీకలు వున్నాయి. ఈ అలంపురము జోగుళాంబ గద్వాల జిల్లాలో వుంది. ఉత్తర వాహిని తుంగభద్రా తీరంలోవున్న ఈ క్షేత్రాన్ని దక్షిణకాశి అని పిలుస్తారు. ఈ గ్రామాన్ని ప్రస్తుతం అలంపురు అంటున్నారు. శాసనాలలో హలంపుర, హతంపుర, అలంపురం అని స్థల పురాణంలో హేమలాపురం అని గ్రామం వ్యవహరించబడింది. ఉర్దూ రికార్డులలో అల్పూరు, అలంపూరు పేర్లు రాయబడి వున్నాయి. దీనికి ఈ పేరు ఎలా వచ్చిందో చెప్పడానికి తగిన ఆధారాలు కనిపించవు. మూడవ శతాబ్దంలో ఇక్ష్వాకు వంశీయుడైన ''రుద్ర పురుషదత్తుని'' నాలుగో రాజ్య సంవత్సంలో వేయించబడిన శాసనం, 'నడుకసిరి' అనేవాడు తన ఆయుష్యు పెరగడం కోసం భగవంతుడైన హలంపురస్వామికి కొంత భూమిని ధారాదత్తం చేసిన విషయం తెలుపుతోంది. ఇందులోని హలంపురమే అలంపురం కావచ్చు. అదే సరియైనదయితే మూడవ శతాబ్దం నాటికి ఈ గ్రామం హలంపురంగా ప్రసిద్ధి పొందివుండిందని చెప్పవచ్చు.

అలంపురమే తరువాత శాసనలలో హతంపురంగా మారి అలంపురమై వుండవచ్చు. లేక గ్రామ దేవత అయిన ఎల్లమ్మ పేరుతో ఎల్లమ్మపరంగా వుండి రానురాను అల్లంపురం, అలంపూరుగా మారి ఉండవచ్చు. స్థల పురాణంలోని హేమాలపురం, ఎల్లమ్మపురం అనే మాటకు సంస్కృతీకరణమై వుంటుందనటంలో సందేహం లేదు. అలంపూర్‌కు మైళ్ళ దూరంలోని ఉండవెల్లిలో ఈ రోజుటికీ 'హేమల' లనే పేరుతో కిరీటం ధరించిన ఒక శిరస్సు మాత్రం పూజించబడుతోంది. ఈ హేమలా దేవాలయం ఇటుకతో సంపద్ధతిలో కట్టిన విమానముతో ఉండి తన ప్రాచీనతను చాటుకొంటోంది. తెలంగాణలో అమూల్య మైన సాహిత్య సంపదగల జిల్లా జోగులాంబ గద్వాల్. ఎందుకంటే గద్వాల్ సంస్థానం తన సాహిత్య సేవలో యావద్భారతదేశం దృష్టిని ఆకర్షించింది. ఎందరో కవి పండితుల్ని ఆదరించింది. కవుల గ్రంధాలను ప్రచురించి వారిని ప్రోత్సహించింది. కేవలం సాహిత్యమే కాకుండా సంగీత, నాటక ప్రక్రియల్ని ఆదరించింది. దేశంలో ప్రసిద్ధ సంస్థానమైన మైసూరు వాళ్ళ గద్వాల సాహిత్యసేవను చూసి ఆశ్చర్య పడ్డారు. సి.పి.బ్రౌన్ తాను చేపట్టిన నిఘంటు నిర్మాణానికి ప్రాచీన గ్రంథాల సేకరణకు, ముద్రణలకు గద్వాల సంస్థాన ప్రభువు సీతారామ భూపాల్ సహాయాన్ని అర్థించాడు. సి.పి.బ్రౌన్ పుస్తకాల ప్రచురణకు తనవంతు సహాయాన్ని ఇచ్చి బ్రౌన్‌ని ప్రోత్సహించారు. ఈ విధంగా తెలుగు సాహిత్య చరిత్రలో గద్వాల శాశ్వతంగా నిలిచిపోతుంది.

జోగులాంబ గద్వాలజిల్లా దేశంలోని అష్టదశ శక్తిపీటాలలో ఐదవ శక్తిపీఠమైన జోగులాంబ అమ్మవారి పేరుపైన ఈ జిల్లాకు నామకరణం జరగడం సాంస్కృతిక విశేషం. ఇంకా ఒక్కమాటలో చెప్పాలంటే ఆధ్యాత్మికత చరిత్ర సాహిత్యాలమేలు కలయిక జోగులాంబ గద్వాల జిల్లా అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఈ జిల్లా అనేక సుందర ప్రదేశాలకు ప్రకృతి అందాలకు పట్టుకొమ్మలుగా ఉంది. ఇది బౌగోళికంగా సుసంపన్నమైన ప్రాంతంగా చెప్పుకోవాలి. అయితే గిరిజన జాతుల ఉనికి తక్కువే అని చెప్పాలి. అనేక రాజవంశాల పరిపాలించిన ప్రదేశం కావడంతో స్థానికంగా గొప్ప చరిత్ర, నాగరికత, సంస్కృతి వికాసించాయి. జోగులాంబ గద్వాల జిల్లాకు పేరుతెచ్చిన పరిశ్రమ చేనేత పరిశ్రమ. గద్వాల సంస్థానం దగ్గర నుండి నేటి వరకు చేనేత పరిశ్రమ మూడు పువ్వులు, ఆరు కాయలుగా విలసిల్లుతుంది. తిరుపతి బ్రహ్మోత్సవాలు సందర్భంగా నేటికి జోడుపంచెలను పంపే సంప్రదాయం కొనసాగుతుంది. ఈ జిల్లాలో గద్వాల, రాజోలు, అనంత పురం, ఐజ, గట్టు మొదలైనవి ప్రధాన చేనేత కేంద్రాలు గద్వాల ప్రాంతం విద్యారంగంలో అగ్రభాగాన ఉన్నది. భారతదేశంలో లార్డ్ మోకాలే 1835లో ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టడానికి మనుపే గద్వాల సంస్థానంలో ఆంగ్ల బోధన ఉన్నది.

అలంపురం తాలూకాలోని పాతానికోట తొలి ఆంధ్ర రాజులైన శాతవాహనుల జన్మస్థలం అని కొందరు చారిత్ర కుల అభిప్రాయం. క్రీ.శ.7వ శతాబ్దంలో నిర్మించబడిన అలంపురంలో జోగులాంబ అమ్మవారి ప్రాచీనాలయం ప్రసిద్ధి పొందింది. క్రీ.శ.9వ శతాబ్దంలో ఆదిశంకరుడు ఈ దేవాలయంలో శ్రీ చక్ర ప్రతిష్ట చేసినట్లు జనం వాడుకలో ఉంది. ఇక్కడ బాల బ్రహ్మేశ్వరుడిని సేవిస్తే ఎలాంటి కష్టనష్టాలు రావని భక్తుల నమ్మకం. స్థల పురాణంలో ఈ క్షేత్రం దక్షిణకాశీగా, భాస్కర క్షేత్రంగా పరుశురామ క్షేత్రంగా వర్ణించబడింది. జోగులాంబ గద్వాల జిల్లా సాహిత్యంలో తెలంగాణ ప్రాంతానికే తలమానిక మైనది. నాటి సంస్థానాల నుండి నేటి అధునిక కాలం వరకు ఎందరో మహోన్నత, ప్రతిభావంతులైన కవులు, రచయితలు ఈ నేలన నడయాడారు. ఈ సాహితీ క్షేత్రాన్ని రసవంతమైన రచనలతో సుసంపన్నం చేశారు.

సురవరం ప్రతాపరెడ్డి, గడియారం రామకృష్ణశర్మ, కేశవపంతుల నరసింహాశాస్త్రి, పోకూరి కాశీపతి, గొట్టు ముక్కల కృష్ణమూర్తి మొదలైన కవిపండితులు జోగులాంబ గద్వాల జిల్లాకు చెందినవారే. వీరిలో సురవరం

ప్రతాపరెడ్డికి గడియారం రామకృష్ణశర్మకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. కరీంనగర్ మెదక్ తరువాత ఎక్కువగా శతక సాహిత్యం జోగులాంబ గద్వాల జిల్లాలో వచ్చింది. సంస్థానంలో వచ్చిన సాహిత్యం నేటి తరానికి అందుబాటులో లేకపోవడం వల్ల జోగులాంబ గద్వాల సాహిత్యాన్ని ముఖ్యంగా శతక ప్రక్రియల్లో వచ్చిన వివిధ క్షేత్ర సాహిత్యాన్ని నేటి సమాజానికి అందించాలనే సంకల్పముతో ఈ పరిశోధన ప్రణాళికను చేపట్టారు.

జోగులాంబ గద్వాల జిల్లా వివిధ సాహిత్య ప్రక్రియలతో పాటు కళలు, విద్యలు, శిల్ప సంపదతో అలరారే దేవాలయాలు, పండుగలు, జాతరలు మొదలగు వాటితో ఇక్కడి సంస్కృతి విలసిల్లుతున్నది. జోగులాంబ గద్వాల జిల్లాను ఎన్నో రాజవంశాలు, సంస్థానాధీశులు పరిపాలించి, దాని చుట్టుప్రక్కల ప్రాంతాలలో కర్ణాటక, కొంత మహారాష్ట్ర భాషల అదాన ప్రధానలు, మహమ్మదీయ, ఆంగ్లేయులు పరిపాలన ప్రభావాలు చాలా ఉన్నప్పటికీ ఈ జిల్లా ఒక ప్రత్యేకత సంతరించుకుంది. ఆధునిక కాలంలో పాశ్చాత్య నాగరికతా ప్రభావం ఈ జిల్లాపై పడినప్పటికీ జిల్లా ప్రతిపత్తికి మూలభూతలైన ప్రాచీన గద్వాల సంస్థానం పురాతన వైభవం, సనాతన ధర్మం సంస్కృతి, ఆచార వ్యవహారాలు, ఆలోచన సరళి నేటికి జోగులాంబ గద్వాలజిల్లా ప్రజల నిత్యజీవితంలో సజీవంగా తొణికిసలాడుతుంది.

ఈ సృష్టిలో ప్రతిచెట్టుకూ, పుట్టకూ, చరిత్ర ఉన్నట్లే జోగులాంబ గద్వాల జిల్లాకు ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. నిజానికి ఈ జిల్లాలో గద్వాల, అలంపూర్ మొదలైన ప్రదేశాలలో కొన్ని వందల ఏళ్ళ సంవత్సరాల సమాధులు విశేషంగా కనిపిస్తున్నాయి. ఉత్తర భారతదేశం నుండి వచ్చిన బౌద్ధజైన మతాలు తెలంగాణ ప్రాంతాలలో స్థిరనివాసం ఏర్పర్చుకున్నాయి. చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అంతేకాదు జైనులు గద్వాల, అలంపూర్‌లలో ఉన్నట్లు అక్కడి తీర్థం కరుల మూర్తుల విగ్రహాలు తెలుపుతున్నాయి.

ఈ సంస్థానం పూర్వకాలంలో పశ్చిమ చాళుక్య సామ్రాజ్యంలో, తర్వాత కొంతకాలం తెలుగు చోడుల రాజ్యంలో, తర్వాత కాకతీయ సామ్రాజ్యంలో ఉన్నది. బలు, దరూరు, పూడూరు, గట్టు, వల్లూరు మొదలగు సీమలు ఏర్పడ్డాయి. వాటిని వేరువేరు నాడగౌడులు పరిపాలించారు. ఈ రాజవంశాల శాసనాలు, కట్టడాలు సంస్థానంలో ఎన్నో ఉన్నవి.

పూడూరు :

గద్వాల సంస్థానంలో 'పూడూరు' చాలా ప్రాచీనమైనది. తొమ్మిదవ శతాబ్దంలో యిది అత్యున్నత స్థితిలో ఉన్నట్లు ఒక కన్నడ శాసనం వలన తెలుస్తున్నది. మల్లికార్జునుని దేవాలయం వద్దగల పూడూరు శాసనం వలన దీనికి గతంలో 'పుండ్రపురము' అని పేరున్నట్లు తెలుస్తున్నది. ఈ గ్రామం గద్వాల రాజులకు మొదటి నివాసస్థలం. రాజులు యిక్కడ ఉండి గద్వాల కోటను కట్టించారు. ఇక్కడి చెన్నకేశవాలయం ఆవరణలోని సింహద్వారం ప్రాచీన చాళుక్య శిల్ప పద్ధతి అనుసరించి నిర్మించబడింది. పూడూరు దుర్గం చూడదగింది.

వల్లూరు :

ఇక్కడి వేణుగోపాలస్వామి ఆలయం ప్రసిద్ధమైనది. ఆలయంలోని ఆవరణలో ఒక శాసనముంది. ఈ వల్లూరు శాసనం ప్రకారం చోళులకు యిది రాజధాని అని తెలుస్తున్నది. అంతేకాక కాకతి గణపతిదేవుని సామంతుడగు 'గంగయసాహిణి'కి రాజధానిగా ఉండి పానుగలు మొదలగు ప్రదేశాలను ఏలినట్లు కూడ ఈ శాసనము తెల్పుతున్నది. రుద్రమదేవి, ప్రతాపరుద్రుల సామంతుడగు త్రిపురాంతకుడు ఈ వల్లూరు నుండి రాదరికం నడిపాడు.

రాజవోలు (రాజోలి) :

రాజవోలు వేంకట భూపాలుడు ఈ ప్రాంతాన్ని పరిపాలించిన రాజు, ఇతడు కవి. రాజవోలుగా పిలువబడిన రాజోలిలో కోటచుట్టు కందకం, లోపల ఆలయాలున్నవి. వీరనారాయణస్వామి ఆలయం ప్రసిద్ధం. తుంగభద్రా

నదీ తీరంలో ఉన్న రామేశ్వరాలయంలో ఒక తెల్లరాతి మీద చాళుక్య భూలోకముల్లుని శాసనముంది.

బోరవెల్లి :

బోరవెల్లి గద్వాలకు పూర్వమే ఈ సంస్థానం చాలా ప్రసిద్ధం. గద్వాల ప్రభువుల గోత్రం వీరి గోత్రం ఒకటే. ఇక్కడ అనేకమంది కవులు గొప్ప కావ్యాలను రాశారు. ఒకప్పుడు స్వతంత్రంగా ఉండిన ఈ సంస్థానం తర్వాత గద్వాల సంస్థానంలో విలీనమైంది.

ఐజ :

పూర్వం యిక్కడ ఓ దుర్గముండేది. ఇక్కడ మూడు ప్రాచీనాలయాలు ఉన్నవి. ఆంజనేయస్వామి ఆలయంలో ఉన్న శాసనంలో కాకతీయ ప్రతాపరుద్రుని ప్రశంస ఉంది. గద్వాల సంస్థానం కాకతీయ సామ్రాజ్యం నుండి పుట్టిందనడానికి ఆ శాసనం సాక్ష్యంగా ఉంది. గద్వాల సంస్థాన మూలపురుషుడు బుద్ధారెడ్డి ఈ గ్రామ నివాసి.

బీచుపల్లి :

శ్రీ వ్యాసరాజస్వామివారు ప్రతిష్ఠించిన ఆంజనేయ స్వామి క్షేత్రం బీచుపల్లి. ఇక్కడ చింతచెట్టు కిందగల స్తంభంపైన చాళుక్యభువనైకమల్లుని శాసనముంది. ఈ ఆలయానికి అత్యంత సమీపంలో కృష్ణానది ఉంది. దాని మధ్యలో ఒక ద్వీపం ఏర్పడింది. దానిపై ఒక కోట ఉంది. దానికి 'నిజాం కోట' అని పేరు.

దరూరు :

దరూరుకు కూడ బుద్ధారెడ్డి నాడగొడు. ఇక్కడ ఉన్న ఆంజనేయస్వామిని 15వ శతాబ్దాలలో విజయనగర రాజులు తమ కులదైవంగా ఆరాధించారట.

మొదలకల్ (మల్లకల్లు) :

బ్రహ్మాండ పురాణంలో దీనిని అది 'ఆదిశిలాక్షేత్రంగా' పేర్కొన్నారు. ఇక్కడ వెంకటేశ్వరస్వామి ఆవిర్భవించిన పర్వతాన్ని గంజాచలము అంటారు. దాస సాహిత్యం రచించిన శేషదాసు యిక్కడ తపస్సు చేశాడని చెప్తారు. అది శిలమత విశాల మహాత్యము' లోని ప్రతి శ్లోకానికి రాణి ఆదిలక్ష్మి దేవమ్మ తాత్పర్యం రాయించి ప్రచురించింది.

అలంపురం :

ఇది తుంగభద్రా తీరంలో ఉంది. అలంపురానికి హలంపురం, హతంపురం, హేమలాపురం, ఎల్లమ్మపురం అని వివిధ పేర్లు ఉన్నవి. పూర్వం దీనిని అయిజెనాడు అని పిలిచేవారు. చాళుక్య విషయంలో యిది ఒక భాగంగా ఉండేది. అలంపురం తాలూకాలోని సాతానికోట తొలి ఆంధ్ర రాజులైన శాతవాహనుల జన్మస్థలం కావచ్చునని కొందరు చారిత్రకుల అభిప్రాయం. నవ బ్రహ్మల పేరిట ఆలయాలు వెలయడం ఈ క్షేత్రం ప్రత్యేకత. బాల బ్రహ్మేశ్వరుడు యిక్కడి ప్రధానదైవం. అలంపురం క్షేత్ర మహాత్యాన్ని తెలిపే సాహిత్యం విరివిగా వచ్చింది. అందులో గడియారం రామకృష్ణ శర్మ పరిష్కరించిన 'శ్రీమదలంపుర క్షేత్ర మాహాత్మ్యం', దోమా వెంకటస్వామి గుప్తాగారి 'బ్రహ్మేశ్వర పురాణం', గడియారం రామకృష్ణశర్మగారి 'అలంపుర క్షేత్రం', బొడ్డుచర్ల చెన్నకృష్ణకవి 'సతీబాలబ్రహ్మేశ్వర పరిణయం' ముఖ్యమైనవి.

చెన్నకేశవాలయం - ఉండవెల్లి :

అలంపురానికి సమీపంలో ఉండే ఉండవెల్లిలో చెన్న కేశవాలయం పురాతనమైనది. ప్రసిద్ధమైనది. నల్లరాతితో చేసిన చెన్నకేశవుని మూర్తి మనోహరంగా ఉంటుంది. ఈ స్వామికి పుష్యంలో పూర్ణిమ నుండి తదియ వరకు నాలుగు దినాలు ఉత్సవాలు నడుస్తాయి. చెన్నకేశవునితో పాటు ఈ గ్రామంలో హేమలాంబ కూడ ప్రసిద్ధం.

చెన్నకేశవాలయం - చెన్నిపాడు :

ఇక్కడ చెన్నకేశవుడిని క్రీ.శ.11వ శతాబ్దంలో కేసన మయ్య కట్టించినట్లు శాసనాధారాలు ఉన్నాయి. ఈ స్వామి పేరుమీదనే ఈ గ్రామానికి చెన్నునిపాడు అనే పేరు వచ్చింది. కాలక్రమేణా అది చెన్నిపాడు అయింది. క్రీ.శ. 1521లో ఈ గ్రామాన్ని కృష్ణదేవరాయలు అలంపురం

బ్రహ్మేశ్వరస్వామికి దానం చేసి వెళ్లాడు. ఆ తర్వాత క్రీ.శ.1527లో అలంపురం సీమను పాలించిన పెద నాయుడు ఇక్కడి చెన్నకేశవుడికి 'గోకులపాడు' అనే గ్రామాన్ని దానం చేశాడు..!

వెంకటనారాయణస్వామి ఆలయం రాజోలి :

రాజోలి తుంగభద్ర తీర ప్రాంత గ్రామం.. ఇక్కడ వెంకటనారాయణస్వామి ఆలయం కోటలోపల ఉంది. తుంగభద్ర యిక్కడ రెండు పాయలుగా చీలి ప్రవహిస్తుంది. నది ఒడ్డున రామేశ్వరాలయం కూడ ఉంది. రాజోలి పరిపాలకులలో ముష్టిపల్లి వేంకట భూపాలుడు ముఖ్యుడు. ఆయన 'దివ్యదేశ మహాత్మ్య దీపిక' అని ద్విపద గ్రంథం, రాజోలి వేంకటేశ్వర శతకం, రాజోలి వేంకటేశ్వర కీర్తనలు రచించాడు. దివ్యదేశమహాత్మ్య దీపికలో వెంకటనారాయణ స్వామి ప్రస్తావన ఉంది. దీనిని బట్టి ఈ ఆలయం 300 లేదా 400 సంవత్సరాల క్రిందటిది అని చెప్పవచ్చు. ఇక్కడ జ్యేష్ఠ పూర్ణిమ నుండి ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

ఆంజనేయస్వామి - బీచుపల్లి :

ఇక్కడి ఆంజనేయస్వామి చాలా ప్రసిద్ధుడు. పవిత్ర కృష్ణానదీ తీరాన ఈ క్షేత్రముంది. ఈ క్షేత్రమందలి ఆంజనేయునికి ఇరువైపులా శంఖ, చక్రాలుండుటచే యిది వ్యాస ప్రతిష్ఠయని ప్రతీతి. 16వ శతాబ్దంలో ఈ ప్రతిష్ఠ జరిగి ఉండవచ్చు. దేవాలయ నిర్మాణాలు గద్వాల సంస్థాన ప్రభువులచే జరిగినవి. వైశాఖ శుద్ధ పౌర్ణమికి స్వామి ఉత్సవం జరుగుతుంది. ఇక్కడి స్వామిని మహామహిమాన్వితుడని భక్తులు భావిస్తారు. ఇచ్చట అనువంశికంగా వాల్మీకులే అర్చకులు. వారికి తోడుగా మాధ్వ బ్రాహ్మణులున్నారు.

మల్దకల్ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయం :

నేడు మల్దకల్‌గా పిలవబడుతున్న ఈ గ్రామానికి మదల్కల్, మొదలకల్లు, గిరీశాచాలం అని పేర్లున్నవి. ఇది గద్వాల అయిజ రహదారిలో ఉంది. దీనిని ఆది శిలాక్షేత్రం అని కూడ అంటారు. కన్నడ భాషలో 'మొదలు' అనగా 'ఆది' అని, కల్లు అనగా 'రాయి' అని అర్థం. బ్రహ్మాండ పురాణంలో నాలుగు అధ్యాయాలలో ఈ క్షేత్రమహాత్యరాఉంది. పరమేశ్వరుడు యిక్కడ తపస్సు చేసి భగవంతుని సాక్షాత్కారం పొందాడట. ఈశ్వరుడు కృతయుగంలో భగవంతుని దశావతారాలను ఘనంగా స్తుతించగా దానికి మెచ్చి ఈ ఆదిశిలకు గిరీశాచలమని పేరు పెట్టాడు. తాను ఆ శిలలో స్వయంభువుగా శ్రీనివాస రూపాన వెలిసేటట్లు వరమిచ్చారు. అదే ప్రకారం శ్రీనివాసుడు, లక్ష్మీదేవి, వరాహస్వామి, ఆంజనేయుడు ఒకే శిలయందు ఉద్భవించాడు. ఇక్కడి క్షేత్రమూర్తి పరమేశ్వరుడు

చింతరేవుల ఆంజనేయస్వామి దేవాలయం :

ఇది కృష్ణానదీ తీర క్షేత్రం. ఇచ్చటి ఆంజనేయస్వామి విగ్రహం ఊర్ధ్వ దృష్టిని కల్గియున్నది. 500 సంవత్సరాల క్రితం చంద్రికాచార్యులనబడే శ్రీవ్యాసయతీంద్రులచే ప్రతిష్ఠించబడింది. మొదలికల్ శేషదాసులు తపస్సు చేసి యిక్కడి స్వామిని శాంతింప చేశారని చెప్తారు. ఇక్కడి అర్చకులు మాధ్వులు.

ఆగద్వాల కేశవాలయం :

పూడూరి చెన్నకేశవుడు గద్వాల సంస్థాన ప్రభువుల కులదైవం.

అక్కడున్న స్వామినే తెచ్చి యిక్కడ ప్రతిష్ఠించారని చరిత్రకారుల కథనం. ఈ ఆలయం విశాలమైన ప్రాకారాలతో ఎత్తయిన గోపురాలతో గంభీరంగా కనిపిస్తుంది. పెదసోమనాద్రి, చినసోమనాద్రి, చిన్నసోమభూపాలుడు తదితర రాజులు ఆలయాన్ని అభివృద్ధిపథంలో నడిపించారు. ఇక్కడి పెద్దగంట చూడదగింది. కొంతకాలం కేశవాలయం నిత్యపూజలకు దూరమైంది. ఇప్పుడది మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం వారి ఆధ్వర్యంలో ఉంది. స్వామివారికి సేవలలో కొరతలేదు.

సడ్లోనిపల్లి కృష్ణమందిరం :

సద్గలోనిపల్లె మల్దకల్లు మండల గ్రామం. సుమారు

400 సంవత్సరాల క్రితం ఇక్కడ కృష్ణస్వామి స్వయంభువుగా వెలిశాడు. శ్రీకృష్ణ జన్మాష్టమికి ఐదురోజులు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ప్రతి సంవత్సరం విజయదశమి నుండి దీపావళి వరకు ప్రతిరోజు పల్లకీ సేవ జరుగుతుంది.

పాగుంట వేంకటేశ్వరస్వామి :

ఇది గద్వాలకు సమీపంలో ఉన్న కాలూరు-తిమ్మన్ దొడ్డి మండలంలోని గ్రామం. ఇక్కడి స్వామి ముందుగా రాయచూరు ప్రాంతంలోని ఎర్రమొరసు గ్రామంలోని కాశిబావిలో ఉండెనట. ఈ క్షేత్రం పేదల తిరుపతిగా ప్రసిద్ధికెక్కింది. స్వామివారి తీర్థాన్ని కండ్లలో వేసుకుంటే సర్వరోగాలు నయమైతాయని భక్తుల నమ్మకం. దీపావళి రోజు కళ్యాణం, రథోత్సవం జరుగుతాయి.

పూడూరు ఆలయాలు :

పూడురు గ్రామం క్రీ, పూ, మహావీరుని కాలంలోనే చరిత్ర కలిగి ఉంది. పూడురు గ్రామం బయట వీరభద్ర స్వామి దేవాలయం, మల్లికార్జునస్వామి దేవాలయం, గ్రామంలో చెన్నకేశవస్వామి దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయాలు ఉన్నవి. చాళుక్యరాజుల కాలంలో 11వ శతాబ్దంలో నిర్మాణాలు జరిగినవి. వీరభద్రస్వామి దేవాలయంలో 4 అడుగుల ఎత్తు శివలింగం, 6 అడుగుల ఎత్తు వీరభద్రస్వామి విగ్రహం ఉన్నవి. ప్రతి సంవత్సరం వీరభద్రస్వామి జాతర జరుగును.

గద్వాల - అహోబిలమఠం :

గద్వాల సంస్థానానికి, అహోబిల మఠానికి మధ్య సంబంధం ఏర్పడి దాదాపు 300 సంవత్సరాలు కావస్తున్నది. గద్వాల రాజు సోమభూపాల్ అహోబిల మఠం 24వ జీయర్ పరాంకుశ యతీంద్ర మహాదేశికులు 1829-31లో గద్వాలకు వచ్చారు. దాదాపు 3 సంవత్సరాలు యిక్కడనే ఉన్నారు. 40వ జీయర్ స్వామి కేశవాలయంలో భంగపడిన మూలవిగ్రహం స్థానంలో నూతన మూర్తిని ప్రతిష్టించారు. ఈ స్వామి గద్వాల అహోబిల మఠంలో మూడు సంవత్సరాలున్నారు. ఈ మఠానికి సంబంధించిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం గద్వాల పట్టణంలోని పెద్ద అగ్రహారంలో ఉంది.

వేణీసోంపురం వేణుగోపాల ఆలయం :

వేణీసోంపురం అయిజ మండలంలోని గ్రామం. చ్యవనమహర్షి తపస్సు చేసినందువల్ల ఆ ప్రాంతానికి చ్యవనకాశ్రమమని పేరు వచ్చినట్లు పరిశోధనకులు చెప్తారు. ఇక్కడి చెరువు తవ్వకాలలో రెండు వేణుగోపాల స్వామి విగ్రహాలు దొరకగా ఒకటి యిక్కడ, మరి ఒకటి వల్లూరులోను ప్రతిష్టించినట్లు ఒక కథనం.

అలంపురం ప్రాంతంలో లభించిన శాసనాలలో అధిక శాతం కన్నడవే కావడం విశేషం. అక్షరాస్యతా శాతం తక్కువగా ఉంది. గట్టు మండలం విద్యాపరంగా వెనుకబడి ఉంది. సామాజిక వివక్ష యిప్పటికీ ఉంది. ఈ జిల్లాలో అన్ని రకాల కులాలు, మతాలు ఉన్నవి. ఆంధ్రప్రాంతం నుండి వలసవచ్చిన కుటుంబాలు పెద్ద సంఖ్యలోనే ఉన్నవి. ఎవరి ఆచారం, వ్యవహారం, సంప్రదాయాలను అనుసరించి వారు జీవిస్తున్నారు.

తెలంగాణ సాహిత్యంలో శతకాలకు ముఖ్యంగా జోగులాంబ గద్వాల జిల్లా శతకాలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. శతక సాహిత్యమంతా భక్తి రస పూరితమైందే. భగవన్నుతితో కూడినదే శతకాలు భక్తి, జ్ఞాన, వైరాగ్య, నీతి, శృంగార, హాస్య భావాలతో కూడి ఉన్నాయి. తెలుగులో వచ్చిన శతకాలు 300 లకు పైగా ఉన్నాయి. వాటిలో భక్తి ప్రధాన శతకాలే ఎక్కువ. అవి శైవ, వైష్ణవ, శక్తి, భక్తి పరంగా వ్రాయబడ్డాయి.

బీచుపల్లి శ్రీమదాంజనేయ శతకం- కాటూరి లక్ష్మణాచార్యులు, సద్దలోనిపల్లి ముద్దు కృష్ణశతకం- డా॥ వెలుదండ సత్యనారాయణ, మొల్దకల్లుపుర శ్రీ తిమ్మప్ప శతకం - వారణాసి విశ్వబ్రాహ్మణ నాగేశ్వరచార్యులు, జమ్ములమ్మ శతకం - మేడచర్ల హరినాగభూషణం, పాగుంట వేంకటేశ్వర శతకం- మేడిచర్ల హరినాగభూషణం, జోగులాంబ దేవిశతకం -వారణాసి నాగేశ్వరాచార్యులు,

శ్రీమొల్లకల్రాయుని శతకం -వారణాసి నాగేశ్వరాచార్యులు, బీచుపల్లి హనుమచ్ఛతకం- తురిమెళ్ళ రాధాకృష్ణమూర్తి, జోగులాంబ గద్వాల జిల్లా ద్వాదశ పుణ్యక్షేత్రాలు-అంబటి భాను ప్రకాష్, మేడిచర్ల హరినాగభూషణం, అలంపూరి జోగులాంబికా నక్షత్రమాల- సంస్కృత శ్లోకాలు, డా॥.ఎన్.ఎం.హుస్సేన్, జమ్ములమ్మ పాటలు- డా॥ వెలుదండసత్యనారాయణ, పుష్కర తుంగభద్ర - డా॥ భీంపల్లి శ్రీకాంత్ (వ్యాసం), అపర తిరుపతి ఆదిశిలా క్షేత్రం- శ్రీ స్వయంభూలక్ష్మి వేంకటేశ్వరస్వామి, మొదల్కల్లు పట్వారి ప్రహ్లాదరావు (వ్యవస్థాపక వంశీయులు) మొదలైన కవులు రచయితలు జోగులాంబ గద్వాల్‌జిల్లా క్షేత్ర సాహిత్యాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరించి తెలంగాణ క్షేత్ర సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

ఆధార గ్రంథాలు :

1. మహబూబ్ నగర్ జిల్లా సర్వస్వము, బి.ఎన్.శాస్త్రి, మూసీ పబ్లికేషన్స్, హైదరాబాద్ ,1993.
2. పాలమూరు జిల్లా ప్రాచీన, ఆధునిక కవుల చరిత్ర, ఎస్వీ. రామారావుగారు.
3. సద్దలోని పల్లి ముద్దు కృష్ణ శతకము, డా॥వెలుదండ సత్యనారాయణ, రాధికా ప్రచురణలు, 2010.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కె.విశ్వనాథ్ శంకరాభరణం చిత్రంలో చంద్రమోహన్ పాత్ర - నటనా వైదుష్యం

- జ్ఞ్.శీదేవి, పి.హెచ్.డి రీసెర్చ్ స్కాలర్, తెలుగు శాఖ, మద్రాస్ విశ్వవిద్యాలయం, చెన్నై.

కళాతపస్వి చిత్రాలన్నీ అణిముత్యాలే.అందులో నటించే నటులకు పాత్ర చిన్నదైనా ప్రాముఖ్యత ఉంటుంది. అలాగే ఆ పాత్ర ద్వారా దర్శకులు విశ్వనాథ్ సమాజానికి ఒక చక్కటి సందేశాన్ని ఇస్తారు. అది వారి దర్శకత్వ ప్రతిభకు నిలువెత్తు నిదర్శనం.

వారి చిత్రాలలో ఘన విజయం సాధించి విజయ ఢంకా మ్రోగించిన సంగీత, నృత్య, సాహిత్య పరమైన విలువలున్న ఒక అమూల్యమైన చిత్రం "శంకరాభరణం". యువత పాశ్చాత్య సంగీతం వైపు మొగ్గుచూపుతున్న తరుణంలో శంకరాభరణం చిత్రం రావడం. ఈ చిత్రం భారీ విజయం సాధించి మరుగున పడుతున్న సంగీత కళాశాలలు,నృత్య కళాశాలలు విరబూసిన స్వర్ణకమలాల్లా తెరుచుకున్నాయి. ఎందరినో సంగీత, నృత్యం వైపు నడిచేట్టు చేసాయి అనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు. ఈ చిత్రంలో కథానాయకుడు అంటే శంకర శాస్త్రి పాత్రలో నటించిన జె. వి. సోమయాజులు పాత్రనే. కానీ కథా పరంగా చూస్తే కామేశ్వర రావు పాత్రలో నటించిన చంద్రమోహన్ పాత్ర. నేను ఈ శంకరాభరణం చిత్రంలో చంద్రమోహన్ పాత్ర నటనా వెదుష్యం గురించి తెలియ చేస్తాను.

ముందుగా ఈ చిత్రం గురించి క్లుప్తంగా వివరాలు.

శంకరాభరణం చిత్రం వివరాలు

నిర్మాత : శ్రీ ఏడిద నాగేశ్వరరావు గారు.
దర్శకత్వం, కథ, స్క్రీన్ ప్లే : కె.విశ్వనాథ్ గారు
మాటలు : శ్రీ జంధ్యాల గారు
పాటలు : శ్రీ వేటూరి సుందరరామమూర్తి గారు
సంగీతం : శ్రీ.కె.వి.మహదేవన్ గారు
నటీనటులు : జె. వి.సోమయాజులు , చంద్రమోహన్, రాజ్యలక్ష్మి, మంజుభార్గవి, బేబీ తులసి, అల్లు రామలింగయ్య, నిర్మలమ్మ, బేబీ వరలక్ష్మి తదితరులు.
బ్యానర్ : 1980లో పూర్ణోదయా ఆర్ట్ క్రియేషన్స్ ద్వారా విడుదల అయింది.

ఈ చిత్రం శంకరాభరణం పేరుతోనే తమిళ, మలయాళంలో, "సుర్ సంగ" పేరుతో హిందీలో నిర్మించారు.

ఈ చిత్రానికి బంగారు నందులు, జాతీయ అవార్డులు లెక్క లేనన్ని వచ్చాయి. కళాత్మకమైన ఈ చిత్రం తర్వాతనే విశ్వనాథ్ గారు "కళాతపస్వి" గా ప్రపంచానికి పరిచయం అయ్యారు.

సినిమా కథ క్లుప్తంగా :

కర్ణాటక సంగీత విద్వాంసులు అయిన శంకర శాస్త్రికి దేశ వ్యాప్తంగా గొప్ప పేరు ప్రతిష్టలు ఉంటాయి. వేశ్యా కుటుంబంలో పుట్టిన తులసికి సంగీతం అంటే పంచప్రాణాలు. మంచి నర్తకి కూడా. తులసి తల్లి తులసిని జమీందారు పంచన చేర్చి డబ్బు సంపాదించాలనుకుంటుంది. తులసి పారిపోయి ఒక రైలులో శంకర శాస్త్రి ఉన్న బోగీలో ఎక్కుతుంది.తులసి పరిస్థితి చూసి తనతో పాటే ఆమెకు ఆశ్రయం కలిపిస్తారు ఆయన. తులసిని వెతుక్కుంటూ తులసి తల్లి శంకర శాస్త్రి గారి దగ్గర ఉన్న తన కూతురిని బలవంతంగా తీసుకెళ్ళిపోయి జమిందార్ పంచన చేర్చుతుంది. ఆ జమిందార్ తులసిని బలవంతంగా వశం చేసుకోవాలనుకుంటాడు. అప్పుడు తులసి అతన్ని చంపి పారిపోయి శంకర శాస్త్రి గారింటికి వెళ్తుంది. అలాంటి పరిస్థితిలో శంకర శాస్త్రి అవిడకు

అశ్రయం కలిగిస్తారు.ఆవిడని ఇంట్లో వుండనివ్వడం సంగీతజ్ఞులకు, పండితులకు, జనాలకు ఇష్టం ఉండదు. శాస్త్రి గారికి తన వలన చెడ్డ పేరు రాకూడదని ఇల్లు వదిలి వెళ్ళిపోతుంది తులసి. ఆ తర్వాత తులసికి ఒక అబ్బాయి పుడతాడు. ఆ బాబుని ఎలాగైన శంకర శాస్త్రి గారి దగ్గర చేర్చి సంగీతం నేర్పించాలని ఆశపడి తులసి బాబుని తీసుకుని శంకర శాస్త్రి గారు ఉన్న ఊరు చేరుకుంటుంది. సంగీతానికి ఆదరణ తగ్గి,శాస్త్రి గారు కష్టాలలో ఉండడం చూసి. తనకు వచ్చిన ఆస్తి ద్వారా పరోక్షంగా ఆదుకుంటూ కొడుకు శంకరాన్ని శాస్త్రి గారి దగ్గర చేర్చి.గురువు గారికి ప్రియ శిష్యుడిని చేసి ఆత్మ తృప్తి పొందుతుంది.సంగీత కళ ఎప్పటికి నిలవాలని శాస్త్రి గారికి తిరిగి పూర్వ వైభవం రావాలని ఒక పెద్ద మండపంలో శాస్త్రి గారి కూతురు పెళ్ళి సందర్భంలో పెద్ద సంగీత కచేరీ పెట్టిస్తుంది. ఆ కచేరిలో శాస్త్రి గారికి అనారోగ్యం వచ్చి పాడలేని సమయంలో తులసి అబ్బాయి శంకరం ఆ పాటని పూర్తి చేసి గురువు మెప్పు పొంది. తన తదనంతరం తన సంగీత వారసుడు శంకరమే అని శాస్త్రి గారు భావించి వారి కాలుకున్న గండపెండేరాన్ని తొడిగి, ఆ శంకరం తులసి అబ్బాయి అని తెలుసుకుని ఎంతో సంతోషపడతారు. సంగీతం నిరంతరం సాగే దైవ దత్తమైన సాధన అని శంకర శాస్త్రి గారు శిష్యుడు శంకరం తన సంగీత వారసత్వం నిరూపిస్తారు.

చంద్రమోహన్ నటనా వైదుష్యం :

దర్శకులు కళాతపస్వి కె.విశ్వనాథ్ గారు ఏదైనా పాత్రను సృష్టించారు అంటే ఆ పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉందనే అర్థం. ఈ చిత్రంలో చంద్రమోహన్ కామేశ్వర రావు పాత్ర అతిథి పాత్రలా కనిపించినా ఎంతో ప్రాధాన్యత ఉన్న ముఖ్యమైన పాత్ర. ఆ పాత్ర ద్వారా ప్రేక్షకులకు ఎన్నో విషయాలు అవగతమవుతాయి. ముఖ్యంగా బామ్మతో కామేశ్వర రావు, మాధవాచార్యులు దంపతులతో శారద అన్నవరం వెళ్ళినప్పుడు మొదటిసారి శారద ను కామేశ్వరరావు అక్కడే చూస్తాడు.యవ్వనంలో ఉన్న జంటకు మొదటిసారి కలిగే మధురమైన ప్రేమాను భూతులకు బీజం అక్కడే పడుతుంది. గుడి మెట్లు ఎక్కుతున్న బామ్మకు, కాముడికి మధ్యలో కనిపిస్తుంది శారద. మెట్లెక్కుతూ. బామ్మ గారి మరచెంబు పొర పాటున కిందపడేస్తాడు కాముడు. బామ్మ గారు ఆ మరచెంబు వారి పుట్టింటి వారిచ్చింది అని కాముడిని అరవటం, మెట్లెక్కి వస్తున్న శారద ఆ చెంబు కాముడి చేతికి ఇవ్వడం. దగ్గరగా ఒకరికొకరు చూసుకోవడం, ఎదో తెలియని ఆకర్షణకు లోనవుతారు. మళ్ళీ రెండో సారి కావాలనే మరచెంబు కింద పడేస్తాడు కాముడు. శారదని మళ్ళీ చూడొచ్చని, చెంబు ఇస్తుందని ఆశతో. ఈసారి ఓ చిన్న కుర్రాడు అది తీసుకోవడం. ఇదంతా చూస్తున్న శారద ముసిముసి నవ్వులు నవ్వుతూ అతన్ని చూడటం చక్కటి సున్నితమైన హాస్యంతో ఉంటుంది ఇక్కడ చంద్రమోహన్ గారి అద్భుతమైన నటన. అలాగే అన్నవరం దర్శనం లైన్ లో కాముడు బామ్మ, మాధవా చార్య దంపతులు శారద నిలబడటం నుండి దర్శనం అయ్యాక ప్రసాదాలు తీసుకునే వరకు ఉన్న అన్ని సన్నివేశాలలో చంద్రమోహన్ నటన ఎంతో సహజంగా ప్రేక్షకులకు ఇలాంటి సన్నివేశాలు మన జీవితంలో కూడా జరిగాయి కదా అనుకునేంత అద్భుతంగా నటించారు.

ఇక ఇంకో సన్నివేశం :

శుద్ధ హిందోళంలో రిషభం

ఇక కాముడు బామ్మ గారు శంకర శాస్త్రి గారింటికి మాధవాచార్య దంపతుల మధ్య వర్తిత్వంతో శారద ని చూడటానికి పెళ్ళి చూపులకు వచ్చే సన్నివేశం. కానీ కామేశ్వరరావు శారదని అన్నవరం లో చూసినప్పటినుండి ఆ అమ్మాయినే తన మనస్సులో స్థిరపర్చుకున్నారు. వేరే పెళ్ళి చూపులు ఇష్టం లేకుండానే వెళ్లిన కాముడికి పెళ్ళి కూతురు శారద ని చూసి ఆనందంతో తబ్బిబ్బుపోతాడు. ప్రముఖ సంగీత విద్వాంసులు శంకర శాస్త్రి గారి అమ్మాయి శారద అని సంతోష పడతారు. శారద ని పెళ్ళి చూపులలో ఒక పాట పాడాలని బామ్మ గారు కోరడంతో

తాను మైమరచి కాముడిని ఊహించుకుంటూ తన్మయత్వం చెంది పాడుతూ పారపాటున స్వరాలు తప్పుగా పలుకుతుంది. అయితే శాస్త్రి గారు శారదని పెళ్ళి వారి ముందే కోప్పుడుతారు. స్వరాలు అడుగుతారు. శారద ని తండ్రి కొప్పడటం చూసి కాముడు ఎదో సర్ది చెప్పబోయి శాస్త్రి గారిని చూసి భయంతో హడావిడిలో తాను తప్పుగా స్వరాలు చెపుతాడు. శాస్త్రి గారికి ఇంకా కోపం వచ్చి వారిని వెళ్లిపోమంటారు. అప్పుడు చంద్ర మోహన్ గారి నటన, తప్పు చేసినందుకు పశ్చాత్తాపం పడుతున్నట్టు, శారదతో పెళ్ళి సంబంధం ఎత్తి పోతుందేమో అని బాధ అతని నటనలో మనకు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది. కాముడు తన సంగీత విద్వత్తు ఎలాగైనా శాస్త్రి గారికి చూపించాలని గుడిలో సరస్వతి అమ్మవారి మీద పాట ''మాణిక్యవీణా'' ఎంతో అద్భుతంగా పాడి శాస్త్రి గారి మెప్పు పొందుతాడు. అంతే కాకుండా శారద తో తనకు పెళ్ళి అంగీకరిస్తారు శాస్త్రి గారు. శారద ని చూసినప్పటినుండి ఆమెను పెళ్ళి చేసుకోవాలని పడిన ఆరాటం మధ్య మధ్య ఆరోగ్యకర మైన చిరు హాస్యం తో చంద్రమోహన్ గారు వారి నటనను ప్రేక్షకులకు చిరస్థాయిగా గుర్తుండేట్టు నటించారు.

చంద్రమోహన్ గారి నటనపైన నా విశ్లేషణ :

యుక్త వయస్సులో ఉన్న ఒక సాంప్రదాయ కుటుంబంలోని అబ్బాయి ఒక అమ్మాయిని చూసి ఆకర్షణకు లోనయి ఆ ఇష్టాన్ని వ్యక్తీకరణ చేయడానికి కూడా ఒక పద్ధతిగా భారతీయ సంప్రదాయ విలువలకు ప్రాధాన్యత ఇస్తూ ఆ అమ్మాయిని తాను ఇష్టపడుతున్నట్టు అతనిచేతల ద్వారా తెలియచేయడంలో ఎంతో సహజంగా నటించారు. ప్రతి ఇంట్లో ఆ కాలంలో బామ్మ మనవడు ఇలాగే వుండేవారు అని తెలిసేట్టు తన అద్భుతమైన నటన ద్వారా తెలియచేశారు చంద్రమోహన్ గారు. అలాగే ఎంతో సహజంగా సంప్రదాయ పద్ధతిలో జరిగిన పెళ్ళి చూపుల సన్నివేశంలో కాముడు పాత్రనే ముఖ్యమైన పాత్రగా చెప్పేట్టు నటించారు. అంతే కాకుండా అప్పుడప్పుడే పాశ్చాత్య ప్రభావంతో ఉన్న ఆ కాలంలో కూడా సంప్రదాయ సంగీతం ప్రాధాన్యత కాముడు పాత్రలో చంద్రమోహన్ పాడిన పాట ద్వారా మనకు తెలుస్తుంది. భారతీయ సంస్కృతి, సాంప్ర దాయంలో భాగం అయిన పెళ్ళి ద్వారా రెండు సంప్ర దాయ కుటుంబాలు కలవడం, సంప్రదాయ కర్ణాటక సంగీత ప్రాధాన్యత చూపించడం కోసం కళా తపస్వి కె విశ్వనాథ్ గారు తీసిన ఈ ఆణిముత్యం లాంటి సినిమాలో సహజనటులు, అద్భుతమైన నటనా కౌశల్యం ఉన్న చంద్రమోహన్ గారినే కాముడు పాత్ర కు ఎంచు కోవడం ద్వారానే తెలుస్తుంది ఈ సినిమాలో ఈ పాత్రకు చంద్ర మోహన్ గారైతేనే న్యాయం చేయగలరని దర్శకులు విశ్వనాథ్ భావించినట్టు. శంకరాభరణం సినిమాలో చంద్ర మోహన్ గారి నటనా వైదుష్యం ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా ఉండిపోయే ఆణిముత్యం లాంటి చిత్రం.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నేటితరానికి నడత నేర్పించే నాటితరం మహానుభావుల 'మహాత్మ పంచకం'

- డా॥. ఎం. లోకకృష్ణ
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ద్రావిడ విశ్వవిద్యాలయం.

- బయ్యం మల్లీశ్వరి
తెలుగు పరిశోధక విద్యార్థిని,
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

'పాతొక రోత- కొత్తొక వింత' ఇదీ లోకోక్తి... ఈ మాట అక్షరాలా వాస్తవం కూడా. ఎందుకంటే పాతతరాల వారి విలువలు, వారి నైతికత, నియమనిబద్ధతలు, నమ్మిన వాటి కోసం, నమ్మినవారి కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా భావించిన వారి తెగింపు.. ఇవన్నీ కొత్త తరానికి అర్థంకాని విషయాలు. రోతపుట్టించే సంగతులు.

పబ్బులు.. క్లబ్బులు.. విందులు.. విలాసాలు.. స్మార్ట్‌టీవీలు.. మొబైళ్లు... మనుషులను గుప్పిట్లో పెట్టుకుని జీవితాలను శాసించే ఇంటర్నెట్.. ఇవన్నీ లేకుండా గతతరాలన్నీ ఎలా బతికాయని జాలిపడే నేటితరం కొత్త వింత పోకడలు.

కొత్త మంచిదే. కాదని ఎవరూ అనరు. కానీ ఆ కొత్త దనం అమూల్యమైన జీవితాలను, కాలాన్ని, అనుబంధాలను బలితీసుకుంటూ మనిషిలోని మానవత్వాన్నే చంపేస్తూ మృగంలా మారుస్తుంటే.. వారిని మార్చడానికి పాతతరం ఒక గట్టి ప్రయత్నం చేయాలి. ఆ ప్రయత్నం పటిష్టంగా వుండాలి.

అలాంటి వారికోసమే మహనీయుల జీవిత చరిత్రలను రచించాలి. వారి త్యాగాలను, పోరాటాలను, విజయాలను, అపజయాలను, ముళ్లబాటలను, తరువాతి తరాలకోసం వారు అమర్చిన పూలబాటలను నేటితరానికి పరిచయం చేయాలి. నేటితరానికి ఏదో ఒకరకంగా వారిని దగ్గరికి తీసుకురావాలి. పెడదారిన వెళుతున్న కొత్తతరం మనసుల్లో వారిని బలంగా నాటాలి. వారి జీవితంలో ఆ మహనీయులను భాగంగా మార్చాలి.

డాక్టర్ అంతటి నరసింహం.. ఒక విస్మృత యాత్రికుడు. ఆయన పేరు తెలియని వారంటూ వుండరు. కానీ గుర్తించరు. కారణం ఏంటో తెలియదుగానీ గుర్తున్నా గుర్తుపట్టనట్లు నటిస్తారు. కడపజిల్లాలో పుట్టిన రచయిత అయినా, కడపజిల్లా రచయితల సంఘ వ్యవస్థాపకులలో ఒకరైనా ఆయనను సాహిత్యపరంగా ఆయనను ఆ జిల్లా ఆదరించలేదు. ఆ జిల్లానే కాదు... రాయలసీమే ఆయనను పక్కనపెట్టింది. ఇక్కడి రచయితలంతా నిప్పుకణికను కడుపులో దాచుకుని ఏమీ జరగనట్లు కనిపిస్తుంటారు.

"వంగి వంగి నమస్కరించడం ఆయన చేతకాదు. దేనికి కూడా ఆయన వ్యక్తిత్వాన్ని పణంగా పెట్టడు."1 అంటారు అంతటి షష్టిపూర్తి సంచిక 'ఆరుపదుల అంతటి'లో 'మహోన్నత మానవతామూర్తి డాక్టర్ అంతటి' అన్న వ్యాసం రాసిన 'సంస్కృతి బంధు ఎస్.వి. రమణారావు.

బహుశా అవసరానికి మించిన వినయవిధేయతలను కోరుకునేవారికి ఆయన ఆత్మవిశ్వాసం శరాఘాతంలా మారడంవల్లే అంతటిని విస్మరించాలన్న ఆకాంక్ష వారిలో కలిగిందేమోనన్న సందేహం కలుగుతుంది. కానీ అంతటి మాత్రం కర్మయోగి. ఈ స్థితిగతులనన్నింటినీ దాటిన చిద్విలాసమూర్తి.

వీటన్నింటినీ పక్కనబెడితే అంతటి రచనల్లో అద్భుతమైన రచన 'మహాత్మ పంచకం'. ఈ పుస్తకంలో ఆయన మన దేశంలో దళిత, మైనారిటీల అభ్యున్నతి

కోసం జీవితకాలపు కృషి చేసిన ఐదుగురు మహానుభావుల జీవిత చరిత్రలను పొందుపరిచారు. ఇది చూడడానికి చిన్నపుస్తకమే అయినా, ఇందులో ఆయన ఆ ఐదుగురి గురించి సంపూర్ణంగా వివరించారు. ఈ పుస్తకం నేడు అందుబాటులో లేదు. ఈ పుస్తకాన్ని ప్రచురించి, నేటి యువతతో చదివిస్తే వారిలో కొంతైనా మార్పువస్తుందన్న ఆశాభావం కలుగుతుంది.

అంతటి నరసింహం 'మహాత్మపంచకం'లో బుద్ధుడు, గాంధీజీ, జోతిబా ఫులే, నారాయణగురు, అంబేద్కర్‌ల జీవిత చరిత్రలను పొందుపరిచారు. వారందరి గురించీ ఆయన ఈ పుస్తకంలో సవివరంగా రచించారు. ఈ పుస్తకం ఆయా మహాత్ముల గురించి ప్రచారంలో వున్న అభూత కల్పనలలో ఎంత వాస్తవం వుందో నిగ్గుతేలుస్తుంది. వారిని అగ్నిపునీతులను చేసి పాఠకుల ముందు నిలుపుతుంది.

గౌతమబుద్ధుడు :

'బుద్ధ పరమాత్మ' అన్నపేరుతో అంతటి నరసింహం గౌతమబుద్ధుని జీవితచరిత్రను రచించారు. సిద్ధార్థుడు లోకం ఎరగనివాడని, ఒక వృద్ధుడిని, ఒక మరణాన్ని చూసి సన్యాసి అయ్యాడని ప్రచారంలో వున్న కథలను ఈ రచన ఖండిస్తుంది.

బుద్ధుడు సిద్ధార్థుడుగా వున్న కాలంనుంచే... అంటే బాల్యంనుంచే హింసకు ఎంత వ్యతిరేకో... ఆ కాలంలో ఏర్పడిన జల వివాదాన్ని రక్తపాతరహితంగా ఎలా పరిష్కరించడానికి ప్రయత్నించాడో, ప్రాణనష్టం కలిగించే యుద్ధాన్ని ఆపడానికి ఎంత ప్రయత్నించాడో ఈ పుస్తకం మనకు తెలుపుతుంది. బుద్ధుడు దేవుడు కాదని, మహాయోగిగా రూపాంతరం చెందిన ఓ మనీషి అన్న విషయం మనకు ఈ జీవిత చరిత్ర ద్వారా తెలుస్తుంది.

"కొలియాలకూ, శాక్యులకూ మధ్య రోహిణీనది ప్రవహిస్తుంది. ఈ రెండుదేశాలూ ఆ నదీజలాలను వాడుకుంటున్నాయి. జలాలను వాడుకోవడంలో ఇరుపక్షాలలోనూ వైమనస్యమేర్పడింది. ఉభయపక్షాల సేవకులూ కొట్టుకున్నారు. గాయాలు తగిలాయి. యుద్ధం చేసి అటోయిటో తేల్చుకోవాలనుకున్నారు. శాక్యుల సేనానాయకుడు శాక్యసంఘాన్ని సమావేశపరిచి కొలియాలపై యుద్ధం ప్రకటించే తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు. సిద్ధార్థుడు దాన్ని వ్యతిరేకించాడు. యుద్ధం మరొక యుద్ధానికి దారితీస్తుందన్నాడు. శాక్యసంఘం నుంచి ఇద్దరు ప్రతినిధులను, కొలియాలనుంచి ఇద్దరు ప్రతినిధులను ఎన్నుకోమందాం. ఈ నలుగురూ కలిసి వేరొకరిని ఎన్నుకోమందాం. ఈ ఐదుగురూ కలిసి చర్చించుకొని ఒక నిర్ణయానికి వస్తారు. ఆ నిర్ణయం ప్రకారం చేద్దాం అన్నాడు. అయితే ఆ ప్రతిపాదనను శాక్యసంఘం త్రోసిరాజన్నది."

అంటే బుద్ధుడు ఒక్కరోజులో పరివ్రాజకుడుగా మారలేదు. ఆనాటి సమాజంలోని సమస్యలపట్ల ఆయనకు సమగ్రమైన, సంపూర్ణమైన అవగాహన వుంది. సిద్ధార్థుడిగా ఆయన ఆ రుగ్మతలను మాన్పలేకపోయాడు. అందుకే సర్వస్వాన్నీ పరిత్యజించి పరివ్రాజకుడై అనేకమందిని శాంతివైపు నడపగలిగాడు.

మహాత్మాగాంధీ :

అతి సామాన్య కుటుంబంలో జన్మించిన మోహన్‌దాస్ కరంచంద్‌గాంధీ మహాత్మాగాంధీగా మారడం వెనుక ఆయన పడిన కష్టనష్టాలను, అవమానాలను, ఆయన చేసిన పోరాటాలను కూలంకషంగా చర్చించారు అంతటి. దక్షిణాఫ్రికాలో రైలునుండి తోయడంవల్ల జరిగిన అవమానం అనంతరం గాంధీజీ పోరాటం బాట పట్టారన్నదే మనకు తెలిసిన ప్రధానమైన విషయం. అయితే అదే గాంధీజీకి మొదటి అవమానం, చివరి అవమానం కాదని అంతకుముందూ, ఆ తర్వాత కూడా ఆయన అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్నారన్న వాస్తవాన్ని ఈ పుస్తకం మనకు తెలుపుతుంది.

సున్నిత స్వభావి, సిగ్గరి అయిన ఒకవ్యక్తి అనేక ఆటుపోట్లను తట్టుకుని దేశానికి నాయకుడిగా, ప్రపంచానికి దార్శనికుడిగా ఎదిగిన తీరును ఈ పుస్తకం మనకు కళ్లకు

కట్టినట్లు చూపుతుంది. తన బాల్యంనుంచీ తనచుట్టూ జరిగే ఆంగ్లేయుల దౌర్జన్యాలు, భారతీయులను అణచి వేస్తున్న తీరు గాంధీజీని కలచివేసిన వైనాన్ని ఈ పుస్తకంలో అంతటి క్షుణ్ణంగా తెలిపారు.

గాంధీజీ మొదట అందరిలాంటి సామాన్యుడే. భార్య ఆత్మవిశ్వాసాన్ని భరించలేని ఓ భర్త. మొదటిసారి ఇంగ్లండుకు వెళ్లినపుడు వారితో పోటీపడి సూటూబూటూ ధరించి, డాబూ దర్పాలను అరువు తెచ్చుకున్న వ్యక్తే. అయితే ఆయన అంతటితో ఆగిపోలేదు. తాను చేస్తున్నది తప్పని తెలుసుకున్నాడు. తన చేతలే గౌరవాన్ని తెచ్చి పెడతాయని, దుస్తులు కాదని తెలుసుకున్నాడు. శారీరకంగా అత్యంత బలహీనుడైనా, ఆయన మానసిక దృఢత్వమే ఆయనను అందరిలోనూ ప్రత్యేకమైన వ్యక్తిగా నిలిపింది.

"తన దేశంలో, తన ఇంట్లో బీదరికం అనుభవిస్తూ వుంటే తాను ఇంగ్లండులో దర్జాగా బతకడం తప్పని తెలుసుకున్నాడు. ఇపుడు ఒక గదితోనే సరిపుచ్చు కున్నాడు. తన వంట తానే చేసుకునేవాడు. శక్తికోసం కొన్ని దినాలు గుడ్లు కూడా తినడం సాగించాడు. గుడ్లు మాంసాహారం కాదనే అభిప్రాయంతో ఆ పనిచేశాడు. తర్వాత తల్లికి చేసిన ప్రమాణాన్ని అనుసరించి గుడ్లు కూడా చాలించాడు."3

గాంధీజీ తన బలాలను గానీ, బలహీనతలనుగానీ దాచలేదు. తాను చేసిన తప్పొప్పులను కూడా నిర్భయంగా సమాజానికి చాటి చెప్పారు. నిజమైన నాయకుడి లక్షణం ఇదేనని ఈ పుస్తకం చదివాక మనకు అర్థం అవుతుంది.

గాంధీజీ జీవితాన్ని స్వాతంత్ర్య పోరాటాన్ని విడివిడిగా చూడడం సాధ్యం కాదు. రెండూ కలగలిసిపోయిన జీవితమే గాంధీజీది. అందుకే ఈ పుస్తకం దక్షిణాఫ్రికాలో, భారతదేశంలో గాంధీజీ సత్యాగ్రహ పోరాటం, అంబేద్కర్‌తో విభేదాలు, కాంగ్రెస్ ఏర్పాటు, నెహ్రూకు అధికారాన్ని కల్పించడం.. తదితర ఆనాటి దేశ స్థితి గతులను, స్వాతంత్ర పోరాట చరిత్రను మనకు తెలుపుతుంది.

మహాత్మా జోతిరావు పులే :

పీష్వాల కాలాంతంలో పుట్టి దళిత, శూద్ర వర్ణాల అభ్యున్నతి కోసం పాటుపడిన జోతిరావు పులే జీవిత చరిత్రను కూడా అంతటి 'మహాత్మ పంచకం'లో పొందు పరిచారు.

తెలివైన విద్యార్థి అయిన జోతిబాను చదువు బ్రాహ్మణులు అడ్డుకోవడంతో మధ్యలోనే ఆటకెక్కింది. అయినా ఆయన నొచ్చుకోలేదు. బడిమానేసినా చదువు ఆపలేదు. పగలంతా పొలం పనులు చేసుకుని, రాత్రి దీపం వెలుగులో చదువుకునే వారు. ఆయన శ్రద్ధ ఒక మతాధికారిని ఆకట్టుకుంది. ఆయన సూచనతో జోతిబా తండ్రి ఆయనను మళ్లీ బడికి పంపాడు. బ్రాహ్మణ వర్గాల ఆధిక్యత వున్న ఆకాలంలో ఆయన పడిన కష్టాలు అంతులేనివి.

తనలాగా మరే శూద్ర, దళిత విద్యార్థీ అవస్థ పడ రాదన్న కోరికతో ఆయన శూద్రులు, దళితులు, మహిళల కోసం పాఠశాలను ప్రారంభించారు. ఈ ఘటన ఆ కాలంలో సంచలనం సృష్టించింది. అగ్రవర్ణాలకు ఆగ్రహాన్ని కలిగించింది. దీనికితోడు తన భార్య సావిత్రిబాయికి చదువు నేర్పించి ఆమెను ఆ పాఠశాలలో ఉపాధ్యాయినిని చేశారు పులే. మనుస్మృతిని, ఇతర ధర్మశాస్త్రాలను ఆయన సవాలుచేశారు. ఆంగ్లేయుల కాలం కావడంతో సరి పోయింది గానీ, పీష్వాల కాలం గనుక అయి వుంటే జోతిబాకు, సావిత్రికి 'కొరత' తప్పేదికాదు.

అయినా సరే జోతిబాకు కష్టాలు తప్పలేదు. సావిత్రికి అవమానాలు తప్పలేదు. అయినా వెనకంజ వేయకుండా జోతిబా తాను అనుకున్న దాన్ని సాధించాడు. అనేకమంది శూద్ర, దళిత, మహిళలను విద్యావంతులను చేశారు.

"బాలికల విద్య వారూహించలేని విషయం. అందుకు బ్రాహ్మణులు సమావేశాలు జరిపారు. చర్చలు జరిపారు. జోతిబాను ఖండించారు. మండిపోసాగారు. జోతిబాను ఏమిచేయడం? ఇదే గనుక తమ తాతల కాలంలో జరిగివుంటే జోతిబాను ఏనుగు కాళ్లకింద తొక్కించి

వుండేవారు. పరిస్థితులు మారాయి. ఇంగ్లీషువాళ్ల రాజ్యం ఇది."4

ఇది మాత్రమే కాదు. ఆయన వితంతువుల కోసం శరణాలయాలను స్థాపించారు. పురోహితులు లేకుండా వివాహాలను జరిపించేవారు. కులవివక్షకు వ్యతిరేకంగా ఉద్యమాలను కూడా నిర్వహించారు. గాంధీజీకన్నా ముందే సత్యాగ్రహాన్ని ఆయుధంగా వాడిన మొదటి వ్యక్తి జోతిబాఫులేనే. ఆ తరువాత చాలా సంవత్సరాల తర్వాతే గాంధీజీ సత్యాగ్రహ మార్గాన్ని ఎంచుకున్నారు. జోతిబా మహాత్ముడని సాక్షాత్తూ మహాత్మాగాంధీచే కొనియాడబడిన ధన్యజీవి. గాంధీజీనే కాదు. అనేకమంది జోతిబా ఉద్యమానికి ప్రభావితులయ్యారు. సమాజానికి అంత గొప్ప సేవలందించారు కాబట్టే నేటికీ గాంధీజీ వలెనే జోతిబా, సావిత్రిబాయి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

నారాయణగురు :

కేరళలోని తిరువాన్కూరు సంస్థానంలో శూద్రకులంలో జన్మించిన నానూ ఆశాన్ (నారాయణ గురు) సమాజంలో పెనువిప్లవాన్ని తీసుకువచ్చారు.

బాల్యంలోనే వైరాగ్యం వైపు ఆకర్షితుడైన నానూ ఆశాన్ అనేకమంది గురువుల సాయంతో జ్ఞానిగా మారారు. తానే స్వయంగా తపస్సునుచేసి నారాయణ గురు అయ్యారు. అయితే అనేకమంది సాధుసన్యాసుల వలె ఆయన సమాజానికి దూరంగా వుండిపోలేదు. సమాజంలో అంతర్భాగంగా మారి వర్ణవ్యవస్థను రూపుమాపడానికి నడుం బిగించారు.

శూద్ర, దళితుల కోసం ప్రత్యేకమైన ఆలయాలను నిర్మించడం ఆ కాలంలో పెనుదుమారం రేపింది. పైగా ఇతర ఆలయాల్లో వలె కాకుండా బ్రాహ్మణులు లేకుండానే పూజలు నిర్వహించడం, అత్యంత శుచీ శుభ్రతను పాటించడం అక్కడే గ్రంథాలయాలను కూడా ఏర్పరచడం అందర్నీ ఆశ్చర్య చకితులను చేసింది.

దీనితో పాటు శూద్ర, దళితులకు వేదాలు నేర్పడం ఆనాటి సమాజాన్ని కుదిపివేసింది. వారికోసం ప్రత్యేకంగా వేద పాఠశాలను ప్రారంభించారు నారాయణ గురు. ఆయన ఆశ్రమంలో వర్ణవివక్షకు చోటుండేది కాదు. కులమతాలకతీతంగా అందర్నీ ఆయన సమానంగా చూశారు.

"నారాయణ గురు తన ఆశ్రమాన్ని కులరహితం చేశారు. సమాజంలోని అన్ని కులాలనుండీ తన శిష్య వర్గంలో చేర్చుకున్నారు. అందులో బ్రాహ్మణులూ, హరిజనులూ కూడా వున్నారు. ఆయన అనుచరుల్లో హిందువులతో పాటు, ముస్లింలూ, క్రైస్తవులూ, బౌద్ధ మతస్తులూ కూడా వున్నారు."5 తిరువాన్కూరులో దళితులపై వివక్షకు వ్యతిరేకంగా గాంధీజీ చేసిన సత్యాగ్రహానికి నారాయణ గురు మద్దతునిచ్చారు. ఆర్థికపరంగా, సామాజికంగా అవసరమైన మద్దతును ఆయన గాంధీజీకి ఇచ్చారు. నారాయణ గురుతో సమావేశం అనంతరమే గాంధీజీ అస్పృశ్యతా నివారణను కాంగ్రెస్ ప్రణాళికలో చేర్చారు.

అందుకే అట్టడుగు వర్గాలకు ఆత్మవిశ్వాసాన్ని నూరి పోసిన ఆ ధీరుడిని, మహాయోగిని నిరంతరం స్మరించుకుంటూనే వుండాల్సిన అవసరం ఎంతైనా వుంది.

మహాత్మా అంబేడ్కర్ :

మహాత్మా పంచకంలో ఐదవవారు బాబాసాహెబ్ అంబేడ్కర్. అంబేడ్కర్ జీవితమంతా ఏటికి ఎదురీతే.. అడుగడుగునా ఎదురైన అవమానాలు అంబేడ్కర్‌లో పట్టుదలను పెంచి ఆయనను శిఖరాగ్రానికి చేర్చాయి.

నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన అంబేడ్కర్ అనేక కష్టనష్టాలకోర్చి చదువుకున్నారు. తండ్రి రాంజీ పోరాట స్ఫూర్తినే అంబేడ్కర్ కూడా అందుకున్నారు. తాగడానికి మంచినీరు కూడా లేని దైన్యస్థితిని కూడా అయ అనుభవించారు. హైందవమతంలోని వర్ణ వివక్ష ఆయనను తీవ్రంగా గాయపరచడంతో బౌద్ధమతాన్ని స్వీకరించారు.

బరోడా రాజు సాయంతో అమెరికా, ఇంగ్లండుల్లో చదువుకున్నారు. తిరిగి వచ్చాక బరోడా రాజు కొలువులో ఉద్యోగానికి చేరారు. అక్కడ తనను ఇతర ఉద్యోగులు విపక్షతో చూడడాన్ని తట్టుకోలేక ఆ ఉద్యోగం మానేశారు.

తర్వాత కొల్హాపూర్ రాజు సహాయంతో లండన్‌కు వెళ్లి అక్కడ విద్యను అభ్యసించారు. అంబేడ్కర్‌లాంటి విద్యావంతులు ఆ కాలంలో మరొకరు వుండరనడంలో అతిశయోక్తి లేదు. అయితే కేవలం భారతదేశంలో వేళ్లూనుకునిపోయి వున్న వర్ణవ్యవస్థ కారణంగా ఆయన ఉన్నత పదవులను అందుకోలేకపోయారు. కుటుంబ పోషణ కోసం తన అర్హతకు తగని అనేక ఉద్యోగాలు చేశారు.

అనంతరం రాజకీయాలలోకి ప్రవేశించి మహద్ ఉద్యమాన్ని విజయవంతంగా నడిపారు. దేశంలో వున్న కులవివక్షను తీవ్రంగా నిరసించారు. దళితులకు ప్రత్యేక నియోజకవర్గాల కోసం పోరాటం చేశారు. దీనికోసం జాతిపిత మహాత్మాగాంధీతోనే తలపడ్డారు. దళిత అభ్యున్నతి కోసం గాంధీజీతో ఏర్పడిన విభేదాలను కూడా ఆయన ఎదుర్కొన్నారు. గాంధీజీ ప్రతిపాదించిన 'హరిజన' పదం సరైనది కాదని తప్పుడు అర్థాన్ని యిచ్చి దళితుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిమ్నజాతీయుల కోసం ఉమ్మడి పాఠశాలలు, స్కాలర్‌షిప్పులను సాధించారు. వారికి దేవాలయ ప్రవేశంకోసం ఉద్యమాలు నిర్వహించారు. లండన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో దళితులకు నిజమైన ప్రతినిధిని తానేనని, గాంధీజీ కాదని ప్రకటించారు. ఈ ప్రకటన దేశంలో సంచలనం సృష్టించింది.

"1931 మేలో, లండన్‌లో రౌండ్‌టేబుల్ సభ జరిగింది. గాంధీజీ, మాలవీయ, సరోజినీనాయుడు, కాంగ్రెస్ ప్రతినిధులు. దళితుల తరపున అంబేడ్కర్ ప్రతినిధిగా పాల్గొన్నాడు. సభలో గాంధీ హరిజనులకు తాను ప్రాతినిధ్యం వహిస్తున్నానన్నాడు. అంబేడ్కర్ ఒప్పుకోలేదు. ఆ మహాసభలోనే తిరస్కరించాడు. గాంధీజీ అప్పటికి దేవుడులాగా చూడబడుతున్నాడు. అలాంటి వాడిని నలభైయేళ్ల అంబేడ్కర్ ఎదుర్కొన్నాడు. అంబేడ్కర్ ఆవేశం అటువంటిది.

నిమ్నజాతులయెడ ఆయన కర్తవ్యం అంతటిది. కాంగ్రెస్‌వల్లా, గాంధీజీవల్లా నిమ్నజాతులకు మేలు జరగలేదన్న బాధ ఆయనది."6

దేశ విభజన అనంతరం కొన్నాళ్లకు ఇరువర్గాలూ పశ్చాత్తాపపడతాయని, పాకిస్తాన్ సమస్యల్లో పడుతుందని ఆయన ఆనాడే ఊహించి అదేవిషయాన్ని నిర్మొహమాటంగా చెప్పారు. అంబేడ్కర్ తన జీవితకాలంలో అనేక పురస్కారాలను అందుకున్నారు. రాజ్యసభ సభ్యునిగా, కేంద్రమంత్రిగా పనిచేశారు. అయితే కేంద్రమంత్రి పదవిలో ఇమడలేక పదవికి రాజీనామా చేశారు.

నేడు భారతదేశంలో ప్రజాస్వామ్యం ఒడిదుడుకులకు లోనైనా స్థిరంగా వుండగలుగుతోందంటే, అన్నివర్గాల ప్రజలు నిర్భీతిగా బతకగలుగుతున్నారంటే ఏకైక కారకుడు అంబేడ్కరే. ఆయన మన రాజ్యాంగాన్ని అత్యంత పటిష్టంగా రూపొందించారు. ఏ వ్యవస్థ అయినా తప్పుదారి పడితే దానిని సరిదిద్దేందుకు మరొక వ్యవస్థను ఆయన సిద్ధంగా వుంచారు. ఇది ఆయన దూరదృష్టిని తెలుపుతుంది. రాజ్యాంగ నిర్మాతగా అంత గొప్ప విద్యావేత్తను నియమించడమే మనదేశ ప్రజాస్వామ్యపు తొలి విజయంగా భావించవచ్చు. తన జీవితమంతా పోరాటంలో గడిపిన అంబేడ్కర్ తన తర్వాతి తరాలకు భద్రమైన జీవితాన్ని కల్పించి 1956 డిసెంబర్‌లో కన్నుమూశారు.

పైన పేర్కొన్న మహానుభావుల మార్గాలు వేరై వుండవచ్చు. కానీ వారి గమ్యం మాత్రం ఒక్కటే. పేద, దళిత, శూద్రవర్గాల అభ్యున్నతికే వారు తమ జీవితాన్ని వెచ్చించారు. ఇలాంటి కర్మవీరుల జీవిత చరిత్ర చదివితేనే నేటితరానికి తమకోసం ఆ మహానుభావులు చేసిన త్యాగం అర్థం అవుతుంది. ఈ పుస్తకాన్ని పునర్ముద్రించి, వీలైతే ఆంగ్లంలోకి అనువదించి నేటి యువతకు అందుబాటులోకి తీసుకురావలసిన అవసరం ఎంతైనా వుంది.

ఆధారగ్రంథ సూచి :

1. మహోన్నత మానవతామూర్తి డాక్టర్ అంతటి, ఎస్.వి.రమణారావు, ఆరుపదుల అంతటి, డాక్టర్ అంతటి షష్టిపూర్తి సన్మాన సంఘం, హైదరాబాదు. జనవరి 1, 1987 పుట 57
2. మహాత్మ పంచకం జీవిత చరిత్రలు, బుద్ధ పరమాత్మ, డాక్టర్ అంతటి నరసింహం, 4, సంతోష్ డీలక్స్ అపార్ట్‌మెంట్స్, మెహదీపట్నం, హైదరాబాదు, 1996, పుట:10
3. మహాత్మ పంచకం జీవిత చరిత్రలు, మహాత్మాగాంధీ, డాక్టర్ అంతటి నరసింహం, 4, సంతోష్ డీలక్స్ అపార్ట్‌మెంట్స్, మెహదీపట్నం, హైదరాబాదు, 1996, పుట:17
4. మహాత్మ పంచకం జీవిత చరిత్రలు, మహాత్మా జోతిరావు ఫులే, డాక్టర్ అంతటి నరసింహం, 4, సంతోష్ డీలక్స్ అపార్ట్‌మెంట్స్, మెహదీపట్నం, హైదరాబాదు, 1996, పుట:14
5. మహాత్మ పంచకం జీవిత చరిత్రలు, నారాయణగురు, డాక్టర్ అంతటి నరసింహం, 4, సంతోష్ డీలక్స్ అపార్ట్‌మెంట్స్, మెహదీపట్నం, హైదరాబాదు, 1996, పుట:19
6. మహాత్మ పంచకం జీవిత చరిత్రలు, మహాత్మా అంబేడ్కర్, డాక్టర్ అంతటి నరసింహం, 4, సంతోష్ డీలక్స్ అపార్ట్‌మెంట్స్, మెహదీపట్నం, హైదరాబాదు, 1996, పుట:23

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

గిరిజన నవలలో స్త్రీల ఆర్థిక సమస్యలు

- ఆలకుంట్ల యాదయ్య, తెలుగు సహాయాచార్యులు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, జడ్చర్ల.

తెలుగు నవలలను సాంఘిక నవలలు, జానపద నవలలు, డిటెక్టివ్ నవలలు, పరిశోధనాత్మక నవలలు, ప్రయోగాత్మక నవలలు, ఉద్యమ నవలలు, సామాజిక పరిణామాల నవలలు, మధ్యతరగతి నవలలు, గ్రామీణ జీవితాల నవలలు, ఆయా ప్రత్యేక వృత్తుల చిత్రణ నవలలు, కార్మిక నవలలు, రైతు జీవితాల నవలలు, స్త్రీల గురించిన నవలలు, స్త్రీవాద నవలలు, విప్లవ నవలలు, విప్లవవాద నవలలు, దళిత నవలలు, దళితవాద నవలలు, బీసీ నవలలు, బీసీవాద నవలలు, ముస్లిం నవలలు, ముస్లింవాద నవలలు, క్రైస్తవ నవలలు, క్రైస్తవవాద నవలలు మొదలైన ఎన్నో రకాలుగా నవలలను వర్గీకరించవచ్చు. వీటితోపాటు గిరిజన నవలలను అనేకమంది రచయితలు తెలుగు సాహిత్యంలో విశ్లేషించారు. గిరిజన నవలలను వాటిలో ఉన్న గిరిజన సమస్యలను వివరించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

నవలా రచన, పఠనం కొంతమంది వినోదం, కాలక్షేపం కోసం భావించవచ్చు. కొంతమంది సమాజాన్ని, మానవ స్వభావాలను, జీవితాలను, సైకాలజీని అర్థం చేసుకోవడానికి రాయవచ్చు. అందుకోసం చదవవచ్చు. మరికొంతమంది ఈ సమాజాన్ని మార్చాలని, సామాజిక విలువల్లో, ఆలోచనల్లో, సంస్కృతిలో మార్పులు తేవాలని, బాధితులపట్ల, పీడితులపట్ల, పేదలపట్ల వికలాంగుల పట్ల, పిల్లలపట్ల గిరిజన సమాజం చిన్నచూపు చూసేవారిపట్ల మద్దతుగా నిలుస్తూ, వారికి చేయూత నివ్వాలని, సంఘాన్ని సంస్కరించాలని, అందుకు చూసే దృష్టిలో మార్పు తేవాలని, రచన చేస్తుంటారు. ఆధునిక కాలంలో అనేక జాతుల జీవితాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రపంచంలో ఏ మూల ఉన్నా ఆ జాతి జీవితం గురించి తెలుసుకోవడానికి ప్రధానమైన ఆధారం సాహిత్యం. సాహిత్యం జీవిత లోతుల్లోకి వెళ్ళి వాళ్ళ సాధక బాధలను వింగడించి సమాజానికి అందిస్తుంది. కాలం మనిషిని నిర్ణయిస్తుంది. కానీ, మనిషి కాలాన్ని నిర్ణయించలేడు. కాలానుగుణంగా మానవుడు నడుచుకుంటాడు. ఆ క్రమంలోనే జీవితాన్ని తనకు కావలసిన విధానంలో తీర్చిదిద్దుకుంటాడు. ఆ విధానంలో జీవితాన్ని మలుచుకోకపోతే కొన్ని సమస్యలను ఎదుర్కొంటాడు. అవి సాహిత్యపరంగా సృజనీకరించుకోవడానికి ముడి సరుకులాగా ఉపయోగపడుతుంటాయి.

అలా అనేక జాతుల సాహిత్యం వెలుగులోకి వచ్చిన తరుణంలో గిరిజన సాహిత్యం కూడా ముందుకు వచ్చింది. తెలుగులో కంటె ఎక్కువగా హిందీ, బెంగాలీ, గుజరాతీ, ఒరిస్సా భాషలో గిరిజన సాహిత్యం ఎక్కువగా వచ్చింది. ప్రకృతి ప్రసాదించిన అడవి గిరిజనుడికి ఆధారం. ఆ అడవుల్లో కొండ కోనల్లో జీవిస్తున్న గిరిజన జీవితాల గురించి పురాణాతిహాసాల్లో అనాగరికుల, అమాయకులని చిత్రింపబడింది, కానీ, ఆధునిక కాలంలో కొంత వరకు ప్రజాస్వామ్య ధోరణి కనిపిస్తుంది. ఆ జాతి జనుల ఆలోచనల ప్రతి ఫలింపబడుతున్నాయి.చరిత్రను వర్గ పోరాటాల చరిత్రగా, సమాజాన్ని వర్గ సమాజంగా చూస్తుంది మార్క్సిజం. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనని కూడా చెప్తుంది. మానవ సమాజ చరిత్రను పరిశీలించినట్లైతే ఎప్పుడూ ఒక వర్గం పీడించేదిగానూ, ఒక వర్గం పీడింపబడేదిగానూ ఉంటుంది. కొంత కాలానికి పీడితులలో చైతన్యం వచ్చి పోరాటం ద్వారా సమాజంలో మౌలిక మార్పును తీసుకువస్తారు. ఫలితంగా సమాజ స్వరూపం మారుతోంది.

భారతదేశంలో గిరిజనుల జీవనం, వారి ఆర్థిక వ్యవస్థ యావత్తూ అడవులతోనే పెనవేసుకుపోయింది. అత్యధిక

గిరిజన జనాభా పూర్తిగా అడవుల్లోనే జీవిస్తూ అటవీ ఉత్పత్తులతోనే జీవనోపాధి కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా దుంపలు, గడ్డలు వారికి ఆహారంగా ఉపయోగ పడతున్నాయి. చిన్న చిన్న అడవి జంతువులను వేటాడి ఆహారంగా భుజిస్తుంటారు. అయితే వేట ప్రధానంగా జీవిస్తున్న గిరిజనుల సంఖ్య తక్కువే. ముఖ్యంగా ఒరిస్సా, మధ్య ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో వారి జనాభా కొంత వరకు వుంది. ఇప్పపూలు, విత్తనాలు, తునికాకు, దుంపలు, వెదురుబొంగు, చింతపండు కుంకుడుకాయలు మొదలైన అటవీ ఉత్పత్తుల మీద ఆధారపడి వీరి జీవనం సాగుతోంది. ఇక్కడ ఆర్థిక విధానంలో గిరిజనుల పరిస్థితిని రచయిత్రులు నవలల్లో ఏ రకంగా చిత్రించడం జరిగిందో చూడడం జరిగింది.

గిరిజన ఆర్థిక వ్యవస్థ అడవితో ముడిపడి ఉంటుం దనేది గుర్తించాల్సిన విషయం. కాని ఆర్థిక జీవన విధానంలో గిరిజనుల ఎక్కడ వెనకపడిపోతున్నారు? అని ఆలోచిస్తే వ్యవస్థలో వివిధ రకాలైన లోపాలున్నాయని గిరిజన నవల రచయితులు తమ తమ నవలలో చెప్పడం జరిగింది. దాదాపు గిరిజన నవలలన్నీ ఆర్థిక వ్యవస్థను చిత్రించినవే ఎక్కువగా ఉన్నాయి.

గిరిజన పన్నులు :

'అడవి' నవలలో 'పొద్దున లేవగానే తిండి తిప్పలు కానిచ్చి, మూట ముల్లె చేత పట్టుకొని ముంత సర్ధుకొని తలలకెత్తుకొని, పిల్లాపాపలతో అల్లిగూడెం నుండి పిట్ట బొంగారం వైపు ప్రయాణం కాసాగారు నాయకపోళ్ళు. అంతలోకి గుర్రాలపై దిగారు జంగ్లాత్ వాళ్ళు. జంగ్లాత్ వాళ్ళు గుర్రుల చూడగానే నాయకపోళ్ళ పై ప్రాణాలు పైకే పోయినట్లయ్యాయి. కాని వాళ్ళు వచ్చింది నాయక పోళ్ల గురించి కాదు, ప్రతియేటా వారు చేసే వసూళ్ల కోసం. ఇలా గిరిజనులు అధికార్లకు ప్రతి దానికి పన్ను రూపంలో చెల్లించడం ఆనవాయితీ.

'పునరావాసం' నవలలో పన్నులు కట్టిగా గానీ, కట్టలేదనే నెపంతో లేదా గిరిజన గుడిసెలు కాలబట్టడమో చేసేస్తే కట్టిన రశీదు ఉండదు. మామూలు ప్రజల లాగా దాచుకోవడానికి గిరిజనులకు ప్రత్యేకమైన సదు పాయాలంటే ఏమీ ఉండవు కాబట్టి దాన్నీ అధికారులు గ్రహించి గుడిసెలను కాలబెట్టడం నేర్చుకున్నారు. దాంతో గుడిసెలో దాచి పెట్టిన రశీదు కాలిపోతుంది. మళ్ళీ పన్ను రూపంలో గిరిజనులను దోచుకోవచ్చు. ఒక విధంగా చూసినట్లయితే గిరిజనులు అనాది కాలం నుండి బాగా వెనకపడి పోవడానికి అనేక కారణాలల్లో పన్ను చెల్లించడం కూడా ఒక ప్రధాన కారణం.

గిరిజన స్త్రీ- లైంగిక వేధింపులు :

గిరిజనుల పై జరిగే లైంగిక వేధింపులు ఆర్థిక సమస్యలతో ముడిపడి ఉంటాయి. గిరిజనులు ఆర్థికంగా సమాజంలో బాగా వెనకబడి ఉంటారు. అందువల్ల పనులు చేయడానికి పట్టణ ప్రాంతాలకు వెళ్లడం ఒక కోణమైతే, ఆర్థికంగా వెనకబడి ఉంటారు కాబట్టి అధికార్లకు దాసోహంగా ఉండడం మరోకోణం. గిరిజనుల దగ్గర డబ్బులు ఏదైనా పంట చేతికొస్తేనే, లేక బంక, ఆకులు, గిరిజన మూలికలు మొదలైన అమ్మడం వల్ల వచ్చే డబ్బులు అప్పుడప్పుడు ఉంటుంటాయి. ఆ డబ్బులు అధికార్లు అడిగిన పన్నులకు సరిపోకపోవడం వల్ల, కొన్ని రోజుల తర్వాత చెల్లిస్తామని వేడుకున్న అధికార్లు గూడెం (గిరిజన తండాలు) గూడెం తిరిగి గిరిజన స్త్రీల పై లైంగిక దోపిడి చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో ఎటువంటి సందర్భం లేకపోయినా, లైంగిక కోరిక తీర్చుకోవటానికి కూడా గిరిజన గూడెంకు వెళ్తుంటారు. ఆ రకంగా కూడా గిరిజన స్త్రీ పై లైంగిక దాడి తప్పడం లేదు.

రైల్వే స్టేషన్లో, రైళ్ళలో పల్లీలు అమ్ముకుంటూ కనిపించే స్త్రీలు గిరిజనులే. ఈ మధ్య గిరిజనులలో వలస ఎక్కువైంది. గ్రామాల నుండి పట్టణ ప్రాంతానికి రావడం జరుగుతుంది. ఊర్లో పనులు లేక తినడానికి తిండి లేక బతకడం కోణం పట్టణ ప్రాంతానికి చేరుకుంటారు. కొన్ని రోజులు పట్టణ ప్రాంత వాతావరణానికి అలవాటు

పడుతున్న తరుణంలో పట్టణ దాడికి బలై కొన్ని సార్లు చనిపోవడం, కొన్ని సార్లు లైంగికంగా చితికిపోవడం జరుగుతుంటుంది. ఏరకంగా గిరిజనులను చూసినా, ఎక్కుడ చూసినా గిరిజనేతర్లు దాడులు తప్పించుకోవడం గగన తరమవుతుంటుంది. అందువల్లే గిరిజనులు తొందరగా నాగరిక జీవితానికి అలవాటు పడలేక పోతున్నారు.

'ఎల్లి' నవలలో 'ఆ వూళ్ళో పోకిరి కుర్రోళ్ళు బాజిని చూసి యీలలెయ్యటం కన్నుగీటటం చేస్తూనే వున్నారు. ఆ కుర్రాళ్ళల్లో వొకడు బాజికి బాగా దగ్గిరిగా వొచ్చి తెలిసికూడా నీ పేరింటి పిల్లా అన్నాడు. వొస్తే డబ్బులిస్తాం వొదదు అంది యెలాగో గొంతు పెగల్చుకుని. వొద్దా. పోన్లే వూరికే రా అని జబ్బు పట్టుకున్నారు యిద్దరూ. నేనురాను నన్ను వొదలండి అని గింజుకుంది. మరుసటి రోజు సందేలకి చిన్న కుక్కిమంచంలో వొక శవాన్ని తీసుకొచ్చారు. సుబ్బన్న గుడిసెకి. తీసుకొచ్చింది అల్లుడు కోటయ్య. అలా కాలవలో పడని బాజి శవం గుండారు గుడెం లాకులకి పట్టింది.

బాజి చేసుకున్న పాపం ఏమిటి ? అని ఆలోచిస్తే ఒంటరిగా చిగురుకు వెళ్ళడమే తప్పు అనిపిస్తోంది. ఎరుకుల కులంలో పుట్టిన బాజి జీవితాన్ని చిగురిస్తున్న చిగురాకులా మొలకల్లోనే తెంపేసినట్టు నాశనం చేశారు. గటిపూట గిరిజన స్త్రీ ఒంటరిగా తిరిగితేనే బాజిలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. గాంధీ గారు చెప్పినట్టు ఏ అర్ధరాత్రితో ఒంటరిగా తిరిగితే, ఆ నన్నివేశం చూద్దామన్నా గిరిజన గూడెంలో కనిపించదు.

గిరిజన కుటుంబంతో వ్యవసాయ పనులు చేయించు కున్న దొర, దొర అనే ముసుగుతో దొర కొడుకు ప్రవర్తించిన విధానం వల్ల అమాయక గిరిజన స్త్రీ జీవితం బుగ్గిపాలైంది. కేవలం లైంగిక కోరిక తీర్చటానికి మాత్రమే గిరిజన స్త్రీ అవసరమవుతుంది. పెళ్ళికి మాత్రం పనికిరాదు. 'అడవి' నవలలో అటువంటి చూపు పక్కకు తిప్పారు తల్లి పక్కన బిడ్డకనిపించింది. ఇంకా పెద్దమనిషి కాలేదు. పేరు మోతి మోతి నిజంగా ముత్యంలాగా ఉంది. భయం భయంగా చూస్తున్న మోతి చేయిని చటుక్కున అందుకున్నాడు సేరేదార్. గారగార ఈడ్చు కుంటూ పంతులు పట్వారి దివాన్ ఖాన్‌లోకి ఈడ్చుకు పోయాడు. మోతి తూలుతూ బయటకొచ్చింది. వెంటనే చౌకీదార్ తన బాధ్యత జవానుకు అప్పజెప్పి తను మోతీని తీసుకుని పక్క గదిలోకి దూరాడు. ఒకరి తరువాత ఒకరు.. ముందు సేరెదార్ తర్వాత చౌకీదార్, మళ్ళీ జవాను, మళ్ళీ ఇంకో జవాను.. ఒకరి తర్వాత ఒకరు తుపాకి తూటాను కొలాముల గుండెలకు గురిపెట్టి ఆ ముత్యంతో ఆడుకున్నారు. చూస్తుండగానే తెల్లవారిపోయింది. అటు ఈ ముత్యం నల్లబడిపోయింది. ఇటు చౌకీదార్ వెంట గదిలోకి వెళ్ళిన మోతి మళ్ళా లేచి నిలబడలేదు. ఇంకా సేరేదార్ లేవలేదు. అప్పటికీ మోతీ ప్రాణం పోయింది. మోతి ఇంకా పెద్దమనిషి కాలేని గిరిజన అమ్మాయి. ఆమెను సేరేదార్, చౌకీదార్, చివరికి జవాను కూడా ఆమెను అనుభవించి పూవ్వును రాల్చినట్టు మోతి జీవితంతో ఆడుకున్నారు. అందుకే గిరిజనులు అడవిలో క్రూర మృగాలన్నా భయపడరేమో, కానీ, ప్రభుత్వ అధికారులంటే, గిరిజనేతరులంటే ఆ జంతువుల కంటే ఎక్కువ భయపడ్తారు. పురాసవాసం నవలలో వలసకి వచ్చే ఒక కాంట్రాక్టర్ బంతిని ప్రేమించేటట్టు చేశాడు. బంతి పది చదివి ఫైయిలై ఇంటి దగ్గర ఉంటుంది. కాలనీ పనులకి వెళ్ళుతుంటుంది. అక్కడే ఆ కాంట్రాక్టర్ దృష్టిలో పడ్డది బంతి. ఆమెకు ఎన్నో మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు రాజుబాబు.

కాంట్రాక్టరు రాజబాబు చదువుకొమని చెప్పితే తండ్రి లాంటి వాడనుకుంది బంతి. ప్రేమిస్తున్నడని తెలిస్తే ప్రాణం ఇవ్వడానికి సిద్ధమైంది. ఎందుకంటే మోసం చేయడం గిరిజనేతరులకు ఏ విధంగా అలవాటో, మోస పోవడం గిరిజనులకు పుట్టుకతోనే అలవాటైపోయింది. బంతిని కావాల్సినంత సేపు వాడుకున్నాడు రాజబాబు. కడుపొచ్చిన తర్వాత ఉద్యోగమే బదిలీ చెయించు

కున్నాడు. ఎక్కడుంటాడో తెలియదు. ఒకవేళ తెలిసిన ఏమీ చెయ్యలేరు. అందుకే ఇది నాకర్మ అని ఊరుకుంది బంతి. గిరిజన తండాల్లో ఎందరివో జీవితాలు బంతిలా బలైపోతున్నాయి.

సరిహద్దు నవలలో ఇగ సాయబులు, జంగలోల్లు పేపరు మిల్లోల్లులు షాకుల రాముళ్ళైరి. వాల్ల చేతుల్లల్లనే వీల్ల కూలిపనులాయో. లొంగకపోతే మీదికెళ్ళి కొత్తలు (పైసలు) ఆశ చూపిచ్చిరి. అల్లు చెప్పినట్టు ఇనకుంటే పని బందాయె. కాదు పోదంటే బలిమికి మానభంగం కూడా చేస్తారాయె. ఈల్లకు దిక్కెవలు? పడచు వ్యవహారమాయె. ముందే చెప్పుకున్నట్టు గిరిజనులు ఆర్థికంగా ఎదిగినప్పుడే ఇటువంటి వాటిని నివారించడం సాధ్యమవుతుంది. అప్పటి వరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. సంఘం నవలలో కొన్ని సందర్భాలలో బాకీ చెల్లించక పోయినవాని భార్యో, కూతురో, చెల్లో వయస్సు, అందమూ గలదిగా వుంటే, అతని కామదాహాన్ని కూడా తీరుస్తూ పడి వుండాలి. అప్పుడప్పుడు ఇలాంటి స్త్రీలు చేతి బిడ్డతో తిరిగి రావడం కూడా కద్దు. దాన్నెవరూ పట్టించుకోరాదు. అలాగాక దాన్నెవరైనా ప్రశ్నిస్తే వారు తమ ఫలసాయాన్ని అమ్ముకోవడానికీ, ఇంటి సరుకులు కొనుక్కోవడానికీ మైదాన ప్రాంతంలో జరిగే సంతకు రాలేదు. అది వారిని విషమిచ్చి చంపడమే అవుతుంది.

పేదవాడిగా పుట్టడం మనిషి చేసుకున్న పాపం కాదు. అలా అని ధనవంతుడుగా పుట్టటం మనిషి చేసుకున్న అదృష్టం కాదు. అవన్నీ కాలక్రమంలో కనుమరుగై పోతాయి. ఒక్కొక్కసారి పేదవాడే ధనవంతుడుగా మారడం ప్రకృతి భేదంలేని దాన్ని నిరూపిస్తుంది. కాబట్టి గిరిజనులు డబ్బులు లేక ఉన్నవాడి దగ్గర అప్పు తీసుకోవడమే గిరిజనులు చేసుకుంటున్న పాపం. దానివల్ల గిరిజన స్త్రీలు శీలాన్ని అమ్ముకునే పరిస్థితి వస్తుందని వారికి తెలియదు.

ఇలా ప్రతి గిరిజన నవలలను పరికించినట్లయితే లైంగిక అపహరణలు ఏ విధంగా విచ్చలవిడిగా గిరిజన ప్రాంతంల్లో జరుగుతున్నాయో అర్థమవుతుంది.

గిరిజన స్త్రీలు- సంతలో ముడిసరుకా ? :

స్త్రీకి రక్షణ లభిస్తుందా ? లభిస్తే ఎందుకు హత్యలకు, లైంగిక దాడులకు బలవన్మరణా లకు పాల్పడుతున్నారు. స్త్రీ ఎందుకు ఒక ముడి సరకులాగ అమ్ముడు పోతున్నారు? అనే అంశాలను స్ఫురిస్తాయి. వాటిని వివిధ కోణాల్లో ఆలోచించవల్సిన అవసరం ఉంది. తెలుగు సాహిత్యంలో స్త్రీ లైంగిక స్వేచ్ఛకు పట్టంకడుతూ చలం, స్త్రీల జీవితాలను కూడా నియంత్రించేది ఆర్థిక అంశాలే నని కొడవగంటి కుటుంబరావు, లాంటి వారు అనేక కోణా లను స్పృశించి రచనలు చేశారు.

గిరిజన ప్రాంతాల్లో స్త్రీ ఎందుకు సంతలో ఒక ముడి సరుకులాగా అమ్ముడుపోతుంది. లేక గిరిజన సమాజం స్త్రీని ఒక ముడిసరుకుగా భావించుకుంటుందా? అనే అంశాన్ని పరిశీలించినట్లయితే అనేక అంశాలు తెలిసి వస్తాయి. 'ఎల్లి' నవలలో గిరిజన స్త్రీ ఏ విధంగా ముడి సరుకుగా మారుతుందో, మార్చుతున్నారో రచయిత్రి యిలా వర్ణిస్తుంది. 'మాబతుకులా యేముందమ్మ గారూ యేదో పుట్టింటోళ్ళు వోలి పుచ్చుకుని వొకటికి అమ్మేసు కుంటారు. దానికి మనువని పెద్దపేరూ. యికాడిష్టం మాలో ఆడదానికి యిష్టమేముంది అమ్మగారు. ఆడు యెవడికైనా అమ్మితే ఆడెమ్మట యెల్లిపోవాలి. యిష్టమున్నా లేకపోయినా గొడ్డులాగా మొగుడు దిక్కు మాలిన సచ్చినోడైతే యింకొక్కణ్ణి మారు మనువు కట్టు కుందామన్నా ఆ మారు మనువోడు దొరకాలి. దొరికినా యీణ్ణి వొదిలి ఆడెమ్మట యెల్లాలంటే యిడిచ్చిన వోలంతా తిరిగి కట్టాలి.

గిరిజన కులాల్లో స్త్రీ పట్ల ఎటువంటి వ్యవస్థ నడుస్తోంది ఈ వర్ణనను బట్టి అర్థమవుతుంది. పెండ్లి చేసుకుంటేనే స్త్రీకి భద్రత అనుకున్నాం. భర్తే స్త్రీని ముడి సరుకుగా అమ్ముకుంటున్న తీరుని ఎల్లి నవల ఎత్తి

చూపింది. ఇటువంటి వ్యవస్థ ఉన్నంత వరకు గిరిజన స్త్రీకి స్వేచ్ఛ లభించదు. స్త్రీ పుట్టినప్పటినుండి ఒక వస్తువుగానే చెలామణి అవుతుంది. నేడు లంబాడీ కులాల్లో ఎక్కువగా పిల్లలను అమ్ముకుంటున్నారు. దానికి కారణం లంబాడీల ఆర్థిక పరిస్థితి ఒకటైతే, ఆడపిల్లలనే భయం మరొకటి. ఆడపిల్లలు పుడితే కట్నకానుకలు ఎక్కడినుండి తెచ్చేదనే ఆలోచన వల్ల పిల్లలను అమ్మడం ఎక్కువగా జరుగుతుంది. ఎక్కువ శాతం మాత్రం ఆర్థిక ఇబ్బందుల వల్ల అమ్ముతున్నట్లు వివిధ గ్రామాలకు వెళ్ళినప్పుడు వివరించారు.

గిరిజనులు కుల పంచాయితీలు :

ఏ వ్యవస్థలోనైనా తమ సమస్యలను తీర్చుకోవడానికి కొన్ని నియమనిబంధనలు అనేవి తప్పనిసరిగా వుంటాయి. సమస్య పరిష్కారంలో మొదట పాత్ర వహించేది గ్రామపంచాయితీలే. అందువల్ల పంచాయితీ వ్యవస్థ గిరిజన ప్రాంతాల్లో కీలకపాత్ర పోషిస్తుంది.'ఎల్లి' నవలల్లో నీలి భర్త చనిపోయి తల్లిగారింటికి చేరుకుంటుంది. అలా భర్త చనిపోతే గిరిజన కులమైన ఎరుకల తెగలో ఒక ఆచారం పాటిస్తుంటారు. చనిపోయినప్పుడు భర్త ఎంత ఓలిచ్చి స్త్రీని కొనుగోలు చేసుకుంటాడో ఆ డబ్బులు తిరిగివ్వవలసింది ఉంటుంది. నీలి భర్త అనివార్య కారణంగా చనిపోయిండు. కానీ, నీలి భర్త చనిపోయిన తరువాత నీలి భావ 'నీలి'ని వశ పరుచుకోవడానికి ప్రయత్నిస్తాడు. దానికి నీలి ఒప్పుకోక పోయిసరికే అత్తమామలు, బావ పగవట్టి హింసించటంతో నీలి తల్లిగారింటికి వచ్చేస్తుంది. దాని కోసం నాలుగు సార్లు కుల పంచాయితీలు నిర్వహిస్తారు. ఒక్కసారిగా తెగి పోవలసిన పంచాయితీని తాగుడకుకు అలవాటుపడి తెగకుండా చేస్తారు నాయకులు.

ఈ బాధలు భరించలేక చివరికి నీలి అన్న మాటలు గమనించినట్లయితే '' యింతలో నీలిలేచి నిలబడి యిక్కడ మొలతాడు గట్టిన మగోళ్ళందరికి వొక దణ్ణం మీ పంచాయితీకో దణ్ణం. థూ మీరు మగోళ్ళా సారా నీళ్ళకి చీకుముక్కలకీ చొంగలు గార్చుకునే నా కొడుకులు పంచాయితీలు జేత్తారు. యెవడి మీదరా మీ పంచాయితి. ఆ సంగడి కొడుక్కి నేను వొక్కరోజు సంపారం జేయ్యాలా. నేను ఆడి కోడలిన గాదు. ఆ గుడిసెకి నాకు యేం సమ్మందం లేదు. ఇందులో నీలి పాత్రచైతన్యానికి ప్రతీకగా తీర్చబడింది. 'లంబాడోళ్ళ రాందాసు' నవలలో అనలు పదిమందికీ ఈ ఇసయం ఎందుకంట? పంచాయితీలు సేసి ఇకనుంచీ పెల్లిల్లు సేయిత్తారా ఏందీ? నేను రాను ఏం సేసుకుంటారో సేసుకోండి అని కబురు తెచ్చిన వాళ్ళందర్నీ తరిమి వేశాడు'' ఇలా చేసిన తప్పులకు కుల పంచాయితీలంటే గిరిజనుల గుండెల్లో పెద్ద రాయి పడ్డట్టు. అందువల్ల తాగిన మైకంలో ఏమేమో అనేస్తుంటారు. నేటికి గిరిజన గ్రామాలు అన్ని విషయాల్లో సరిహద్దుల్లో ఉండటానికి గల కారణాలు ప్రత్యేకమైనవి అంటూ ఏమి లేకపోయినా, వారిలో ఉండే ఐక్యమత్యమే ప్రధానం. అందువల్ల గిరిజనులు ప్రతి విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటుంటారని ఈ నవల వివరిస్తుంది.

లంబాడీలు సారాయి తయారుచేయడంలో కొంత ముందుంటారు. కొన్ని కుటుంబాలు దాని ద్వారా వచ్చే ఆదాయం వల్లే జీవితాన్ని గడుపుతుంటారు. 'తాండా' నవలలో 'డుగ్లీబాయి' భర్త చనిపోయి, సారాయి బట్టి పెట్టి జీవిస్తుంటుంది. డుగ్లీబాయి కూతుర్నీ గిరిజనేతరుడైన లచయ్య ప్రేమించినట్టు నటించి మోసం చేసి వెళ్ళిపోతాడు. దానితో దిక్కుతోచని పరిస్థితుల్లో తాండా ప్రజలుంటారు. ఇలా కుల పంచాయితీ ద్వారా నిజాలను రాబట్టడానికి చేసిన ప్రయోగాలు అనేకంగా ఉన్నాయి. 'నీ మాట నిజమే అయితే వేపాకు చేతిలో పట్టుకుని ఆ మాట చెప్పు, అంటు ఒక పంచాయితీ పెద్ద సవాలు చేసాడు. ఇంకొకతను పట్టుకో, పట్టుకో అంటూ ఆకులు తెచ్చి ఆమె చేతికి ఇచ్చేందుకుపోతే ఆమె వాటిని ముట్టుకోడానికి అసలు ఒప్పుకోలేదు. కాబట్టి గిరిజన స్త్రీ జీవితాల్లో కులపంచాయితీల పాత్రకు ఒక ప్రత్యేకత ఉందని తెలుస్తోంది. నిజానికి అంతకు ముందున్న గిరిజన స్త్రీ

జీవితానికీ, ఆధునిక కాలంలో ఉన్న స్త్రీ గిరిజన జీవితానికి చాలా తేడాలు కన్పిస్తాయి. దానికి కారణం సమాజంలో వచ్చిన విపరీతమైన మార్పు. దాని వల్ల కొంత లాభం ఉన్న చాలా వరకు నష్టమే ఉంటుంది. గిరిజన సంస్కృతి మరుగునపడిపోతుంది. కుల పంచాయితీలు పోయి దాని స్థానంలో పోలీసు వ్యవస్థ వచ్చింది. ఏ చిన్న విషయానికైనా అక్కడదాకా వెళ్ళడం జరుగుతుంది. అందువల్ల వాటిని కాపాడుకోవాలని ఈ నవలలు రుజువు చేస్తున్నాయి.

ఆధార గ్రంథాలు :

1. భారతదేశం గిరిజన సముదాయాలు, సూర్య నారాయణ.ఎం, తెలుగు అకాడమి, హైదరాబాద్, 1983.
2. తెలుగు నవల నూరు సంవత్సరాలు, 1973, హైదరాబాద్, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి.
3. దక్షిణమూర్తి, పోరంకి, 198 కథానిక స్వరూప స్వభావాలు, విజయవాడ, నవోదయ పబ్లిషర్స్.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఎమ్.సి. మేరికోమ్ బాల్యం అభేద్యం – ఆత్మకథ

– డా॥. నందమూరి లక్ష్మీపార్వతి, చైర్మెన్, తెలుగు అకాడమీ, ఆంధ్ర ప్రదేశ్.

మాంగ్టే చుంగ్‌నైజాన్ మేరికోమ్ భారత మహిళా బాక్సింగ్ రాణి. ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ ఒలింపిక్ విజేత. ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లోని చురాచంద్‌పూర్ జిల్లాలోని సగాంగ్ గ్రామంలో 1982 నవంబర్ 24న జన్మించారు. సుమారు 100 కుటుంబాలు నివసించే సగాంగ్ పెద్ద గ్రామం క్రిందే లెక్క. ఆమెకు 5 నెలల వయసులోనే ఆ గ్రామం విడిచి వెళ్ళడం వలన ఆ ఊరు గురించిన జ్ఞాపకాలేవి లేవని తెలిపారు.

చదువులేని, భూమిలేని శ్రామికుడైన నాన్నకు జీవనం కష్టమైంది. పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్న ఆ రోజుల్లో కోమ్ పుట్టారు. కూతుర్ని తన తండ్రి కోరిక తీర్చానని కోమ్ తండ్రి సంతోషించినట్లు కోమ్‌తో చెప్పారంట. కాని మేరికోమ్ తల్లిగారు మాత్రం కొంచెం నిస్పృహ చెందారట. భారతదేశంలోని చాలామంది తల్లుల్లాగానే కొడుకు పుట్టాలని ఆమె కోరుకుంది. కూతురు వల్ల సహాయం కన్నా బాధ్యత పెరుగుతుందని ఆమె భావన. పొలంలో తండ్రి ప్రక్కనే ఉండి ఆడపిల్ల శ్రమించగలదా అని.

వీరి తెగలో పెద్దవాళ్ళ పేర్లు పిల్లలకు పెట్టుకోవడం సంప్రదాయం. వీళ్ళ నాన్నగారికి అత్తగారిపట్ల గౌరవ సూచకంగా ఆమె పేరు మేరికోమ్‌కు పెట్టాలనుకున్నారు. అందువలననే ఆమె పేరులో మొదటి భాగం 'ఛుంగ్'. ఇది మేరికోమ్ అమ్మమ్మ పేరైన 'ఛుంగ్ధెమ్' పేరులోంచి వచ్చింది. వీరికి 'ఛుంగ్‌నైజాంగ్' అని పేరు పెట్టారు. వారి భాషలో 'ఛుంగ్' అంటే ఉన్నతమైన అని నై అంటే సంపన్నమైన అని, జాంగ్ అంటే చురుకైన అని అర్థాలు. భవిష్యత్తును సూచించే పేరుగా తమ మొదటి సంతానం పై తల్లిదండ్రుల పెద్ద ఆశలను ప్రతిబింబించేటట్లుగా ఈ పేరు పెట్టారు.

మేరికోమ్ పుట్టుక గురించి చెప్పాలి అంటే ఆమె తల్లిదండ్రులకు స్వంతమంటూ ఏమిలేని రోజుల్లో పుట్టారు. ఆమెను మాత్రమే వారి విలువైన సంపదగా భావించేవారు. కోమ్‌ను వారి నాన్న "సనాహెన్" అని పిలచేవారట. అంటే నా 'తొలి సంపద' అని అర్థం.

కుటుంబం పెరుగుతుండడంతో ఖర్చులు కూడా పెరగసాగాయి. ఈ పరిస్థితి సోదరుల మధ్య తరచు కలహాలకు దారితీసేవి. కుటుంబ వాతావరణం సంతోషదాయకంగా ఉండేదికాదు. కోమ్ నాన్నగారు తాతగారి పొలంలో తన హక్కుగా వాటా అడిగారు. కాని చిన్న వరిపొలాన్ని నాలుగు భాగాలు చేయాలనే ఆలోచన ఆమె తాతగారికి చాలా బాధ కలిగించింది. ఆయన వీరి నాన్నతో "తొన్వ! తొందరపడవద్దు. కష్టాలు నిన్ను విడిచి పెడతాయి. మంచి రోజులు నీముందున్నాయి" అనేవారట. భార్యా పిల్లల్ని పోషించాల్సిన అవసరం ఉన్న వ్యక్తికి మంచి భవిష్యత్తును గురించి ఊహించి చెప్పే ఇలాంటి మాటల వల్ల ఏం ప్రయోజనం? బ్రతుకుతెరువు కోసం వీరి నాన్నగారు ఇతర మార్గాలు వెదకసాగారు. ఇంఫాల్ వెళ్ళి రిక్షా నడపాలా అని ఆలోచించారు. దీనివల్ల కుటుంబాన్ని వదిలివేసి ఆయన వేరే ఉండాల్సి ఉంటుంది. తన వాటా భూమి దక్కదు అనే నిరాశతో ఆయన శాశ్వతంగా సగాంగ్‌ను విడిచిపెట్టి కాంగథై వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. ఆయన జీవితంలో ఎక్కువ భాగం భూమి లేని శ్రామికుడిగానే గడిపారు.

కాంగ్‌థైలో వీరి జీవితం శూన్యంతో ప్రారంభమైంది. గ్రామాధికారి సొంతిల్లు కట్టుకోవడానికి వీళ్ళ నాన్నకు స్థలం ఇచ్చారు. ఆయన తన నైపుణ్యం, శ్రమ శక్తితో వెదురుతో అల్లిన పూరిపాకను మట్టిగోడలతో నిర్మాణం చేసుకున్నారు. ఆ ఇంట్లోనే మేరికోమ్ బాల్యం గడిచింది. ఈమె ఇంటిపనులు చేస్తూ చదువు సాగించేవారు. ఆ తర్వాత

కోమ్‌కు చెల్లెలు సింగ్‌లెనై, తమ్ముడు ఖుప్రింగ్ పుట్టారు. అప్పట్నుంచి ఈమె తల్లిదండ్రుల జీవన పోరాటం ఆరంభమైంది. వారనుకున్న మాట ప్రకారం కుటుంబ కార్యక్రమాలకు చాలా అరుదుగా వెళ్ళడం తప్ప వారి స్వగ్రామమైన సగాంగ్‌కు వెళ్ళలేదు.

కోమ్ తాతగారు మరణించారు. ఆమె నాన్నగారికి ఆయన భవిష్యత్తును గురించి చెప్పిన మాటలు గుర్తు చేసేందుకు కొంతకాలం జీవించి ఉంటే బాగుండేదని ఆమె అనుకున్నారు. ఆ రోజుల్లో వీళ్ళ "కోమ్" సమాజంలో చదువు విషయానికి వచ్చేసరికి మగపిల్లలకే ప్రాధాన్యం. ఆడపిల్లలు పెళ్ళి చేసుకుని అత్తవారింటికి వెళ్ళిపోయే వారు. కనుక వారి చదువుపై డబ్బు ఖర్చు చేయడం అనవసరమని చాలామంది భావించేవారు. కాని మేరికోమ్ నాన్న అలాకాదు. తన తొలిబిడ్డ మొట్టమొదటి పదవ తరగతి వరకు చదివినవారై ఉండాలని ఆయన కోరిక. ఆయన ధైర్యంగా అందరికన్నా భిన్నంగా ఆలోచించ గలగినందుకు, ఆమెను ఈ స్థాయికి తీసుకువచ్చిన ఆయన దూరదృష్టికి మేరికోమ్ ఇప్పటికీ గర్విస్తూ ఉంటుంది.

ఆమె గ్రామంలోని అందరి పిల్లల్లాగా కాకుండా చాలా కష్టపడేది. వాళ్ళ నాన్నగారు చిన్నతనం నుండి కష్టపడి పనిచేయడం నేర్పారు. మగపిల్లలే కష్టపడి చేయగలిగే పనులు కొన్ని మేరికోమ్ చేయగలిగేవారు. ఇంటికి పెద్ద సంతానంగా ఆమె బాధ్యతలను చాలా శ్రద్ధగా నిర్వర్తించేది. పొలం దున్నడంలో తన తండ్రికి సాయపడేది. అందుకు చాలా శక్తి కావాలి. ఎడ్లను అదుపులో ఉంచడం తేలికైన పనికాదు. ఆమె ఎద్దులతో పని చేయిస్తుంటే మగవాళ్ళు ఆశ్చర్యంతో నోరు తెరిచి చూస్తుండేవారు. పొలం దున్నే పనే కాకుండా బరువైన వ్యవసాయ పనిముట్లు ఉపయోగించడం, నాటడానికి వరిమొలకల సంచులు, తర్వాత ధాన్యం బస్తాలు మోయడం వంటి పనులు కూడా చేయాల్సి వచ్చేది. పంటచేను కోసాక మిగిలిన గడ్డిని పశువుల మేతకోసం ఇంటికి మోసుకెళ్ళే వారు. అంతేకాదు, గ్రామంలో త్రాగునీరు లేకపోవడం వల్ల దూరం నుండి మంచినీళ్ళు మోసుకొచ్చేవారంట. వాళ్ళ నాన్నతో కొండమీదికి వంట చెరుకు కోసం, సరస్సు దగ్గరకు చేపల కోసం వెళ్ళేవారు. ఆమె తండ్రికి కుడి భుజంలా పనిచేస్తుంటే తల్లి కూడా తన పనుల్లో సహాయం కోరేది. వంటపని, బట్టలు ఉతకడం, తోటపని, ఇల్లు శుభ్రం చేయడం వంటి పనులు కూడా ఆమె నిత్య కృత్యాలు అయ్యాయి. సంతానంలో పెద్దది అవ్వడం వలన తల్లిదండ్రులు ఆమెపై ఆధారపడేవారు. వారి ఆవుల్ని సంరక్షించేది. అవి బాగా పాలిచ్చేవి. వాటిని విలువైన ఆస్తిగా వాళ్ళు భావించేవాళ్ళు. దూరంగా మైదానంలో పిల్లలు ఆడుకుంటుంటే చూసి ఆమె అసూయపడేదంట. ఎవరైనా అలాగే భావిస్తారు. కాని వెనక్కి తిరిగి ఆలోచిస్తే "ఆమె కఠినమైన శారీరక శ్రమే ఆమె దేహాన్ని "బాక్సింగ్"కు సిద్ధం చేసింది. ఆ శక్తి, దమ్ము బాక్సింగ్ సమయంలో పెద్ద పోటీదారులను ఎదుర్కొంటున్నప్పుడు ఆమెకు బలమైన అంశాలుగా తోడ్పడ్డాయి.

ఆమె తల్లిదండ్రులు చాలా కష్టపడి పనిచేసి గొప్ప త్యాగం చేశారు. వీరి నాన్న యుక్తవయసులో గ్రామంలో 'రెజ్లింగ్ ఛాంపియన్'. కాని భార్య, పిల్లల్ని పోషించే క్రమంలో అయనకు ఆ తీరికే ఉండేది కాదు. ఆమె తల్లికి రోజంతా పనులతోనే గడిచిపోయేది. ఆమె శాలువాలు నేసి అమ్మితే ఆ డబ్బుతో పాఠశాల ఫీజు కట్టేవారు.

ఒక్కొక్కసారి పాఠశాల ఫీజు సమయానికి కట్టలేకపోయే వారట. అది చాలా ఇబ్బందికరమైన పరిస్థితి. అటువంటి సందర్భాల్లో తరగతి గదిలోకి ప్రవేశం ఉండేది కాదు. పరీక్షలకు కూర్చోనిచ్చేవారు కాదు. అయితే సాధ్యమైనంత వరకు డబ్బు దాస్తూ ఇలాంటి పరిస్థితి నుంచి తప్పించాలని మేరికోమ్ తల్లి ప్రయత్నించేది. దైవభక్తి కలిగి కష్టించి పనిచేయడంలో ఆమెకు తెలిసీ తన తల్లి చాలా గొప్పవ్యక్తి అంటారు కోమ్.

గురిచూసి కొట్టడంలో వీరి నాన్న సిద్ధహస్తుడు. ఆయన నైపుణ్యం కలిగిన వేటగాడు. పిల్లలు అమాయకంగా చిన్న చేపలు ఉంచుకుని పెద్దవాటిని బయటకు ఎందుకు ఇచ్చేస్తున్నావని అడిగేవారంట. అందుకు తల్లికి ఎంతో బాధ కలిగేదని తల్లి కోమ్‌తో చెబుతూ ఉండేదట. పెద్ద చేపలు విక్రయిస్తే మంచి ధర వస్తుంది. ఆ ధరతో బియ్యం కొనేవారు.

వాళ్ళ వంటగదిలో ఎప్పుడూ కాల్చిన చేపలు, మాంసం వేలాడుతూ ఉండేవి. వాళ్ళు పేదవాళ్ళైనా భోజనం విషయంలో పేదరికం ప్రదర్శించేవారు కాదు. తరువాత కాలంలో శిక్షణ కోసం వెళ్ళినప్పుడు కాల్చిన మాంసం అమెకోసం ఇచ్చేది తల్లి. అది బాగా భద్రపరచబడి ఉండేది. ఇంటికి దూరంగా వెళ్తున్నానన్న బెంగను ఈ ఇంటి ఆహారం కొంతవరకు ఉపశమింపజేసేది.

ఒక్కొక్కసారి ఆమె తండ్రి ఊరికి వంద కిలోమీటర్ల కన్నా ఎక్కువ దూరంలో ఉండే ఉఖ్రుత్, టామెంగ్‌లాంగ్ అడవుల్లో కర్రలు కొట్టే పనికోసం వెళ్ళి నెలల తరబడి ఉండిపోయేవారంట. కాంట్రాక్టు కార్మికుడిగా వెళ్ళేవాడు. పని మొత్తం పూర్తయ్యాకనే కూలి చెల్లించేవారు. ఒక్కోసారి రెండు మూడు నెలల పని ఉండేది. అడవిలోపల కార్మికులు చెట్లు నరికి వాటిని చాలాదూరం మోసుకువచ్చి రహదారి ప్రక్కన రవాణాకు సిద్ధంగా పోగుచేసేవారు. అక్కడ శక్తిమాన్ అనే ఒకే ట్రక్కు ఎత్తు పల్లాలతో కూడిన ఆ కొండ ప్రాంతానికి పనివారిని తరలించేది. ఆ ట్రక్కు రాకకోసం నిరీక్షించి దానిమీద కలపవేసి సమీప పట్టణంలో దించి తిరిగి అడవికి వచ్చేసేవారు. ఒకసారి ఆయన బెట్టుకొడుతూ ఉండగా ఎత్తైన చెట్టుమీద నుంచి ముళ్ళపొదపై పడిపోయారు. ఆయనకు ఒంటినిండా గాయాలయ్యాయి. ముళ్లు చర్మాన్ని చీల్చేశాయి. అడవిలో మందులుగాని, వైద్య సౌకర్యంగా లేవు. గుచ్చుకున్న ముళ్ళను మెలిమెల్లిగా ఊడదీసి గాయాలు వాటంతటవి మానడం కోసం ఎదురు చూసేవారు. చాలాసార్లు ఆ పనిలో ఒంటరిగానే ఉండేవారు. రాత్రుళ్ళు కూర్చునే నిద్రపోయే పరిస్థితి ఏ జంతువైనా దాడిచేస్తే వెంటనే లేచి తప్పించుకు పారిపోయేందుకు వీలుంటుంది. అప్పట్నించి వారి నాన్న జీవితం గురించి వాళ్ళందరూ మాట్లాడుకుంటున్నప్పుడు ఆయన కళ్లల్లో నీళ్ళుండేవి. అది ఆనందమో, దుఃఖమో! రెండింటి కలయిక అంటా రాయన. ''నా కష్టం గురించి బాధ ఉన్నా నువ్వు గొప్ప విజేతవైనందుకు ఆనందంగా'' ఉంది అంటారంట మేరికోమ్ తండ్రి.

తన తండ్రి చదువులేకపోయినా జీవితం తెలిసిన వాడు. తనకు తెలిసిన విషయాలను బిడ్డలతో పంచుకునే వాడు. ముఖ్యంగా మేరికోమ్‌తో ''సానాహెకా'' నువ్వు ఏ పనైనా చేయగలగాలి. అబద్ధాలు చెప్పకూడదు. మంచిగా, దయార్ద్ర హృదయంతో ఉండాలి. పెద్దల్ని ప్రేమగా, జాగ్రత్తగా చూసుకోవాలి అని చెప్పారంట. తన తండ్రి నుంచి నేర్చుకున్న గొప్ప పాఠం శ్రమ జీవనంలోని గౌరవం, నిజాయితీ.

''నువ్వు నాటినది నువ్వు కోసుకుంటావు
నేను నాటినది నేను కోసుకుంటాను'' అనేవారు. అంటే మనం చేసే పనులే ఫలితాన్ని నిర్ణయిస్తాయని అర్థం.

ముగింపు :

ఆమె కఠోర శ్రమ, పట్టువిడువని పోరాటం, చెక్కు చెదరని ఉత్సాహం కలగలిసి విజయానందాన్ని అందించాయి. ఒలంపిక్ కాంస్య పతకం ఆమెకు అత్యున్నత పురస్కారం బాక్సింగ్ క్రీడకై ఆమె జీవితం అంకితం అదే వాస్తవం. బాక్సింగ్ వలయంలో పలుమార్లు ఆమెదే విజయం. అందుకే ఇవన్నీ సాధ్యమయ్యేలా చేసిన దేవుడికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నారు మేరికోమ్...

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వి. ఆర్. విద్యార్థి రచనల్లో సామాజిక స్పృహ

– గడ్డమీ కుల్లేశం, పరిశోధక విద్యార్థి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలుగు సాహిత్యంలో ''సామాజిక దృక్పథం'' అన్న మాట నేడు విస్తృతంగా ఉపయోగింప బడుతున్నది. రచయిత గానీ, కవిగానీ, తన అనుభవంలో ఉన్న సామాజిక స్పృహ నుండి విశ్లేషించడం శాస్త్రీయ దృష్టి అనిపించుకుంటుంది. సమాజంలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎలా అధిరోహించాలన్న అవగాహనను కల్పించే ప్రయత్నాన్నే 'సామాజిక స్పృహ' అనవచ్చు. రచయిత తాను రాస్తున్న విషయాలలో సమాజంలో భిన్న వర్గాల మధ్య భిన్న ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అలాంటి అంశాలను జోడించి రాయటమే, చైతన్యానికి ప్రధాన భూమిక. అదే సామాజిక స్పృహ, ఒకే అంశాన్ని పలువురు పలు రకాల కోణాలలో చర్చించవచ్చు. విశ్లేషించ వచ్చు. ఏ అంశం అయితే ఎక్కవ మంది మనసును ఆకట్టు కుంటుందో అదే మంచి రచన అవుతోంది. మంచి విశ్లేషణ కూడా అవుతుంది.

ప్రాచీన సాహిత్యంలో కానీ, ఆధునిక సాహిత్యంలో కాని ఎంతో మంది సమాజ సంబంధమైన అంశాలను ఇతివృత్తాలుగా ఎంచుకుని రచనలు చేశారు. సామాజిక సంఘటనలకు తగిన రసాలనీ, శబ్దాలనీ, గుణాలనీ, రీతులను, అలంకారాలను జోడించి చెప్పడమే సాహిత్య సాంప్రదాయమని నిర్వహించారు. సాహిత్యం, సామాజిక సంబంధ మైనదే. సమాజాన్ని అవగాహన చేసుకోకపోతే సాహిత్యాన్ని సృజించడం కష్ట సాధ్యం. లోకజ్ఞత, మానవుల విజ్ఞత, పరిపక్వ దృష్టి, కరుణ, సత్యసంధత, ధీరత్వం మొదలైన లక్షణాలన్ని ఉపయోగించి రచయితలే సాహిత్యం యొక్క సిసలైన సామాజిక ప్రతిరూపం. అలా రచించబడిన సాహిత్యమే వింతల్ని చూపిస్తూ నవ్విస్తోంది. విశేషాన్ని చూపిస్తూ కవ్విస్తోంది. విషయ సమస్యల్ని చూపిస్తూ ఏడిపిస్తోంది. నవ్వుల కంటతడి పెట్టించే సాహిత్యమే ఉత్తమ లక్షణంగా ఎక్కువమంది పాఠకులకు ఆమోద యోగ్యంగా ఉంటుంది.

మనిషికి సాటి మనిషితో ఎలాంటి సంబంధం బాంధవ్యాలుండాలో మనుస్మృతి మొదలు, మహాభారత, రామాయణాల వరకూ యెన్నో రీతుల చెబుతూనే వచ్చాయి. అలాగే తైత్తరీయ బ్రాహ్మణం, పద్మపురాణం లాంటి ప్రాచీన గ్రంథాలలో సామాజిక జీవనం యేవిధంగా వుండాలో ఎన్నో రీతులలో ప్రవచించడం చూడవచ్చు. మనమీనాడు ఒక మంత్రంగా భావిస్తున్న సామజిక స్పృహ అన్న అంశం- యేనాడో కవులందరికీ సుపరచిత మైనదేననీ కేవలం ఆధునిక భావజాలం కనిపెట్టిన అంశమే మాత్రమూ కాదని చెప్పటానికి ఎన్నెన్నో ఉదాహరణలు సంస్కృత సాహిత్యంలోనే కాక, ఇంకా ప్రాచీనమైన ప్రకృతి సాహిత్యంలోనూ కుప్పలు తెప్పలుగా కనిపిస్తాయి. సాహిత్యానికీ సమాజానికీ మధ్య ఎప్పుడూ అవినాభావ సంబంధం ఉంటుంది. పరస్పర ప్రభావం అనివార్య మయి విలువలను పెంచుతుంది. ఇది సమాజం ఏర్పడిన నాటి నుంచి సాహిత్యం సృజింపబడినప్పటి నుంచి నిరంతరాయంగా జరుగుతున్నవే. వాటిలోని అంశాలన్నీ ప్రయోజనాన్ని సాధించ లేకపోయినా చాలా వరకు సమాజ శ్రేయాస్సును ఆకాంక్షించేవే. సమాజం పరిణామ శీలాన్ని నంతరించుకున్నట్టిది. వివిధ ఉద్యమాల ద్వారా రక రకాల ప్రభావాల ద్వారా మార్పు చెందుతూ ఉంటుంది. పూర్వకాలంలో ఉద్యమాలు అనేవి ప్రత్యేకంగా లేకపోయినా కొన్ని సంఘటనల సంఘర్షణల ద్వారా మార్పు వచ్చినట్టు కనిపిస్తుంది. ఇవి సమాజాన్ని ఆలోచింపజేశాయి. ఆధునిక కాలంలో ప్రత్యే కించి కొన్ని ఉద్యమాలు సమాజం వెంటే ఉండి పని చేశాయి. కొన్ని సందర్భాలలో సమాజానికి ముందు నడి

చాయి. వర్తమానంలో కూడా ప్రభావితం చేస్తూనే ఉన్నాయి.

సాహిత్యం ఒక ప్రేరక ప్రక్రియ. అది ఎప్పటికప్పుడు సామాజిక స్వరూపాన్ని ప్రతిబింబిస్తూనే ఉంటుంది. అందుచేత తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం ఎల్లవేళలా ప్రతి ఫలిస్తూనే ఉంది. రచనలలో సామాజిక స్పృహలోపిస్తే అది సహజత్వాన్ని కోల్పోతుంది. పదికాలాల పాటు మనుగడ సాగించలేదు. అందుకే బీరువాలలో మాత్రమే పదిలంగా ఉండిపోతుంది. సామాజిక స్పృహ అన్నప్పుడు సమాజంలోని అన్ని పార్శ్వాలు కూడా ఈ స్పృహలోనే ఆవిర్భవించి ఉంటాయి. పరిణామ శీలమైన కాలంతో పాటు సమాజం, సమాజంతోపాటు సాహిత్యం మారడం అనివార్యమైన యదార్థం.

విద్యార్థి సాహిత్యం అంతా సమాజపరమైందే. ధర్మం, నీతి, న్యాయం, భక్తి దేశీయత, జాతీయత, మానవత, ఆధ్యాత్మికత వంటి అంశాలకు సంబంధించిన రచనలు అయనవి. ఆయన సమాజంలో జరుగుతున్న ప్రతి ఘటనకు స్పందిస్తారు. ప్రతి సంఘర్షణకు చలిస్తారు. వెంటనే సాహిత్య ప్రక్రియా రూపంలో ఆవిష్కరిస్తారు.

"హితేన సహితం సాహిత్యం". సాహిత్యం సమాజ హితాన్ని కాంక్షిస్తుంది. సమాజ హితమంటే సమాజం లోని సర్వజనుల హితమని అర్థం. సమాజం లోని ప్రజల అజ్ఞానాన్ని, దారిద్ర్యాన్ని పారద్రోలి నిజమైన వికాసాన్ని, ప్రబోధాన్ని ఇచ్చే శక్తి కవిత్వానికి ఉంది. దానిలో భాగంగానే నిన్న జరిగిన విషయాలతో నేటి అనుభూతులను రంగరించి రేపటి స్వప్నాలతో అనునంధానిన్తూ రచయితలు తమ కలం బలంచే సామాజిక చైతన్యం దిశగా రచనలు సాగిస్తారు. ఆ క్రమంలోనే కవులు రచయితలు సమాజ స్థితిగతులను, వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపే ప్రయత్నం చేస్తారు. అందులో భాగంగానే వర్తమాన కాలపు వివిధ అంశాలను ప్రస్తావించడంతో పాటు సమాజాన్ని ప్రతిబింబించేలా సమకాలీన ప్రజల జీవన విధానాన్ని కూడా చిత్రీకరిస్తారు. ఆ భావాలను అభివ్యక్తీకరించడంలో పద్యం కంటే వచనం మరింత దృఢంగా ప్రభావం చూపుతుందని ఆధునిక రచయితల నమ్మకం. సగటు మనిషి హృదయపు భాషలో అనుభవాలను అభివ్యక్తీకరించ గలిగితే నేరుగా పాఠకుల మనసు ఆలోచనల అద్దం పై ఒక ముద్ర వేస్తాయి. ఆముద్రలే ఆత్మావలోకనం చేసుకోగల వివేకాన్ని ప్రేరేపిస్తాయి.

సమాజాన్ని అన్ని దృక్కోణాల నుంచి పరిశీలించి ఈ వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలను, అన్యాయాలను, ప్రజల అవస్థలను విద్యార్థి తన కవిత రచనలలో చొప్పించారు. సమాజంలో నెలకొన్న ప్రతి అంశాన్ని కూలంకషంగా విశదపరుస్తూ కవిత్వీకరించారు. విద్యార్థి తమ కవిత్వం ద్వారా సమాజంలోని అకృత్యాలను అమానవీయ సంఘటనలను తూర్పారపడుతూ సామాజిక చైతన్యాన్ని అభిలషించారు.

ఏ కవికైనా వుండవలసిన ముఖ్యమైన లక్షణం సామాజిక స్పృహ. అట్టిది ఈ కవికి ఎంతో పుష్కలంగా వుంది. సమాజంపట్ల ఎంతో గౌరవమూ, అంతే బరువు బాధ్యతలు వున్నట్లు గోచరమవుతాయి. ఈ కవి వ్రాసిన ప్రతి కవిత లయాత్మకం. అంతర్లయ, బహిర్లయల సమపాళ్ళ సమ్మిళితం. రాజ హంసలాంటి నడక హొయలు ప్రతి కవితలోను కనపడు మధురమైన భాషతో చక్కని పద చిత్రాలతో, సందర్భోచిత సమాసాలతో చక్కని కవిత్వం.

వస్తువును ఎన్నుకొనడంలో ఒక ప్రత్యేకతను కన పరుస్తాడు ఈ కవి. అది వృత్తిపరమైన ఇతివృత్తమే కావొచ్చు, వ్యక్తిగత ఇరకాటమే కావచ్చు, కుటుంబపరమైన చిక్కులే కావచ్చు, సామాజిక బుగ్గతే కావొచ్చు, మరేదైనా కావొచ్చు. కాని ఏదైనా వాస్తవ ప్రపంచంలోనిదై వుండాలి. విద్యార్థి కవిగా సున్నిత మనస్కుడు, తూర్పున దిగంతాల ద్వారము తెరుచుకొని, మంచుకొండల మెట్ల పైనుండి దిగివచ్చే ఉషస్సులను, మబ్బుల్ని, గిరులను, ఆకాశాన్ని, పచ్చిక మైదానాలను, వాటిపై తిరుగాడే సీతాకోక చిలుకల్ని,

రకరకాల పక్షులను, పూల గుత్తులను, తుమ్మెద గుంపును, మంచు కొండల్లోని గిరి పుత్రులను చూసి ఎంతగా పరవశించి పోతాడో, అదే సమయంలో సమాజం లోని అసమానతలను, అన్యాయాలను చూసి అంతగా ఆగ్రహం చెందుతాడు. అందుకే ఆయన కవిత్వంలో సామాజిక వాస్తవికత బలంగా కనిపిస్తుంది.

కవి కూడా ఒక మనిషే, మనిషి ఒక వ్యక్తి. ఈ వ్యక్తికి ఒక జీవితముంటుంది. దానికొక నేపథ్యముంటుంది. వ్యక్తి జీవితమూ, కవి జీవితమూ రెండూ ఒకటికానప్పుడు సంఘర్షణ తప్పదు ఈ సంఘర్షణకు అనేక పార్శ్వాలుం టాయి. ఈ సంఘర్షణలో వ్యక్తో, కవో ఎవరో ఒకరు గెలవడం, ఇంకొకరు ఓడడం జరుగుతుంది. ఈ సంఘర్షణను విద్యార్థిగారు ''నాతో నేను'' కవితలో వర్ణించారు.

''జీవితంలో నన్ను నేను గెలవడానికే / కవిత్వమై పలకడం, కథలు చెప్పడం / చిత్రం గీయడం, శిల్పం తొలచడం /నాట్యం చేయడం, స్వరతరంగమై లేవడం / నిరంతరం నాతో నేను యుద్ధం చేస్తూ గెలుస్తాను, కానీ ఓడిపోతాను/ గెలవడానికే

ఏరకమైన కవిత్వమైనా సమాజంలో ఏదో ఒక కర్తవ్యం నిర్వహిస్తుంది. సమాజాన్ని నిద్ర పుచ్చగలదు, నిద్రలేప గలదు. కవిని బట్టి కవిత్వం. ప్రజా స్వభావం గల కవి సమాజాన్ని నిద్ర లేపడానికి కలం పట్టుకుంటాడు. దుష్ట వ్యవస్థలోకి ప్రజాకవి కలం ఆయుధంగా ప్రవేశించినప్పుడు ఆయనకు సమాజ విశ్వరూపం దర్శనమిస్తుంది. తన కవిత్వం కర్తవ్యం బోధపడుతుంది. విద్యార్థి ఇక కవిత సాగేదెలా అనే కవితలో తనకెదురైన సామాజిక దృశ్యాలను సందర్భాలను పేర్కొన్నారు. అలాంటి సమాజంలో తానేం చేయాలో నిర్ణయించుకున్నాడు. పంజాబు దురాగతాలు, కాశ్మీర్లో తీవ్రవాద చర్యలు, హైదరాబాద్ మతకల్లోలాలు, గల్ఫ్ యుద్ధం, సామ్రాజ్యవాద దేశాల ఆగడాలు వంటి ప్రపంచ వ్యాప్త సంక్షోభ సందర్భాలు ఎదురయ్యాయి. ఇలాంటి స్థితిలో కవి ఏమి చేయాలి కవిత్వ కర్తవ్యం ఏమిటి ?

భూగోళం సాంతం / గజగజ వణకుతుంటే / భగభగ మండుతుంటే /అక్షరాల పగ్గాలు విసిరి ఆపాలనీ / ఆర్ద్రతా జల్లులు కురిసి చల్లార్చాలనీ/ యీ కలం తెగయాతన పడుతోంది.కవులనీ దిగ్భ్రమకు గురి చేసే విశ్వసన్నివేశంలో కవిత్వం ఏమి చేయగలదో కవి చెప్పాడు.

కవి, కవిత్వం మనముందున్నారు. కవిని అధ్యయనం చేసి, అంటే కవికి సంబంధించిన విషయాలు తెలుసుకొని కవిత్వాన్ని చదవాల్నా లేక కవితో సంబంధం లేకుండా కవిత్వాన్ని చదువుకోవాల్నా అన్నది ప్రశ్న. విద్యార్థి 'కవిత్వంలో కలుసుకోండి' అనే కవితలో కవివ్యక్తిగత విషయాల జోలికిపోకుండా కవిత్వాన్నే చదవండి, అక్కడే కవి కనిపిస్తాడు అన్నారు. నిజానికి ఒక మార్క్సీయ కవి ఇలా అనడం ఉచితం కాదనిపిస్తుంది. కవిస్థలకాల నేపథ్యం తెలియకుండా కవి సాంఘిక నేపథ్యం తెలియ కుండా కవిత్వం సమగ్రంగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. విద్యార్థి గారు ఈ విషయం తెలియనివాడు కాదు. ఆయన ఈ కవితను ఇలా రాయడానికి రెండు కారణాలుండవచ్చు. ఒకటి, కవికున్న పేరు, ప్రసిద్ధులను బట్టి, లేదా ఇతర ప్రసిద్ధులు ఆ కవికి రాసిన అసాధారణ మైన ముందుమాటలను బట్టి పాఠకులు ఆ కవి స్థాయిని అర్థం చేసుకొనే ప్రమాదముందనడం ఇటీవల కవిని చూడగానే ఒక లేబిల్ అతికించే యాంత్రిక అలవాటు ప్రబలడం వల్ల, దాని ప్రభావంతో కవిని చదవవలసి రావడం ఈ అపసవ్యకర ధోరణులను నివారించ డానికి విద్యార్థి ఈ కవితను ఇలా రాసి ఉంటారు. ఆయన కూడా కవిని కలుసుకోమంటున్నారు. అది కవిత్వం ద్వారానే అంటున్నారు.

మరో కవితలో గుజరాత్ గుండెల్లో బాకు దింపింది., మత ఛాందసులకు పిచ్చిలేపి రంగంలోకి దింపింది రాజకీయ దుండగులే అని ఈసడించుకుంటాడు.

ఎవరు వీళ్ళు/ రాక్షసులా రాబందులా / కాదు కాదు
చూడ్డానికి మనుషుల్లానే ఉన్నారు'' అంటూనే ''వీళ్ళ చేష్టలు ప్రళయం కంటే క్రూరంగా ఉన్నాయి.'' అంటూ

శవాల గుట్టల మీద విజయ పతకాల్ని ఎగిరేస్తున్న వారిని ఇంత నగ్నంగా ప్రజల ముందు నిలబెట్టడానికి కవికి ఎన్ని గుండెలు కావాలి ?

పల్లెబాట రహదారిగా మారిన తరువాత ఊరిని దోచి నగరానికి పెట్టే దళారి రాజ్యం రానే వచ్చింది. ఊరు ఊరుగా నాన్నప్పుడు బ్రతుకంటే ఫికర్ ఉండేది కాదు. రేపటి చింతే ఉండేది కాదు, అభివృద్ధి పేరుమీద పల్లెల విధ్వంసాన్ని 'రహదారి' అనే కవితలో వివరిస్తాడు. ఒకప్పుడు పల్లె పల్లె అంతా ఒక కుటుంబం గా కలిసి మెలిసి ఉండే వాళ్ళు, అన్నా తమ్ముడు, అక్కా చెల్లె అవ్వ అంటూ వరుసలు పెట్టి పిలుచుకునే వాళ్ళు, కాని 'రహదారి' వచ్చిన తరువాత పక్కింటి వాళ్ళనే ఆనవాళ్ళ పట్టలేనంత పరాయీకరణ చెందిన వైనాన్ని తలుచుకొని దుఃఖిస్తాడు.

అన్నపూర్ణ నా తెలుగుతల్లికి / పలుచోట్ల బిచ్చమెత్తే గతి పట్టిందని ' అంటాడు.

ఒక తెలుగు తల్లి కాదు దేశం మొత్తం కూడా అప్పుల ఊబిలో కూరుకు పోయింది. స్వయం సమృద్ధి అభివృద్ధి నమూనాను మరిచి అప్పుల కోసం విదేశాల ముందు జరుగుతున్నది. బహుళజాతి సంస్థల లాభాల కోసం, దేశాన్ని దేశ సంపదను తాకట్టు పెట్టే తలక్రిందుల అభివృద్ధి నమూనా రాజ్యం ఏలుతున్న వైనాన్ని చూసి ఆగ్రహం చెందుతాడు. తెలుగులో సైనికుని పరంగా వచ్చిన కవిత్వం తక్కువనే చెప్పాలి. ఇతర రంగాలలో వారు చేసిన త్యాగాలను కీర్తించే రచనలు కనిపించినంతగా, దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికులుగాని, విధి నిర్వహణలో అసువులు బాసిన అధికారులుగాని చేసిన త్యాగాలను గుర్తించే రచనలు కనిపించవు. ప్రాణాలే అర్పించనక్కర్లేదు, కుటుంబానికి దూరంగా ఏ సరిహద్దు ప్రాంతం లోనో ఉండటం వల్ల వారికి ఎదురయ్యే ఇబ్బందులు, వారు కోల్పోయే చిన్న చిన్న ఆనందాల గురించి ప్రస్తావించినా కూడా ఒక మానవీయ కోణం ఆవిష్కరించి నట్లుగా ఉంటుంది. అటువంటిదే "సైనికుడి ఉత్తరం" కవిత.

"సైనికుడి ఉత్తరం" పేరుమీద వచ్చిన కవితల్లో బహుశ మొదటిది రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో వేరే దేశంలో ఉన్న సైనికుడి అంతరంగాన్ని చిత్రిస్తూ తిలక్ రాసినది. రెండవది బాంగ్లాదేశ్ యుద్ధానికి తరలిపోతున్న సైనికుడి మనోగతాన్ని తెలిపేలా విద్యార్థి రాసినది. రెండూ సైనికుడు తన భార్యకు రాసినట్లుగానే ఉంటాయి. తిలక్ కవితలో ఉత్తరం యుద్ధభూమి నుండి రాసినదైనా, ప్రాథమికంగా అది యుద్ధ వ్యతిరేక కవిత. యుద్ధంలో పనిచేస్తున్న సైనికునికి ఆ యుద్ధం మీద వైముఖ్యం, తనలోని యాంత్రికత మీద నైరాశ్యం ఏర్పడటం ఇందులో చూస్తాం. సైనికుని మనస్థితి గురించి తిలక్ ఊహించి రాసినది కాబట్టి, సహజంగానే ఆయనకున్న యుద్ధ వ్యతిరేకత కూడా ఇందులో వ్యక్తమై ఉండవచ్చు. దీనికి భిన్నంగా విద్యార్థి కవిత, భార్యను వదిలి యుద్ధం కోసం దూర ప్రాంతానికి తరలిపోతున్న ఒక యువ సైనికుని మనస్థితిని స్వీయానుభవంతో రాసినది. ఇందులో రాబోయే విరహం గురించిన చింత కొంత వ్యక్తమైనా, అదే సమయంలో ఆ యుద్ధంలో గెలవాలనే ఆకాంక్ష, దాని వల్ల ప్రయోజనం పొందే బాంగ్లాదేశ్ శరణార్థుల కష్టాలతో పోల్చినప్పుడు తమ కష్టం ఏమంత పెద్దది కాదనే స్పృహ కనిపిస్తాయి.

డ్యూటీని ప్రాణం కంటే మిన్నగాను, ఆయుధాన్ని భార్య కంటే ఎక్కువగాను భావించే సైనికుల సేవా తత్పరతని, యుద్ధంలో తమ ధాటికి తట్టుకోలేక వెనుదిరిగి పోయే శత్రు విమానాలు, నౌకలను చూసినపుడు వారికి కలిసే ఆనందాన్ని, సహచరులెవరైనా నేలకొరిగినప్పుడు కలిగే విచారాన్ని, విజయాలను ఉమ్మడిగా సెలబ్రేట్ చేసే వారి కామ్రేడరీని చక్కగా వర్ణించే "మా కోసం" అనే కవిత కూడా చెప్పుకోదగినది. ఉద్యోగ విరమణ చేసినప్పుడు వారికి కలిగిన "దుఃఖం నిండిన సంతోషం, సంతోషం నిండిన దుఃఖం" గురించి ప్రస్తావించే ఈ కవిత తరువాత అంతా ఏమైనట్లు అన్న సందేహంతో ముగియటం. అంతర్గత శత్రువుల్ని తాము గుర్తించలేకపోయామనే బాధ వ్యక్తపరచడం ఈ కవితకు ప్రత్యేకతనిస్తాయి.

సాధారణ సైనికుల, వారి కుటుంబాల సంక్షేమం పట్ల దేశం వహించిన ఉదాసీనతకు షాక్ ట్రీట్మెంట్ వంటి కవిత ''ఇది కథ కాదు''. కవిత మొత్తం సంభాషణ రూపంగా జరిగే ఈ కవిత శిల్పరీత్యా కూడా భిన్నమైనది. పొట్ట కూటికోసం ఒళ్ళు అమ్ముకోవలసిన దుస్థితిలో ఉన్న ఒక స్త్రీ ఇందులో విటుడడిగిన ప్రశ్నలకు జవాబు చెబుతుంది. ఈ వృత్తినే ఎందుకు ఎంచుకున్నావు ?

''ఈ దేశంలో మరొక వృత్తి దొరకలేదు గనుక
ఇంకా ఎంత కాలం చేస్తావీ వృత్తి?
''మీవంటి వాళ్ల కళ్ళకు నచ్చినంతకాలం !''
తర్వాత ?
విషం తయారుగా ఉంది''

ఇలా మొదలై చివరిలో ''అయ్యా డబ్బివ్వండి వెళ్ళాలి. పిల్లలు ఆకలితో ఎదురు చూస్తుంటారు'' అని ఆమె అనటం, నీకు పిల్లలా అని అడిగితే ముగ్గురిని చెప్పటం, భర్త గురించి అడిగితే, ''దేశం కోసం యుద్ధంలో పోయాడు'' అని జవాబివ్వటంతో కవిత ముగుస్తుంది. దేశం కోసం ప్రాణాలర్పించిన ఒక సైనికుని కుటుంబం అటువంటి స్థితిలో ఉందంటే, చదివినవారి కెవరికైనా హృదయం ద్రవించక మానదు. ఇది ఎన్నో దశాబ్దాల క్రితం రాసిన కవిత. బహుశ ఇప్పుడటువంటి పరిస్థితి లేదని ఆశిస్తాను. ఏవిధంగా చూసినా అప్పటికంటే ఇప్పుడు ఎంతో సంపన్నంగా ఉన్న దేశం తన సైనికుల పట్ల మరింత బాధ్యతగా మెలుగుతూ ఉండవచ్చు. ఐతే, ఒకప్పటి దుస్థితికి మాత్రం ఈ కవిత అద్దం పడుతుంది.

ఆధార గ్రంథాలు :

1. జగన్నాథం పేర్వారం, 1987, 'అభ్యుదయ కవిత్వానంతర ధోరనులు', సాహిత్య బంధు ప్రచురణలు, వరంగల్లు.
2. నరసింహం కె.వి.ఆర్, 1982, 'ఆధునికాంధ్ర కవితా సమీక్ష ' గంగాధర పబ్లికేషన్స్, విజయవాడ.
3. బాలశ్రీనివాసమూర్తి, జి. 2019. తెలంగాణ సాహిత్య చరిత్ర. నీల్ కమల్ పబ్లికేషన్స్. హైదరాబాద్.
4. వి.ఆర్ విద్యార్థి రచనలు

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ కథా ప్రక్రియ - కె.వి.నరేందర్ కథల్లో వైవిధ్యం

- జి. కృష్ణవేణి, పరిశోధక విద్యార్థిని, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

కథా ప్రక్రియ ఆనాటి ప్రాచీన సాహిత్యంలో సామాన్య జనులలోనూ మిక్కిలి ఆదరణ పొంది ప్రత్యేకమైన సాహిత్య ప్రక్రియగా గుర్తింపుపొందింది. ఆనాటి నుండి కథా వాఙ్మయంలో వేలకు వేలు కథలు గంగా ప్రవాహంలా పుట్టుకొని వచ్చాయి. ప్రాచీన సాహిత్యాలలో కథా వాఙ్మయం ఒక జీవనదిలాంటిది. అయితే అక్కడ కనిపించే కథాస్వరూపం వేరు. ఆధునిక కథా స్వరూపం వేరు. ఒకే సాహిత్య ప్రక్రియగా వెల్లివిరిసినా సంస్కృత కథలకు తెలుగు కథలకు ఎక్కడా పోలికలేదు.

తెలుగు కథానికా సాహిత్యంలో ఒకే అంశం చుట్టూ తిరిగే కథలతో కథానికా సంకలనాలను వెలువరించిన ఘనత కె.వి. నరేందర్ కు దక్కుతుంది. 'అమ్మ'ను కేంద్రంగా చేసుకొని 'అమ్మ' పేరుతో, సైనికులను కేంద్రంగా చేసుకొని 'యుద్ధం' పేరుతో, పిల్లలను కేంద్రంగా చేసుకొని 'బురదలో జాబిల్లి' పేరుతో, తండ్రిని కేంద్రంగా చేసుకొని 'నాన్న' పేరుతో, ఇల్లాలని కేంద్రంగా చేసుకొని "నాతి చరామి' పేరుతో, పల్లెటూరును కేంద్రంగా చేసుకొని "ఊరు' పేరుతో ఆయన ఇదివరకు ఇలాంటివి ఆరు కథానికా సంకలనాలను వెలువరించాడు. ఈ తరహా కథలకు ఆయన 'సింగిల్ కాన్సెప్ట్ కథలు అన్న పేరు కూడా పెట్టాడు. అమ్మ మీద వెలువరించిన కథలకు 'మదర్ కాన్సెప్ట్ స్టోరీస్' అని నాన్న మీద వెలువరించిన కథలకు 'ఫాదర్ కాన్సెప్ట్ స్టోరీస్' అని... ఇలా ఈ కథలను సింగిల్ కాన్సెప్ట్ కథలనో లేక ఏకాంశ కథలనో అనొచ్చునన్న అభిప్రాయాన్ని కె.వి.నరేందర్ కల్గించాడు. తెలుగు కథానికా సాహిత్యంలో దీన్నొక ప్రయోగంగా చెప్పుకోవచ్చు.

ఇతివృత్త వైవిధ్యం, పాత్ర చిత్రణలో పటుత్వం, అద్భుతమైన కథాశిల్పం, గంగా ప్రవాహంతో సాగే రచనా పాటవం తన కథల్లో మలచిన కథా శిల్పి, సీనియర్ కథా రచయిత కె.వి.నరేందర్.

జీవితాన్ని నూతన దృక్పథంతో దర్శించి కథారూపంలో దాని తత్వాన్ని అన్వయించే ప్రయత్నంలో భాషలో కొత్తదనాన్ని, శిల్ప నైపుణ్యాన్ని, సంఘ అభ్యుదయాన్ని నిలబెట్టి చివరి వరకు చదివించే శైలిని, వస్తు శిల్పాల సమన్వయాన్ని కె.వి.నరేందర్ తన కథల్లో సమర్థవంతంగా నిర్వహించారు. 'ఇతివృత్తం కావ్యానికి శరీరం' అని భరతుడు చెప్పాడు. సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భావాన్ని వస్తువు లేదా ఇతివృత్తం అంటారు. రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చు. "కథకు ఇతివృత్తమంటూ ఒకటి ఉండడం తప్పనిసరి. ఇతివృత్తం కోసం ప్రత్యేకంగా వెదనవసరం లేదు. ప్రతి మనిషికి కదలికలోనూ కథకు కావలసిన ఇతివృత్తం ఉంటుంది. తనను, తన చుట్టూ వున్న సమాజాన్ని, మనుషులనూ పరికించి చూడగలిగితే ప్రతి కన్నీటి బొట్టులోనూ,

కంటిపాప మెరుపులోనూ, కథకు కావలసిన ముడి సరుకు దొరుకుతుంది. అయితే, రచయిత తనకు గల అభిరుచులను బట్టి, ఆలోచనాధోరణిని బట్టి, తనకు కావలసిన వస్తువును ఎంచుకుంటాడు. తన సామర్థ్యాన్ని బట్టి కథగా మలచుకోగలుగుతాడు. సరిహద్దుల్లో శత్రువునెదుర్కొంటున్న సైనికున్ని తల్చుకోకపోతే మన కన్ను మనం పొడుచుకున్నట్టే. అయిదు దాటిన తర్వాత ఆఫీసు నుంచి రావటం లేటయితేనే తల్లీబిడ్డలు తల్లడిల్లి పోయే రోజులివి. సరిహద్దుల్లో యుద్ధం చేస్తున్న కొడుకు/భర్త ఏ రీతిలో వస్తాడోనన్న ఆలోచన... ఎంత భయంకరమైందో వూహించండి..

యుద్ధం ముగిసినా... విజయోత్సాహాన్ని మనం పంచుకుంటున్నాం. జ్ఞాపకాల్ని, అవార్డుల్ని... కన్నీటితెరల మధ్యన వాళ్ల కుటుంబాలు పంచుకుంటున్నాయి. మరణానంతరం

శౌర్యచక్రల్నీ, పరమవీరచక్రల్నీ, అందుకుంటున్నప్పుడు కన్నీటితో ఒక్క పెట్టున రోదించిన తల్లుల్ని, స్పృహతప్పి పడిపోయిన ఇల్లాల్లనీ చూసి భరతమాత గుండె పగిలినా... మనం మాత్రం ఆ వార్తలు చదివి వదిలేస్తాం. సినిమాల్లో హీరోయిన్ ఏడ్పు కదిలించినంత కూడా అలాంటి సంఘటనలు మనల్ని కదిలించలేకపోతున్నాయి. దాదాపుగా అవి మన దృష్టికే రాకుండా పోతున్నాయి.

అదిగో... అలాంటి స్ఫూర్తితో... యుద్ధమేఘాల వెనక తచ్చాడుతున్న గుండెల్లోని తడిని చూపించాలన్న తపనతో ఈ కథా సంపుటిని మీ ముందుంచుతున్నాం. సరిహద్దు జీవితాల్లోని బంధాలు, అనుబంధాల మధ్య సంఘర్షణనీ ప్రతిబింబించిన ఈ కథలు.

'యుద్ధం' కథలో నిజానికి యుద్ధమే లేదు. కాని సరిహద్దు ఉద్యోగాల్ని ఎలా భావిస్తున్నారో తెలియ చెప్పటంలో నరేందర్ కృతకృత్యులయ్యాడు. ఇప్పుడు యువకుల్లో దేశభక్తిని పెంపొందించటం ఎంతైనా అవసరం. సైనికుల త్యాగనిరతిని, శౌర్యగుణాల్ని మనో రంజకంగా చెప్పడానికి నరేందర్ ప్రయత్నించాడు. సైనికుల జీవితాల మీద చిరుకథల సంపుటి అయినా రావటం హర్షించదగింది. శతృవు, పృధ్వీ, మా...తుయే సలాం, సైనికుని ఉత్తరం...ఇలా కథల పేర్లలోనే విశిష్టత వుంది. కథల్లో ఉద్వేగం, ఉద్రిక్తత మనసుని సరిహద్దుల్లోకి తీసుకెళ్తాయి. గుండె కవాటాలు యుద్ధభేరిని మోగిస్తాయి. కథనం పదంపదం...కదం కలిపిన సైనికుల్లో తట్టిలేపితే... కథనశిల్పం కదనరంగానికి మధనంతో, వ్యధనంతో సాగుతుంది.

ఒకే కాన్సెప్ట్ పై రాసిన కథలైనప్పటికీ... ప్రస్తుత బర్నింగ్ సబ్జెక్టు ఇదే కాబట్టి... అందంగా రూపుదిద్దుకున్న 'యుద్ధం' అందరూ చదవాల్సిన కథలసంపుటి. భారత సరిహద్దు ప్రాంతం మరోసారి దిక్కులు పిక్కటిల్లేలా దద్దరిల్లు తోంది... రాకెట్ లాంచర్లు గగనతలాన్ని చీల్చుతున్నాయి... బంకర్ల నించి వడగళ్లవానలా కురుస్తున్న గుళ్లు.. నిర్విరామంగా మూణెళ్లనించి సాగుతున్న యుద్ధం..

సైన్యం ఉక్కుపిడికిలి బిగించి పోరాడుతోంది... రవ్వంత విశ్రాంతి కూడా దొరకని పోరాటం అది... అప్పుడు... సాయంత్రం నాలుగున్నర గంటలు దాటు తోంది. విస్పోటనా శబ్దాల ప్రతిధ్వనులు శాంతికపోతపు గుండె కవాటాలై కొట్టుకుంటున్నాయి.

"స్టాప్ దట్ మిస్టర్ విక్రమ్.. మనకు దేశరక్షణే ముఖ్యం కాదనను... కాని మరోసారి ఆ టెలిగ్రాం చదువ్... రెండు ప్రాణులు నీ కోసం ఎదిరిచూస్తున్నాయి. రేపేమైనా అయితే భరతమాత దుఃఖం మనకు కన్పించకపోయినా భార్య కన్నీళ్లను ఏ అవార్డులూ, రివార్డులూ ఆపలేవురా... వీరజవాన్ జస్పాల్‌రాణా భార్య శోకం నన్ను అప్పుడప్పుడూ వెంటాడి మౌనముద్రలోకి తీసికెళ్తుంది. వీరమరణం పొందిన గురుదేవ్ సింగ్ భార్య "పరమవీరచక్ర' అవార్డ్ అందుకుంటూనే వేదిక మీదే కుప్పకూలిపోయింది. నా సర్వీస్‌లో ఎన్నో చూసాను. నీకు అవకాశం వుండబట్టే వెళ్లమంటున్నాను. అఫ్ కోర్స్... నీ కొడుకుని కూడా నీలాగే దేశరక్షణ కోసం అంకితం చేస్తానంటేనే నిన్ను పంపించేది..." నవ్వుతూ అన్నాడు మేజర్ జనరల్ మనీందర్ సింగ్. పృధ్వీ కథలో యుద్ధ సంఘటననూ సైనికుల విశేషాలను కళ్ళకు కట్టించారు. నరేందర్ చేసిన 'సింగిల్ కాన్సెప్ట్'ల ప్రయోగం తెలుగులో కొత్త కావచ్చు. కొన్ని ఇతర భారతీయ భాషల్లో ఎలాంటి ప్రయోగాలున్నాయి. నరేందర్ కథలు కొన్ని తమిళ, కన్నడ, ఒరియా భాషల్లోకి అనువదించబడినాయి. నరేందర్ 'రాష్ట్ర ప్రభుత్వ యువ విశిష్ట అవార్డ్, విశాల సాహితీ అవార్డ్' లతో పాటు సి.నా.రె., గోపీ వంటి సాహితీ సుగతుల ప్రశంసలు అందుకున్నాడు.

కె.వి.నరేందర్ కథల్లో చక్కని కథాశిల్పం, కథా గమనంలో కలిసిపోయే చక్కని కొసమెరుపులుంటాయి. రచయితల్లో మూడురకాల వారున్నారు. మొదటిరకం కేవలం కాలక్షేపం కోసమే రాసేవారు. వీళ్ళ రచనలూ కాలక్షేపంకోసం చదివేవే. ఇలాంటి రచయితలు మనకు చాలామందే ఉన్నారు. వివిధ పత్రికల్లో ప్రతినెలా వస్తున్న వందలాది కథల్లో ఇలాంటి కథలే ఎక్కువ. ఈ కథల్లో

మంచి శిల్పమున్నా వీటితో సమాజానికొరిగే ప్రయోజనమేం లేదు. ఈ రచనలు తర్వాతి కాలంలో కాల గర్భంలో కలిసిపోయినా రచయితకు పేరు, డబ్బు బాగానే లభిస్తాయి. ఈ రచనలు కొన్ని సినిమాలుగానూ రావచ్చు.. ఇవి పూర్తిగా వ్యాపార రచనలే. రెండవకోవకు చెందిన రచయితలు సాహిత్యానికి సామాజిక ప్రయోజనముండాలని, సాహిత్యం ఉబుసుపోకకు చదివేది కాదని భావించి రాసేవారు. వీరు వ్యాపార రచనల జోలికి పోరు. వీళ్ళు మంచి శిల్పంతో కూడుకున్న కథలు, శిల్పం కొంత తక్కువైనా మంచి వస్తువుతో కూడుకున్న కథలు రాస్తున్నా శిల్పానికంటే ఎక్కువ వస్తువుకే ప్రాధాన్యతనిస్తారు. మంచి వస్తువుతో, మంచి శిల్పాన్ని జోడించి కథలు రాసినా సాహిత్యం ప్రయోజనాన్ని గుర్తెరిగి రాస్తారు వీళ్ళు.. వీళ్ళకు తమ కథలు సినిమాలుగా వస్తాయా, టీ.వీ. సీరియల్‌గా వస్తాయా అన్న ఆలోచనుండదు. అవి తాముద్దేశించిన పాఠకుల్ని చేరుతున్నాయా లేదా అనే ఆలోచిస్తారు. అయితే తర్వాతి కాలంలో అవి క్లాసిక్స్ గా మారి టీ.వీ.సినిమాల కెక్కితే ఎక్కవచ్చు.. తెలంగాణా ప్రాంతంలో ముఖ్యంగా కరీంనగర్ జిల్లా నుంచి వచ్చిన రచయితల్లో ఇలాంటివారే ఎక్కువ. మొదటితరంలో ఈ జిల్లానుంచి ఒకరిద్దరు రచయితలుగా ప్రసిద్ధులైనా స్వాతంత్ర్యానంతరం పుట్టిన తరంలోంచే చాలామంది రచయితలుగా ఎదిగారు. ఎదుగు తున్నారు. 70లలో వచ్చిన ఉద్యమాలు ఈ జిల్లాలో కొంతమందిని కలంబట్టేట్టు చేసాయి. భూ పోరాటోద్యమాలు, స్త్రీవాద, దళితవాదోద్యమాలు, తెలంగాణాలో మధ్యతరగతి ఎదిగిన క్రమం, కులాల పాత్ర.. లాంటి అనేక విషయాలను తీసుకొని కథా సాహిత్యంలో ఉదాహరణ ప్రాయాలనదగిన కథలు రాస్తున్నారిక్కడి రచయితలు. కె.వి.నరేందర్ కలంపట్టే నాటికి చక్కని సాహిత్య నేపథ్యముందీ జిల్లాలో.

ఇక మూడోరకం రచయితలు.. వీళ్ళు మొదటి రెండు రకాల రచయితలకు మధ్యగా ఉంటారు. రెండు ధోరణులను ఆకళింపు చేసుకొని కొంత వ్యాపార ధోరణి ఉన్నా సామాజిక స్పృహను గుర్తెరిగి రచనలు చేస్తారు వీరు. ఇలాంటి రచయితల్లో అగ్రభాగాన నిలిచే రచయిత కె.వి.నరేందర్. అతి చిన్న వయసులోనే అన్ని పత్రికలకు, టీ.వీ.కి రచనలు చేసాడు కె.వి ఈతడు తన కథావస్తువుగా సీరియస్ విషయాన్ని తీసుకున్నా, సెంటిమెంటిను తీసుకొని రాసినా మంచి శిల్పంతో కథను పండిస్తూ కరీంనగర్ జిల్లా రచయితల్లో ఓ విలక్షణమైన స్థానాన్ని పొందిన రచయిత. అతడే వస్తువు పై కథ రాసినా అతని రచనల్లో పీడిత పక్షపాతమే కనబడుతుంది. ఇందుకాతని ఈ చిరు కథాసంకలనం బురదలో జాబిల్లే సాక్ష్యం. ఎవరూ పట్టించుకోని చిన్నపిల్లల గూర్చి రాసిన కథలివి. 'బురదలో జాబిల్లి' మరో పసివాడి కథ.. ఉద్యమ ప్రాంతంలో పిల్లలు ఉద్యమంతో సంబంధం ఉన్నా లేకున్నా ఎలా బలయి పోతున్నారో, పసివాళ్ళు విప్లవకారులకెలా ఉపయోగ పడతారో, వాళ్ళ పసిచేతులెలా గాయాలకు గురవు తున్నాయో తెలిపే కథ ఇది. చద్దన్నం తీసుకెళ్ళిన మైసిగాడు బిక్క చచ్చిపోతున్న తెలంగాణా పల్లెలాగా చచ్చిపోతున్నా డంటాడు రచయిత. తెలంగాణా పల్లెల్లోని దినదినగండమైన బతుకుల గూర్చి అగ్నిగుండాల్లో ఉన్న పల్లెల గూర్చి చెబుతాడీ కథలో రచయిత. మర్నాడు పత్రికల్లో పతాక శీర్షికల్లో మైసిగాడి చావును గూర్చి రాసిన వాళ్ళగూర్చి ఇలా ఎద్దేవా చేస్తూ కథ ముగిస్తాడు రచయిత. ఇందులోని కథలన్నీ ఆణిముత్యాలనదగ్గవే. తన ప్రాంతంలో జరుగుతున్న వివిధ ఉద్యమాలను ఈ రచయిత పట్టించుకోనట్టు పైకి కనబడినా ఈ రచనలు చదువుతుంటే వాటిపై సానుభూతున్నట్టగుపడుతుంది. ఆతని పీడిత జన పక్షపాతమూ స్పష్టమవుతుంది. సాహితీలోకంలో అత్యంత వేగంతో దూసుకొస్తున్న యువ రచయిత కె.వి. నరేందర్.

ఈ రచయిత మరింత అవగాహనను పెంచుకొని ఇదివరకు రాస్తున్న విషయాలతో పాటు గ్లోబలైజేషన్ పేరుమీద సాగుతున్న అమెరికనైజేషన్, కులమతాల వికృత చేష్టలు, బ్రెయిన్ డ్రెయిన్, వలసలు, ప్రజల్లో

పెరుగుతున్న అసంతృప్తి, మృగ్యమవుతున్న మానవ సంబంధాలు, మారుతున్న విలువలు, అత్యంత వేగంగా వస్తున్న మార్పులు, కంప్యూటరైజేషన్ పేరుమీద పెరుగుతున్న నిరుద్యోగం, విశృంఖల విహారం చేస్తున్న టీ.వీ.సంస్కృతి.. లాంటి విషయాల పై కూడా చక్కని కథలు రాస్తున్నారు.

సూపర్ కిడ్, హింసధ్వని రెండూ మధ్యతరగతి జనం ప్రాపంచిక లౌల్యం, వెంపర్లాట తత్వాన్ని దృశ్యమానం చేసే కథలు. కృత్రిమమైన జీవన వాతావరణం ఒక 'ప్లాస్టిక్ పువ్వు' బతుకు ప్రసాదించే స్థితిని అర్థవంతంగా చెపుతాయివి. కటికోల్లు కథ వృత్తిపరమైన దోపిడీ, పెనుగులాట. నిస్సహాయత నిండిన కొందరి దుఃస్థితిని విశద పరుస్తుంది. కవితాత్మకంగా, ఒక సెల్యూక్షన్‌లా... సాంకేతిక సృజనాత్మకతతో రాసిన కథ సిటీ. ఒక్కరోజు జరిగిన సంఘటనల పరంపరను ఒక జీవన బీభత్సంగా, చెరిగిపోని ముద్రగా మన ముందు ప్రదర్శిస్తాడు. మనిషిని కదిలిస్తుందీ కథ.

నరేందర్ అప్పట్లో వెలువరించిన బర్రె కథ కూడా కలకాలం జ్ఞాపకముందే కృతి.

టెలివిజన్ లో స్క్రిప్ట్ రైటర్‌గా రెండేళ్లకు పైగా పనిచేసిన ఈ రచయిత ఇప్పటికే 360 ప్రోగ్రాంలకు, 40 ప్రత్యేక కార్యక్రమాలకు రచన చేసి ఉన్నారు. ఏదైనా విజువలైజ్డ్‌గా చెప్పడం ఈయన ప్రత్యేకత. కళ్ళకి కనబడినట్టు చిత్రితమైన విజువల్స్ కాబట్టే ఈ కథల్ని 'చదువుతాం' అనే బదులు 'చూస్తాం, అనుభవిస్తాం' అనవచ్చు. కేవలం విషాద పార్శ్వాన్నే ఎత్తిపెట్టక వాటితోపాటు సాంస్కృతిక పరమైన విశేషాలూ, చమత్కారాలూ కలగలపడంతో కథానికలకు మరింత పుష్టి చేకూరింది.

రాస్తున్న కథల్లోంచి ఒక ఇతివృత్తానికి దగ్గరగా ఉన్న కథల్ని వేరు చేసి సింగిల్ కాన్సెప్ట్ కథలుగా వెయ్యడం నరేందర్ పద్ధతి. ఇప్పుడీ సంపుటి గ్రామ జీవితానికే కేంద్రీకృతమైతే ముందు ముందు తీసుకురాబోయేది మధ్య తరగతి జీవితాన్ని అతలాకుతలం చేస్తున్న ఆర్థనైజేషన్ కాన్సెప్ట్‌తో సిటీ కథల సంపుటి అని ఈయనే అంటున్నారు. నిశిత పరిశీలనతో, క్షుణ్ణమైన అవగాహనతో, అన్నిటినీ మించిన ఆయా ప్రాంతాల మాండలికంపై సరైన వ్యక్తీకరణతో ఈ 14 పల్లె కథలూ దేనికది పాఠకుల్ని కదిలిస్తాయి, కరిగిస్తాయి.

యంత్రీకరణ అనేది తమల్ని నియంత్రిస్తోందని తెలుసు గాని, అది రూపుదాల్చే క్రమమెక్కడో తెలీక కల్లాకపటం ఎరగని పల్లెజీవి కలవరపడుతున్నాడు. ఈ తికమక మట్టి మనసు కథలో స్పష్టంగా చూస్తాం. వ్యవసాయ పనులలో హార్వెస్టర్, రైస్ ట్రాన్స్ ప్లాంటర్ లాంటి యంత్రాలు చొరబడి మానవ సంబంధాల మదురానుభూతుల్ని పీల్చి పిప్పి చేస్తున్నాయి.

పల్లెతనాన్ని పోగొట్టుకుని ఊరు ఉనికినే కోల్పోతున్న తెలంగాణ గ్రామీణ దురవస్థ బాల్యంతోనే ప్రారంభమవడం మరింత బాధాకరం. తొమ్మిదేళ్ళ సాగర్‌గాడు బతుకుదెరువు కోసం పడే వేదనను పిండం అనే కథలోనూ, నాలుగో తరగతి చదువుతున్న వికాస్ గుండెల్ని కదిపేసిన విషాదం నెమలి కన్నుపై నెత్తుటి చుక్కలు అనే కథలోనూ చూస్తాం ! ఇక మానవజాతి వెన్నెముకనే కోరుక్కుతింటున్న కుల వివక్ష అనే కుష్ఠు వ్యాధి తెలంగాణ పల్లెసీమలో ఎంతగా పాతుకుపోయి బాధిస్తోందో సందెన అనే కథ చెప్పకనే చెబుతుంది. ప్రతి కథా ఒక వ్యథ. ఒక సందేశాత్మకత.

కథా సంకలనాన్ని రచించిన కె.వి.నరేందర్ తాను పుట్టి పెరిగిన పరిసరాలను చిత్రించడం ఈ సందర్భంలో చెప్పుకోదగిన విశేషం. అప్పుడప్పుడూ రాసిన ఇలాంటి కథల్ని క్రోడీకరించి 'పోరు' కథలుగా నరేందర్ మన ముందుంచుతున్నాడు. ఇలాగే సింగిల్ కాన్సెప్ట్ (ఏకాంశ) కథలుగా అమ్మ, యుద్ధం, బురదలో జాబిల్లి, నాన్న, నాతిచెరామి, ఊరు, సిటి లాంటి కథా సంకలనాలు వెలువరించాడు. ఈ క్రమంలోనే కల్లోల కథలుగా పోరు' కథా సంపుటి రూపుదిద్దుకుంది.

నిజానికి మేం 'తెలంగాణగడీ'లపై పరిశోధనాత్మక వ్యాసాలు రాస్తూ అనేక గ్రామాలు తిరిగినపుడు అప్పటి పరిస్థితులు చెప్పిన వాళ్ల మాటలు విన్నాక...అక్కడక్కడా శిథిలమైపోయిన స్థూపాలు కన్పించినప్పుడు....ఈ 'పోరు' కథలు వేయాలన్న ఆలోచన నరేందర్ కి వచ్చింది. నరేందర్ రాసిన ఏకాంశ కథా సంకలనాలు చదివితే ఒక వస్తువుని తీసుకున్నాడంటే.. ఆ వస్తువుని పది పదిహేను కోణాల్లో మొత్తం బాడీ స్కానింగ్ చేసినట్లు భిన్నమైన రీతిలో కథనీకరించడం... ఇలాంటివి దీంతో కలిపి ఇప్పటికి 8 ఏకాంశ కథా సంకలనాలు తీసుకురావటం మామూలు విషయం కాదు. తెలుగు కథా సాహిత్యంలో ఇది ఎవరూ చేయని ప్రయోగం. ఒకవేళ చేద్దామనుకున్న ఇప్పుడు నరేందర్‌ని అధిగమించటం కూడా కష్టమే. .

ఈ కథల చివరలో తన ఏకాంశ కథా సంపుటాలపై వచ్చిన కొన్ని సమీక్షల్ని కూడా జతపరిచాడు. నరేందర్ కథలు చదవుతుంటే ఇండియాటుడేలో అవసరాల రామకృష్ణారావు రాసినట్టుగా చదువుతున్నట్లుగా కాకుండా... కళ్లముందు దృశ్యాలు కదలాడుతున్నంత విజువలైజ్డ్‌గా సజీవంగా కన్పిస్తాయి. స్త్రీకి భార్యగా, తల్లిగా, నానమ్మగా భిన్నమైన జీవన కోణాలున్నట్లుగానే ఒక స్థితి నుంచి బాహ్య వస్తు వలయాలకు సంబంధించిన సంబంధాల్లోనూ వైవిధ్యం ఉంది. సాధారణంగా వస్తువుకి చుట్టూ ఉండే వలయాల సంబంధం సమాంతరంగా ఉండదు. 'అమ్మ'లో ఇతర వస్తు వలయాల సంబంధం సమాంతరంగా ఉంటుంది. చాలావరకు 'అమ్మ' నుంచి చూసి చిత్రించడం వల్ల ఆ కోణంలో మార్పు ఎక్కువ ఉండదు. బాహ్య వస్తు వలయాల నుంచి చూసినప్పుడు వస్తు స్థితి వల్ల బేధం కనిపిస్తుంది. 'అమ్మ'ను సార్వత్రిక లక్షణంగా తీసుకున్న కె.వి. నరేందర్ కథల్లో ఈ లక్షణం కనిపిస్తుంది. సాధారణంగా బాహ్య వస్తుకోణంలోని వైయక్తిక దృక్పథం వల్ల వస్తుగుణంలో మార్పు చోటు చేసుకుంటుంది. ఈ మార్పు సాదారణీకరణకు భిన్నంగా ఉండొచ్చు, ఉండకపోవచ్చు. రచయిత ఏ పాత్రను ముఖ్యం చేసి కథా రచన చేస్తున్నాడనే అంశం పైనే ఈ భిన్నత్వం ఆధారపడి ఉంటుంది. నరేందర్ కథల్లో అయిదు కథలు ఒక కోణం నుంచి, మరో నాలుగు కథలు వేరే కోణం నుంచి, రెండు కథలు ఇందుకు భిన్నమైన కోణాల్నించి వచ్చాయి. మొదటికోణంలోని అయిదు కథలు- అమ్మ, అమ్మని పంచుకుందాం, వెన్నెల, డెలివరీ, నానమ్మ' వీటిలో బాహ్య వలయాల్లోంచి తల్లి పాత్రని చూపడం కనిపిస్తుంది. బాహ్య వస్తు వలయాల్లోనూ కొడుకు, మనవడు అనే రెండు అంతర్ భేదాలు కనిపిస్తాయి.

కుటుంబ సభ్యుల మనస్తత్వాన్ని, కొడుకుల వల్ల బాధపడుతూ గడిపిన తల్లిని అమ్మ, అమ్మను పంచుకుందాం కథల్లో చూస్తాం. ఇందులో మొదటి కథని కొడుకు కంఠస్వరంతో, రెండో కథను మనవని కంఠ స్వరంతో చెప్పడాన్ని చూడొచ్చు. అందువల్ల బాహ్య వస్తు కోణంలో భేదం కనిపిస్తుంది.

ఒకే రకమైన అంశాల్ని ఇతివృత్తంగా తీసుకుని కథా సంపుటులుగా ప్రకటించినరేందర్ ఒక నూతన ఒరవడికి నాంది పలికాడు. మొత్తం కథల్ని పరిశీలిస్తే వస్తువుకి ప్రాధాన్యం ఇవ్వడం కనిపిస్తుంది. ధ్వని లేదా ప్రతీకాత్మకంగా కాకుండా స్పష్టమైన శైలిని ఎంచుకున్నాడు. తనకు అనుభవంలోకి వచ్చిన లేదా తనకు తెలుస్తున్న జీవితాల్లోంచే కథలు అల్లాడు. అందుకే ప్రాంతాలతో సంబంధం లేకుండా మన మధ్య తిరుగుతున్నవారి కథలే అనిపిస్తాయి. పరిణితి చెందిన రచనాకౌశలం బట్టి ఆ మేరకు గొప్ప కథల్ని నరేందర్ నుండి ఇంకా ఆశించొచ్చు. కథా సాహిత్య చరిత్రలో ఒకే వస్తువుని అనేక పార్శ్వాలుగా దర్శించి తనదైన దృష్టికోణంతో వైవిధ్యమైన కథల్ని అందిస్తున్న నరేందర్ అభినందనీయుడు. కాలం పరిణామశీలం కలది. జీవితమూ, సాహిత్యమూ కాలానుగుణంగా మార్పులకు లోనుకావడం సహజమే. తెలుగు కల్పనా సాహిత్య కీర్తిని అంతర్జాతీయ స్థాయికి తీసుకొనిపోయిన ఎందరో రచయితలు అన్ని వర్గాల

జీవితాలలో చోటుచేసుకుంటున్న సమస్యల్ని, సంఘర్షణల్ని మార్పుల్ని తమ రచనలలో ప్రతిబింబింప జేస్తూ తెలుగుకథకు ఔన్నత్యాన్ని చేకూర్చారు.

ఈ రచయితలలో కొడవగంటి కుటుంబరావు, రావిశాస్త్రి, కాశీపట్నం రామారావు తర్వాతి తరంలో తెలుగు కథా సీమను సుసంపన్నం చేసి, అత్యున్నత స్థానాన్ని అలంకరించిన మంచికథకుల్లో ఎన్నదగినవారు కె.వి.నరేందర్ అని చెప్పడంలో అతిశయోక్తి లేదను కుంటాను.

కవి అన్నవాడు ప్రజాకోటి కోసమే తన కలాన్ని ప్రయోగించాలి. అంతేగాని కాగితమూ కలమూ పుచ్చుకుని పోలీస్ కేసుల్లా పేజిలు నింపి బనాయించి చేసిన జీవిత వాస్తవికత లేని కథలు వ్రాస్తే అవి చస్తే మంచి కథలు కావు. కాలేవు. రామాయణానికి నాందీ అయిన వాల్మీకి "మానిషాద" శ్లోకం జీవితంలో నుంచి పొగుచేసుకున్న వాక్యమే కదా ! ఈ విధంగా తన చుట్టూ వున్న జీవిత వాస్తవ పరిస్థితులను అవగాహన చేసుకొని వాటిని తన కథల్లో ఇతివృత్తంగా తీసుకొని జాతీయతను అంతర్జాతీయతను ఆవిష్కరించి, వర్తమాన తెలుగు సాహిత్యంలో బహుముఖ ప్రజ్ఞావంతుడు కె.వి.నరేందర్ ఇటువంటి వారే పాఠకుల హృదయాల్లో పదికాలాలపాటు నిలుస్తారు.

కె.వి.నరేందర్ పుంఖాను పుంఖాంగా కథలు రాస్తుండడమే కాకుండా కథా సంకలనాలు కూడా అంతే వేగంగా వెలువరిస్తున్నారు. నరేందర్ రచనలు తెలంగాణ గ్రామీణ వ్యవస్థలో చోటు చేసుకుంటున్న సామాజిక మార్పులకు తిరగబడుతున్న విలువలకు అద్దం పడుతున్నాయి. సునిశిత దృష్టితో పాటు అతులిత సృష్టి చేయగల నేర్పరితనం ఉన్నా రచయిత.

ఆధార గ్రంథాలు :

1. కాత్యాయనీ విద్మహే. 'ప్రాంతీయ చైతన్యం తెలంగాణ సాహిత్యం', పాలపిట్ట బుక్స్. హైదరాబాద్.2013.
2. కోవెల సుప్రసన్నాచార్య. 'తెలంగాణ తెలుగు కథ' , కాకతీయ విశ్వవిద్యాలయం. సుబేదారి. వరంగల్లు 2011.
3. రాములు.బి.ఎస్, 'తెలంగాణ కథకులు-కథానరీతులు' (ముందుమాట) తెలంగాణ సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం. హైదరాబాద్. 2008.
4. కె.వి.నరేందర్ కథాసంపుటాలు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అంతరంగ ప్రవృత్తి చిత్రీకరణ

- ఆచార్య అయ్యగారి సీతారత్నం, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళా పరిషత్, విశాఖపట్నం.

మనిషి ప్రవర్తనని అంతరంగం లో లోపలికి వెళ్లి అన్వేషించి బయట పెట్టడం రావిశాస్త్రి గారికి తెలుసు. నిజానికి మానవుని విముక్తికి ప్రధానమైన అడ్డంకి భావజాలమే. అంతరంగ ప్రవృత్తికి కారణమైన భావజాలాన్ని ఒడిసి పట్టుకొని విస్పష్టం చేసి- ఆ భావజాలాన్ని మార్చుకొనే అవసరాన్ని తెలిపి విముక్తి చేయడానికి కళాత్మకంగా కథలు రాసారు.

రావిశాస్త్రి గారి కథలు కళాత్మకంగా ఉన్నాయని ఎందుకు అనిపిస్తుంది అంటే కవిత్వంలో ఉపమాలంకారాలు ఉంటాయి. కథలో కూడా అంతసునాయాసంగా హాయిగా ఉపమానాలు వాడడం నిజంగా కథన వైచిత్రే. అసలు 'ఉపమా కాళిదాసస్య' అన్నారు కాళిదాసు ముందు పుట్టారు కాబట్టి. రావిశాస్త్రిని చదివితే' ఉపమా రావిశాస్త్రశ్య' అని అనవలసినదే. ఉపమాలంకారంలో సాధారణంగా వస్తువు లేదాభావములే ఉపమానములుగా తీసుకుంటారు. రావిశాస్త్రి అనుభూతుల్ని, సన్నివేశాల్ని, సందర్భాన్ని కూడా ఉపమానంగా తీసుకోవడం విశేషం. రమ్యమైన వర్ణనల అనుభూతిని అందాన్ని అందించడానికి అలంకారం అనుకుంటారు. కానీ భావాన్ని మరింత స్పష్టం చేయడానికి, ఎంత దుఃఖ పూరితమైన సన్నివేశాలలో నైనా తగిన ఉపమానాలను అతి సహజంగా రచించి ఔచిత్య సహితంగా ఒప్పిస్తారు. పాత్రల స్థితిగతులను కూడా ఉపమానాలతోనే పాఠకుని మనసులో స్థిరీకరిస్తారు.

ఇవన్నీ సూరిబాబు నవ్వు అనే కథను పరిశీలిస్తే స్పష్టమవుతాయి. ఈ కథలో ముగింపు పాఠకుని ప్రశ్నించడం తో ముగిస్తుంది. ఇటువంటి ముగింపు ఎక్కడా ఉండదు. రావి శాస్త్రి కే చెల్లింది. ఆయనది విభిన్న శైలి. ప్రత్యేకమైన శైలి. ఎవరు అను కరించలేరు. గభాల్న అనువదించలేరు. ఎప్పుడో రాసిన కథ అయినా కొత్త కొత్తగా చదువుతాం. చదువుతుంటే పెదవుల మీద నవ్వు, మెదడులో ఆలోచన, మనసులో అనుభూతి కలుగుతాయి.

ముగింపు ''పాఠక మహాశయా! ఆ సమయంలో సూరిబాబు నవ్వాడు కదా అతను ఎందుకు నవ్వేడో నీవు చెప్పుకోగలవా?'' ఈ ప్రశ్నే పాఠకుడిని ఆలోచింపజేసి అంతరంగ విముక్తికి దోహదం చేస్తుంది.

ఈ కథలో సూరిబాబు గిరిబాబు స్నేహితులు. 20 సంవత్సరాల క్రితం మరదలు రమ గిరి బాబు ని కాదని ఉత్తరం పెట్టి మరీ వెళ్ళిపోతుంది. అప్పటినుండి సూరిబాబు గిరిబాబుకి అన్ని రకాలుగా సాయం చేస్తుంటాడు. కానీ గిరిబాబు ఎప్పుడు అందరిమనుషులు దుష్టులే అంటాడు. అందరూ అలా ఉండరులే అన్నా నమ్మడు. మొత్తం కథ 8 సన్నివేశాల కల్పనతో 8ఉపమానాలతో చిత్రీకరించారు.

''నీకు పెళ్ళాంగా ఉండడం అంటే చిన్నప్పుడు ఓనమాలు నేర్పిన మాస్టర్‌ని పెళ్ళాడ వలసి వస్తే సిగ్గు వేసినట్టు సిగ్గు గా ఉంటుంది''.

''అప్పుడు పుట్టిన మేక పిల్లని అష్టకష్టాలు పెట్టినంత గిల్టీగా ఫీలవుతున్నా''.

''ముద్దుగా పెంచిన విధవ తల్లి తనను విడిచి పెట్టి ఎవరితోనో ఎక్కడికో వెళ్ళిపోతే కొడుకు బాధపడి నడట్టుగా పడ్డాడు.''.

''చప్పుడు చేయకుండా కొత్తకుండ నీరు కార్చి నట్టు ఏడ్చింది.''

''మరణ శిక్ష కోసం ఎదురుచూస్తున్న దానిలా కూర్చుని ఉంది''

''జీవితం కష్టాల నవల లా నడిచింది.''

''అందమైన చిత్రాన్ని ఒళ్ళు మరిచి చూస్తుంటే వెనక నుంచి వచ్చి ఎవడో తాపు తన్నిన్నట్టుగా ఉంది.''

"సన్నగా పొట్టిగా చామనచాయ గా మతాబ పక్క సిసింద్రీ లా ఉంది"

"గుండు దెబ్బకి పిండి బొమ్మ రాలి పోయినట్టు రాలి పోయాడు.

వడ దెబ్బకి తులసి మొక్క వాలి పోయినట్టు వాలిపోయాడు.

కెరటం దెబ్బకి ఇసుక గూడు పోయినట్టు ఏమి కాకుండా పోయాడు."

ఉపమానాలు అన్ని 8 సన్నివేశాల్లో ఉపయోగించారు. మొదటి సన్నివేశం 20 సంవత్సరాల క్రితం జరిగిందని చెబుతారు. అదే గిరిబాబు ని పెళ్లి చేసుకో లేనని మరదలు లేఖ రాసి వెళ్ళిపోవడం. అప్పుడు నిస్పృహ పడిన గిరి బాబుని ఓదార్చడం, పోస్టు బాక్సులో పడిన శుభలేఖ లనీ వెనక్కి తీసుకు రావడం సూరిబాబే చేస్తాడు. గిరిబాబు చాలా బాధపడతాడు. మంచి మనుషులు లేరు అను కుంటాడు.

గిరిబాబు తర్వాత శ్యామని పెళ్లి చేసుకుంటాడు. ఆ పెళ్లిలో మామ గారు మూడు వేలు ఇస్తానని ఇవ్వకపోతే సూరిబాబు అతని ని వేరే విధంగా ఇబ్బంది పెట్టి మొత్తానికి ఇప్పిస్తాడు. గిరిబాబు మళ్ళీ మంచి మనుషులు లేరు అంటాడు.

మూడో సన్నివేశం - పెత్తండ్రి కొడుకు పెరటి గోడని గిరిబాబు స్థలంలో కట్టబోతే మళ్లీ సూరి బాబే ధైర్యం చెప్పి సెటిల్ చేస్తాడు.

గిరిబాబు మనుషులంతా దుష్ట వెధవలే అంటాడు. అందరూ కాదులే కొంతమందే అంటాడు సూరిబాబు. కానీ వొప్పుకోడు గిరిబాబు.

నాలుగో సన్నివేశం - చింత చెట్టు కొమ్మలు డాబా మీద కొట్టించమంటే, తిరిగి డబ్బులు ఇమ్మంటాడు పక్కింటివాడు. సూరి బాబువిధవపనిమనిషి చేత ఆమెని అన్యాయం చేశాడని నోటీస్ ఇప్పించి బెదిరించి.. కొమ్మలు తీయించే ఏర్పాటు చేస్తాడు.

అయిదవ సన్నివేశం - మరదలు రమా రాత్రిపూట ఏడుస్తూ వచ్చి 3000 అర్జెంటుగా కావాలంటుంది. ఆమెను కాదనలేని గిరిబాబు సూరిబాబు తో కాబోలి వాడి దగ్గరికి వెళ్తాడు. సూరిబాబు కూడా సంతకం పెట్టి ప్రోనోటు మీద డబ్బులు ఇప్పిస్తాడు.

ఆరో సన్నివేశం - కాలేజీలో ఒక అమ్మాయి ఒక కంటికే కాటుక పెట్టుకోవడం తో తదేకంగా చూస్తాడు గిరిబాబు. ఆమె ప్రిన్సిపాల్ కు కంప్లైంట్ పెడితే మళ్ళీ సూరి బాబు ఆమె అర్ధరాత్రి వెళ్ళిన సినిమా హాల్ దగ్గర ఫోటోలు తీసి.. వాళ్ళ అన్న కి చూపించి.. గిరిబాబుని రక్షిస్తాడు. చూసావా ఎంత అన్యాయము. మనుషుల్లో మంచి వాడు లేడు అంటాడు.

ఏడో సన్నివేశం - గిరిబాబు భార్య అతనికి మరదలి రమతో సంబంధం ఉందని అనుమానించి కొడుకుని తీసుకుని వెళ్లి పోతుంది. ఇంటిలో వాటాఇమ్మనమని దావా వేస్తుంది. అప్పుడు కూడా సూరి బాబే అతను సన్యాసుల లో కలిసిపోయాడని , అతని ఇంటి వాటా సంఘానికి దానం చేశాడు అని చెప్తాడు. దాంతో భయపడి శ్యామ, వాళ్ళ నాన్న పరిగెత్తి వస్తారు. గిరి బాబు ని వెతికి పట్టుకున్నట్టుగా తీసుకువచ్చి అప్పచెప్తాడు. మొత్తానికి గిరిబాబు కాపురం నిలబడతాడు సూరిబాబు.

ఆఖరి సన్నివేశం : సూరిబాబు గిరిబాబు బీచ్లో కూర్చుం టారు. అప్పుడు గిరిబాబు 'ఏ లోకం రా, ఇది. మంచి వాడుమచ్చుకి ఒక్కడు కూడా కనిపించడు'అంటాడు. అప్పుడు సూరిబాబు నవ్వాడు. సూరిబాబు ఎందుకు నవ్వాడని పాఠకుల్నిప్రశ్నిస్తారు రావిశాస్త్రి.

20 సంవత్సరాల నుండి అంటే మరదలు గిరి బాబు ని వదిలి వెళ్లిపోయిన నాటినుండి సూరి బాబు సహాయ పడుతూనే ఉన్నాడు. అస్సలు గుర్తించడు గిరిబాబు. మనుషుల్లో మంచి వాడు ఒక్కరు లేరు మచ్చుకు కూడా అంటూ ఉంటాడు. నిజానికి గిరిబాబుకి మనుషులుని నిందించడమే గాని వాటి నుండి బయట పడే అంత

ధైర్యం లేదు. మనస్సులో మాత్రం ప్రతికూల వైఖరి. అపకారం చేసినవాళ్లని నిందిస్తాడు గాని ఉపకారం చేసిన వాళ్లని గుర్తించడు. సూరిబాబు తోనే మనుషుల్లో మంచివాడు మచ్చుకు కూడా లేడు అంటూ ఉంటాడు. అందరూ అలా ఉండరు లేరా అని అతను అన్నప్పటికీ అంగీకరించడు.

ప్రవర్తనా విధానంలో (బిహేవియరిజమ్)లో వైఖరులు చాలా ముఖ్యమైనవి. ప్రతికూల వైఖరి, సానుకూల వైఖరి. ఈ వైఖరులని రెండు పాత్రల ద్వారా తెలియజెప్పారు. నిజానికి ఇప్పుడు మనో వైజ్ఞానిక శాస్త్రం, మేనేజ్మెంట్ స్టడీస్ ..లలో పరిశోధనల ఫలితంగా ఈ వైఖరుల ప్రాముఖ్యత పెరిగింది. కానీ 1960లోనే గిరిబాబు ప్రతికూల వైఖరి గురించి సూరిబాబు నవ్వు ద్వారా ఆలోచింపజేసే మంచి కథని రచించిన సామాజిక సార్వత్రిక రచయిత రావిశాస్త్రి.

ఆధార గ్రంథములు :

1. రావి శాస్త్రి రచనా సాగరం - ప్రచురణ - మనసు ఫౌండేషన్
2. మేడిపండు సమాజానికి మేలిమి భాష్యకారుడు - తెలకపల్లి రవి, ప్రజాశక్తి 30/06/21

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 8(2), August 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

Political Geste of Women in Contemporary Tamilnadu - A Historical Study

